
# అంతస్స్రవంతి



నవీన్

BAPUJI
Cultural Association
...NDUAL...

# ప్రవేశిక

'అంపశయ్య' నవల వ్రాసిన నవీన్ గారిని పాఠకలోకానికి కొత్తగా పరిచయం చెయ్యనవసరంలేదు! తెలుగులో చైతన్య స్రవంతి పద్ధతిలో వ్రాయబడిన నవలల్లో ఉత్తమమైన నవల 'అంపశయ్య.' వస్తువూ శైలీ రెండూ విడదీయరాని విధంగా ఏకమై, సౌష్ఠవాన్నీ, భావస్ఫూర్తినీ సంతరించుకున్న చక్కని సాహిత్య కృషి అది. చైతన్య స్రవంతి పద్ధతి అన్ని రకాల కథా వస్తువుకి నప్పదు. దాన్ని స్వగతంగా, అంతరంగ కథనంగా పల్చనచేసి, మార్చి ప్రయోగించినప్పుడు చాలాసార్లు మంచి ఫలితాలే వచ్చాయి. రా.వి. శాస్త్రి 'అల్పజీవి' అందుకు ప్రసిద్ధమైన ఉదాహరణ. పోతే ఉత్తమ పురుషలో కథాకథనాన్ని నిర్వహించడం నవలా ప్రక్రియలో తరచు ఉపయోగించే విధానమే! ఈ 'అంతస్స్రవంతి' నవల కేవలం చైతన్య స్రవంతి పద్ధతిలో వ్రాసిందికాదు!

చైతన్య స్రవంతి పద్ధతికి వ్యక్తి అంతరంగం, ఆలోచనలూ. అనుభూతులూ మాత్రమే వస్తువైతే చాలదు. సామాజికంగా సంబంధం ఏర్పరచుకోలేక, తనను గూర్చిన స్పృహ, విశ్వాసం గట్టిగా ఏర్పడక, ఎన్నో ప్రభావాల తాకిడికి సతమతమౌతూ, తన ఉనికి (ఐడెంటిటీ) కోసం వెతుక్కునే వ్యక్తి మనఃస్థితికి ఆ పద్ధతి సరిగ్గా సరిపోతుంది.

'అంపశయ్య'లో కాలేజీ విద్యార్థి రవి అటువంటి మనఃస్థితిలో ఉన్నాడు. 'అల్పజీవి'లో ఆత్మన్యూనతా భావంతో, సామాజిక సంబంధాల్లో విజితుడుగా మనుగడ సాగిస్తున్న సుబ్బయ్యకు కొంతమేర ఆ విధానం మంచి అభివ్యక్తి కలిగించింది. కాని అతనిలో వచ్చిన మార్పుతో, ఆ పద్ధతి 'స్వగతం'గా మారుతూ వచ్చింది.

నవీన్ వ్రాసిన ఈ నవల 'అంతస్స్రవంతి'లో నాయకులు మంచి వ్యక్తిత్వం ఉన్న రచయిత, లెక్చరర్, 'అంపశయ్య'లోని రవి విద్యార్థి దశను దాటి, ఉద్యోగాన్వేషణ ప్రయత్నాల్లో ('ముళ్ళపొదలు') వ్యక్తిగ విలదొక్కుకుని, చివరకు సామాజికుడుగా స్థిరపడిన స్థితి 'అంతస్స్రవంతి లో మనకు కనిపిస్తుంది.

ఈ నవలలో వస్తువు నేటి కాలేజీ వ్యవస్థ. కాలేజీల్లో నేడు వ్యవస్థ కంటే అవ్యవస్థే ఉన్నదనడం రహస్యం ఏమీ కాదు! అవ్యవస్థ కావడ వల్లే దాన్ని గూర్చి ఎన్నో అభిప్రాయలూ, విశ్లేషణలూ ఉండడానికి వీల న్నది. అందరూ దానికి సంస్కరణలు సూచించేవారే! అందులో ఏకా భిప్రాయం కుదిరే అవకాశమే కన్పించదు!

'అంతస్స్రవంతి' నవలలో విశిష్టత — కాలేజీ అవ్యవస్థను గూర్చి ఒక విశ్లేషణ కాకుండా, ఒక సమగ్ర చైతన్య స్వరూపాన్ని మనకు దృశ్య మానం చెయ్యడం; సమస్యల తాలూకూ సంశ్లిష్టతను మన అనుభవంలో తీసుకు రావడం, తద్వారా మన అభిప్రాయాలకు మనల్ని వదలి పెట్టడం ఈ 'అంతస్స్రవంతి' ఒక వ్యక్తిచే తనకు ప్రతి రూపంకాదు, ఒక సామా జిక చేతనకు ప్రతిరూపం. అందుచేత దీన్ని ఆత్మాశ్రయం రచనగా కాక వస్తుగతమైన రచనగానే నిర్దేశించవలసి ఉన్నది.

కాలేజీలో అధ్యాపకుడుగా నవీన్, కాలేజీ బాధ తన బాధగా తాదాత్మం చెంది. చక్కని నవలలు వ్రాశారు. 'లైఫ్ యిన్ ఎ కాలేజ్' వంటి కథలతో బాటు, 'ప్రమాదంలో ప్రమదలు' 'విమెన్స్ కాలేజ్' నవలలు నవీన్ అసక్తినీ, అభిరుచినే కాక, (నేటి రచయితల్లో అరుదైన) ఆయన సమదృష్టినీ, చాటుతున్న మంచి రచనలు నేటి సమాజంలో స్త్రీ ఎదుర్కొం టున్న సమస్యల్లో, స్త్రీ ప్రతి పత్తికి సంబంధించిన విషయాల్లో, ఎందరో మహిళా రచయితలకంటె, చక్కని వస్తుగతమైన చిత్రణనూ, అవగాహనను నవీన్ తన నవలల్లో సాధించారు.

'అంతస్స్రవంతి'లో తొలి భాగంలో - దాంపత్యంలో అనురాగం అనురూపత ఎంత ఉన్నా, నిత్య జీవితంలో ఎలాంటి సన్నివేశాలు దంప



తుల మనస్సుని బాధిస్తాయో చిత్రించడంలో — భార్యా భర్తల సంబంధం లోని అంతస్స్రవంతి ఏమిటో, పాఠకుల్ని ఆలోచింపేట్టు చేశారు

రవీ, రజనీ- యిద్దరూ యిద్దరే - వారి సంవాదంలో, సంఘర్షణలో ఎవరికి వారు న్యాయంగానే మాట్లాడుతున్నట్టు మనకు తోస్తుంది అవతలి మనిషిమీద ఎంత మమత, ఆకర్షణ, అనురాగం ఉన్నా, వ్యక్తి తన అహం పరిధిలోనే స్పందించడానికి సాధ్యం అనే అంతర్యాన్ని స్ఫురింప జేయడంలో నవీన్ సమదృష్టి సాధించిన విజయం గొప్పది.

మార్కెట్ కు వెళ్ళాలి, కాని డబ్బులేదు, అప్పు ఎవరిస్తారు? భర్త వెళ్ళబోతూండగా, తండ్రి చీరకోసం తనకిచ్చిన డబ్బులో పదిరూపాయలు తెచ్చి యిస్తుంది భార్య మార్కెట్ కు వెళ్ళి, కిరాణా దుకాణంలో వెంట్రుక వాసిలో అవమానాన్ని తప్పించుకుని, హైరానా పడి అన్ని వస్తువులూ తెచ్చాడు లిస్టు ప్రకారం. కాని 'స్టౌబత్తి' లేని సంగతి భార్య ఆలస్యంగా గుర్తించింది! మళ్ళీ బజారుకి వెళ్ళలేదు భర్త! తంటాలు పడి ఆమె ఉప్మా తయారు చేస్తే, ఆలస్యమైందని తినకుండానే వెళ్ళిపోయాడు: తానూ తిన కుండా దుఃఖిస్తూ ఉండిపోయింది భార్య!

దీనిలో ఎవరిని తప్పు పట్టడం? పోతే, కాలేజీ అవ్యవస్థ దృశ్యాలు— నవలలో ప్రధాన భాగాన్ని ఆక్రమించిన చిత్రణ: ఎందరో పాత్రలు: ఒక్కొక్కరూ భిన్న ప్రవృత్తులతో, భిన్నమైన స్వార్థ ప్రయోజనాలతో స్పష్టంగా మూర్తికట్టిన వ్యక్తులు, వారి సమావేశం, సంఘర్షణ, ప్రవర్తన, తుచ తప్పని వాస్తవికతతో, సమగ్రంగా, సశ్లిష్టంగా, సజీవంగా రూపొం దింది.

అల్ప పరిధిలో అనల్పమైన స్ఫూర్తినిచ్చే విశేషాలనూ, సామాజిక శక్తులనూ సంతరించుకున్న కాలేజీ సంక్షోభ దృశ్యంతోబాటు, కథానాయ కుడు రవి స్నిగ్ధ మనస్కతతో అందులో వహించిన పాత్రకు, సామాజి కంగా, వైయక్తికంగా, ఎదుర్కో వలసి వచ్చిన ప్రమాదం, అతని మనః స్సంక్షోభం, సమాజానికీ వ్యక్తికీ గల సంబంధాన్ని గూర్చి చాలా ప్రశ్నల్ని రేపింది.

నవల ముగిసినా, వ్యక్తి బాధ్యత ఎంతవరకు? రవి వంటి లెక్చరర్ నేటి కాలేజీ అవ్యవస్థలో నిర్వహించ గలిగిన బాధ్యత, సాధించగలిగిన ప్రయోజనం ఎటువంటిది? అతను రచయితగా ఎటువంటి సాహిత్యాన్ని సృష్టించాలి.

ఈ ప్రశ్నలకు అసంఖ్యాకమైన సమాధానాలు వస్తాయి. నవీన్ సమాధానం—

"ఎవరికి ఏది చేతనయితే అదీ రాస్తారు. అంతేగాని, దేశానికో ఒక వర్గం పాఠకులకో అవసరమని ఎవరూ నువ్వు చెప్పినట్టు సంచలనాత్మక రచనలు చెయ్యరు!" రచయితలో వ్యక్తిగా, సామాజికునిగా, నిజాయితీ ఉన్నదో లేదో కూడా అతని రచనే నిరూపిస్తుంది! అని తీర్మానం.

వ్యక్తిగా, రచయితగా స్వధర్మాన్ని నిర్ణయించుకుని దాన్ని ఆచరిస్తున్న నవీన్ రచనలు, సమకాలీనతను ప్రతిఫలిస్తూనే, మానవత్వం లోతుల్నీ మానవ స్వభావ వైచిత్రినీ ఆవిష్కరిస్తున్నాయి.

'అంతస్స్రవంతి'లో కూడా ఉపరి ప్రవాహం కంటె అంతస్స్రవంతియే ముఖ్యమని నా అభిప్రాయం.

—ఆర్. ఎస్. సుదర్శనం

LAVANYA RENTED BOOK STALL,
PARK ROAD;
PROP:
M. Venkateswarlu;
NANDYAL.

# అంతస్స్రవంతి

అదో పెద్ద మేడలా వుంది.

మెట్లు పైకి పైపైకి.... అందంగా, తెల్లగా, అంచెలంచెలుగా....

తను మెట్లు ఎక్కేస్తున్నాడు.

మెట్ల చివర వెడల్పైన ద్వారం....

ఆ ద్వారానికి ఫ్రెంచ్ పాలిష్‌తో తళతళ మెరుస్తున్న పెద్ద పెద్ద టేకు తలుపులు.

తనక్కడకు చేరుకోవాలి.

చకచక మెట్లెక్కేస్తున్నాడు.... రెండు మూడు మెట్లు ఒకేసారి సునాయాసంగా ఎక్కేస్తున్నాడు.... అంత సులభంగా మెట్లెక్కెయ్యటం ఎంత హాయిగా వుందో.... గాలిలో తేలిపోతున్నట్టుగా ఎక్కేస్తున్నాడు.... ద్వారం ముందు కొచ్చేశాడు.... అందంగా వున్న ఆ తలుపుల్ని మెల్లగా తట్టాడు. అవి తెరచుకుంటాయని చూశాడు. ఆశ్చర్యం. అవి తెరచుకోలేదు. మళ్ళీ తట్టాడు. తెరచుకోలేదు. అవి తెరచుకోవని అర్థమయింది. కిందకు చూశాడు. అగాధంలోకి వెళ్ళిపోతున్న అసంఖ్యాకమైన మెట్లు.... ఎన్ని

మెట్లో.... వందలు....వేలు.... పాతాళంలోకి వెళ్ళిపోతున్న మెట్లు.... తను మళ్ళీ అంత కిందకు.... ఆ మెట్లన్నీ దాటి వెళ్ళిపోవాలా? భయం.... ఆ మెట్లన్నీ దిగిపోవాలంటే భయం.... వద్దు....వద్దు.... తనా మెట్లన్నీ దిగిపోవద్దు.... ఈ తలుపుల్ని ఎలాగైనా తెరిపించాలి. తలుపుల మీద బాదాడు.... గట్టిగా తన శక్తి కొద్దీ బాదుతున్నాడు. ఈసారి తలుపులు తెరచుకుంటాయి. తెరచుకోగానే తను గబుక్కున లోపలకు దూరిపోవాలి.

కానీ ఇదేమిటి? తలుపులు తెరచుకోవటం లేదేమిటి?

ఛీఛీ! తనో పిచ్చివాడు. తలుపులకు గొళ్ళెం పెట్టి పెద్దతాళం వేశారు. తనింతసేపూ గమనించనేలేదు

జేబులో ఎక్కడో తాళంచెవి ఉండాలి.

జేబులన్నీ వెతుక్కున్నాడు కానీ తాళపుచెవి దొరకటంలేదు.

తాబేలులా తాళం — కదలదు - మెదలదు.

జేబులన్నీ వెతికి వెతికి....

తల పీక్కుంటున్నాడు.... భయం.... ఎవరో వచ్చేస్తున్నారు. తనను వెంటాడుతున్నారు అక్కడ్నించి వెంటనే వెళ్ళిపోవాలి. కిందకు సాగిపోతున్న మెట్లు.... ఆ మెట్లకు అంతం కనిపించటం లేదు అయినా దిగుతున్నాడు.... గాలిలో తేలిపోతున్నట్టుగా.... అన్ని మెట్లు ఎలా దిగేశాడు.... ఇదంతా కలా? నిజమా?

కింద.... మెట్ల చివర మళ్ళీ ద్వారం — మూసుకునే వుంది. తలుపుల్ని బాదబోయాడు.... కొండ చిలువలా తాళం. చాలా పెద్ద తాళం.... పైకి చూశాడు.... పైకి సాగిపోతున్న మెట్లు.... ఎంత అందంగా, ఎంత అద్భుతంగా వున్నాయో.... తనను రమ్మంటున్నాయి.... తప్పదు. తనా మెట్లన్నీ ఎక్కి ఆ తలుపుల్ని చేరుకోవాలి. ఈసారవి తప్పకుండా తెరచుకుంటాయి.

మెట్లెక్కుతూ తను ఒకటి, రెండు, మూడు, పది మెట్లెక్కేసి పైకి చూశాడు. ఇంకా వంద మెట్లున్నట్లున్నాయి. శక్తినంతా కూడ దీసుకుని ఒక్కొక్క మెట్టే ఎక్కేస్తున్నాడు. మొదట్లోలాగా రెండు మూడు మెట్లు ఒకేసారి ఎక్కెయ్యలేకపోతున్నాడు.



కాళ్ళల్లో శక్తంతా నశించిపోతోంటే తన అవయవాలన్నీ తునాతునకలై పోతోంటే ఆ మెట్లన్నీ ఎక్కేస్తున్నాడు.

ఇక మూడే మెట్లు మిగిలాయి. అవి ఎక్కేస్తే ఆ తలుపుల్ని చేరుకోవచ్చు. ఈసారా తలుపులు తనకోసం తప్పక తెరచుకుంటాయి. ఆ చివరి మూడు మెట్లూ ఎక్కేసెయ్.

కానీ ఎక్కలేడు. శ్వాస ఆడటం లేదు. ఆయాసం వణికి పోతున్నాడు చెమటలు కారుతున్నాయి. ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు. గాలిలేదు. ఏ క్షణంలోనైనా తను చచ్చిపోతాడు. ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేడు తను చచ్చిపోవటం ఖాయం. అయినా ఇంకా పెనగులాడుతూనే వున్నాడు. మరో రెండు మెట్లు ఎక్కేశాడు. ఇంకొక్క మెట్టెక్కితే తనీ నరకంలోంచి, తనీ పద్మవ్యూహంలోంచి బయటపడ్తాడు కానీ ఎక్కలేడు. అసలు ముందు ద్వారమే లేదు. గోడ ఆకాశమంత ఎత్తున్న గోడ. తలను గోడకేసి బాదుకుంటున్నాడు. కానీ గోడ కరగదు-గోడ కదలదు-గోడకు జాలిలేదు. గోడ దారివ్వదు. తన ప్రయాణం అయిపోయింది. తనక్కడ ఆగిపోవాలి అంతే.

గోడను చూస్తే భయం. అక్కడ్నించి పారిపోవాలి. కానీ కాళ్ళు కదలవు భూమిలో కూరుకుపోతున్నాయి. లేచి నిల్చోలేడు. పరిగెత్త లేడు. ఎటు చూసినా గోడ. అరవాలి హెల్ప్....హెల్ప్....కానీ గొంతు పెగలదు. గొంతులోంచి మాట రాదు. శ్వాస ఆడదు. గాలిలేదు సఫొకేషన్, ఉక్క నాలుగు వేపులా గోడ. గాలిని గోడ బంధించింది. తన గొంతు నెవరో నులిమేస్తున్నారు. శ్వాస తీసుకోవటానికి పెనగులాడుతున్నాడు. గాలిని వదలండి. ఈ సఫొకేషన్నుండి రక్షించండి అరవబోయాడు గొంతు పెగలడం లేదు. కాళ్ళు కదలటం లేదు. భయం. భయం. పెద్దగా అరవాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ గొంతు పూడుకుపోయింది.

రవి శక్తినంతా కూడదీసుకొని కళ్ళు తెరిచాడు....

తనెక్కడున్నాడు? అంతా చీకటి....

మేడ....మెట్లు....గోడ....యేమైపోయాయి?

అమ్మయ్య! అంతా కలన్నమాట! కలని తెలిసిపోవటంతో ఎం హాయిగా ఉందో!

చుట్టూ చూశాడు. జీరో కాండిల్ వెలగటం లేదు. పైన ఫ్యాన్ తి గటం లేదు. కరెంట్ పోయినట్టుంది. అందుకే ఈ ఉక్క. గాలినెవ బంధించినట్టు....

తన పక్కనే రజని హాయిగా నిద్రపోతున్నది-కరెంట్ పోయి ఆమెఅంత హాయిగా ఎలా నిద్రపోతున్నదో!

ఇందాక కలలో కూడా గాలి స్తంభించిపోయినట్టుగా, శ్వాస ఆగి తున్నట్టుగా, తనెందుకో అరవాలని ప్రయత్నిస్తున్నట్టుగా....

అదంతా ఓ పీడకల అన్న స్పృహ రాగానే ఎంత రిలీఫ్!

అదొక మరో ప్రపంచం అదో లోకం. ఆ ప్రపంచంలో ఉన్నం సేపూ అదే నిజం మెలకువ రాగానే ఈ ప్రపంచంలోకి యిక్కడున్నం సేపూ ఇదే నిజం. కానీ ఈ రెండింట్లో ఏది నిజం? ఏది మిథ్య? అం నిజమే. అంతా మిథ్యే....

కళ్ళు ఇష్టంగా మూస్తూ, భారంగా తెరుస్తూ, మళ్ళీ ఆ కల సృష్టి చిన మూడ్‌లోకి....

అదెంత పెద్ద పీడో! అన్ని మెళ్లెన్నడూ చూళ్ళేదు....

ఈ కరెంటింకెప్పుడొస్తుందో!

రజనిలో చలనం లేదేమిటి? కరెంట్ పోగానే తనకు మెలకు వచ్చేస్తుంది.

రజని తనవేపు తిరిగితే బావుండును.... ఆమె తిరగదు. తనే తిప్ కోవాలే.

రజనిని అతని వైపుకు తిప్పుకొని గట్టిగా కౌగలించుకున్నాడు.

"అబ్బా! ఉండండి-నిద్రొస్తోంది" అంటూ ఆమె అతనికి దూరం జరిగింది. కానీ అతడామెను మళ్ళీ తనవైపుకు తిప్పుకున్నాడు.

ఉద్భృత మౌతున్న ఉద్రేకం... నిద్రపోతున్న రక్తం జాగృతమై తనామెలో ప్రవేశించాలని....



"చెప్తోంటే మీక్కాదు. మంచి నిద్ర పాడు చెయ్యకండి. ప్లీజ్!" ఆమె విసురుగా అతన్ని విడిపించుకుని దూరంగా జరిగి దుప్పటి కప్పుకొని పడుకుంది.

ఇక అంతే. తనామెలో ప్రవేశించలేడు....

అలా అని బయటపడే మార్గమూ లేదు.

ఉవ్వెత్తున ఎగిసిన ఈ రక్త చైతన్యాన్ని ఎలా అదుపుచెయ్యాలి?

బయట కెళ్ళాలి. లేచాడు....

ఇంత ఉక్కపోతలో నిండుగా దుప్పటి బిగించేసిన రజని నిజంగా గ్రేట్! ఈ పురుష ప్రపంచం నుండి స్త్రీ ఎప్పుడూ తనను తాను రక్షించుకుంటూ ఉండాలి. రజనికి ఆ దుప్పటి ఒక రక్షక కవచం!

మంచం దిగి చీకట్లో తడుముకుంటూ ముందుకు నడిచి స్విచ్ వెయ్యబోయాడు-"కరెంట్ లేదు కదూ!" అనుకుంటూ బెడ్‌రూం లోంచి వంట గదిలోకి తలుపు గొళ్ళెం తీశాడు. త్వరగానే తెరచుకుంది. యిందాకటి కలలో తలుపల్లా ఎంత బాదినా తెరచుకోకపోతే ఎంత బాధో!

కరెంట్ పోవటం, ఫ్యాన్ ఆగిపోవటం, గాలిలేక ఉక్కిరి బిక్కిరి సఫోకేషన్-శ్వాస ఆడకపోవడం, ఇదంతా బయట జరుగుతున్నప్పుడు కలలో కూడా సరిగ్గా యిలాగే జరుగుతుంటుంది. ఆ విధంగా కలకూ నిజానికీ ఎంతో సంబంధం ఉందనిపిస్తుంది.

ఇందాకొచ్చిన కలకు అర్ధమేమిటో....

ఇలాంటి కలను ఇంతకు ముందెన్నడూ కనలేదు.

మగవాళ్ళు కలల్ని మాత్రమే కనగలరు.

ఆడవాళ్ళయితే పిల్లల్నీ. కలల్నీ కనగలరు. పాపం ఆడవాళ్ళు!

కళ్ళు మూతలు పడిపోతోంటే బాత్‌రూమ్‌ను వెతుక్కుంటూ ఇంత దూరం రావటం ఇంటి వాడు బాత్‌రూంను ఇంత దూరంలో కట్టించి చంపుతున్నాడు. ఓ అటాచ్‌డ్ బాత్‌రూం కట్టిస్తే చస్తాడా? చావడు కానీ నువ్వే చస్తావు. అద్దె పెంచేస్తాడు.

మరో తలుపు కిర్రుమంటూ తెరచుకుంది.

లోపలకెళ్ళాడు.

ఇప్పుడు భలేహాయిగా ఉంది. కళ్ళు మూసుకుపోతున్నాయి.

వెళ్ళిపోయి పడుకోవాలి. గాఢనిద్ర ఎంత సుఖం!

పంపు తిప్పాడు. 'స్సుయ్'మని నీళ్ళు.

నీళ్ళచప్పుడు హాయిగా ఉంటుంది. ప్రవహిస్తున్న నీళ్ళ చప్పుడైతే మరీ హాయి. ఒడ్డుకు కొట్టుకుంటున్న సముద్ర కెరటాలు అది చప్పుడు కాదు. హోయ్! ఘోష! పయోధర షడ్జధ్వానం!

పంపు మళ్ళీ తిప్పాడు. నీళ్ళు ఆగిపోయాయి.

కిర్రుమని రేకు తలుపు. ఎంత అసహ్యం ఆ చప్పుడు. యింటి వాడు మంచి తలుపు పెట్టించకూడదూ?

కళ్ళు మూస్తూ, తెరుస్తూ చీకట్లో దారి వెతుక్కుంటూ త్వరగా పక్కమీదకు చేరుకోవాలి. రజని పక్కన పడుకోవటం ఎంత సుఖమో! తెల్లారుతుండగా రజనిని గుండెలకు హత్తుకొని పడుకోవటం ఎంత బావుంటుందో.... కానీ రజని స్పర్శ తన రక్తాన్ని రెచ్చగొడుతుంది.... రక్త చైతన్యం!

కిలకిలమని చప్పుడు చేస్తూ ఎగిరి పోతున్న పక్షులు....

పైకి చూశాడు. మబ్బులు లేని స్వచ్ఛమైన ఆకాశంలో తళతళ మెరుస్తున్న నక్షత్రాలు సెప్టెంబర్ నెలలో ఒక్క మబ్బుతునకైనా లేకుండా ఆకాశం ఇంత స్వచ్ఛంగా ఉండటం ఆశ్చర్యమే! అసలీ సంవత్సరం వర్షాలు పడవేమో! అడవులన్నింటినీ నిర్దాక్షిణ్యంగా నరికేస్తోంటే వర్షాలెలా పడతాయి!

అంత స్వచ్ఛమైన ఆకాశం కేసి తెల్లారకట్ట చూడటం ఓ అద్భుతాన్ని చూసినట్టుగా వుంటుంది.

ఉషస్సును ప్రసవించాలని తూర్పు ఆకాశం ప్రసవ వేదన పడుతోంది....

ఛీ ఛీ! యింత ఆహ్లాదకరమయిన వాతావరణంలో ప్రసవ వేదనేమిటి?

మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరిచి మరోసారి తూర్పు ఆకాశం వైపు చూశాడు.



తళతళ మెరుస్తున్న శుక్రుడు.

శుక్రుడు తన కిరణాలతో తన కళ్ళను పొడుస్తున్నాడు.

పొడవటం బాగాలేదు. కొన్ని పదాలిలా అప్రయత్నంగా బుర్రలోకెందుకొస్తాయో అర్థంకాదు.

శుక్రుడ్ని చూడటానికే తెల్లారకట్ట యిలా బయటకొచ్చినప్పుడల్లా తన కళ్ళు తూర్పు ఆకాశం వైపు చూస్తాయి.

తనిప్పుడు చూస్తున్న ఆ చుక్క నిజంగా శుక్రుడేనా?

అది చుక్క కాదు గ్రహం. శుక్రగ్రహం కాబట్టే అంత ప్రకాశవంతంగా వెలిగిపోతోంది. అది వీనస్. అందుకే అంత తెలుపు

చేతులు తెగిన వీనస్ డి మెల్లో తెల్లగా....

తాజ్‌మహల్ తెల్లగా తాజ్ అందమంతా ఆ పాలరాయిలో ఉందన్నాడట ఆల్డస్ హక్స్‌లీ. పాలరాయి లేకపోతే తాజ్ అతి మామూలు శిల్పమట! తెలుపులో అంత అందం. అందుకే తనకు తెలుపంటే యిష్టం. పాలరాయి సంగెమర్‌మర్, మార్బుల్, పాలు, పయోధరాలు, వీనస్ డి మెల్లో, వెన్నెల, సముద్రం, కెరటాలు, తుంపర, నురుగు, వెన్నముద్ద, మంచుగడ్డ, అంటార్కిటికా మంచు ఖండం. ఎస్కిమోలు, నానుక్ ఆఫ్ ది నార్త్ చూశావా? గ్రేట్ డాక్యుమెంటరి. ఇంకాస్సేపిలాగే శుక్రుడి స్నిగ్ధ దరహాసాల్ని చూస్తూ ఉండిపోతే కళ్ళు మూతలు పడిపోతున్నాయి. నిద్ర ఆంఖోమే సారీరాత్ జాయేగి తుమ్‌కోభీ కైసే నీంద్ ఆయేగి ...రఫీలా పాడగల్గే గొంతుంటే!

పాడగల్గే కంఠం లేకపోయినా వినగలిగే చెవులున్నందుకు సంతోషించు.

ఇంట్లో కొచ్చి తలుపులు మూసేసి గొళ్ళెం పెట్టాడు.

బెడ్ రూంలో కొచ్చాడు.

జీరో క్యాండిల్ వెలుగుతోంది.

అమ్మయ్య! పవరొచ్చేసింది గాలి హాయిగా ఉంది.

ముసుగు తన్నేసి గాఢనిద్రలో రజని!

జీరో కాండిల్ లేత వెలుగులో నిద్రపోతున్న తన రాజీని చూసుకోవటం రోజూ తనకో అద్భుతమైన అనుభవం.

ఇంకా పూర్తిగా విచ్చుకోని రోజా చైత్రమాసంలో పూసిన మల్లె.... తూర్పు ఆకాశంలో ఉదయించిన వీనస్....

ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకొని ముద్దు పెట్టుకోబోయాడు.

ఆమె కళ్ళు తెరచి "అమ్మయ్య! కరెంటొచ్చేసిందా? ఇంతసేపెక్కడికి వెళ్ళారు?" అంటూ అతని మీదే చెయ్యేసి పక్కకు తిరిగి పడుకుంది.

ఆమె ఇంకాస్సేపు అలా చూస్తూ ఉండిపోతే బావుండుననిపించింది.

ఆమె కన్నులలో అనంతాంబరంబు నీలినీడలు కలవు
ఏదియో అపూర్వ మధుర శక్తి స్ఫురియించుగానీ
అర్థమ్ముకాని భావగీతమ్ములవి.
రజని తనకు అర్థమ్ముకాని భావగీతమే.

అనుక్షణం ఏదియో అపూర్వ మధుర శక్తి మాత్రం స్ఫురిస్తుంటుంది

రజని పక్కన పడుకొని, ఆమె కప్పుకున్న దుప్పటినే తనూ కప్పుకొని, ఆమెను తనవైపు తిప్పుకున్నాడు.

వెచ్చగా, మత్తుగా, హాయిగా రాత్రి తలలో పెట్టుకున్న వాడిన మల్లెల వాసన .... విచ్చిన మల్లెల కంటే వాడిన మల్లెల వాసనే బావుంటుంది....

ఆమెను తన గుండెలకు హత్తుకున్నాడు.

దగ్గరగా ఇంకా దగ్గరగా పూర్తిగా ఆమెను తనలోకి చేర్చుకొని, తను ఆమెలో చేరిపోయి....ఇద్దరుగా అంతమై ఒకరుగా ఆవిర్భవించాలని... ఈ కౌగిలి యిలాగే శాశ్వతమయిపోవాలని ఎవ్వరోడినను బిగి కౌగిలియే శిక్ష!

ఆమె పెదవులకోసం వెతికాడు.

"ఛీ! కాస్సేపైనా పడుకోనివ్వరు...."

ఆమె అతని నుండి తప్పించుకొని దూరంగా జరిగి పడుకుంది.

"రాణీ! మైడియర్ రాణీ!" తగ్గు స్వరంతో గుసగుసగా అతడు.

సమాధానం చెప్పదు. నిద్రపోతున్నట్టుగా నటిస్తుంది.



"రాణీ! రాణూ! మైడియర్ రాణూ!"

ఆమెను మళ్ళీ తన మీదకు లాక్కున్నాడు.

"ఊఁ"

ఎవరో వీణ మీటినట్టనిపించిందతనికి-

"ఈ ఊఁ తప్ప అస్సలు మాట్లాడవా?"

"ఊహూ!"

"అంతేనా?"

"నాకు నిద్రొస్తోందంటే వినిపించుకోరేం?"

"ఇంత హాయిని ఏ నిద్రా ఇవ్వలేదు"

"ఎంతహాయిని?"

"ఇదిగో....ఇంతహాయిని...."

అతడామెనింకా గట్టిగా తనకు హత్తుకున్నాడు.

"ఊఁ" అంది ఆమె కూడా అతనికి కరచుకుపోతూ....

స్త్రీ శరీరంలో ఏదో అనితర సాధ్యమయిన మహత్తర శక్తి వుంది.

ఆమె స్పర్శలో పురుషుకి శరీరాన్ని పునీతం చేసే మహత్తు వుంది. స్త్రీ హృదయంలో దైవత్వం వుంది. ప్రేమించిన స్త్రీ తప్ప ప్రపంచంలో మరే శక్తీ పురుషునికి యింతటి చిరస్మరణీయమయిన హాయినీ, ఆనందాన్నీ ఇవ్వలేదు.

"రాణీ!"

"ఊఁ...."

"రాణీ డియర్"

"ఊఁ"

"నాకేదో మత్తు మందిచ్చావు...."

"ఊఁ"

"నన్ను పూర్తిగా వశపరచుకుని పిచ్చివాడ్ని చేసేశావు"

"ఊరికే మాట్లాడక ఇలా పడుకోండి"

ఆమె అతని తలను తన గుండెలకు హత్తుకుంది.

పసిపిల్లాడిలా ఆమె గుండెలకు అలా హత్తుకుపోవటం అతనికింకా హాయిగా వుంది. బాల్యంలో అమ్మవడిలో పడుకున్నప్పటి పారవశ్యం.

"రాజీ!"

"ఊఁ"

"ఎప్పుడూ ఇలాగే ఉండిపోతే...."

"ఎలాగ?"

"ఇలాగే... ఈ కౌగిలికో ఇలాగే స్తంభించిపోతే సినిమాలో ఫ్రీజ్ షాట్ లా...."

ఆమె సన్నగా నవ్వింది—ఆమె చిలకలా నవ్వింది.

యెనక జన్మములోన ఎవరమోనంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలక నాయెంకి

"యెంకి....యూ అర్ మై యెంకి"

ఆమె మళ్ళీ నవ్వింది.

"ఇదో కొత్తపేరా?"

"కాదు. పాతపేరే"

"పాత పేరా?"

"యెంకంటే నాకు చాలా యిష్టం?"

"ఇంతకూ ఈ యెంకెవరు?"

"యెంకెవరో చెబితే అర్థమౌతుందా?"

"ప్రయత్నిస్తాను."

"యెంకెవ్వరని లోకమెపుడయిన అడిగితే
యెలుగు నీడలకేసి యేలు సూపింతు అన్నాడు యెంకిని సృష్టించిన మహాకవి"

"మీరూ మీ యెంకి యేమన్నా చేసుకోండి. నాకు నిద్రొస్తోంది బాబు...."

ఆమె అతన్ని వదిలేసి అటుపక్కకు తిరిగి పడుకోవటానికి ప్రయత్నించింది. కాని అతడామెను మళ్ళీ తన చేతుల్లో బంధించి తనవైపు తిప్పుకున్నాడు.



"నువ్వే నా యెంకివి. యేం చేసినా నీతోనే. నువ్వు తప్ప నాకు వేరే ప్రపంచమంటూ లేదు"

"చాల్లెండి....ఈ మాటలన్నీ యిప్పుడే-ఈ బెడ్‌లో వున్నంత సేపే...."

"కాదు—ఈ భూమ్మీద ఉన్నంత కాలం...."

"సర్లెండి-కాస్సేపు నిద్రపోనీయండి"

"ఊహూ! పోనివ్వను గాక పోనివ్వను. నన్నిలా ఉండనివ్వు. మాట్లాడనివ్వు. తెల్లారకట్ల ఇలా నువ్వు నేనే ఇంకెవ్వరికీ వినిపించకుండా తగ్గు స్వరంతో బూ మాట్లాడుకోవటం నాకెంతో బావుంటుంది."

ఆమె మాట్లాడలేదు. ఆమె నిద్రలోకి వెళ్ళిపోయిందని గ్రహించాడు.

ఆమె గుండెల్లో తల దూర్చి. తనూ నిద్రపోవటానికి ప్రయత్నించాడు. కళ్ళు మూసుకుపోతున్నాయే గాని నిద్రవచ్చేలా లేదు.

ఆమెతో అలాగే మాట్లాడుతూ వుండాలని.... తన అంతరాంతర జ్యోతిస్సీమల్లో మసలుతున్న ఎన్నో అనుభూతుల పరంపరల్ని ఆమెతో పంచుకోవాలని.... ఆమెను తను ఎంతగా వాంఛిస్తున్నాడో, ఎంతగా ప్రేమిస్తున్నాడో, ఆమెలో తను ఎందరెందరి రూపాల్ని చూస్తున్నాడో, ఎంతెంత కవిత్వాన్ని రచించుకుంటున్నాడో ఆమెకు చెప్పాలని.... ఆమెతో గడిపే ప్రతి క్షణాన్ని అత్యంత రసమయంగా మలచుకోవాలని తను చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ఆమె అర్థం చేసుకోవాలని....

"రాజీ!"

మళ్ళీ పిలిచాడు — ఆమె నిద్రపోతున్నది.

అతడు తనలోతాను మాట్లాడుకుంటునట్టుగా

"మైడియర్ రాజీ! పూర్వం నువ్వెక్కడో.... కొన్ని కోట్లమైళ్ళ అవతల ఏ నక్షత్రమండలములోనో ఓ నక్షత్రంగా ఉంటుండేదనివట-కేవలం నాకోసమే నువ్వీ రూపం ధరించి ఈ భూలోకంలో పుట్టావట-ఈ విషయం బహుశా నీకు తెలియదేమో. కానీ నాకు తెలుసు...."

"ఎవరు చెప్పారేమిటి?" సన్నటి గొంతుతో అంది ఆమె.

"అమ్మదొంగా! అంతా వింటూనే ఉన్నావన్నమాట నిద్రపోతున్నావనుకొని...."

"నిద్రపోతున్నానని తెలిసికూడా ఎవరితో చెబుతున్నారు? మీ యెంకితోనా?"

"కాదు - నాకు నేనే.... కొన్నిసార్లు నాలో నేనే మాట్లాడుకోవటం నాకు చాలా ఇష్టం...."

"అలాగా! అయితే ఇంతసేపూ మాట్లాడుతున్నది నాకోసం కాదన్నమాట–మీకోసమే నన్నమాట...."

"కాదు - నీకోసమే.... నువ్వే నా రాజీవి - నా మెంకిలి....నా ఊర్వశివి - పార్వతివి - నా కోమలివి.... నా అమృతావివి ... నా అరుణవి నా మధురవాణివి.... నా సత్యభామవి"

"అమ్మబాబోయ్! ఎవరు వీళ్ళంతా?"

"అందరూ నువ్వే .. నువ్వే అందరూ"

"నాకేమీ అర్థం కావటం లేదు బాబు. నన్ను కాస్సేపు నిద్రపోనీండి...."

"ఓ యస్! అలాగే.... నేనడిగిందిస్తే నువ్వూ నిద్రపోవచ్చు. నేనూ నిద్రపోవచ్చు"

"ఏమిటి మీరడిగేది?"

"ఇస్తానంటే చెబుతాను - మాటిచ్చి తర్వాత తప్పించుకోవద్దు"

"అమ్మో! తెలిసింది. మీరడగబోయే దేమిటో తెలిసింది. మీరేమీ అడగొద్దు. నేనేమీ ఇవ్వద్దు ఇంకాస్సేపైతే తెల్లారుతుంది. కాస్సేపు నన్నిలా పడుకోనియ్యండి ప్లీజ్...."

"ప్లీజ్! నేనడిగిందిచ్చేసి ఎంతసేపయినా పడుకో...."

"ఇప్పుడిచ్చేదేమీలేదు.... తెల్లారిపోతోంది...."

"నా బాధా అదే! తెల్లారిపోతోంది.... మళ్ళీ ఎప్పటికి దొరుకుతావో"



"మీకేం? మగమహారాజులు. ఇప్పుడిలా మాట్లాడి నా నిద్రపాడు చేస్తారు. నేను లేచి వెళ్ళిపోగానే హాయిగా యేడింటిదాకా పడుకుంటారు"

"ఈ రోజు నేను కూడా నీతోబాటే లేస్తాను. నీకు చాలా పనులు చేసి పెడ్తాను ఇప్పుడు నువ్వు ఒప్పుకుంటే...."

"యేమిటి ఒప్పుకునేది? ఇంకాస్సేపయితే పాలవాడొచ్చేస్తాడు. పని మనిషి వచ్చేస్తుంది...."

"వాళ్ళు రావటానికింకా చాలా టైముంది. వాళ్ళపేరు చెప్పి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నావు."

"కొంచెంకూడా బుద్ధిలేదు."

"ఎవరికి?"

"మీకే"

"ఇంత మనిషిని పట్టుకొని.... సాక్షాత్ నీ భర్తను పట్టుకొని బుద్ధి లేదు అనటానికి ఎంతసాహసం నీకు.... పతివ్రతలయితే ఇలా అంటారా?"

"నేను పతివ్రతను కాను అని మీకు చాలాసార్లు చెప్పాను. పతివ్రతలంటే అసహ్యం అంటూనే నేను పతివ్రతను కావని బాధపడతారేం."

"పోనీయ్‌లే.... టాపిక్ మార్చకు. ఈ ఒక్కసారి...."

"ప్రతీసారీ మీకొక్కసారే"

"ఈ ప్రపంచంలో నాకు నిజమైన హాయినిచ్చేదేదన్నా వుంటే అదొక్కటే...."

"కొంచెం కూడా బుద్ధిలేదు — అలా మాట్లాడటానికి...."

"ఉన్నమాట చెబితే బుద్ధిలేనట్టా?"

"మీతో వాదిస్తూ కూర్చోలేను. తెల్లారుతోంది. అవతల బోల్డు పనుంది. వెళ్తున్నాను"

ఆమె అతన్ని తప్పించుకొని లేచి వెళ్ళిపోటానికి ప్రయత్నించింది. అతడామెను గట్టిగా తన చేతుల్లో బంధించేశాడు.

"పొద్దున్నే ఇలా నిరుత్సాహ పరిస్తే రోజంతా ఏదో పోగొట్టుకున్నట్టుగా వుంటుంది. మూడంతా చెడిపోతుంది — ప్లీజ్"

"ఏమిటీ పిచ్చి మీకివ్వాళ్ళ? బయటకు చూడండి — పూర్తిగా తెల్లా
పోయింది. మీరుకూడా ఇప్పుడే లేవండి ఇప్పుడైతే ఎవరూ డిస్టర్బ్
చెయ్యరు అదేదో పత్రికకు కథ పంపించాలని పది రోజులుగా అం
న్నారు. ఈ రోజిది రాసెయ్యండి"

"అలాగే రాస్తాను - నువ్విప్పుడొప్పుకుంటే.... నీకు నిజంగా నే
కథ రాయాలని వుంటే నా చిన్న కోరికను వెంటనే తీర్చేస్తావు — ఔనా?"

"కాదు - చిన్న కోరికైనా పెద్దకోరికైనా రాత్రి దాకా ఆగితేనే"

"రాత్రి.... అంటే ఇంకా కనీసం పదహారు గంటలు గడవా
అప్పటిదాకా ఈ ప్రాణం ఉంటుందంటావా?"

"భేషుగ్గా వుంటుంది. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. సరేనా?"

"భలే ఏడిపిస్తున్నావే రాజీ!"

"ఛీ! యేమ్మాటలవి"

"ఔను, పసిపిల్లాడ్ని చేసి ఆడిస్తున్నావు. మందో మాకో పెట్టినట్లు
వశపరచుకున్నావు మరల్చి, పిచ్చెక్కించి. పిచ్చివాడ్ని చేస్తున్నావు..."

"పిచ్చివాడ్ని నేను చెయ్యటం లేదు మీరే అవుతున్నారు. మీ
చేసిందంతా మరచిపోతున్నారు- ఎన్నిసార్లు మీరడిగినప్పుడల్లా...."

"ఊరించి....ఊరించి ....బాధించి.. బాధించి... బతిమాలించుకొని
బతిమాలించుకొని.... అప్పుడుగాని... "

"ఛీ! ఇలా మాట్లాడితే నాకెంత కోపమొస్తుందో.... అసలేవి
మీ ఉద్దేశ్యం? ఇకపై నాలుగ్గంటలు అదే లోకమా?"

"అలా అయితే ఎంతబావుండును"

"నిజంగా బుద్ధిలేదు. మొదటిసారి చూసినప్పుడు ఎంత బుద్ధిమంతు
అనుకున్నాను...."

"నిజమే.... నిన్ను చూసేంత వరకు ఈ విషయంలో బుద్ధిమం
డినే.... నువ్వు నా జీవితంలో ప్రవేశించిన మరుక్షణంలోనే నాలో
అనేది మాయమై పోయింది"

"అలాగా రాజా!" అందామె అతని మొఖాన్ని తన గుండె
హత్తుకుంటూ- అతడామె శరీరాన్నంత ముద్దుపెట్టుకున్నాడు.



"నీతో వేగటం చాలా కష్టమై పోతోంది రాజా!"

"ఎందుకు?"

"రోజురోజుకూ చాలా పసిపిల్లాడై పోతున్నావు"

"నువ్వే నన్ను పసిపిల్లాడ్ని చేసి ఆడుకుంటున్నావు"

"పసి పిల్లాడయితే చెప్పినట్టు వింటాడు. కాస్సేపు ఏమీ మాట్లాడ
కుండా పడుకోండి"

ఆమె అతన్ని ఇంకా దగ్గరకు లాక్కొని నిద్రపుచ్చటానికి ప్రయ
త్నిస్తున్నట్టుగా జోకొట్టింది.

"రాజీ! ఎప్పుడూ ఇలాగే వుండు. ఒక్క క్షణం కూడా నన్ను విడిచి
వెళ్ళకు ..."

"ఉష్! మాట్లాడొద్దు... కాస్సేపు నిద్రపోండి"

అతడు నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నట్టుగా నటించాడు. ఆమె
స్పర్శ తనలో కొంత ఉద్రేకాన్ని రగిలించకపోతే ... తన రక్తాన్ని
ఇంతగా వేడెక్కించకపోతే నిద్రపోయేవాడే....

బయట తెల్లగా తెల్లారుతోంది. ఇప్పుడామెను ఒప్పించడం తన
తరంకాదు. ఆమె ఒక్కసారి 'నో' అన్నదంటే....

మెల్లగా అతని కళ్ళు మూతలు పడ్తున్నాయి.... యేదో మత్తు
తనన్నీ ఆక్రమించు కుంటోంది.

ఏవో దృశ్యాలు.... ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు.

తెల్లగా మంచుముద్దలు.... పచ్చటి పచ్చిక మైదానలు. దూరంగా
మంచు కప్పబడి సూర్య కిరణాలు తాకిడికి తళతళ మెరుస్తున్న పర్వత
శిఖరాలు.

ఆకాశంలోకి చొచ్చుకు పోతున్న యూకలిప్టస్ చెట్లు- ఆ చెట్ల
మధ్యలో తను ఎటు చూసిన చెట్లే అవి యూకలిప్టస్ చెట్లుకావు. ఆపిల్
చెట్లు, ఆ చెట్లకు ఆపిల్ పళ్ళు గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతున్నాయి.
ఎర్రగా, పచ్చగా, ఊదాగా, ఎరుపుగా ... వాటిని చూస్తేనే వాటిని తాకాలని
పిస్తోంది వాటిని తెంపుకొని నోట్లో పెట్టుకోవాలనిపిస్తోంది. ఎక్కడ

చూసినా ఆపిల్ పళ్ళే. నిగనిగలాడ్తూ నోట్లో నీరూరిస్తూ....వాటి అ న్నంతా కళ్ళతోనే జుర్రేస్తున్నాడు.

ఆపిల్ పళ్ళను ఆ మైదానంలో కుప్పపోశారు. వందలు....వేలు ఆ కుప్పమీద తను దొర్లుతున్నాడు.

ఆ పళ్ళన్నీ ఓ మంచు పర్వతం మీదినుంచి కిందకు దొర్లిపోతున్నా జలపాతంలా కిందకు దూకుతున్నాయి.

ఎంత అద్భుత దృశ్యం! రంగురంగుల పళ్ళన్నీ జలపాతంగా పోవటం! ఆ పళ్ళతోపాటు తనూ కొట్టుకుపోతున్నాడు.

కానీ ఇదేమిటి? ఎవరో వచ్చేశారు. చెక్కలతో డబ్బాలు పండ్లనన్నిటినీ ఆ డబ్బాల్లో నింపేస్తున్నారు. ఒక చెక్కను ఇం చెక్కకు జతచేసి మేకుతో కొడ్తూ డబ్బాల్లా తయారు చేస్తున్నా సుత్తెలతో కొడ్తున్నారు. అదేపనిగా సుత్తెలతో బాదేస్తున్నారు. అబ్బబ్బ ఎవరు వాళ్ళు? ఎందుకంత చప్పుడు చేస్తున్నారు....అదే పనిగా ఎందు బాదేస్తున్నారు? ఆ సుత్తెలతో తన తలమీద బాదుతున్నట్టుగా ఉంది. చప్పుడు ఆగిపోతే బావుండును....అబ్బబ్బబ్బబ్బ....

"ఆఁ! వస్తున్నాను...." తన చేతుల్లోంచి అతన్ని విడిపించు లేచిపోవటానికి ప్రయత్నిస్తున్నదని, బయట తమ ఇంటి తలుపు పాలవాడు బాదేస్తున్నాడని అతనికర్థమైంది.

"రజీ! అప్పుడే వెళ్తున్నావా"

"అప్పుడే యేమిటి? ఆరున్నరయిపోయింది. బయట పాల తలుపులు బాదేస్తున్నాడు. నాకిప్పుడే కొత్త కునుకుపట్టింది." ఆమె అ వదిలించుకొని, లేచి నిల్చొని విడిపోయిన చీరె జాకెటును సరిచేసుకుం

"రోజూ ఈ పాలవాడొకడు మన ప్రాణం తియ్యటానికి. ని నన్నూ వేరుచెయ్యటానికి పుట్టిన దుర్మార్గుడు" అన్నాడు రవి గు మీదకు లాక్కొని.

బయట "అమ్మగారూ!" అంటూ రజని తలుపులు తెరచి అతనికి మళ్ళీ మత్తు ఆవరించేసింది.



పాలవాడు–పాలవాడు. పాడుపాలవాడు. పొద్దున్నే నా పాలబడ్డవాడు. నడు వాడు-ఎచటివాడు-ఇటు వచ్చిన తెల్లవాడు. పాలవాడు కాబట్టి ల్లవాడే-

ఇంతకు ముందు మళ్ళీ ఏదో కలగన్నట్టున్నాడు. ఆ ఆపిల్ పండ్లు ంత పొంకంగా....వింకంగా....మళ్ళీ ఆ కలొస్తే బావుండును. కలలు.... లలు....ఎన్ని కలలో....ఎన్ని కలలో ఎవడు గెలుస్తాడో....ఎవడో ఒకడు వడైతేనేం పోటీపడి కాటులాడ... బస్సుసీటు బ్రహ్మరథం.... నెహ్రూను బ్రహ్మరథం పట్టిన దేశం....నెహ్రూ వెళ్ళిపోయాడు. ప్రిన్స్ చార్మింగ్! ర్లింగ్ ఆఫ్‌ది మిలియన్స్ వెళ్ళిపోయాడు....కోటికోటి ఎదల గులాబీలు తని పాదాలు ముద్దిడుతున్నాయి. ప్రియదర్శనుడు నెహ్రూ పండితుడు శాశ్వత నిద్ర పోతున్నాడు సద్దు చేయకండి. సద్దు చేయకండి-ఎవరది? డబా డబా....డిబడిబా....డబడబా... డిబడిబా.... ఏమిటా చప్పుడు?

పనిమనిషి కూడా వచ్చినట్టుంది. వంటింట్లోంచి అంట్ల పాత్రలన్నీ యట పడేస్తున్నట్టుంది.

ఈ స్టీలు పాత్రలు....భలే చప్పుడు చేస్తాయి. ఒకటే డబడబా.... డిబడిబా....అందులో ఖాళీవి ఎంప్టీ వెస్సెల్స్ మేక్ మచ్ నాయిస్.... ంచిమోగినట్లు కనకమ్మ మ్రోగునా....వంటపాత్రల్ని బంగారంతో యించుకుంటే ఇంత చప్పుడు ఉండదేమో! వేయరు రాసి పారేసిన ఆటవెలదులెన్నో.... ఆటవెలది ద్విపదకత్తగారు ....ఆరుద్రకు శ్రీశ్రీ మామగారు. ఒక్క మహాప్రస్థానం రాసి యాభయ్యేళ్ళు ఆంధ్రసాహిత్యాన్ని చక్రవర్తిలా ఏలాడు. అయినా పాపం డబ్బెంతగా రాలేదట.

యే అమెరికాలోనో బ్రిటన్‌లోనో అయితే నువ్వు రాసిన ఒక్క పుస్తకం సక్సెసయితే చాలు....లక్షలు మిలియన్స్ సంపాదించొచ్చు.... జీవితాంతం ఇక డబ్బు సమస్య లేకపోతే ఎంతహాయి! ఎంత విశ్రాంతి.... అప్పుడిక ఎన్ని నవలలైనా రాసెయ్యొచ్చు....ఒక్క నవల రాసి మిలియన్స్ సంపాదించటం తనకు సాధ్యమౌతుందా? తనకే కాదు. ఈ దేశంలో ఎవడికీ సాధ్యం కాదేమో....

ఇదేమిటీరోజు....బ్రెయిన్‌లో బ్రెయిన్‌గన్—రెయిన్‌లా ఆలోచన బ్రెయిన్.

తనో పూర్ తెలుగూ రైటర్! తన పుస్తకాల్ని తనే పబ్లిష్ చేసుకోవాలి. తనే అమ్ముకోవాలి. అడవిలో మానై పుట్టినా ఫరవాలేదుగా తెలుగు రచయితగా మాత్రం పుట్టొద్దు తెలుగు రచయిత పొద్దున లేవగా చేసేపనేమిటంటే అప్పుకోసం పరిగెత్తటం.

అవును....తనకీరోజు అప్పెవడిస్తాడు? ఇంకాస్సేపట్లో రజని వచ్చి తనను లేపుతుంది. "ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి. వెళ్ళి తెచ్చి పెట్టమంటుంది. కానీ జేబులో డబ్బేది? తన జేబులో డబ్బులేదని రజనికి తెలుసు అయినా సరుకులు తెమ్మంటుంది. నాల్గు రోజులుగా రోజూ చెబుతూనే ఉంది. తను రోజూ "రేపు" "రేపు" అంటూ వాయిదా వేస్తూనే ఉన్నాడు ఇన్ని రోజులూ ఎలాగో ఊరుకుందిగానీ ఈ రోజు మాత్రం ఊరుకోదు కాబట్టి తను లేవగానే అప్పుకోసం వేట మొదలెట్టక తప్పదు. పక్కింటి ప్రవీణ్‌కుమార్ని అడిగేద్దామా?

ప్రవీణ్‌కుమార్ రోజూ అర్ధరాత్రిదాకా క్లబ్‌లో పేకాడి ఓ వంద రూపాయలకు తక్కువ కాకుండా సంపాదించి ఇంటికొస్తాట్ట. ఏ రోజైనా అతడు క్లబ్‌కెళ్ళనని, ఇంట్లోనే ఉంటానని అంటే అతని భార్య అస్సలు ఒప్పుకోదట! అతనికి పాంట్ షర్ట్ తొడిగి రిక్షా మాట్లాడి క్లబ్‌కు తీసికెళ్ళమని చెప్పి పంపిస్తుందట! అతన్నందరూ "రష్మిప్రవీణ్‌కుమార్" అంటారు ఈరోజు తప్పదు—మైడియర్ రష్మిప్రవీణ్! వచ్చేస్తున్నాను. వచ్చేస్తున్నాను ఓ వందరూపాయల నోట్‌తో రెడీగా ఉండు. వందలేదా? పోనీయ్ యాభై చాలు.

"యేమండి మీరు—మీకు మా వారే దొరికారా? మీరూ ఉద్యోగం చేస్తున్నారు....పైగా నవలలు రాస్తారు—మీ దగ్గర డబ్బులేకపోవటమేమిటి ఎవరన్నా చూస్తే నవ్వుతారు" అంటుంది ప్రవీణమ్మ....పోనీయ్ ప్రవీణా

అలా నవ్వొద్దు ప్రవీణా! త్వరలోనే మనమంటే ఏమిటో నీకు తెలుస్తుంది. త్వరలోనే నేనో గొప్ప నవల రాయబోతున్నాను. గొప్ప సైంటిఫిక్ సస్పెన్స్ మిస్టరీ థ్రిల్లర్! ఇర్వింగ్‌వాలెస్—సిడ్నీ షెల్డన్



గిల్డన్ వాలెస్.... రాబిన్‌కుక్.... హెరాల్డ్ రాబిన్స్— రాబిన్స్‌గిబిన్స్ షెల్డన్‌గిల్డన్ వాలెస్ గిలెస్—అందర్నీ మిక్సీచేసి ఒక బ్రహ్మాండమైన మిక్చర్‌ను తయారు చేస్తాడు—ఆ మిక్చర్‌ను ఆంధ్రదేశంలోని అన్ని పత్రికలు—ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క ఇన్‌స్టాల్‌మెంట్ చొప్పున ప్రచురించేస్తాయి ఒక్కొక్క పేపర్ ఒక్కొక్క లక్ష ఇచ్చేస్తాయి.

పేపరున్న పబ్లిషర్లందరూ పోటీపడి తన నవలల్ని ప్రచురిస్తారు. మార్కెట్లో ఎక్కడ చూసినా తన నవలలే—కుప్పలు తెప్పలుగా డబ్బు మహాప్రవాహంలా డబ్బు—తన నవలల్ని సినిమాలు తీస్తారు అలా తీసిన ప్రతి సినిమా సూపర్‌హిట్టయిపోయి బాక్సాఫీసును బద్దలు కొట్టేస్తాయి. తనకు మళ్ళీ డబ్బు.

తన ఇంటి ముందు ఇటు పబ్లిషర్లు, అటు ప్రొడ్యూసర్లు క్యూలో నిల్చుంటారు. మీ పుస్తకాలు కావాలి. మీ కథలు కావాలి. మీ డైలాగులు కావాలి. మీ పాటలు కావాలి మీ ఐడియాలు కావాలి. మీ పేరుంటే చాలు.. పెట్టుబడి తిరిగి రావటం గ్యారంటీ—

మళ్ళీ తనకు లక్షలు—లక్షలు కోట్లవుతాయి— మిలియన్స్.... బిలియన్స్. తనో బిలియనీర్....తనో కోటీశ్వరుడు...తను పట్టుకున్నదల్లా బంగారమై పోతుంది మిడాస్‌టచ్!

ఓ పెద్ద మేడ....స్కైస్క్రేపర్....ఆకాశహర్మ్యాన్ని కట్టించేస్తాడు. తను కూర్చుని నవలలు రాయటం కోసం ఓ ప్రత్యేకమయిన ఎయిర్‌కండిషన్డ్ రూమ్ తనకింద నలుగురు స్టెనోలు పనిచేస్తారు. ఒకేసారి నల్గురికి నాలుగు నవలల్ని డిక్టేట్ చేస్తాడు. నాలుగు పత్రికలకు పంపించేస్తాడు తన కారణంగా ఎంతోమందికి జీవనభృతి దొరుకుతుంది.

తనకెన్నో సన్మానాలు....ఎన్నో బిరుదులు....ఎన్నో అవార్డులు.... జ్ఞానపీఠ్. నోబెల్‌ప్రైజ్....భారతరత్న...... ప్రధానమంత్రి, రాష్ట్రపతి తనకు అభినందన సందేశాలు పంపిస్తారు.

తనను ప్రపంచంలోని అన్ని దేశాల ప్రభుత్వాలూ ఆహ్వానిస్తాయి. పారిస్, లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కో, టోక్యో, బీజింగ్, మాస్కో అంతటా అందరూ తనకు బ్రహ్మరథం పడతారు.

తనను వినటానికి, తనను చూడటానికి లక్షలమంది జనం ఆనందోత్సాహాలతో వచ్చేస్తారు.

మంచిని, మానవత్వాన్ని పెంపొందించేసే సాహిత్యమని...... కులాలు, మతాలు, ధనికులు, పేదలు, ప్రాచ్యులు, పాశ్చాత్యులు....వీటన్నిటికీ అతీతమయిన, స్వచ్ఛమైన మానవత్వాన్ని పెంచుకోమని చెప్పటమే రచయితగా తన ధ్యేయమని, తన రచనలు మానవాళిలో స్నేహం సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తున్నందుకు గర్విస్తున్నానని చెబుతాడు.

"ఇంకెంతసేపు పడుకుంటారు? ఏడయిపోతోంది. లేవండిక" రజని వచ్చి అతన్ని అటూ-యిటూ కుదిపి లేపటానికి ప్రయత్నించింది.

"ఒక్క ఐదు నిమిషాలు నన్నిలా వదిలెయ్, ప్లీజ్" అన్నాడతడు దుప్పటిని పైకి లాక్కుంటూ—ఛీఛీ! ఎంత మంచి కలను పాడుచేసింది?

"ఐదు నిమిషాలు కాదు. ఒక్క నిమిషం కూడా ఆగను వెంటనే లేచి బజారుకెళ్ళాలి"

"నేను నిద్రపోతున్నాననుకుంటున్నావా? నిద్రపోవటం లేదు. నిజంగా. ఓ ఐదు నిమిషాల్లో లేస్తాను"

"మీరు నిద్రపోవటం లేదని నాకు తెలుసు మహాశయా! మెలకువగానే వుండి ముసుగుతన్ని వెచ్చగా పడుకొని టెక్నికలర్‌లో కలలు గంటున్నారని నాకు తెలుసు"

"ఔను రజనీ! పొద్దున్నే ఇలా పడుకొని టెక్నికలలు కనడం అంటే నాకెంతిష్టమో నీకు తెలుసు"

"తెలుసు....... బాగా తెలుసు. కానీ మీరీరోజు కాలేజీకెళ్ళాలంటే వెంటనే లేచి బజారుకెళ్ళి...."

"అబ్బబ్బబ్బ! తెలుసు....ఐదు నిమిషాల్లో లేస్తానని చెబుతున్నాగా-ఒక బ్రహ్మాండమైన కల-మధ్యలో చెడగొట్టేశావ్....దాన్ని పూర్తిచేసి...."

"మీ కలలు పూర్తవుతాయా? అవి అనంతం మహాశయా! ఇలాగే పొద్దంతా పడుకున్నా మీ కల పూర్తికాదు. దయచేసి వెంటనే లేవండి"

ఆమె వెంటనే అతడు కప్పుకున్న దుప్పటిని విసురుగా లాగేసింది.



"ఛీ! ఎంత మొండిదానివి....చెబితే వినిపించుకోవు"

అతనికి కోపమొచ్చేసింది

"మొండిదాన్నే! కాబట్టే మీతో బతగ్గలుగుతున్నాను. లేచి బ్రష్ చేసుకొని స్నానంచేసి బజారుకెళ్ళిరండి. ఇంట్లో సరుకులేమీ లేవు. కనీసం అన్నం వండి పడేద్దామన్నా స్టౌలో కిరసనాయిల్ లేదు"

"కష్టాలు మొదలయ్యాయిరా నాయనా! ఇందుకే పొద్దున్నే లేవాలంటే నాకు పరమ చిరాకు"

"మీకు మీ కలలు తప్ప అన్నీ చిరాకే అని తెలుసు. కానీ మీకు చిరాకు కలిగించక తప్పదు. రోజూ రేపు రేపని తప్పించుకుంటున్నారు. ఈ రోజు ఇంట్లోకి కావల్సినవన్నీ తీసుకురాకపోతే వూరుకోను"

"ఏం చేస్తావ్?"

"చెప్పను-చేసి చూపిస్తాను"

"వద్దు రాణీ! వద్దు. చేసి చూపించకు ఇదివరకు చూపించింది చాలు."

"అనుకని మరోసారి నాకు కోపం తెప్పించకుండా మర్యాదగా లేవండి"

"ఇదిగో లేస్తున్నాను—చాలా మర్యాదగా"

గబుక్కున ఆమె చెయ్యి పట్టుకుని, తన మీదకు లాక్కుని, ఆమె పెదాలపై ముద్దుపెట్టుకున్నాడు

"ఛీ! పాచిమొహంతో-బుద్ధి లేదు"

"బుద్ధిలేదు" రాణిగారికి ఊతపదమైపోయినట్టుంది."

"ఊతపదం లేదు, గీతపదం లేదు మొదట మీరు లేచి తెమలండి"

ఆమె అతన్ని తప్పించుకుని లేచి నిల్చొని మరోసారి అతని మీద వున్న దుప్పటి లాగేసి మడతపెట్ట సాగింది.

అతడు మరోసారి ఆవులించి ఒళ్ళు విరుచుకుని లేచి కూర్చున్నాడు.

"పేపరొచ్చిందా?"

"ఎప్పుడో వచ్చింది. కానీ మీకిప్పుడా పేపరివ్వను. బజారుకెళ్ళొచ్చాక తీరికగా చదువుదురుగానీ...."

"పొద్దున్నే లేవగానే ఒక్కసారి 'హిందూ' మొఖం చూడకపోతే నాకు బావుండదని నీకు తెలుసు"

"మీ హిందూ ఎక్కడకూ పోలేదు? త్వరగా తయారయి బజారుకు వెళ్ళిరండి. ఆ తర్వాత మీరెంతసేపయినా మీ హిందూతో గడపండి అభ్యంతరం లేదు"

"ప్లీజ్! ఒక్క ఐదునిమిషాలు హెడ్‌లైన్ మాత్రం చూసి బ్రష్ చేసుకుంటాను"

"మీరిప్పుడలాగే అంటారు. పేపర్ చేతికొచ్చిందంటే గంటసేపటి దాకా లేవరు"

"ఈరోజు మాత్రం ఐదు నిమిషాలకంటే ఎక్కువసేపు పేపర్ చూడను...."

"ఈ ఒక్కరోజు మీరు పేపర్ చూడనంత మాత్రాన ప్రపంచం మునిగిపోదు. రాత్రి రేడియోలో వార్తలు విన్నారుకదా! ఇప్పుడు పేపర్లో ఏమంత కొంప ముంచుకుపోయే వార్తలుంటాయని మీరింతగా ఇదై పోతున్నారు?"

"పిచ్చిమాలోకమూ— పేపర్‌ను కేవలం వార్తలకోసమే చదవనని నీకు తెలియకపోతే—"

"తీరిగ్గా తెలుసుకుంటానుగానీ మీరు పదండి"

"పేపర్ ఇవ్వనంటావు"

"ఇవ్వనుగాక ఇవ్వను"

"మొండి...."

"మీకంటేనా...."?

ఇక లాభంలేదు-ఆమె మాట వినాల్సిందే ఈరోజు బజారుకెళ్ళక పోతే వూరుకోదు"

ఇంటి వెనుకకు నడిచాడు.

ఈ మనిషి ఎందుకిలా మారిపోతుంటుందీ. రాత్రి వున్నట్లుగా పగలు వుండదు. ఇదీ తెమ్మని-అదీ తెమ్మని....ఇలా చెయ్యమని, అలా చెయ్యొద్దని-ఇదే పని—పగలంతా ఇలాగే పంతాలు, పట్టింపులు. పగలయితే దొర



సేరా....రాత్రి నా రాజువురా....పగలయితే దొరసానిరా.... రాతిరి నా రాణిరా....

అసలీ ఆడవాళ్ళు అర్థమై అర్థంకాని భావగీతమ్ములు. ఏదియో అపూర్వ మధుర రక్తి స్ఫురియించునుగాని అర్థమ్ము కాని భావగీతమ్ములై-

పంపుదగ్గర పనిమనిషి విజయ ఇంకా అంట్లు తోముతూనే వుంది. స్టీలు పాత్రల్ని గలగలమనిపిస్తూనే వుంది. ఇద్దరు వ్యక్తులు బతకటానికి ఇన్ని పాత్రలు. ఇన్ని వస్తువులు....ఇంత హంగామా....అడవుల్లో వేటాడుతూ బతికిన ఆటవిక మానవుడే బెటర్ వాడికిన్ని అవసరాలు ...ఇన్ని పాత్రలు... ఇంత డబ్బు అవసరముండేవి కావు. ఇలా అభివృద్ధి చెందుతూ చెందుతూ ఈ ఆధునిక నాకరికత ఏవరికేమవుతుందో? ఫ్యూచర్ ఫ్రాక్! ఎప్పుడో ఓ ఫైన్ మార్నింగ్ ఈ నాగ కతంతా భస్మీపటలమైపోతుందేమో.

టూత్‌బ్రష్ మీద పేస్ట్ వేసుకున్నాడు. ఈ పేస్ట్ కనిపెట్టినవాడూ గొప్పవాడే

బ్రష్‌తో పళ్ళు తోముకోవటం మొదలెట్టాడు.

మనిషనేవాడు భూమ్మీద పుట్టడం........కొన్ని వేల సంవత్సరాలు జంతువుల్లాగే అడవుల్లో వేటాడుతూ జీవించటం....మెల్లమెల్లగా ఒక్కొక్కటే కనిపెట్టటం....పచ్చిమాంసం తినేవాడు నిప్పు కనిపెట్టి ఉడికించిన పదార్థాలు తినటం....నిప్పు ...కిరోసిన్ లేకుట....బజారుకు పరుగెత్తాలి. కిరోసిన్ ఎవడు పోస్తాడు-భూషణం కొట్లో కిరోసిన్ వుంటుందా? భూషణమైతే క్రెడిట్ మీద పోస్తాడు. కానీ భూషణం కొట్లో కిరోసిన్ లేకపోతే— తనింట్లో ఈరోజు స్టవ్ వెలగదు కిరోసిన్ తేలేని తనను రజని క్షమించదు.

ఆదీ మానవుడు నిప్పు కనిపెట్టి వుండకపోతే తనకి రోజూ యిన్ని కష్టాలు. దేవి కావు.

"ఆదిమానవుడే గొప్పవాడు నోబుల్ సావేజ్....చలంగారి మైదానంలో రాజేశ్వరి అమీర్లకెప్పుడన్నా కిరోసిన్ అవసరం పడిందా? వెంకటచలం పాత్ర రాసిన గోపీచంద్‌ను అడగాలి గోపీచంద్ జీవయాత్ర సాగి

సాగి నివరకు అరవిందుని దగ్గర అంతమైందేమిటి? ఎవరీ అరవిందుడు? ఎవరీ రమనీ మహర్షి? కళ్ళకు కనిపించే ఈ భౌతిక ప్రపంచాని కతీతమైన మరొక ప్రపంచం వున్నదా? ఎక్కడుంది? ఆ ప్రపంచాన్ని చూసొచ్చిన మానవమాత్రులెవరయినా వున్నారా? ఏది నిజం? ఏది మాయ?

అమ్మయ్య! మాయ వదిలిపోతున్నది మొహం మీద చల్లటి నీళ్ళు చల్లుకోవటం యెంత హాయిగా ఉందో? నిద్రమత్తు పూర్తిగా వదిలిపోతున్నది ఈ క్షణంలో రాత్రి అంతమై పగలు ప్రారంభమౌతుంది.

మొహం కడుక్కోవటం పూర్తిచేసి ఇంట్లోకొచ్చి తువ్వాలెక్కడ?" అన్నాడు.

"అక్కడెక్కడో వుంటుంది చూస్కోండి" అంది రజని.

"నేను చూసుకున్నాక నువ్వెందుకు?" అనబోయాడు. కానీ అనలేదు. ఆ మాటంటే రజని వెంటనే 'బుద్ధుందా?' అని అడుగుతుంది.

"తువ్వాలందించటానికేనా భార్య?" అంటుంది.

చదువు సంస్కారం ఉన్న తన ఆలోచనలే యింక అధ్వాన్నంగా వుంటే మామూలు వాళ్ళ సంగతేమిటి?

తరాల సాంప్రదాయం, తరతరాల మగవాళ్ళ ఆలోచనా ధోరణి తన రక్తంలో కూడా యింకి, అంతర్భాగమై ప్రవహిస్తోంది. తరతరాల బూజు మా నిజాం రాజు....దాశరథీ కరుణాపయోనిధి ...నా తెలంగాణ కోటిరత్నాల వీణ....బ్రెయిన్‌లో క్రెయిన్....ఆలోచనల చెయిన్!

బెడ్‌రూమ్‌లో టవెల్ వెతుక్కొని మొహం తుడుచుకుని, అద్దం దువ్వెన యెక్కడుందో వెతుక్కొని, తల దువ్వుకున్నాడు

రోజూ ఇదొక యజ్ఞం....బెడ్ మీద నుంచి లేచి మొహం కడుక్కోవటం—రాత్రి సుఖానికి గుడ్‌బై చెప్పటం....

పేపరు ఎక్కడ దాచి వుంటుంది? బెడ్ కింద చూశాడు. లేదు.... పాత పేపర్‌ల మధ్యలో చూసాడు- లేదు

టీ కప్పుతో వచ్చింది రజని.

"థాంక్యూ" అన్నాడు ఆమె చేతిలోంచి కప్పందుకుంటూ.

ఆమె మూతి తిప్పింది.



ఈ ఆడవాళ్ళు యింత అందంగా మూతి తిప్పటం ఎలా నేర్చుకుంటారో!

"థాంక్యూ అని ఎందుకన్నానో తెలుసా?"

"తెలుసు"

"ఎలా తెలుసు?"

"ఎలా తెలుసో మీకు తెలిసేట్టు నేను తెలపాలంటే మీరు చాలా తెలుసుకోవలసి వుంటుందని మీరు తెలుసుకుంటే...."

"కొంచెం ఆగు ఇప్పటి వరకూ యెన్ని తెలుసులయ్యాయో లెక్కపెట్టాక ఆ వాక్యాన్ని పూర్తి చేద్దువుగాని"

ఇద్దరూ గొల్లున నవ్వారు.

"ఇప్పుడు చెప్పు నేను ఎందుకు థాంక్యూ అన్నానో"

"స్టౌలో కిరోసిన్ లేదని చెప్పి కూడా వేడివేడి టీ తెచ్చి దొరగారికి అందించినందుకు."

"కొందరు అప్పులిస్తే పేగులు లెక్కపెడతారంటారు. నువ్వు మాత్రం అపులించకుండానే పేగులు లెక్కపెట్టగలవు."

"చాలు! అంతకంటే ఎక్కువ పొగడకండి స్టౌ అడుగున కొంచెం కిరోసిన్ మిగిలితే దాంతో యీ టీ అయ్యింది. వంట మాత్రం యిలాగే చేసేస్తాను అని మాత్రం ఆశ పెట్టుకోకండి."

"కోను ప్రామిస్"

"థాంక్స్"

"టీ చాలా బాగుంది. కిరసనాయిలు ఆఖరు చుక్కలతో చేశావుగా- అందుకని"

"సరేగానీ ఇక బజారుకు తయారుకండి"

"తయారవుతాను. ఈరోజు నీక్కావాల్సిన సామానంతా తెచ్చి పడెయ్యకపోతే...."

"నాక్కావల్సిన సామానా?"

"సారీ....సారీ....మాట జారాను. మనిద్దరికీ కావలసిన సామాను."

"మాట జారటం కాదు. అది మీ మగవాళ్ళ మనస్తత్వం"

"బాబు-ఒప్పుకుంటాను"

"చాలా బుద్ధిమంతుడై పోయాడు పాపం! సరేగానీ ఆ తెచ్చే సామానేదో త్వరగా తెచ్చిపడేస్తే బాగుంటుంది. యెప్పుడో పదింటికి తెచ్చి కాలేజీకి టైమయిపోయింది... యింకా వంటే కాలేదా అని నా మీద చిందులు తొక్కితే లాభం లేదు."

"చిందులు తొక్కటం అంటే ఏమిటా అని చాలాసార్లు ఆలోచించాను."

"అబ్బబ్బబ్బ....చెప్పేది కొంచెం విసిపించుకుంటారా లేదా?"

"వినిపించుకుంటున్నాను చెవుడు రాలేదింకా. ఇప్పుడే....ఈ క్షణంలోనే బయటకు వెళుతున్నాను"

టీ సిప్ చెయ్యటం ముగించి కప్పు ఆమె చేతికిచ్చి యింటి వెనకకు నడిచాడు

బజారుకు వట్టి చేతులతో వెళ్ళి యేం తెస్తాడు? భూషణం కొట్లో ఖాతా వుంది రెండు నెలలుగా ఆ ఖాతాకేం జమ చెయ్యలేదు కాబట్టి వాడీ రోజు సరుకులివ్వడు. కాబట్టి అప్పుకు వెళ్ళాల్సిందే! అప్పెవరిస్తాడు? సరుకులెలా వస్తాయి? అసలు జీతం రాగానే ఓ నెలరోజులకు సరిపడా యింట్లోకి కావలసిన సరుకులన్నీ తెచ్చిపడేస్తే బాగుండేది.

అయినా ఎన్ని కొని తెచ్చిపడేసినా ఈ ఆడవాళ్ళు పొద్దున లేవగానే పప్పయిపోయిందనో, ఉప్పయిపోయిందనో చల్లగా చెప్పేస్తారు. అసలు యీ అయిపోవటం అంటూ వుండకపోతే?

ప్రతీ క్షణం మనం పీల్చుకునే ఆక్సిజన్ యెప్పుడూ అయిపోదు.... సృష్టి దాన్ని సమృద్ధిగా సమకూర్చింది మానవుడికొక్కవలసిన మిగతా వస్తువులు కూడా ఆక్సిజన్ లాగే లభ్యమయితే మనిషి కి కష్టాలన్నీ వుండేవి కావు. ఆక్సిజన్ కూడా దొరక్కుండాపోతే అప్పుడు మనిషి గతేమవుతుంది?

ప్రళయం ... మహాప్రళయం- అందరూ ఒకేసారి కట్టగట్టుకొని మట్టిలో కలిసిపోతారు.

ఈ మనుషులు, ఈ నాగరికత, ఈ మహాపట్టణాలు, ఈ మహా కట్ట



BAPUJI Cultural Association NANDYAL - 518 501

డాలు, ఈ కర్మాగారాలు, యీ ఆనకట్టలు... యివన్నీ లేనప్పుడు కూడా ఈ భూగోళం ఇలాగే వుంటుందా?

తన చుట్టూ తాను 24 గంటల కొకసారి తిరుగుతూనే వుంటుంది. 865 రోజుల్లో సూర్యుడ్ని చుట్టేసి వస్తూనే వుంటుంది. ఏమిటిదంతా? యీ భూమి, యీ సూర్యుడు, యీ నక్షత్రాలు' యీ గెలాక్సీలు, కోట్లకోట్ల నక్షత్రాలకు కోట్లకోట్ల గ్రహాలున్నప్పుడు—ఒక్క భూగ్రహం మీదే సృష్టెందుకు జరగాలి? ఈ మనుష్యులెందుకు పుట్టాలి? ఈ నాగరికతెందుకు అభివృద్ధి చెందాలి? దీనికంతటికీ కారకుడెవరు? కలడు కలడనెడివాడు కలడో లేడో—యీ ప్రశ్నకు సమాధానం యెవడు చెప్పాలి? ఈ సృష్టి యిలాగే అనంతంగా కొనసాగుతూనే వుంటుందా? సూర్యగోళం మండటం మానేసి చల్లబడిపోయిన క్షణంలో యీ భూగోళం, యీ సృష్టి, యీ జీవరాసులు ఏమైపోతాయి? సూర్యకుటుంబంలోని గ్రహాలన్నీ పెద్ద పెద్ద బెలూన్లలాగా ఫట్ ఫట్ మని బ్రహ్మాండమయిన శబ్దాలు చేస్తూ ముక్కలు చెక్కలై పోతాయి. అంతదాకా యెందుకు? పిచ్చిగా పెరిగిపోతున్న పారిశ్రామీకరణతో కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి పెరిగిపోతున్నదట ఆడవులను నరికెయ్యటంతో ఆక్సిజన్ సృష్టి తగ్గిపోతున్నదట! దాంతో భూగోళం వేడెక్కిపోతున్నదట! యీ అంటార్కిటికాలోని మంచంతా కరిగి సముద్రాలు పొంగి.... భూగోళమంతా మునిగిపోయే రోజు దగ్గర్లోనే వుందట....

నవ్వుకున్నాడు

మన బుర్ర యివ్వాళ చాలా అద్భుతంగా ఆలోచిస్తోంది. కానీ ఇలా యెంత చించినా....చించినా....పైసా మాత్రం పుట్టదు.

నల్లా తిప్పాడు. స్సుయ్‌మని నీళ్ళు ఇలా పంపు తిప్పగానే డబ్బులు కూడా స్సుయ్‌మని సదుపాయమేదన్నా కల్పిస్తే యెంత బాగుంటుంది?

ఇప్పుడు హాయిగా వుంది. మరో ముఖ్యమైన ఘట్టం ముగిసింది. బయటకొచ్చి సబ్బుతో చేతులు కడుక్కున్నాడు

షేవ్ చేసుకొని స్నానం చేశామంటే మరో ముఖ్యమయిన ఘట్టాన్ని పూర్తి చేసినట్టవుతుంది.

"మీ కోసం ఇంటాయనొచ్చాడు."

"ఇంటాయనా? ఆయనిప్పుడెందుకొచ్చినట్టు?"

"అద్దె పెంచుతానని చెప్పటానికొచ్చాడేమో?"

ఎదుటి వాడి మనసులో ఏముందో ఈ ఆడవాళ్ళు ఇట్టే చెప్పేస్తారు. ఈజిట్ ఇన్‌ట్యూషన్? ఇంటాయన నిజంగానే అద్దె పెంచుతున్నానని చెప్పటానికే వచ్చాడా?

ఈ ప్రమాదంలోంచి యెలా బయటపడాలి?

"ఇప్పుడిస్తున్న దానికంటే ఒక్క పైసా కూడా ఎక్కువివ్వలేమని చెప్పేసెయ్యండి" దగ్గరకొచ్చి గుసగుసగా చెప్పింది రజని.

"అలా చెబితే ఇల్లు ఖాళీ చెయ్యమంటాడేమో!"

"అననీయండి....అలా అంటే మరో ఇల్లు దొరగ్గానే ఖాళీ చేస్తామని చెప్పండి."

"మరో ఇల్లు మాత్రం ఇంత కంటే తక్కువకు దొరుకుతుందా?"

"ఆ విషయం తర్వాత చూసుకుందాం....ఇప్పటైతే ఆయనతో నేను చెప్పమన్నట్టు చెప్పండి."

"మంచిది....అలాగే!"

"ఆయనకీ టీ తీసికెళ్ళివ్వండి."

"అప్పుడే ఆయన కోసం టీ కూడా చేశావా?"

రవి ఆమె చేతిలోంచి టీ కప్ తీసుకొని డ్రాయింగ్ రూమ్‌లో ప్రవేశించాడు.

"నమస్కారమండి" అన్నాడు రవి

"నమస్కార మండి" అన్నాడు ఇంటాయన.

రవి అతని చేతికి టీ కప్ అందించాడు.

"థాంక్స్! పొద్దున్నే అయితే తీరికగా వుంటుందని, కాస్సేపు మాట్లాడొచ్చునని ఇలా వచ్చాను...." టీ సిప్ చేస్తూ అన్నాడాయన.

"అవును....నిజమే....చెప్పండి!"



సందేహం లేదు....అద్దె పెంచుతానని చెప్పటానికే వచ్చాడు. ఎంత పెంచుతానంటాడో....నోట్లోంచి యేం వెలువడుతుందో........పాతికంటే ఎలాగో సర్దుకోవచ్చు....యాభై అన్నాడంటే చచ్చామే.

"ఆహా యేమీ లేదు....మీరొచ్చి సంవత్సరమైంది కదా....! అందుకని రెంట్ ఓ యాభై రూపాయలు పెంచుతున్నాను."

యాభై....యాభై....ఫిఫ్టీ రూపీస్ వోన్లీ! అంతే....గిల గిల కొట్టుకొని చచ్చినా అంతే....యాభై....ఎంత సులభంగా చెప్పేశాడు. తనిప్పుడేం చెయ్యాలి? ఇవ్వలేనని కచ్చితంగా చెప్పెయ్యాలి. లేకపోతే రజని లోపల కెళ్ళగానే కచ్చితంగా తన రెండు చెంపలు వాయించేస్తుంది. కమాన్.... చెప్పేయ్....చెప్పేసెయ్....అయినా మరో యాభై రూపాయలంటే ఎక్కడ్నుంచి తెచ్చిస్తావు?

"మీకు తెలియందేముంది? మీరొచ్చి సంవత్సరం దాటింది. ఈ సంవత్సర కాలంలో అన్ని వస్తువుల ధరలూ పెరిగాయి...."

"అదీ నిజమేననుకోండి....కానీ ఒక్కసారే యాభై రూపాయలంటే కొంచెం మా పరిస్థితి కూడా చూడండి."

నీళ్ళు నములుతున్నావు....ఇప్పుడిస్తున్న దానికంటే ఒక్క పైసాకూడా ఎక్కువివ్వలేమని కచ్చితంగా బల్లగుద్ది మరీ చెప్పు ......అంత గట్టిగా చెప్పితే....ఇప్పుడే ఈ క్షణమే ఇల్లు ఖాళీ చెయ్యమంటే—కొత్తింటి కోసం ఎక్కడని వెతుకుతావు. మళ్ళీ ఇంత మంచి ఇల్లు ...ఈ మాత్రం ప్రైవసీ ఉన్న ఇల్లు దొరుకుతుందా? అలా చెప్పకపోతే రజనికి కోపమొచ్చేస్తుంది.

తలుపు చాటున నిల్చుని తనేం చెబుతున్నానోనని జాగ్రత్తగా వింటుంది. ఆమె చెప్పమన్నట్టు చెప్పకపోతే రెచ్చిపోతుంది. యేం చెయ్యటం? గట్టిగా చెబితే ఆయనకు కోపం....చెప్పకపోతే ఈమెకు కోపం.... అడకత్తెరలో ఇరికిన పోకచెక్క....ఎరక్క చిక్కడ్డాను. ఇందులోంచి ఎలా బయటపడటం?

"ఏమిటంతగా ఆలోచిస్తున్నారు? మీరీ ఇంట్లో చేరినప్పట్నుంచి నే రెంట్ పెంచలేదు. మంచివాళ్ళు....మర్యాదస్తులు....ఇద్దరే వుంటున్నా అనుకొని వూరుకున్నాను ఈ ఊళ్ళో మీరెక్కడన్నా చూడండి—మూ రూముల పోర్షన్... సపరేట్ బాత్ అండ్ లాట్రిన్....ఇరవై నాల్గు గంట వాటర్ సప్లయ్....ఇన్ని ఫెసిలిటీస్ వున్న ఇంటికి మీరు రెండొందల న్నారు. మేం కాబట్టి అంత తక్కువకిచ్చాం. ఇంకెవరైనా మూడువందల తక్కువిచ్చేవారు గాదు. నేనిప్పుడు రెండు వందల యాభై ఇవ్వమన ఏ విధంగా చూసినా న్యాయమే"

పైకి మెత్తగా కనిపిస్తాడు గానీ చాలా గట్టివాడే.... పెద్ద ఇంజనీర్. బోల్డు సంపాదించాడు. ఈ వూర్లోనే ఆయనకు ఐదారిండ్లున్నాయని చెప్ కుంటారు... ఇప్పుడే యాభై రూపాయలు పెంచి తన ప్రాణం తియ్య పోతే యేం? లాభం లేదు. ఆలోచించి లాభంలేదు—ఒక్క పైసా కూ ఎక్కువిచ్చుకోలేమని చెప్పెయ్యాలి. పోనీయ్ ఓ పాతిక పెంచండి....ఇంకో సంవత్సరం గడిచాక ఇంకో పాతిక ఇదీ న్యాయం.

"మీరు చెప్పేదంతా నిజమే ననుకోండి....కానీ మీరు కొంచెం మా సమస్యను కూడా గుర్తించాలి"

"మేం మీ సమస్యను గుర్తించాలి, మీరు మా సమస్యను గుర్తి చాలి మిమ్మల్ని ఒకేసారి మూడు వందలిమ్మనటం లేదుగా! న్యాయా మూడు వందలు రావలసిన పోర్షనిది. మీరు ఖాళీ చేస్తే మూడొందల తక్కువివ్వను మీరు సంవత్సరం నుండి ఉంటున్నారు. మీరు మా వచ్చారు మా ఆవిడకు మీ ఆవిడ మంచి కంపెని. ఇవన్నీ గమనించే నే యాభై రూపాయలు మాత్రమే పెంచాను. మీకో విషయం తెలుసో తెలీదో ఈ ఇండ్లు కట్టటమంత తెలివితక్కువ పని మరొకటి లేదు. వెనకటికెవ 'ఫూల్స్ బిల్డ్ హౌజెస్... వైజ్ మెన్ లివ్ ఇన్ దెమ్' అన్నాట్ట. ఆ మా అక్షరాలా నిజమనిపిస్తుంది. అష్టకష్టాలు పడి మనం ఇల్లు కడితే మ పెట్టుబడికి కనీసం ఫైవ్ పర్సెంట్ కూడా ఇంటరెస్ట్ రాదండి"

"కానీ...." రవి ఏదో చెప్పబోయాడు.



"కానీ లేదు. యేమీ లేదు. వచ్చే నెల నుండి యాభై కలుపుకుని రెండువందల యాభై ఇవ్వండి-నే వస్తాను మరి."

ఇల్లు గలాయన లేచాడు. ఇంకో క్షణంలో బయటకు వెళ్ళిపోతాడు. తన మౌనాన్ని అంగీకారంగా తీసుకుంటాడు. ఒక్క పైసాకూడా ఎక్కువ ఇచ్చుకోలేం అని చెప్పకపోయినా కనీసం రెండు వందల పాతిక కంటే ఎక్కువివ్వలేమనన్నా చెప్పేసెయ్. రజని కొంచెం శాంతిస్తుంది. ఆలా చెప్పకపోయావో నరకమంటే యేమిటో చూపిస్తుంది.

"ఒక్కసారే యాభై అంటే చాలా ఇబ్బందౌతుందండి. ఈసారికి పాతిక పెంచండి"

ఎలాగో అనేశాడు. ఆయన సరే అంటే బావుండును. కానీ.... అంటాడా?

"ఏమండీ లెక్చరర్‌గారు! ఇదేమన్నా కూరగాయల బేరమా? యాభై రూపాయలకే ఇంత ఇబ్బందంటే ఎలాగండి? మనకు ఆర్నెల్లకొకసారి డి ఏ పెరగటంలేదూ? సంవత్సరానికొకసారి ఇంక్రిమెంట్ రావటం లేదూ? నేను యాభై రూపాయలు పెంచటం చాలా సమంజసమండి. మళ్ళీ సంవత్సరం దాకా పెంచను. సరేనా?"

"సరేలెండి" గొణిగినట్టుగా అన్నాడు రవి.

అసలు తన నోటినుండి 'సరేలెండి' అన్న మాట వెలువడుతుందని తనకే తెలియదు కనీసం మౌనంగానన్నా ఉండాల్సింది స్టుపిడ్‌లాగా 'సరేలెండి' అనేశాడు ఇప్పుడిక తుఫాన్ చెలరేగుతుంది.

థాంక్స్....వస్తానండి! సైట్ మీద కెళ్ళాలి" ఇల్లు గలాయన వెళ్ళిపోయాడు.

"ఒప్పేసుకున్నారన్నమాట—" అంది రజని. ఇల్లుగలాయన బయటకు వెళ్ళగానే ముందు రూమ్‌లో కొచ్చేసి.

"యేం చెయ్యమంటావు మరి?"

యేం చేస్తారు....మీకేం? మీ దగ్గర బోల్డు డబ్బు మూలుగుతోంది. యాభై రూపాయలేమిటి? వంద పెంచినా ఒప్పేసుకుంటారు."

"రజనీ! వ్యంగ్యంగా మాట్లాడటం నాకూ వచ్చు. కానీ పరిస్థితిని కొంచెం అర్థం చేసుకో."

"ఏమిటండి అర్థం చేసుకునేది? మేమంత ఇవ్వలేము. కావాలంటే ఖాళీ చేస్తామని కచ్చితంగా ఎందుకు చెప్పరు....? ఆయన అన్నదానికల్లా 'నిజమే ననుకోండి' అంటూ మీరే తాళం వేస్తుంటిరి."

"ఖాళీ చేస్తే ఇన్ని సౌకర్యాలున్న ఇల్లు రెండువందలకు దొరుకుతుందా? కనీసం మూడు వందలైనా పెట్టందే ఇంత మంచిల్లు ఈ వూర్లో ఎక్కడా దొరకదు."

"ఇంతకు ముందు ఆయన చెప్పిన మాటలను అక్షరాలా నిజమని నమ్మేశారన్న మాట పసిపిల్లాడికంటే అన్యాయం. ఎవరేది చెబితే దాన్ని నమ్మేస్తారు. ఈ వీధిలోనే రెండొందల్లో ఇంతకంటే మంచిల్లును నేను మాట్లాడతాను."

"మాట్లాడు. ప్లీజ్ మాట్లాడు. ఇప్పుడు మించిపోయిందేమీ లేదు. ఈ ఫస్ట్‌కే ఖాళీ చేసి వెళ్ళిపోదాం."

"ఇప్పుడు మాత్రం మించిపోయిందేమీలేదని ఎంత ఈజీగా అనేస్తున్నారు. అన్నిటికీ ఒప్పేసుకున్నాక ఇల్లు ఖాళీ చేస్తే వాళ్ళేమనుకుంటారు. అతడు మంచివాడే. అతని భార్యే గయ్యాళి. బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించిందని వన్నాడిపోసుకోరూ? ఎవరన్నా వింటే నవ్వుతారు. ఒక్కసారే యాభై రూపాయలు పెంచటం అన్యాయమండి అని చెప్పలేరట. 'కావాలంటే ఇల్లు ఖాళీ చేస్తామని చెప్పండి' అనీ చిలుకకు చెప్పినట్టు చెప్పి' పంపించాను. యేమాటా కచ్చితంగా మాట్లాడలేరు ఇవ్వండి. మీకేం.... యాభై రూపాయలంటే మీకో లెక్కా. లక్షాధికారులు."

ఆ కంఠంలో ధ్వనించే ఆ వ్యంగ్యం తనకు పిచ్చెక్కిస్తుంది.

"రజనీ! ప్లీజ్ స్టాప్ దట్...." అరచినట్టుగా అన్నాడు.

"నా నోరు మూయిస్తారు లెండి! బయటి వాళ్ళతో మాట్లాడలేరుగానీ నా మీద అరవమంటే మాత్రం రెడీ."



"ఏం చేస్తావు మరి? నీకిలాంటి క్రూరుడు భర్తగా దొరికాడు. నిన్ను అనుక్షణం పీడించి పీడించి చంపుతున్నాడు" అతనికి తెలియకుండానే అతని కంఠం పెరిగింది.

"ఎందుకలా అరుస్తారు? కాస్త నెమ్మదిగా మాట్లాడండి. పక్కవాళ్ళు వింటారు"

"విననీ-నాకేం భయంలేదు. వీడో సంస్కారం లేనివాడనుకుంటారు. నువ్వే అనుకున్నపుడు బయటివాళ్ళు అనుకోవటంలో ఆశ్చర్యం ఏముంది?"

"నేనెందుకు చెబుతున్నానో మీకర్థం కాదు. మీరు ఇప్పటికే అనుక్షణం డబ్బుకోసం బాధపడ్తున్నారు. ఇంకో యాభయ్ రూపాయలు అంటే ఎక్కడ్నించి తెస్తారని నేనింతగా ఇదైపోతున్నాను. నేను బాధపడేది మీ కోసమే"

"తెలుసు. కానీ ఏం చెయ్యమంటావు? ఆ మనిషి ఎంతో ఫ్రెండ్లీగా వుంటాడు. ఇంట్లోకొచ్చిన సంవత్సరంనుండి వాళ్ళతో మనకెలాంటి ప్రాబ్లెమ్స్ రాలేదు. నీక్కూడా వాళ్ళ మిసెస్‌తో మంచి ఫ్రెండ్‌షిప్ యేర్పడింది. అలాంటి వాళ్ళతో అలా కచ్చితంగా ఎలా మాట్లాడమంటావు? ఏ మనిషితోనయినా సరే కత్తె విరిచినట్టుగా మాట్లాడాలంటే నా కసహ్యం. డటీచ్ మై నేచర్ పుట్టుకతో వచ్చిన బుద్ధి ఇప్పుడు పొమ్మంటే పోతుందా? పోట్లాడటం నాకు చేతకాదు"

"ఆయనతో ఇప్పుడు పోట్లాడమని ఎవరు చెప్పారు?"

"యాభయ్ రూపాయలు ఎక్కువివ్వలేను. ఖాళీ చేస్తానని చెప్పాననుకో.... వెంటనే ఖాళీ చెయ్యమంటాడు. మరో ఇల్లు దొరికాక ఖాళీ చేస్తామని మనమంటాం. మనకు వెంటనే ఇల్లు దొరకదు. ఖాళీ చేస్తున్నామని చెప్పిన మరుక్షణంనుండి వాళ్ళు మనల్ని శత్రువుల్లా చూస్తారు. ఇంకెప్పుడు ఖాళీ చేస్తారని అనుక్షణం మనవెంట పడతారు. ఇదంతా పోట్లాటకు దారి తీయదూ? ఎవరిమీదో పెట్టి మనల్ని ఏదన్నా అంటారు. నీకావిడ ఫ్రెండే కదా! ఇల్లు ఖాళీ చేస్తున్నామని చెప్పిన మరుక్షణంలో ఎలా మారిపోతుందో చూడు"

"తెలుసు. అంతా మీరూహించుకుంటున్నదే. అయినా అద్దె పెంచుతానన్న మరుక్షణంలో మీరు ఇప్పుడిస్తున్న దానికంటే ఒక్క పైసా కూడా ఎక్కువిచ్చుకోలేము కావాలంటే ఖాళీచేస్తామని మీరు కచ్చితంగా చెప్పేస్తే అతడు తప్పకుండా తగ్గేవాడు"

"తగ్గేవాడు కాదు ఇంకా పెరిగేవాడు. ఈ క్షణం ఖాళీచెయ్యమని నిలదీసేవాడు"

"అలా అంటే ఖాళీ చేసేసే వాళ్ళం. ఈ వూర్లో ఈ ఇల్లు తప్ప యిల్లంటూ లేదా ఏమిటి?"

"బయటకు వెళ్ళి ఓ యిల్లు వెతికి, మాట్లాడిపెట్టరాదూ? అదీ మాత్రం చేతకాదు. ఇంట్లో కూర్చుని అధికారం చెలాయించమంటే మాత్రం రెడీ"

"నేనిప్పుడేం అధికారం చెలాయించాను? సర్లెండి ఏ విషయంలో కూడా జోక్యం చేసుకోను అంతా మీ యిష్టమొచ్చినట్టుగా చేసుకోండి. సరేనా? ఇంట్లో కూర్చుని వండిపెట్టడం వరకే నా డ్యూటీ........" ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

"పైనుండి ఇదొకటి. కొంచెం గట్టిగా మాట్లాడితే ఈ ఏడ్పొకటి" అతనూ ఆమె వెంటే లోపలికొచ్చాడు.

"ఇప్పుడెవరూ ఏడ్వటంలేదు. ఏం చేస్తారు పాపం.... మీకో గయ్యాళ్ది ఏడుపుగొట్టుది దొరికింది"

ఆమె కంఠం రుద్ధమైపోతోంది.

"రజనీ ప్లీజ్...."

అన్నాడతను ఆమె దగ్గరగా వెళ్ళి.

ఆమె వెళ్ళి మంచంమీద పడుకుంది. అతను వెళ్ళి ఆమె మీద చెయ్యేశాడు.

"దయచేసి నన్నిలా కాసేపు వదిలెయ్యండి"

తన మీదనుంచి అతని చెయ్యి తీసేసి విసురుగా అంది.



అతడు బెడ్‌మీంచి లేవాడు. ఆమెకు కోపం వచ్చిందంటే వెంటనే తగ్గదని అతనికి తెలుసు. వెంటనే బజారుకెళ్ళి ఆమె తెమ్మన్న సరుకులు తెస్తేనన్నా ఆమె కోపం తర్వగా తగ్గుతుంది.

షేవింగ్‌బాక్స్ తీసుకుని అద్దం ముందు కూర్చొని షేవ్ చేసుకోడం మొదలెట్టాడు

మగవాణ్ని రెచ్చగొడతారు. వాడి సహనాన్ని పరీక్షిస్తారు ఎంతసేపూ సమస్యను తమ దృష్టితో తప్ప ఎదుటివాడి దృష్టితో చూడరు. ఏమన్నా అంటే ఏడ్చేస్తారు. దటీజ్ విమెన్!

ఇంకా ఏడుస్తూనే వుందా? ఆమెనంతగా బాధపెట్టే మాట తనేమన్నాడు? తనయితే ఎన్ని మాటలన్నా అనొచ్చు. 'మీకసలు మాట్లాడటం చేతకాదు' అనొచ్చు. 'మీకంటే పసిపిల్లాడు నయం' అనొచ్చు. ఇన్‌డైరెక్టుగా మీరొట్టి అసమర్థులు అనొచ్చు. ఇన్ని మాటలన్నా తను నోరు మెదపకూడదు.

'అధికారం చెలాయిస్తున్నావు' అనటం తప్పయిపోయింది. అంతే- ఆమెకు కోపమొచ్చేసింది. ఇక మౌనవ్రతం పట్టేస్తుంది ఆ వ్రతాన్ని బ్రేక్ చెయ్యాలంటే యూ హావ్ టు బ్రేక్ యువర్ హెడ్! ఈ ఆడవాళ్ళున్నారే....అబ్బబ్బబ్బ... వీళ్ళతో వేగడం అంటే కొండకేసి తల బాదుకోవడమే తల ముక్కలయిపోయినా కొండకు జాలి కలగదు.

బ్లేడు తెగి రక్తం కారింది.

పొద్దున్నే రక్తం! బ్లేడ్ పక్కనే బ్లడ్ వుంటుంది బ్రదర్! బ్లడీ బ్లేడ్!

"మీకసలు షేవ్ చేసుకోవడం చేతకాదండి" అంటుంది రజని.

కరెక్ట్!

మనకు గెడ్డం చేసుకోవడం చేతకాదు. ఇల్లు గలాయనతో మాట్లాడటం చేతకాదు. అసమర్థుని జీవయాత్ర.

రజని ఎప్పుడూ కరెక్టుగానే మాట్లాడుతుంది. లోకం పోకడను కరెక్టుగా అంచనా వేస్తుంది. ప్రతివాడిని తన ఎక్స్‌రే కళ్ళతో పరీక్షిస్తుంది. ఎవడ్నీ నమ్మదు! హండ్రెడ్ పర్సెంట్ ప్రాక్టికల్.

మనకది చేతకాదు. అందర్నీ నమ్మేస్తాం. చేతకానివాడిని చేతకానివాడు అంటే అంత రెచ్చిపోవటం దేనికి? అనవసరంగా బాధపెట్టేశాడు.

ఇంకా ఏడుస్తూనే వుందా? ఈ ఆడవాళ్ళకు అంత సులభంగా కన్నీళ్ళలా వస్తాయో? బాధతో నలిగిపోతున్నా తనకు కన్నీళ్ళు రావెందుకు?

సబ్బూ, రక్తమూ కలసిపోయాయి. వెధవ బ్లేడు-సృష్టి స్త్రీ పక్షపాతి. వాళ్ళకి కన్నీళ్ళిచ్చి మనకివ్వలేదు. ఒక్కొక్కసారి కన్నీళ్ళు కార్చెయ్యటం వలన ఎంత గుండెభారం తీరుతుందో?

త్వరగా ముగించెయ్! వెధవ మీసాలు. కుదిరి చావవు. ఒకవేపు ఎక్కువ....ఒకవేపు తక్కువ.

అసలు క్లీన్ షేవ్ బెటర్.

"మీకు మీసాలుంటేనే బావుంటారంటుంది" రజని కాబట్టి నో క్లీన్ షేవ్—

త్వరగా తెమలాలి. స్నానం చేసేసి సైకిల్ తీసుకుని బజారుకెళ్ళి ఇంట్లోకి కావలసిన సరుకులన్నీ తెస్తేనే రజని శాంతిస్తుంది. లేకపోతే ఈ రోజంతా మౌనవ్రతమే. తను గిలగిలా కొట్టుకుని చావాలి.

షేవింగ్ సెట్ సర్దేసి లేచాడు. ఆమె యింకా దిండులో మొఖం దూర్చి పడుకునే వుంది.

"రజనీ! వేన్నీళ్ళేమన్నా పెట్టావా? చన్నీళ్ళే పోసుకోమంటావా?"

ఆమె వేన్నీళ్ళు పెట్టలేదని తనకు తెలుసు. అయినా ఆమెను పలకరించాలని....ఆమె కోపాన్ని పోగొట్టాలని....ఏమీ జరగలేదని ఆమెకు చెప్పాలని....

ఆమెలో చలనం లేదు.

టవల్, బకెట్, సోప్ ఎక్కడున్నాయో వెతుక్కుని బాత్రూమ్‌లోకి ప్రవేశించాడు.

అతడు స్నానం చెయ్యటం మొదలెట్టాడు.

ఇందాక గెడ్డం తెగినచోట చన్నీళ్ళు పడగానే భగ్గున మంట.

తొందరలో డెట్టాల్ రాసుకోవటం మరిచిపోయాడు.



"అసలిప్పటికీ మన దేశం ఓ మంచి బ్లేడును తయారుచెయ్యలేక పోతున్నది ఏం దేశమండి ఈ దేశం?" అంటాడు సీతారామారావు సీతారామారావుకు అన్నీ తెలుసు పేరుకు కామర్స్ లెక్చరరే అయినా ఫిజిక్స్ కెమెస్ట్రీ అస్ట్రానమీ ఫిలాసఫి, సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్, అలెగ్జాండర్, అక్బర్-అన్నీ మాట్లాడేస్తాడు.

"వాకింగ్ ఎన్‌సైక్లోపేడియా ఆఫ్ దిస్ కాలేజ్" అని పేరు పెట్టాడు తను. "వాకింగెందుకు? సిట్టింగ్ ఎన్‌సైక్లోపేడియా" అనాల్సింది. ఆయన ఎప్పుడూ కూర్చునే వుంటాడు కాబట్టి.

ఎప్పుడు ఎవరికి ఏ విషయంలో డౌటొచ్చినా అతన్నే అడుగుతుంటారు. అతనిచేత 'తెలియదండి' అనిపించటం అసాధ్యం. అతడు సర్వజ్ఞుడు. "మిష్టర్ నో ఆల్"

చన్నీళ్ళు పోసుకుంటుంటే హాయిగా వుంది. వేన్నీళ్ళకంటె చన్నీళ్ళే బావుంటాయి అసలు నీళ్ళే బావుంటాయి ప్రపంచంలో అన్నిటికంటె అందమైన దృశ్యమేదని ఎవరన్నా అడిగితే నయాగరా జలపాతం అంటాడు. నయాగరా సినిమాలో మార్లిన్‌మనో నయాగరా బావుందా? మార్లిన్‌మన్రో బావుందా? చెప్పటం కష్టం.

నీళ్ళయిపోయాయి పంపు తిప్పాడు. స్సుయ్ మంటూ నీళ్ళు యాభై రూపాయలు పెంచాడు. బాత్‌రూంలో షవర్ పెట్టించినా బావుండును. షవర్ కింద స్నానం చెయ్యటం ఎంత బావుంటుందో! షవర్‌లోంచి నీళ్ళు వేగంగా స్సుయ్‌మని చప్పుడు చేస్తూ జడివానలా శరీరం మీద కురుస్తోంటే ఎంత హాయిగా ఉంటుందో! హస్టల్లో ఉన్నప్పుడు రోజూ షవర్ కిందనే స్నానం చేసేవాడు హాస్టల్ 'ఎ' రూమ్. నెంబర్ 8 పక్కనే బాత్‌రూమ్స్ పొద్దున్నే షవర్ చప్పుడు గోల్డెన్‌డేస్!

గతమెప్పుడూ మధురంగానే ఉంటుంది. మరపురానీ బాధకన్నా మధురమే లేదు. గతము తలచి వగచే కన్న సౌఖ్యమే లేదు పాడేస్తున్నాడు. అవర్ స్వీటెస్ట్ సాంగ్స్ ఆర్ దోజ్ దట్ టెల్ అవర్ సాడెస్ట్ థాట్స్! షెల్లీ....మైస్వీట్ షెల్లీ....షెల్లీ మరోసారి మరణించాడు. మీరు

మనసారగా యేడ్వనీరు నన్ను. నాకు దుఃఖంపుసరుల దొంతరలు కలవు. ఎవ్వరని ఎంతురో నన్ను....కృష్ణశాస్త్రీయం వెంటనే వెళ్ళి సరుకుల సంగతి చూడకపోతే ఈరోజు దుఃఖంపు సరుల దొంతరలే మిగులుతాయి.

భూషణం ఈరోజు క్రెడిట్ మీద సరుకులిస్తే తన బాధలన్నీ తీరతాయి. పోయిన్నెల వాడికి డబ్బివ్వ లేదు. దాదాపు ఇరవై రోజులుగా వాడికి మొఖం చూపించలేదు. ఈరోజు సరుకులు కావాలని వెళితే ఎంత దుసబుస లాడ్తాడో? ఎన్ని మాటలంటాడో? అసలు మంచివాడే

ఓరోజు అకస్మాత్తుగా "మీరు కథలు రాస్తారట నిజమేనా సార్?" అని అడిగాడు. తను బోల్డు ఆశ్చర్య పడిపోయాడు. తను కథలు రాసే విషయం అతనికెలా తెలిసిందో? పొట్లాలు కట్టే పాత పేపర్లలో తన పేరెప్పుడన్నా చూశాడో యేమో... పాపం....'ప్యాసా' గురుదత్ కవిత్వమంతా పొట్లాలు కట్టే వాడి దగ్గరకే వెళ్ళింది.

ఒకరోజు అడిగేశాడు "నేను కథలు రాస్తానని మీకెలా తెలిసింది". అని ఏదో తప్పు చేస్తూ పట్టుబడిన వాడిలా ధ్వనించింది తన గొంతు

"మా అమ్మాయి చెప్పిందండీ. మా అమ్మాయికి మీ కథలంటే చాలా ఇష్టం"

మైగాడ్! అదీ సంగతి. ఈ ఊళ్లో తన కథలు చదివి, అర్థం చేసుకొని, అభిమానించే వాళ్ళున్నారంటే తను నిజంగా గొప్పవాడే! అదే కిరాణాకొట్టు యజమాని అమ్మాయి. 'బ్రేవో!' అని అరవాలనిపించింది.

అప్పట్నించి భూషణం షాపుకు తానెప్పుడెళ్ళినా చాలా ప్రేమగా మాట్లాడతాడు. ఏది కావాలన్నా క్రెడిట్ మీదే ఇచ్చేస్తాడు. ఈరోజు కూడా ఇస్తాడు 'డోన్ట్‌వర్రీ' ఈరోజు నువ్వు రాసిన కథలే నీ సరుకు దక్కిస్తాయి. రచయిత అన్నవాడికి సమాజంలో కొంచెం పరపతి ఉంది. బ్రేవో!

స్నానం చెయ్యటం ముగించి బాత్‌రూంలోంచి బయటకొచ్చాడు.

"రజనీ! నా బట్టలెక్కడ? త్వరగా ఇవ్వు. బయటకెళ్ళాలి"

బెడ్ మీదున్న బట్టలకేసి చూపించింది. ఫరవాలేదు. అలక పాన్పు మీదనుంచి లేచింది.



"మీకోసం ఎవరో వచ్చారు" అంది డ్రాయింగ్ రూమ్ వైపు పిస్తూ.

"మళ్ళీ ఎవరొచ్చారు?"

"ఎవరో తెలీదు"

"కూర్చోమని చెప్పావా?"

"చిత్తం"

చకచకా బట్టలు వేసుకున్నాడు. ఎవరొచ్చి ఉంటారబ్బా!

టైమ్....టైమ్....టైమెంతయ్యుంటుంది? ఎనిమిది ఎనిమిదిన్నర. ఎవరో తయారయ్యారు.

అద్దం ముందు నిల్చొని దువ్వుకోవటం మొదలెట్టాడు.

ఆ వచ్చిన వాడెవడో? ఎందుకొచ్చుంటాడు? స్పెషల్ బ్రాంచ్ తే కాదు గదా... ఇంటరాగేట్ చెయ్యాలని రాలేదు గదా!

ఈ క్రాఫ్ కుదిరి చావదు. మళ్ళీ దువ్వాడు. ఇది దువ్వేపకు గదు వేస్టాఫ్ టైమ్ బాగా పెరిగిపోయింది. క్షవరం చేయించుకోవకి టైమే దొరకడం లేదు. మరోసారి దువ్వాడు. ఏమిటో పిచ్చి-తను ంగా వున్నానని జనం అనుకోవాలని, తన క్రాఫ్ బావుంటుంంది రజని. క్రాఫ్ తోటే అందమట నిజంగా అందా? తన తృప్తి ఉందా?

అదిగో క్రాఫ్ మధ్యలో తెల్ల వెంట్రుక ఘోరం! అప్పుడే తన తెల్ల వెంట్రుక ఉండటమేమిటి? అవును మరి. ఎప్పుడూ పిచ్చిగా స్తోంటే నల్ల వెంట్రుకలన్నీ తెల్ల వెంట్రుకలై పోక చస్తాయా? ఆ వెంట్రుక నొకదాన్ని వేరు చేసి కసిగా లాగేశాడు. ఇలా ఎన్నని వు?

ఛీ ఛీ! మళ్ళీ జుట్టంతా చెదిరిపోయింది. త్వరగా తెములు. బయటె వెయిట్ చేస్తున్నాడు

మళ్ళీ దువ్వాడు. ఫరవాలేదు. ఈసారి కాస్త బాగానే వచ్చింది.

వెనక్కి తిరిగి రజని కేసి చూశాడు ఆమె అక్కడ లేదు.

వంటింట్లో కెళ్ళినట్టుంది—తను అన్నిసార్లు దువ్వుకోవటం చూసి న తున్నదేమోననుకున్నాడు.

"ఇంత ఒత్తయిన పొడవైన జుట్టు దువ్వి జడ వెయ్యాలనిపిస్తో తన జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి అంది రజని.

"పోనీయ్ వేసెయ్...." అన్నాడు తను

కానీ తన జుట్టు ఆమెకు లొంగలేదు. తన జుట్టు తనకు తప్ప రికీ లొంగదు

ఇప్పుడు బావుంది. దువ్వెన, అద్దం టేబిల్ మీద పడేసి డ్రా రూంలోకొచ్చాడు.

"నమస్కారం సార్!" అన్నాడు అతన్ని చూడగానే దిగ్గున నిల్చున్న ఓ ఇరవయ్యేళ్ళ యువకుడు.

ఇతన్నెక్కడో చూశాడు. కానీ గుర్తురావటం లేదు. స్టె బ్రాంచ్ వాడైతే కాడు.

"నేను సార్! రాజేంద్రను"

"అరె నువ్వా రాజేంద్రా! గబుక్కున గుర్తు రాలేదు. ఈ నువ్వు కనిపించక చాలా రోజులైంది కదూ?"

"అవును సార్!"

"ఏమిటి సంగతి?"

వీడు త్వరగా వెళ్ళిపోతే బావుండును. ఏదో సాహిత్య అంటాడు ఏదో సంఘం అంటాడు. చందా అంటాడు. జిడ్డు పట్టి వదలడు.

"ఈరోజు మా సాహిత్య మిత్రమండలి వార్షికోత్సవం సార్ ఇన్విటేషన్ ఇద్దామని వచ్చాను"

రాజేంద్ర రవికి కరపత్రంలా ఉన్న ఓ కాగితాన్నిచ్చాడు.

"థాంక్యూ" రవి ఆ కాగితాన్ని అందుకున్నాడు.

"మీరు తప్పకుండా రావాలి సార్. చీఫ్‌గెస్ట్‌గా ప్రఖ్యాత క మోహన్‌గారొస్తున్నారు. వారు మీకు చాలా సన్నిహితులని తెలిసింది"



"కృష్ణమోహనొస్తున్నాడా?"

"ఔను సార్! నేను వారిని ఇన్వైట్ చెయ్యటానికి హైదరాబాద్ వెళ్ళినప్పుడు నేను కరీంనగర్ నుండి వచ్చానని చెప్పగానే మీ గురించే అడిగారు"

"అలాగా...."

"వారికి మీరంటే చాలా గౌరవం సార్"

రవి నవ్వాడు. ఆహ్వాన పత్రాన్నిచ్చాడు. రమ్మని చెప్పాడు. వచ్చిన పనయిపోయిందిగా-ఇంకా ఎందుకు కూర్చున్నట్టు?

"మీరు మమ్మల్ని క్షమించాలి సార్!" చాలా బాధపడుతున్నట్టుగా ముఖం పెట్టి అన్నాడు రాజేంద్ర.

"ఎందుకు?"

"కృష్ణమోహన్‌గారు చెప్పేంత వరకు మీ అంతటి రచయిత మా ఊర్లో ఉంటున్నాడని మాకు తెలియనే తెలియదు. ఇంతవరకు మిమ్మల్ని సమావేశాలకు మిమ్మల్నొక లెక్చరర్‌గా మాత్రమే ఇన్వైట్ చేశాం తప్ప ఓ రచయితగా చెయ్యలేదు"

"ఫరవాలేదు"

"మీరేం పుస్తకాలు రాసారు సార్!"

"మిష్టర్ రాజేంద్ర! క్షమించాలి. నాకొంచెం బయట కెళ్ళాల్సిన పనుంది. తీరిగ్గా మరోసారెప్పుడైనా మాట్లాడుకుందాం"

ఇంత స్పష్టంగా వెళ్ళిపొమ్మని చెప్పినా ఇతడింకా వెళ్ళిపోడేమిటి? అలాగే చలనం లేకుండా కూర్చున్నాడు. వీడిని బయటకెలా పంపించి మనం బయట పడటం? దయచేసి దయచెయ్యండి అని చెప్పాలేమో!

"మీతో మరో ముఖ్య విషయం మాట్లాడాలి సార్"

"యేమిటో త్వరగా చెప్పండి"

బాబోయ్! వీడిప్పట్లో వదిలేట్టు లేడు. యేం చెయ్యటం?

"మీరు మా సంస్థకు కొంచెం హెల్ప్ చెయ్యాలి సార్"

హెల్పంటే? చందా ఇవ్వమంటాడా? వెంటనే ఓ ఐదు రూపాయ

లిచ్చి పంపిద్దామంటే ఒక్క పైసా కూడా లేదు. ఒక్క పైసా కూ లేదంటే అతడు నమ్మడు. పిసినారి వాడనుకుంటాడు-ఎలా? ఈ సమ లోంచి ఎలా బయటపడటం?

"హెల్పంటే యేమిటి? చందా అయితే మాత్రం ఇప్పుడివ్వలే జీతం వచ్చాక—"

"చందా కాదు సార్"

బతికించాడు-పదివేల థాంక్స్.

"మరేమిటో చెప్పు"

"మా సంస్థకు మీరు అధ్యక్షులుగా వుండాలి సార్...! మీల పేరున్న రచయిత మా సంస్థకు అధ్యక్షుడయితే...."

"రాజేంద్రగారూ! నాకు పెద్ద పేరేం లేదు. కృష్ణమోహన్ న ఒకప్పుడు చాలా క్లోజ్ ఫ్రెండ్స్‌మి! ఆ అభిమానంతో యేనో చెప్పుంటా అయినా మీ సంస్థకు యిప్పుడో అధ్యక్షుడు లేడా?"

"ఉన్నాడు సార్! కానీ ఆయనకు సాహిత్యాన్ని గూర్చి ఏ తెలీదు."

"ఎవరాయన?"

"పురుషోత్తమరావని పెద్ద క్రిమినల్ లాయర్. బాగా డబ్బుం అప్పుడప్పుడు చందాలిస్తాడనుకొని ఆయనను పెట్టుకున్నాము సా మంటే అభిమాన మున్నట్టుగా కనిపించాడు. కానీ ఆయనకేం తెలీ యిలాంటి మీటింగ్స్ యెప్పుడయినా పెట్టుకుంటే రావడానిక్కూడా నకు టైముండదు. కాబట్టి యీరోజు మీటింగ్‌లో మిమ్మల్ని అధ్య ఎన్నుకుంటాం సార్!"

"వద్దు—నిన్నటిదాకా నా గురించి, కనీసం నేనో రైటర్‌నని మీకు తెలీదు ఈరోజు అధ్యక్షులుగా వుండమంటున్నారు ఏమిటిది?"

"ప్లీజ్ సార్! మీరు తప్పకుండా అధ్యక్షులుగా వుండాలి సా కాదనకండి సార్!"

రెండు చేతులు జోడించి దండం పెట్టాడు రాజేంద్ర.



"చెబుతుంటే వినిపించుకోవేమిటి? అకస్మాత్తుగా వచ్చి మా సంస్థకు అధ్యక్షుడిగా వుండమని యింత బలవంతం చేస్తావేమిటి?"

"మా సంస్థను మొత్తం మీ చేతిలో పెడ్తాం. దాన్ని మీరు ఈ ఊర్లో వున్న యితర సాహిత్య సంస్థలకన్నా గొప్ప సంస్థను చెయ్యాలి. మీరు మీ స్టూడెంట్ డేస్‌లో యిలాంటి సంస్థనే ఒకదాన్ని యెంతో బాగా నడిపారని కృష్ణమోహన్ చెప్పాడు."

"గో టు హెల్! యూ బ్లడీ ఫూల్! ఇంకొక్క నిమిషం యిక్కడున్నావంటే మెడబట్టి బయటకు గెంటెయ్యాల్సి వస్తుంది..... వెంటనే "గెటౌట్" అని అరవటానికి సభ్యత, సంస్కారా లడ్డొస్తున్నాయి.... 'గెటౌట్' అంటే వీడు బయటకెళ్ళి ఎంత గొడవ చేస్తాడో! ఓ సాహితీ సంస్థ సెక్రటరీని పట్టుకొని 'గెటౌట్' అంటాడా? వాడికెంత గర్వం....! సభ్యతా సంస్కారాల్లేని బ్రూట్ అని ప్రచారం చేస్తాడు. జనం వాడి మాటల్ని సులభంగా నమ్మేస్తారు వీడు తననెంత చిత్రహింస చేస్తున్నాడో జనానికక్కర్లేదు.

"సార్! మీరు మా సంస్థకు అధ్యక్షులుగా వుండటానికి ఒప్పుకుంటే మీకు వెంటనే యీ వూర్లో గొప్ప సన్మానం ఏర్పాటు చేయిస్తాను సార్!" అన్నాడు రాజేంద్ర

ఈ ఆయుధం తప్పనిసరిగా పనిచేస్తుందన్న నమ్మకంతో రాజేంద్ర మొహం వెలిగిపోతోంది.

మైగాడ్! వీడింకా స్సేపుంటే తనకు పిచ్చెక్కటం ఖాయం. 'గెటౌట్' అని ఆకాశం దద్దరిల్లేలా అరచి వీడిని బయటకు గెంటెయ్యకపోతే తనను తాను క్షమించుకోలేడు. మనస్సులో అగ్నిపర్వతం బద్దలై పోతున్నా బయటకి మాత్రం ప్రశాంతంగానే వున్నట్టు కనిపిస్తున్నా, సోకాల్డ్ సభ్యత, సంస్కారం తననెంత నిర్వీర్యుడ్ని, అశక్తుడ్ని చేసేసాయి?

"మీ మౌనాన్ని అంగీకారంగా తీసుకుంటున్నాను సార్! ఈ రోజే మావాళ్ళందరికీ చెప్పేస్తాను. సాయంకాలం మీటింగ్‌కు తప్పనిసరిగా రండిసార్...."

రాజేంద్ర వెళ్ళటానికుద్యుక్తుడై లేచాడు.

తనింకా మౌనంగానే కూర్చుండి పోయాడు. ఇంకొక్క సెకండ్ ఆలస్యం చేస్తే చాలా ఘోరమైన ప్రమాదం జరిగి పోతుంది.

"మిష్టర్ రాజేంద్రా! వెళ్ళేముందు నేను చెప్పే మాటలు జాగ్రత్తగా విను నేను మీ మీ సంసకు అధ్యక్షుడిగా ఉండను దటీజ్ నెంబర్ వన్. నెంబర్ టూ. ఏట్టి పరిస్థితుల్లోను నేను మీచేతగాని. మరెవరి చేతనైనగాని సన్మానం చేయించుకోను. అర్థమైందా? ఈ రెండింటి విషయంలోనూ ఎలాంటి కాంప్రమైజ్ లేదు. మీరిక వెళ్ళొచ్చు"

రాజేంద్ర మొహంలో రంగులు మారాయి.

"ఆదేమిటి సార్!...."

"దయచేసి ఇంకేమీ మాట్లాడొద్దు. మీరిక వెళ్ళొచ్చు"

"మీకు కోపాన్ని తెప్పిస్తే సారీసార్"

రాజేంద్ర మెల్లగా బయటకు వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోగానే లోపల్నించి రజని వచ్చింది.

"ఇలాంటి వాళ్ళతో మొదట్నుంచే జాగ్రత్తగా వుండాలి"

"జాగ్రత్తగా వుండక ఏంచేశాను?"

"అతనొచ్చినప్పుడల్లా గంటలకొద్దీ మాట్లాడారు. అడిగినప్పుడల్ల చందా ఇచ్చారు. అయినా నాకెందుకులెండి. బుద్ధిలేక మళ్ళీ ఇలాంటి వి యాల్లో జోక్యం చేసుకుంటున్నాను.

"బుద్ధుండే జోక్యం చేసుకుంటున్నావు. జోక్యం చేసుకునే హక్కు బాధ్యత నీకున్నాయి. లేదని ఎవరూ అనలేదు. వెధవ! పొద్దున్నే వ టైమంతా పాడుచేశాడు. పోనీయ్‌గానీ ఏమేం తీసుకురావాలో లిస్టురాశావ

"నిన్ననే రాశాను"

"త్వరగా ఇచ్చెయ్...."

ఆమె లోపలికెళ్ళి రెండు సంచుల్నీ, ఒక కిరోసిన్ కాన్, మం నూనె టిన్ మొదలైనవి తీసుకొచ్చి అతని చేతికిచ్చింది.



"ఇదిగోండి రెండు లిస్టులు. ఇది కూరగాయల లిస్టు. ఇదీ నెల కిరాణాకొట్లో తీసుకోవలసిన సామాన్ల లిస్టు. ఈ సంచిలో కూరగాయలు తీసుకోండి. ఈ సంచిలో కిరాణాకొట్లో తీసుకున్న సామాన్లు పెట్టండి. ఈ కాన్‌లో కిరోసిన్ పోయించుకోండి. ఈ టిన్‌లో మంచనూనె పోయించుకోండి కాస్త అన్నీ జాగ్రత్తగా చూసుకొని తీసుకురండి. మనకెప్పుడూ ఉరుకులు పరుగులే...."

"అ-గే"

"కన్‌ఫ్యూజయిపోయి మంచినూనె టిన్‌లో కిరసనాయిల్‌ను కిరసనాయిలు కాన్‌లో మంచినూనెను పోయించేరు."

"నువ్వనుకున్నంత కన్‌ఫ్యూజన్ మనిషినేం కాను"

"కన్‌ఫ్యూజన్ కాదుగాని పరధ్యానం ఆ బుర్రలో ఎప్పుడూ యేదో మెదుల్తానే వుంటుంది ఎక్కడికో వెళ్ళిపోతుంటారు. ఒకచోట వుండరుగా. అందుకని ఇంతగా చెబుతున్నాను"

"చాలా థ్యాంక్స్! నా బుర్రను ఇంతగా స్టడీ చేసినందుకు అదిసరేగానీ ఇప్పుడే ఏస్నేమో అడుగుదామనుకున్నాను ... గుర్తురావటం లేదు"

"అనేకదా నేను చెప్పింది. ఒకటైతే గుర్తుంటుంది. రెండైతే గుర్తు టాయి.... ఆ బుర్రలో ఎన్ని ఆలోచనలో.... ఇంతకూ మీ దగ్గర డబ్బేమన్నా వుందా?"

"ఎగ్జాక్ట్లీ! నిన్నడుగుదామనుకున్నది డబ్బే. కిరాణా సామానైతే భూషణం కొట్లో తీసుకురావొచ్చు. కానీ కూరగాయల్ని క్రెడిట్‌మీదెవడిస్తాడు?"

"నా దగ్గర మాత్రం డబ్బెక్కడిది?"

"ఎక్కడన్నా వుంటుంది చూడు. మొన్నెప్పుడో మూడు నెలల పాత పేపర్లమ్మిన డబ్బు నీదగ్గరే వుంచుకున్నావు"

"అదంతా మీకే ఇచ్చాను. అందులో ఒక్క పైసా కూడా మీరు నా దగ్గర మిగల్చలేదు.

4)

"కొంచెం చూడు .... ఏ చీరెలకిందో వుంటాయి .. ఓ అయిదో పదో!"

"ఐమా లేవు. పదీ లేవు. మీకు అడిగినప్పుడల్లా ఎక్కడో దాచుకున్నవి యిస్తోంటే బాగా అలుసైపోయింది."

"పోనీయ్ బదులివ్వు జీతం రాగానే తీసుకుందువు గానీ"

"మహా ఇచ్చారులెండి. ఎప్పుడయినా యేసైరా చిల్లర ఖర్చులకు పనికొస్తాయని ఓ ఐదో పదో తీసి దాస్తే లెక్కలన్నీ అడిగి ఇంకా పట్టుకుపోవాలి! ఇంకా ఖరపై ఉండాలని ప్రాణం తీసుకున్నదీ మరచిపోయారా? నా దగ్గరొక్క పైసా కూడా లేదు"

"అయితే కూరగాయలిప్పుడు తేను. సామాన్లు మాత్రమే తెస్తాను అదీ భూషణం ఇస్తే"

"ఏమీ తీసుకురాకుండా వట్టి చేతులతో రండి"

"చూస్తాను అప్పిచ్చే మహానుభావుడెవరన్నా కలుస్తాడేమొ"

సైకిల్ తీసి బయటపెట్టాడు రెండు సంచుల్నీ హాండిల్‌కు వేలాడదీశాడు. కిరోసిన్ కాన్‌ను కారియర్ మీద పెట్టాడు. మంచినూనెను టిన్ కూడా కారియర్‌కే అమర్చాడు.

ఇవన్నీ సైకిల్‌కు తగిలించుకొని వెళ్ళటం పరమ అసహ్యం కిరాణం కొట్టు, కిరోసిన్ డబ్బా, కంపు ఇలాంటి పనులన్నీ చెయ్యవలసి రావటం గొప్ప పనిష్మెంట్. అలా అంటే రజని రివ్వున లేస్తుంది. అసలు ఈ పెళ్ళిచేసుకోవటమే మనం చేసిన గ్రేటెస్ట్ బ్లండర్! తనొక్కడే అయితే ఈ బాదరబందీ అంతా వుండేది కాదు. పెళ్ళి చేసుకున్నవాడు ఎందుకు చేసుకున్నానా అని బాధపడితే చేసుకోనివాడేమొ ఎందుకు చేసుకోలేదా అని బాధ పడతాడట—కాబట్టి ఎలాగైనా బాధ తప్పదు. మరపురాని బాధకన్నా మధురమే లేదు అని పాడుకోక తప్పదు.

ఒక్క పైసా కూడా లేదని ఎంత కచ్చితంగా చెప్పేసింది! ఐదో పదో తప్పకుండా ఉంటాయని తనకు తెలుసు. అప్పుడప్పుడు ఇస్తుండేది. ఈరోజెందుకో మొండికేసింది. నిజంగానే డబ్బు లేదేమొ!



మురళీమోహన్ దగ్గరకు వెళితే ఇస్తాడేమో. పోయిన వారమే అతని దగ్గర యాభై తీసుకున్నాడు ఆ యాభైతో యీ నెల గడిచిపోతుందనుకున్నాడు. ఐదారు రోజుల్లోనే అయిపోయాయి, మళ్ళీ ఆ మురళీమోహన్నే అడిగితే ఏం బావుంటుంది? ఎవరినన్నా కొత్త వాళ్ళను చూడాలి.

గేటు తీసుకుని రోడ్డుమీదకు వచ్చాడు.

వేట మొదలెట్టాలి. కనీసం ఓ పదిరూపాయలన్నా పుట్టించందీ రజని కోరుకున్న వస్తువుల్ని తెచ్చిపెట్టలేడు. అదిగో తెలిసిన మొఖం— "హల్లో! ఓ ఫైవుందా?" అని అడిగేసెయ్యాలి.

లోపలినుంచి రజని వచ్చేసింది.

"ఇదిగో....మిమ్మల్నే...."

అలా పిలవొద్దని యెన్నిసార్లు చెప్పినా లాభంలేదు. 'రవీ' అని పిలవరాదూ! లాభంలేదు. యెన్నో కబుర్లు చెబుతారే తప్ప యీ ఆడవాళ్ళు మారరు.

"ఏమిటి....పిల్చావా?"

"సైకిల్‌కు స్టాండేసి ఒకసారి లోపలకు రండి"

సైకిల్‌కు స్టాండేసి రవి లోపలికెళ్ళాడు.

"ఇదిగోండి—పదిరూపాయలు"

చేతిలోలో వున్న కొత్త పదిరూపాయల నోటును అతని చేతికి అందించింది

"థాంక్యూ మైడియర్ రజనీ! థాంక్యూ వెరీమచ్! చాలా గొప్ప ఇబ్బందిలోంచి రక్షించావు"

ఆ క్షణంలో అతని కంటికి ఆ పదిరూపాయల నోటు ఎంతందంగా కనిపించిందో.

ప్రపంచంలో అన్నిటికంటే అందమయిన వస్తువేదని అడిగితే యీ పదిరూపాయల నోటని అతడు టకీమని సమాధానం చెప్పేవాడు.

"దీన్ని నేను మీ జీతంలోంచి తీసి దాచేననుకుంటున్నారు కదూ?"

"ఉహూ! అలా అనుకోవటం లేదుగానీ పేపర్లమ్మిన దాంట్లోంచి...."

"అయ్యో రామ! పేపర్లమ్మిన డబ్బు ఎప్పుడో అయిపోయిందండీ. ఇది పోయెన్నెల మా నాన్నగారొచ్చినప్పుడు చీర కొనుక్కోమని ఇచ్చిన డబ్బులోంచి తీసిస్తున్నాను"

"గ్రేట్ సాక్రిఫైస్! ఒక స్త్రీ చీరకొనుక్కోమని ఇచ్చిన డబ్బులోంచి పదిరూపాయలిచ్చిందంటే— ఏమో అనుకున్నాను. నువ్వో పతివ్రతవే...."

"ఇక చాలు....వెళ్ళరండి."

"ఇంత త్యాగం చేసినందుకు నీకు ఏదన్నా యివ్వకుండానే వెళ్ళమంటావా?"

అతడామె దగ్గరగా రాబోయాడు.

"మీరిప్పుడేమీ యివ్వాల్సిన అవసరం లేదు. జీతం వచ్చాక నేనే తీసుకుంటాను. మీరిక వెళ్ళరండి."

"అంతేనంటావా? వెళ్ళక తప్పదంటావా?"

"అంత దగ్గరగా రాకండి-వెళ్ళండి. నేను లోపలకు వెళుతున్నాను"

ఆమె చివ్వున లోపలికి వెళ్ళిపోయింది.

అతడు బయటికెళ్ళాడు. సైకిలెక్కి తొక్కటం మొదలెట్టాడు. మొద్దు సైకిల్ కదలదు. తొక్కి తొక్కి తొక్కి తొక్కితేగాని కదలదు. ఓ స్కూటర్ కొంటే బావుండును. మింగ మెతుకు లేదుగానీ మీసాలకు సెంటట! సామెతలు....ఈ సామెతలెలా పుడతాయో! ఎవడు పుట్టిస్తాడో. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కిందట! సామెతల్ని పుట్టించినవాడు రియల్లీ గ్రేట్!

ఎదురుగా స్కూటర్ మీదొస్తున్న అతడెవరో తనను చూసి నవ్వి- "హలో సర్!" అన్నాడు.

ఎవరీయన? ఇన్‌షర్ట్ వేశాడు-చాలా హుషారుగా కనిపించే ముఖం. సన్నగా... పొడుగ్గా... ఎవరితడు? ఆయన పేరేమిటి? ఎక్కడ చూసాడు?

స్కూటర్ ఆపాడు. అతనిలాగే స్కూటర్ కూడా తళతళ మెరిసిపోతోంది. స్కూటర్‌లా అతడున్నాడా? అతనిలా స్కూటరుందా? చెప్పడం కష్టం.



"మార్కెట్‌కు బయల్దేరారా?"

"ఔనండి"

"ఈమధ్య మీరసలు బ్యాంక్‌కే రావడం లేదేమిటి?"

దట్సిట్! ఈయన బ్యాంకులో పనిచేస్తాడు. ఎస్.బి. కౌంటర్ దగ్గరే వుంటాడు. ఆయన పేరు సాయిరాజు. క్రికెట్ అంటే భలే పిచ్చి. కౌంటర్లో కూర్చుని కామెంటరీ వింటుంటాడు.

"ఔనండి....రావడం లేదు...."

ఎకౌంట్‌లో బాలెన్సేమన్నా ఏడిస్తేకదా రావడానికి

"ఒక్క చిన్న హెల్ప్ సార్!"

కొంపదీసి అప్పడుగుతాడా? బ్యాంక్‌వాడు అప్పడిగితే చచ్చామే. అయ్యుండదు-గవాస్కర్ యిప్పటివరకు ఎన్ని సెంచరీలు చేశాడని అడుగుతాడేమో-కనిపించిన వాళ్ళనల్లా క్రికెట్ గురించే అడుగుతుంటాడు.

"ఏమిటో చెప్పండి?"

"మీ కాలేజీలో ఎడ్వాన్స్‌డ్ ఎకౌంటెన్సీ బాగా చెప్పే కామర్స్ లెక్చరర్ ఎవరన్నా వున్నారా?"

"ఎందుకండి?"

"మా మిసెస్ బికామ్ పరీక్షలు రాయాలంటే....ట్యూషన్ చెప్పించటానికి...."

"ట్యూషన్ కోసమా? సీతారామారావనే లెక్చరర్ ఎడ్వాన్స్ ఎకౌంటెన్సీ బాగా చెబుతాడు. కానీ ఆయనతో ప్రాబ్లెమ్ ఏమిటంటే ఆయన ట్యూషన్‌లు చెప్పడు"

"ఎందుకు చెప్పడు? ఫీజు కొంచెం ఎక్కువ తీసుకున్నా ఫరవాలేదు"

"మీరెంతిచ్చినా లాభంలేదు. ఆయన చెప్పడు. గోపాలరావు అని యింకొకాయన వున్నాడు. ఆయన్నడగండి-ఆయన చెబుతాడు—"

"థాంక్యూ సార్! ఆయన బాగా చెబుతాడంటారా? ఫీజెంత తీసుకుంటాడో?"

"వెళ్ళి అడగండి"

రవి సైకిలెక్కి అక్కడినుంచి వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు.

"హలో చిన్న హెల్ప్ సార్... మీకు క్రికెటంటే ఇంటరెస్టే కద

"నో అంత లేదులెండి...."

"చిన్న డౌటొచ్చింది... బౌలర్ బంతిని విసురుతాడు. బ్యాట్స్‌మె దాన్ని కొడతాడు. బంతి పైకి లేస్తుంది. ఫీల్డర్ దాన్ని క్యాచ్ చేస్తా ఫీల్డర్ దాన్ని క్యాచ్ చేసేలోగా బ్యాట్స్‌మెన్ రన్ తీసుకోవటానికి అ వేపు వెళతాడు. అంపైర్ వాడికి ఔట్ ఇస్తాడు. నా డౌటేమిటంటే కొ వచ్చే బ్యాట్స్‌మెన్ ఎటువైపు వచ్చి ఆడ్తాడు? ఎందుకంటే...." అతడిం చెబుతూనే వున్నాడు—

"సారీ సార్! మీ సందేహాన్ని నేను తీర్చలేను నా క్రికెట్ ప జ్ఞానం చాలా కొంచెం...."

ఇక ఒక్క క్షణం కూడా అక్కడుండొద్దని రవి సైకిల్ తొక్కటం స్టార్ట్ చేశాడు సాయిరాజు కూడా తన స్కూటర్ స్టా చేశాడు. సాయిరాజుకు క్రికెట్ తప్ప మరో ప్రపంచమే లేనట్టుగా వుం పాపం అతని సందేహాన్నెవరు తీరుస్తారో ఏమిటో—

సైకిల్ కదలటం లేదు....ఎదురు గాలి....శక్తినంతా కూడదీసుకు తొక్కుతున్నాడు....సాయిరాజు స్కూటర్ మీద... తనకంటే వయస్సు చిన్నవాడే....ఈ మధ్యనే బ్యాంక్‌లో జాబొచ్చినట్టుంది. స్కూటర్ కొ శాడు...త్వరలోనే అతనికి ప్రమోషన్ కూడా వస్తుంది-హి ఈజ్ ఫాస్ట్-పైకి ఇంకా పైపైకి వెళ్ళిపోతాడు-మనమేమో దొరికిన ఉద్యోగం తృప్తిపడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్టుగా ఈ గవర్నమెం సర్వీసులో వుండిపోతే రిటైర్ అయ్యేంతవరకు లెక్చరరే-లెక్చరర్‌గా అ యింటై లెక్చరర్‌గానే రిటైర్ అయిపోవటం... బహుశా యింకే సర్వీ లోను ఇంత ధ్వాన్న పరిస్థితి వుండకపోవచ్చు. యూనివర్శిటీలో జాయి వుంటే ఈపాటికి రిసర్చ్ చేసి డాక్టరేట్ సంపాదించి రీడరైపోయేవా ఆ తర్వాత ప్రొఫెసర్....

"ఏమిటి రవీ! నువ్వింకా గవర్నమెంట్ సర్వీసులోనే ఉన్నా యూనివర్శిటీలో జాయినైపోవాల్సింది" అన్నాడు ఉపేంద్రబాబు.



Cultural Association NANDYAL-518501

"ఈసారి అప్లయ్ చేస్తాను సార్" అన్నాడతను

"ఇంతకు ముందొచ్చినప్పుడేం చేశావు?"

"ఆ అడ్వర్టయిజ్‌మెంట్ నేను చూళ్ళేదు సార్!"

"ఎక్కడో కరీమ్‌నగర్‌లో వుంటే ఏం చూస్తావు? నువ్విక్కడే హైదరాబాద్‌లో వుండి ఎప్పుడూ యూనివర్శిటీతో టచ్‌లో ఉండాలి. డిపార్ట్‌మెంట్‌తో కూడా టచ్‌లో వుండాలి"

"ఔను సార్"

"హైదరాబాద్‌లోనే ఏ ప్రయివేట్ కాలేజీలోనో జాబ్ చేస్తూ నువ్వీపాటికి రిసర్చ్ కంప్లీట్ చెయ్యాల్సింది"

"ఔను సార్!"

"నువ్వా వూరు ఎందుకు వదిలెయ్యకూడదు? హైదరాబాద్‌లోనే వుంటే ఎన్నో అవకాశాలొస్తాయి. రిసెర్చ్ మీద కాన్‌సన్‌ట్రేట్ చెయ్యొచ్చు—నువ్వా కరీమ్‌నగర్‌లో ఏం చేస్తున్నావసలు?"

"తీరిక దొరికితే ఏవన్నా రాయటం"

"మరచిపోయాను.. నువ్వు కథలవీ రాస్తావు కదూ? పోనీయ్ ఆ ఫీల్డులోనన్నా ఏమన్నా సాధించావా? ఏ ఫీల్డయినా ఫరవాలేదు... బట్ యూ మస్ట్ గో టు ది టాప్ తెలిసిందా? ఆ ఫీల్డ్‌లో పైకి రావాలంటే కూడా నువ్వు సిటీలో వుండటం అవసరం... సిటీ అయితేనే నీ టాలెంట్‌కు తగిన గుర్తింపొస్తుంది... నేను మళ్ళీ చెబుతున్నాను...నువ్వు ఎన్నుకున్న రంగములో నువ్వు చాలా పైకెళ్ళిపోవాలి...దట్ షుడ్‌బీ యువర్ టార్గెట్.... ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్టుగా వుండిపోకూడదు. తెల్సిందా? యూ షుడ్ హావ్ దట్ ఆంబిషన్ ఇన్ యూ....విష్ యూ ఆల్ ది బెస్ట్ యంగ్‌మ్యాన్"

దటీజ్ ఉపేంద్రబాబు! ఎప్పుడు కలిసినా అలాగే మాట్లాడతాడు. గో టు ది టాప్....యూ షుడ్‌బీ ఆంబీషియస్....అదే లేదు మనకు....అల్ప సంతోషి—ఉన్నదాంతోనే తృప్తిపడ్తాడు.

అయినా బాధలేదు ఆంబిషన్ అనేదానికి అంతం అంటూ వుండదు.

ఎంత పైకెళ్ళినా యింకా పైకెళ్ళాలనే తాపత్రయం మనిషిని తృప్తిగా బ్రతకనీయదు. మనిషికి కావలసింది తృప్తి ...ఆ తృప్తి తనకుందా?

తను అనుకున్నంతగా రాయలేకపోతున్నాడు ఎప్పుడూ ఏవో అవాంతరాలు. కాలేజీలో, ఇంట్లో, స్టూడెంట్స్‌తో మనసును బాధపెట్టే ఎన్నో సంఘటనలు చేతిలో ఎప్పుడూ డబ్బుండదు. ఎప్పుడూ ఎవర్నీ అప్పడుగుదామా అన్న బాధ. నెలకు కనీసం రెండొందలన్నా పంపించమంటాడు నాన్న. నీ జీతమంతా ఏం చేస్తున్నావంటాడు- ఆ కుర్చీలెందుకు? ఆ రేడియో ఎందుకు? ఆ పేపరెందుకు? మీ యిద్దరికీ అంత పెద్ద ఇల్లు ఎందుకు? ఓ వంద రూపాయలతో రెండు రూమ్‌లు తీసుకుంటే సరిపోదా అంటాడు. మేమేమో ఇక్కడ ప్రతి పైసాకు కష్టపడుతుంటే మీరేమో హాయిగా కుర్చీలమీద, పంకాలకింద, కాలుమీద కాలేసుకొని నిశ్చింతగా బతుకుతున్నారు. ఆ నాడు హైదరాబాద్‌లో వుంచి నిన్ను చదివించటానికి ఎన్ని కష్టాలు పడ్డామో మర్చిపోయావా? ఇప్పుడేమో నీ సుఖమే చూసుకుంటున్నావు తప్ప మమ్మల్ని మర్చిపోయావు. పొలం ఎండిపోతోంది. వరికి రోగం తగిలింది. మందు కొందామంటే డబ్బు లేదు. యూరియా కొందామంటే డబ్బులేదు. ఇంజన్‌లోకి డీజిల్ లేదు. డబ్బు—డబ్బు-డబ్బు—అనుక్షణం తనను గిల్టీగా ఫీలయ్యేలా చేస్తాడు నాన్న. అయినా ఎన్నిసార్లు డబ్బు పంపించినా యింకా పంపించలేదన్న ఫిర్యాదే తప్ప సంతోషించడు.

మరో వైపు రజని....ఈ రెండు సంవత్సరాల్లో కనీసం నాకో మంచి చీరన్నా కొనిచ్చారా....పక్కింటి వాళ్ళు డైనింగ్ టేబుల్ కొనుక్కున్నారు. డెకొలమ్ మంచాలు కొనుక్కున్నారు. మనకేదీ లేదు- డబ్బు-డబ్బు....డబ్బు....

తను బాగా డబ్బు సంపాదించాలి—గో టు ది టాప్! ఒక్కొక్క నవల మీద ఒక్కొక్క లక్ష సంపాదించాలి. అప్పుడు గానీ ఈ దరిద్రం తీరదు.

"మీరూ ట్యూషన్లు చెప్పండి—మీరూ యేదన్నా బిజినెస్ పెట్టండి" అంటుంది రజని.



చాలా మంది లెక్చరర్లు యేదో బిజినెస్ పెడుతూనే వుంటారు చిట్టీల బిజినెస్—భార్యల పేరులో ఎ.ఐ.సి ఏజెంట్స్—ట్యుటోరియల్ కాలేజీలు, ఇంగ్లీషు మీడియమ్ స్కూల్స్—జనరల్ స్టోర్స్—మీరూ యేదన్నా పెట్టండి. యేమన్నా చెయ్యండి. కానీ చేతినిండా డబ్బు సంపాదించండి.... తను ట్యూషన్లు చెప్పలేదు—ఎ ఐ సి ఏజెంట్ పని చెయ్యలేదు—చిట్టీలు నడపలేదు.

"పోనీయ్ మీకు చేతనయింది చెయ్యండి. కథలు రాయండి నవలలు రాయండి అలా-కూడా కొంత సంపాదించొచ్చుగా" అంటుంది రజని.

డామిట్! డబ్బుకోసం రాయటమా? కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడ నేల యేడ్చెదో—అన్న పోతన్నను మరచిపోయావా?

అయినా తను ఎప్పుడంటే అప్పుడు కథలూ, నవలలూ రాయలేనని రజనికి తెలీదు పూర్ థింగ్! కలమూ కాగితం తీసుకొని టేబుల్ ముందు కూర్చోగానే కథలు నవలలు రాసెయ్యొచ్చనుకుంటుంది. కథలూ, నవలలూ రాయటం అంత సులభం కాదని ఆమెకెలా చెప్పాలి. ఆలోచించి, చించి, బుర్రను మధించి, మధించి, ఓ సంఘటన మనస్సును కలచి కలచి, మేధస్సును ఈ సంఘటన అనే కవ్వంతో చిలికి చిలికి, జీవిత రథచక్రాల కింద పడి నలిగి నలిగి, ప్రతి పాత్రను కలం కుంచెతో బొమ్మ గీసి గీసి, ప్రతి అక్షరాన్ని యేర్చికూర్చి, మార్చి మార్చి, ఇటుక మీద ఇటుకను పేర్చినట్టుగా పేర్చి పేర్చి, తన బాధను ప్రపంచపు బాధగా, ప్రపంచపు బాధను తన బాధగా చేసుకొని చేసుకొని, జీవితం అనే సూది మొనపైన నిరంతర తపస్సు చేసి చేసి—అప్పుడుగానీ కథ పుడుతుంది అప్పుడుగదా నవల పుడుతుంది అదో తపస్సు—అదో సాధన—అదో ప్రసవవేదన... అదో అన్వేషణ. అదో తీరని దాహం—పాపం ఇదంతా రజనికెలా అర్థమౌతుంది?

అర్ధరాత్రి ఆమెను నిద్రలేపి "ఇప్పుడే ఓ గొప్ప ఐడియా వచ్చింది. ఈ ఐడియాతో గొప్ప కథ రాసెయ్యొచ్చు" అంటాడు

"ఇంకేం వెంటనే రాసెయ్యండి. లేకపోతే మరచిపోతారు—" అంటుంది.

కానీ ఐడియాలన్నీ కథలై పోతాయా? అలాంటి ఐడియాలెన్నో బుర్రలో నలిగి, నలిగి, కృంగి, కృశించి, నశించి పోయి వాటి స్థానంలో మళ్ళీ ఎన్నో కొత్త ఐడియాలు మొలకెత్తి, బలంగా పుంజుకొని పెరిగి పెద్దవైతే గాని అవి కథలుగానో నవలలుగానో రూపకల్పన చెందవని, రాయటంలో ఇంత గొడవుందని రజనికేం తెలుసు?

ఉగాది కథల పోటీ - దీపావళి కథల పోటీ - వెయ్యి — రెండువేలు మూడువేలు- డబ్బు డబ్బు- ఈ పోటీకి మీరు రాయండి. నేను రాయలేను. ఎందుకు రాయలేరు. రాయలేను. ఎప్పుడో రాయాలనిపించినపుడు రాస్తానే తప్ప పోటీ కంటే రాయలేను. ఇన్ని పేజీల్లో ఇలా మాత్రమే రాయాలన్న కండిషన్లు పెడితే నేను రాయలేనమ్మా అంటే వినిపించుకోవేం?

సైకిల్ వేగంగా వెళుతోంది. ఇప్పుడు వంపు సైకిల్ వేగాన్ని పుంజుకుంటోంటే తన ఆలోచనలు కూడా వేగాన్ని పుంజుకుంటాయి. రెంటికీ ఏమిటో ఆ సంబంధం.

కూరగాయల మార్కెట్ వచ్చేసింది.

జనం—జనం—ఎక్కడ చూసినా జనమే.

అమెరికాలో డాలర్లు పండును. ఇండియాలో సంతానం పండును. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ధనవంతుని చుట్టూ తిరుగుతోంది.

అడుగో ధనవంతుడు — స్కూటర్ స్టార్ట్ చేస్తున్నాడు తళ తళ మెరుస్తున్న బజాజ్ చేతక్! బజాజ్ చేతక్ తన కల - చేతక్ మీద రజనిని కూర్చోబెట్టుకొని ఈ ప్రపంచపు అంచులదాకా వెళ్ళి రావాలని - ఎటర్నిటీలోకి వెళ్ళిపోవాలని.

"హల్లో సర్! కూరగాయలు కొనడానికొచ్చారా?" అన్నాడు సుధాకర్ ఫిజిక్స్ లెక్చరర్.

"అవును! మీ స్కూటర్ భలే మెరిసి పోతున్నదే" అన్నాడు రవి క్రీమ్ కలర్ తో మెరిసిపోతున్న ఆ స్కూటర్ నే చూస్తూ.

మొన్ననేగా కొన్నాను ఆ మాత్రం మెరిసిపోకపోతే ఎలా....!" అన్నాడు సుధాకర్.



"స్కూటరే కాదు .. మీరు కూడా మెరిసిపోతున్నారు. అందామనుకున్నాడు కానీ అనలేదు. సుధాకర్ అందంగా వుంటాడు. ఎప్పుడూ నోట్లో గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ వెలుగుతుంటుంది. ఇస్త్రీ మడతలు నలగని తళతళ మెరిసిపోయే డ్రెస్....సాండల్ వుడ్ పౌడర్ బాగా పట్టించినట్టున్నాడు. అతని చుట్టూ ఐదారు గజాలవరకు ఆ సుగంధం వ్యాపించింది కొత్తగా ఉద్యోగంలో చేరాడు. కొత్తగా పెళ్ళి చేసుకున్నాడు కొత్తగా స్కూటర్ కొన్నాడు. అతని జీవితంలో అంతా కొత్తదనమే ట్రాన్స్పరెంట్ గా ఉన్న అతని షర్ట్ జేబులోంచి కొత్త పదిరూపాయల నోట్లు అందంగా, అద్భుతంగా కనిపిస్తున్నాయి ఓ పదిరూపాయలు అప్పడిగితే ఇస్తాడా? వద్దు.... అడగొద్దు....ఇదివరకెన్నడూ అడగలేదు. కాబట్టి ఇస్తాడు....నోనో.... ఇవ్వడు....ఇస్తాడు....అడిగేసెయ్ ...అప్పోమేనియా! ఈ మేనియా తనను వదలదు

సుధాకర్ కూరగాయల్ని స్కూటర్ బ్యాగ్ లో సర్దేసాడు. స్కూటర్ మీద కూర్చుని స్టార్ట్ చెయ్యబోతూ—

"ఎన్నడూ లేనిది యీ రోజు కూరగాయల మార్కెట్ కు వచ్చారేమిటి?" అన్నాడు సుధాకర్.

"ఎప్పుడో అప్పుడు రాకపోతే ఇంట్లో ఆడవాళ్ళు స్ట్రయిక్ చేస్తారు" అన్నాడు రవి.

"మీకయితే ఎప్పుడో అప్పుడు-నాకయితే యీ డ్యూటీ ఎప్పుడూ వుంటుంది ఏ రోజున్నా రాకపోతే ఆరోజు స్ట్రయికే....స్ట్రయికంటే ఏమిటనుకున్నారు....వంట చెయ్యకపోవటం గట్రా కాదు"

"మరేమిటి?"

"అమ్మో! చాలా భయంకరమైన స్ట్రయిక్....మీ ఆవిడెప్పుడైనా అలాంటి స్ట్రయిక్ చేస్తుందా?" గుసగుసగా అంటూనే సుధాకర్ ఫెళ్ళున నవ్వాడు రవి సమాధానం కోసం ఎదురు చూడకుండానే స్కూటర్ కు కిక్ కొట్టి స్టార్ట్ చేసి "సీ యూ ఇన్ ది కాలేజ్" అంటూ వెళ్ళిపోయాడు.

లక్కీగై! జేబునిండా డబ్బు.... చేతినిండా స్కూటర్.... పక్కనిండా భార్య - స్త్రీ సుఖమంటే వంటచెయ్యకపోవటం కాదుట! అతనికి తప్ప ప్రపంచంలో ఇంకెవరికీ భార్య లేదనుకుంటున్నాడు. భార్య స్ట్రైక్ చెయ్యటమంటే యేమిటో ప్రపంచంలో తనకు తప్ప మరెవరికీ తెలీదనుకుంటున్నాడు. పోనీయ్‌లే పాపం కొత్త బిచ్చగాడు పొద్దెరుగడు.

సైకిల్ స్టాండువేసి లాక్ చేసి, హాండిల్‌కున్న బాగ్‌ను చేతిలోకి తీసుకున్నాడు. జేబులోంచి రజని రాసిచ్చిన కూరగాయల లిస్టు తీశాడు. అన్నీ అరకిలో చొప్పున తీసుకొమ్మని రాసింది బెండకాయలు, టమాటాలు, బీరకాయలు, ఆలుగడ్డలు వగైరా.... పచ్చిమిరపకాయలు మాత్రం పావుకిలో.... చటాకు అల్లం.... కొత్తిమీర, కరివేపాకు, మెంతికూర వగైరా.. వగైరా.... ఈ కరీంనగర్లో మాత్రం ఎవరూ పావుకిలో అరకిలో చొప్పున అమ్మరు.... పావుశేరు, సవాశేరు అనే అమ్ముతారు.

రోడ్డుకు రెండువైపులా కూరగాయలు అమ్మేవాళ్ళు కూర్చొని కొనేవాళ్ళను పిలుస్తున్నారు. కిక్కిరిసిన జనం. ఎక్కడా నిల్చోవటానికూడా చోటులేదు. ఆ జనంలోకి తనూ వెళ్ళాలి, లిస్టులో వున్న కూరగాయలన్నీ కొని బయట పడాలంటే చిన్నపాటి యుద్ధమే చెయ్యాలి.

"నమస్కారం సార్!" ఆ జనం మధ్యలోంచి ప్రభాకర్, గోపాల్ తనవైపు రావటం కనిపించింది. వాళ్ళిద్దరూ ఎప్పుడూ కలిసే ఉంటారు. ఇన్‌సెపరబుల్స్....

"కూరగాయలకోసం వచ్చిండ్రా సార్" అన్నాడు ప్రభాకర్.... కాలేజిలో బి.ఏ. ఫైనలియర్ స్టూడెంట్స్ వాళ్ళిద్దరూ..

"అవును" అన్నాడు రవి

"యేంగావాల్నో చెప్పుండ్రి.... మేం తెచ్చిపెడ్తం" అన్నాడు ప్రభాకర్

"నేను తెచ్చుకుంటాలే ప్రభాకర్! మీరంతా బాగా బిజీగా ఉన్నట్టున్నారే.... ఎలక్షన్స్ చాలా దగ్గరకొచ్చేశాయి కదూ?" అన్నాడు రవి.

"అవునుసార్.. ఆ సంగతి గురించే మీ దగ్గరకొకసారొచ్చి మాట్లాడదామనుకుంటున్నం సార్"



"ఏమిటో చెప్పండి"

"ఇక్కడొద్దుసార్.... ఇంటికొస్త"

వీళ్ళతో ఇలా నడిరోడ్డుమీద కూరగాయల మార్కెట్లో మాట్లాడుతుండటం ఎవరన్నా చూస్తే ప్రమాదమేమో.... వీళ్ళు యూ ఎస్.యూ వాళ్ళు. తనకూ వీళ్ళకు ఏదో సంబంధం ఉందనుకుంటారు. ఆల్‌రెడీ వీళ్ళ అపోజిట్ పార్టీ జె వి పి వాళ్ళకు తనమీద చాలా కోపంగా వుంది. తను యూ.ఎస్ యూ వాళ్ళ పక్షమని. వీళ్ళేమో తన ఇంటికే వస్తామంటున్నారు. తన పక్కపోర్షన్‌లో ఉన్నవాడు జె.వి.పి వాడు. ప్రభాకర్ తనింటికొచ్చి తనతో కాసేపు మాట్లాడటం వాడు చూశాడంటే యూ ఎస్ యూ వాళ్ళ అడ్వైజర్ రవేనని ఊరంతా ప్రచారం చేసేస్తారు.

"ఇంటిదాకా ఎందుకు ఈ ఎలక్షన్స్ టైములో మీరు మా ఇంటికి రావటం అంత బావుండదేమో, ఏమిటో ఇక్కడే చెప్పండి" అన్నాడు రవి.

"మన కాలేజిల సూర్యప్రకాష్ సార్ యేంజేస్తున్నాడో మీరు చూస్తున్నారా సార్" అన్నాడు ప్రభాకర్

"యేం చేస్తున్నాడు?" —రవి

"మీకు తెల్వదాసార్?"

"యేదో వింటున్నానేగానీ...."

"వినుడేమిటి సార్.... ఆ సార్ జె.వి పి కాండిడేట్స్ తరపున ఓపెన్‌గా ప్రచారమే చేస్తున్నాడు. వాళ్ళకు కరపత్రాలు రాసి పెడ్తున్నాడు. మొత్తం కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌నంతా జె.వి పి వాళ్ళ ఎలక్షన్ ఆఫీసుగ మార్చేసిండు. కరపత్రాలు రాసుడక్కడన్నే, పోస్టర్లు రాసుడక్కన్నే సలహాలు, సంప్రదింపులూ అన్నీ అక్కడన్నే." ప్రభాకర్

"అలాగా! అంత ఓపెన్‌గా సూర్యప్రకాష్ వాళ్ళ తరఫున పని చేస్తున్నాడా?" - రవి

"అవునుసార్! ఆయనంత బరి తెగించిపోయినప్పుడు మీరెందుకు సార్ మాతో అంటిముట్టనట్టుంటారు? మీరు మాకెంతో సహాయం చేస్తరనుకున్నం. ఎన్నో సలహాలిస్తరనుకున్నాం" — ప్రభాకర్

"ప్రభాకర్! ప్లీజ్ ట్రైటు అండర్‌స్టాండ్ మై పొజిషన్—నాకు మీమీద సింపతీ వుంది మీ ఐడియాలజీ నా ఐడియాలజీ ఒకటే....కానీ నేనో ప్రభుత్వోద్యోగినని, మీ కాలేజీలో లెక్చరర్ అని మర్చిపోకండి.... మీమీద నా సింపతి కేవలం మోరల్ సింపతి మాత్రమే ...నేను ఓపెన్‌గా మీ తరఫున పని చెయ్యలేను చెయ్యకూడదు కూడా" —రవి

"మరి సూర్యప్రకాష్ సార్ అంత ఓపెన్‌గా వాళ్ళ తరఫున పని చేస్తోంటే చూస్తూ ఊరుకోవటమేనా మా పని....వాడి సంగతేమిటో తేల్చుకుంటం సార్" చాలా ఆవేశంగా అన్నాడు ఇంతసేపూ నిశ్శబ్దంగా వున్న గోపాల్.

"మీరు తేల్చుకోవటం బావుండదు ప్రిన్సిపాల్‌కు చెప్పండి. కావాలంటే రిటెన్‌గా ఇవ్వండి. అతడు కెమిస్ట్రీ హెడ్ కాబట్టి ఆ డిపార్టుమెంట్ మొత్తాన్ని వాళ్ళ ఎలక్షన్ ఆఫీస్‌గా మార్చటం క్షమించరాని నేరం. దీన్ని మరో పెద్ద ఇష్యూ చెయ్యండి" —రవి

"మస్తుసార్లు చెప్పినం సార్! మన ప్రిన్సిపాల్‌కు సూర్యప్రకాష్ అంటే యేదో భయమున్నట్టుంది. ఏమీ యాక్షన్ తీసుకోలేదు. ఇయ్యాల్లోనే రేపో కాలేజిల ఏదో పెద్ద కొట్లాట జరిగేటట్టుంది సార్! మా వాళ్ళంతా చాలా ఆవేశంగున్నరు" —గోపాల్

"ఆవేశాన్ని కంట్రోల్ చేసుకోవటం మంచిది గోపాల్! మీ పొజిషన్ బాగున్నప్పుడు ఎందరు సూర్యప్రకాష్‌లు కలిసినా యేం చెయ్యలేరు. ఈ టైములో యేదన్నా వయలెన్స్ జరిగిందో నష్టపోయేది మీరే" —రవి

"వాళ్ళు మమ్మల్ని బాగా రెచ్చగొడుతున్నరు సార్! మనోళ్ళను కంట్రోల్ చేసుడు చాలా కష్టమైపోతాంది" —ప్రభాకర్.

"మిమ్మల్ని రెచ్చగొట్టి ఏదన్నా వయలెన్స్ జరిగేలా చూసి లాభపడాలని వాళ్ళ ప్రయత్నం. కాబట్టి మీరు రెచ్చిపోకుండా కామ్‌గా ప్రచారం చేసుకోండి. రెచ్చిపోయి ఏదన్నా వయలెన్స్‌కు దిగారంటే మీరు వాళ్ళ ట్రాప్‌లోకి వెళ్ళిపోతున్నారన్న మాట...." —రవి

"అది నిజమే సార్. కానీ ఉడుకు రక్తం కట్టలు తెంచుకు పారే ఆవేశం. ఏ క్షణం ఏమైతదో చెప్పేటట్టు లేదు" —ప్రభాకర్.



"నువ్వొక బాధ్యత కలిగిన లీడర్‌వు. నువ్వే అలా అంటే ఎలా చెప్పు నువ్వు నీ మనుషుల్ని కంట్రోల్ చెయ్యాలి సరి అయిన దార్లో పెట్టాలి...." - రవి

"నేను కంట్రోల్ చేస్తున్న కాబట్టే ఇప్పటి దాకా యేం కాలేదు."- ప్రభాకర్.

"ఇప్పటిదాకానే కాదు, ఎలక్షన్స్ అయిపోయేదాకా కూడా యేమీ కావొద్దు నేను వెళ్తాను మరి"

- రవి అక్కడ్నించి కదిలాడు.

"సార్! మీరు మాకో సహాయం.. కనీసం ఈ సహాయమన్నా చెయ్యాలి సార్" అన్నాడు ప్రభాకర్ రవి వెంటే నడుస్తూ.

"ఏమిటో చెప్పు ప్రభాకర్!" - రవి

"రేపు ఎలక్షన్స్ అనగా పోటీచేసేవాళ్ళందర్నీ విద్యార్థుల ముందు ఉపన్యాసాలిప్పమంటారు. అటు ఇటు గాకుండా ఉన్న వోటర్లందరూ ఎవరు స్పీచ్ బావుంటే వాళ్ళకే ఓట్లేస్తారు కాబట్టి మీరు మా ప్రెసిడెంట్‌గా, సెక్రటరీల స్పీచ్‌లు రాసివ్వాలే సార్"—ప్రభాకర్

"అలాగే...ఎప్పటివరకు కావాలె మీకు" — రవి.

"పదహారున ఎలక్షన్....పదిహేనున స్పీచెస్ ...ఈ రోజు పది.... మేం బైహార్ట్ చెయ్యాలి గద సార్.... ఈ రోజన్నా రేపన్నా తయారు చేసివ్వండి" — ప్రభాకర్.

"రేపు సాయంత్రం వరకు రాసి పెడ్తాను ఎవరైనా వచ్చి తీసి కెళ్ళండి" — రవి.

"థాంక్యూ సార్! రేపు అరింటికి నేనే వచ్చి తీసుకుపోతా సార్!" ప్రభాకర్.

"మంచిది"

నమస్కారం చేసి వాళ్ళిద్దరూ అక్కడ్నించి వెళ్ళిపోయారు. రవి మార్కెట్లో ప్రవేశించాడు.

జనం కొంచెం తగ్గారు.

"హల్లో సార్ !"

ఎవరిదో తెలిసిన మొఖం. కానీ ఆ మొఖం పేరేమిటో గుర్తురావటం లేదు. ఎక్కడ చూశాడు? ఎక్కడో చూశాడు. హా! తెలిసెన్... క్లాత్ షాపులో సేల్స్‌మన్! రెండు మూడుసార్లు ఇతడే మీకీ ప్యాంట్ క్లాత్ బావుం టుందని పోరాడి తనతో వాటిని కొనిపించాడు- అమ్మయ్య! అతడెవరో తెలీటంతో ఎంత రిలీఫ్!

ఇతడు చూస్తే ఫరవాలేదు. ఇంకెవరైనా చూసుంటారా? చాలామందే చూసుంటారు. తను వాళ్ళకు స్పీచెస్ కూడా రాసిస్తానన్నాడు. తనకు మహా స్పీచెస్ ఇవ్వటం తెలిసినట్టు....తనో గొప్ప ఉపన్యాస కేసరి అయినట్టు.... ఉపన్యాస కేసరి....ఒకే పదం సింహంలా గాండ్రిస్తూ ఉపన్యసించే వాడు ఉపన్యాసకేసరి.... తను ప్రభాకర్ వాళ్ళకు ఉపన్యాసాలు రాసిచ్చినట్టు సూర్యప్రకాష్‌కు తెలిస్తే జుట్టు విదిలించి గర్జిస్తాడేమో....గర్జించనీ....డోన్ట్ కేర్.

రేపు కాలేజిలో ఏదో గొడవ జరుగుతుంది. కెమిస్ట్రీ డిపార్టుమెంటును కెమిస్ట్రీ లాబ్‌ను తగలేస్తారు. తప్పదు.

"సార్....సార్ టమాటాలు ఫ్రెష్‌గున్నాయి సార్! ఇప్పుడే వచ్చినయ్" కూరగాయలమ్మే ఆమె తననే పిలుస్తోందని గ్రహించి ఆమె వైపు చూశాడు. మధ్య వయస్కురాలు....చిరిగిపోయిన జాకెట్... శరీరమంతా కనిపిస్తోంది-పమిటకొంగునునడుముకు చుట్టుకుంది రెండుటమాటాలు చేతిలో పట్టుకొని తనకు చూపిస్తోంది. ఆమెను చూస్తే ఏమాత్రం కూడా చదువుకున్నట్టు లేదు అయినా 'ఫ్రెష్' అనే ఇంగ్లీషు మాట వాడేస్తోంది

ఆమె చేతిలో పట్టుకున్న ఉమాటాలు నిజంగానే చాలా ఫ్రెష్‌గా నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. ఎర్రగా, గుండ్రంగా... భూమాత శరీరంలోని రక్తాన్ని పంచుకొని పుట్టిన టమాటో .... టమాటో! నీవు నవ్వకు... ఈ వెన్నెల కందిపోతుంది....నీవు మాటాడకు....ఈ గాలి కుంకుమై రాలుతుంది ఆడపిల్లల రోజా రంగు సిగ్గుల్లో తడిసి పెరిగినదానా....నా వైపు మాత్రం చూడకు....నిన్ను తినాలనే చిలిపి ఆకలి కోరిక ఉదయిస్తుంది .... ఎంత అందంగా టొమాటో అందాన్ని అక్షరాల్లో మలచాడు కవి. మైడియర్ కవీ! యూ ఆర్ గ్రేట్!



"ఏంది సార్ గట్ల జూస్తరు? టమాటాలొద్దా?" అందామె అతనికేసి చిరాగ్గా చూస్తూ.

అప్పుడు చూశాడామెను. ఎత్తుపళ్ళు గారపట్టి అసహ్యంగా ఉన్నాయి నోట్లోంచి సొళ్ళు కారుతోంది. ఆ సొళ్ళంతా కూరగాయల్లో కలిసే ఉంటుంది.

రవి అక్కడ్నించి కదిలాడు ఈరోజు రాములమ్మ కనిపించదేమిటి? అదిగో రాములమ్మ... టమాటాల రాశిలోంచి కుళ్ళిపోయిన టమాటాలను వేరుచేస్తోంది. ఓ క్షణం సేపు రాములమ్మను చూస్తూ ఉండిపోయాడు.

రాములమ్మ ఈ దిక్కుమాలిన కూరగాయల మార్కెట్లో కుళ్ళిపోయిన టమాటాలను ఏరుతూ కూర్చోవలసిన స్త్రీ కాదు. ఏ అంతఃపురం లోనో, ఏ హంసతూలికా తల్పాల మీదో తేలిపోతూ ఏ రాజకుమారుడి కళ్ళల్లోనో కలల జ్యోతుల్ని వెలిగిస్తూ... ఏమిటో పిచ్చి ఊహలు....ఈ రోజుల్లో అంతఃపురాలు, హంసతూలికా తల్పాలు ఎక్కడున్నాయని.

"ఏమే రాములమ్మ! సారొచ్చి పిల్చిన్నడు. చూస్తవే లేవు" అంది రాములమ్మ పక్కనే ఉన్న వాళ్ళమ్మ.

రాములమ్మ తలెత్తి రవికేసి చూసింది.

చిన్నగా నవ్వి "మీరా సార్" అంది తను ఆమె కెంతకాలంనుండో బాగా తెలుసునన్నట్టుగా. ఆమె అలా కళ్ళెత్తి తనకేసి చూసి నవ్వినప్పుడు ఆమెను చూడటం తనకో గొప్ప అనుభవం తనను చూసినప్పుడల్లా ఆమె అలాగే నవ్వుతుంది. "మీరు నాకోసం వస్తారని తెలుసు... కానీ ఇంత ఆలస్యం చేశారేందుకని" అనే ధ్వని వినిపిస్తుంది తనకామె నవ్వులో.

"ఏంది సార్ మీరు? కూరగాయల కొస్తలే లేదు మీరు" అందామె కోపగించుకుంటున్నట్టుగా.

"ఇప్పుడొచ్చాను గదా"

"వారం రోజుల్నుంచి చూస్తున్న.... మీరొస్తలే లేదు. మీ అసుంటోళ్ళు రాకపోతే మా అసుంటోళ్ళ ఎట్ల బతుకుతారు?"

"ఏం నేను రాకపోతే నీ దగ్గర కూరగాయలింకెవరూ కొనరా ?"

"ఎందుకొ్కనరు. కొంటరు. కానీ మీ అసుంటోళ్ళు కొంటెనే నాకా రోజు మంచిగుంటది"

"నిజంగా? మరి ఆ మాట ఇంతకు ముందెప్పుడూ చెప్పలేదెందుకు"

"చెప్పాల్నా సార్! మీకు తెల్వదా" అంది మళ్ళీ తనను చూసినప్పుడెలా నవ్విందో అలాగే నవ్వుతూ. ఈ రాములమ్మ ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉంటె ఎంత బావుండును.

"తెలియదు"

"తెలిస్తే"

"రోజూ నీ దగ్గరకు కూరగాయలు కొనటానికొచ్చేవాడ్ని"

"ఆమె మళ్ళీ అలాగే నవ్వింది.

"మీరు రోజూ రారు సార్! నాకా మాత్రం తెలియదనుకుంటున్నారా ?"

"రోజూ రావాల్నంటే డబ్బులుండాలి గదా! మా ఇంటి దగ్గర రాసుకొని ఇచ్చే కూరగాయల దుకాణం ఉంది"

"మీకొస్తే నేను రాసుకోకుంటేనే ఇస్త"

"రాసుకోకపోతే ఎన్ని డబ్బులివ్వాలో ఎలా గుర్తు పెట్టుకుంటావు?"

"గుర్తు పెట్టుకోకపోతే యేమైతది"

"నేను తక్కువ డబ్బులిస్తాననుకో"

ఆమె మళ్ళీ అలాగే తన గుండెను పిండుతున్నట్టుగా నవ్వింది.

"మీరలాంటివాళ్ళు కాదు"

ఆమెనలా నవ్వించటం కోసమే తనామెతో అంతసేపూ మాట్లాడుతున్నాడు-ఆమె అలా మాట్లాడుతూనే అతనికి కావలసిన కూరగాయలన్నీ తూకం వేసి అతని బాగ్‌లో పోసేసింది.

"ఏమేం కూరగాయలిచ్చావు?"

"అరకేజి టమాట, అరకేజి ఆలుగడ్డ, అరకేజి బీరకాయలు, అరకేజి బెండకాయలు...."



"అరే! నీకు చెప్పకుండానే అన్నీ సరిగ్గా నా లిస్టులో ఉన్నవే ఎలా ఇచ్చావు ?"

ఈసారామె చాలా గర్వంగా నవ్వింది.

"గామాత్రం తెల్వదా సార్! మీరెప్పుడు తీసుకున్న గివ్వే కద"

"అమాయకంగా కనబడతావుగానీ నువ్వు చాలా తెలివైనదానివే రాములమ్మా"

"ఏం తెలివి సార్! తెలివికల్ల దాన్నైతే గిట్లెందుకుంట సార్"

"ఎట్లుంటే నీ కిష్టం ?"

"మీ లెక్క..... అసుంటాయనతో"

రాములమ్మ సిగ్గుపడింది.

"మీ ఆయన ఏంచేస్తాడు?"

"వాన్ని గురించి ఎందుకడుగుతారు బాంచెను-దాని గండాన పుట్టిండు" అంది పక్కనే ఉన్న రాములమ్మ వాళ్ళ అమ్మ.

"సారీ! కూరగాయలన్నీ మంచివే ఇచ్చినవు గదూ!"

"బాగా లేనివి మీకిస్తనా సార్"

"మొత్తం కలిపి ఎంతయ్యింది ?"

"ఓ ఐదు రూపాయలివ్వండ్రి సార్!"

జేబులోంచి పది రూపాయల నోటు తీసి ఆమెకిచ్చాడు. ఆమె ఆ నోటు తీసుకొని తనదగ్గరున్న ఐదు రూపాయల నోటు తీసి అతనికిచ్చింది.

"అప్పుడప్పుడొస్తుండండి సార్"

"అలాగే"

రవి అక్కడ్నించి కదిలాడు.

"మంచి దొరనే పట్టినవే రాములూ! నువ్వు చెప్పినంత ధర. నువ్విచ్చిన కూరగాయలు అవి ఎట్లున్నయో చూడకుండా పట్టుకుపోయే దొర! పుణ్యాత్ముడు" అంటోంది రాములమ్మ పక్కనే కూర్చున్న మరో కూరగాయలమ్మే రంగమ్మ.

"గట్లని నేనేమన్న ఆ దొరను మోసం జేస్తున్న ననుకున్నవా? మంచోళ్ళకు నేను చాలా మంచిదాన్నే" అంటోంది రాములమ్మ.

"గదంత నాకు జెప్పకువే... గా దొర నీ కూరగాయల్ని జూసిగాదు, నిన్ను జూసి నీ షాపు కొస్తుండు"

"పోనియ్ గట్లనే అనుకో...."

వాళ్ళింకా ఏం మాట్లాడుకుంటారో వినాలనిపించింది. కానీ టైమ్ లేదు. ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఇంకా కిరాణా కొట్టుకెళ్ళాలి. ఇంటికెళ్ళి కనీసం రెండు ఉత్తరాలైనా రాయాలి. ఉత్తరాలు రాసే టైమ్ దొరుకుతుందో లేదో.... ఇంటికెళ్ళేలోగానే కాలేజి టైమ్ అయిపోతుంది. కాలేజికి లేట్‌గా వెళ్ళటం అంటే అసహ్యం.... ఈ రోజు ఫస్ట్ పీరియడ్ ఉంది.

కూరగాయల బ్యాగ్‌ను హాండిల్‌కు తగిలించాడు. ఇంటికెళ్ళాక రజని ఈ కూరగాయల్ని చూసి వాటికి ఎన్ని వంకలు పెడుతుందో! కూరగాయల్ని చూసి కాదు రాములమ్మను చూసి ఆ కూరగాయలు కొన్నానని తెలిస్తే ఎంత గొడవ చేస్తుందో! చెప్పకు-రాములమ్మ విషయం రజనికి చెప్పకు. కీపిట్ ఏ సీక్రెట్!

నవ్వుకున్నాడు-దీంట్లో ఏముందని రహస్యంగా వుంచాలి?

ఈ తాళపుచెవి తనకెప్పుడూ సమస్యే—దీ కీ ప్లేస్ ఎ కీరోల్ ఇన్ యువర్ లైఫ్! ఎక్కడో పోతుందని భయం-ఆ భయంతోనే ఎన్నో సైకిల్ తాళపు చేతుల్ని పోగొట్టేశాడు. తాళపు చెవి కరెక్టా? తాళపు చెయ్యి కరెక్టా? [illegible] ఏది కరెక్టు? ఇంతకూ తాళపు చెవి వున్నట్టా? లేనట్టా? కలదు కలండనెడి వాడు కలడో లేడో! గజేంద్రుడు పడ్డ అవస్థలో పడ్డామే! ఎప్పుడూ ఎక్కడో పడ్తూనే వుంటాం—లేస్తూనే వుంటాం. పాంట్ జేబుల్ని, షర్ట్ జేబును వెతుకుతున్నాడు దొరకడంలేదు ఇప్పుడీ సైకిల్‌ను అన్‌లాక్ చెయ్యటమెలా? ఇందాక రాములమ్మ దగ్గర మాట్లాడుతున్నప్పుడు తాళపుచెవిని బయటకు తీసినట్టున్నాను. అక్కడే పడిపోయి వుంటుంది. వెళ్ళి అడగాలి. ఇదీ రాములమ్మను మరోసారి చూడటానికి వేస్తున్న ఎత్తా? కాదు-నిజంగానే తన తాళపుచెవి పోయింది.

"రాములమ్మా! నా సైకిల్ తాళపు చెవిని ఎక్కడో పోగొట్టుకున్నాను. నీ దగ్గరగానీ పడిపోయిందా?" ఆమె చిలిపిగా నవ్వుతుంది. మీరు



నా దగ్గరకొచ్చింది తాళపు చెవికోసం కాదన్నట్టుగా నవ్వుతుంది "ఈ నవ్వు కోసమే నీ దగ్గరకొచ్చాను" అంటాడు తను తాళపుచెవి విషయం మరచిపోయి.

"అమ్మయ్య! తాళపుచెవి దొరికింది! కర్చీఫ్‌లో దాక్కుంది. లైఫ్ అంతా యింతే. ఎప్పుడూ వెదకటమే....నేనొక నిరంతరాన్వేషకుణ్ణి

సైకిల్‌ను అన్‌లాక్ చేశాడు. సైకిల్ మీద కూర్చుని తొక్కటం మొదలెట్టాడు. సైకిల్ మెల్లగా కదిలింది.

ఎంత తొక్కినా... శక్తినంతా కూడదీసుకుని ఎంత తొక్కి తొక్కి తొక్కి తొక్కి తొక్కినా ఈ డొక్కు సైకిల్ కదలదు ముందొక బ్యాగ్, వెనకొక బ్యాగ్....ముందొక డబ్బా...వెనకొక డబ్బా....డొక్కు సైకిల్-సైకిల్ మీద తను. తననెవరూ లెక్చరర్ అనుకోరు. ఎవరో డొక్కు సామానులు కొనేవాడో లేక అమ్మేవాడో అనుకుంటారు. వ్హాట్ ఎ పిటీ! వ్హాట్ ఎ పిటీ! రవీందర్ ది గ్రేట్! ది గ్రేట్ రైటర్! తన రచనలతో ప్రపంచాన్ని అంతా ఓ ఊపు ఊపి తన పాదాక్రాంతం చేసుకోబోతున్న రైటర్ ది గ్రేట్! ఇలా ఈ డొక్కు సైకిల్ మీద ఈ దిక్కుమాలిన వీధుల్లో పడి తిరగటమూ—షేమ్! షేమ్! కనీసం బజాజ్ చేతక్ అయినా సుధాకర్‌లా.... లేత నీలం రంగుతో తళతళ మెరుస్తున్న వాడి బజాజ్ చేతక్....తనకు కల ...అతడికి నిజం ...బజాజ్ చేతక్ వెనకాల రజనీని కూర్చోబెట్టుకొని తను డ్రైవ్ చేస్తూ వెళ్ళిపోవాలి. ఆ యాత్ర అనంతంగా సాగిపోతూనే వుండాలి....ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ! పాపం! మాంట్ గో మరీ క్లిఫ్ట్ చనిపోయాడు....మానవమాత్రులం....మనకేదీ అనంతం కాదు-ఎక్కడో బ్రేక్ పడుతుంది. ఫుల్‌స్టాప్ పెట్టేస్తాం-గుడ్‌బై చెప్పేస్తాం....అంతా తెల్సి అయినా కలలు కంటూనే వుంటాం—ఈ మనసనేది పిచ్చిది-మనిషికి మనసే లేకపోతే! మనిషికి మనసే తీరని శిక్ష ...దేవుడిలా తీర్చుకున్నాడు కసి! గ్రేట్! బట్ మధ్యలో ఈ దేవుడెవడు? తెలీదు....మనిషికి తెలియనిది.... అర్థంకానిది యేదయినా సరే దాన్ని దేవుడనేశాడు. మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి? గురజాడగారూ, చెప్పండి.

ఆడుగో సూర్యప్రకాష్!

స్కూటర్ మీద రయ్‌మని ఇటే వస్తున్నాడు. ఈ డొక్కు సైకిల్ మీద వాడికి ఎదురుపడటం ఇష్టంలేదు—కాని తప్పదు. వాడిని ఎదుర్కోవాల్సిందే—తప్పదు-వాడికీ, తనకూ పోరాటం తప్పదు—వాడు స్కూటర్‌మీద-తను డొక్కు సైకిల్‌మీద అయినా సరే....వాడితో తలపడక తప్పదు.

"హల్లో...." అన్నాడు సూర్యప్రకాష్.

"హల్లో...." అన్నాడు రవి.

అతడు వెళ్ళిపోయాడు.

లాభంలేదు. ఈ డొక్కుసైకిల్‌ను మార్చెయ్యాలి తనూ ఓ స్కూటర్‌ను కొనుక్కోవాలి....తను మూడు-నాలుగేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఓ డొక్కు సైకిల్‌ను మాత్రం సంపాదించగల్గాడు. కాని ఆర్నెళ్ళ కింద ఉద్యోగంలో చేరిన సుధాకర్ బజాజ్ చేతక్‌ను కొనేశాడు. హౌ తమ్? వాడు కొన్లేదులే....వాడి మామగారు కొనిచ్చాడుట! మరి తన మామగారు తనకో స్కూటర్ ఎందుకు కొనివ్వలేదు? అన్యాయం-అక్రమం.... వెంటనే మామగార్కి ఉత్తరం రాయాలి.

డియర్ మామగారూ!

నాకు వెంటనే ఒక బజాజ్ చేతక్‌ను కొనివ్వండి ఈ డొక్కు సైకిల్ మీద కాలేజీకి వెళ్ళి రావటం చాలా ఇబ్బందిగా వుంది. ఎప్పుడన్నా నేనూ, మీ అమ్మాయి సినిమాకెళ్ళాలన్నా, షాపింగ్‌కెళ్ళాలన్నా చాలా యిబ్బందిగా వుంది. కాబట్టి వెంటనే ఓ స్కూటర్ కొనివ్వండి. ఈ రోజులలో ప్రతి మామ తన అల్లునికి ఒక స్కూటర్ కొనిస్తున్నాడు. నాకేం తక్కువయిందని? నెలకు ఐదారు వందలకంటే ఎక్కువే సంపాదిస్తున్నాను మీ అమ్మాయిని అన్నివిధాలా సుఖపెడుతున్నాను. కాబట్టి నాకో స్కూటర్ కొనివ్వటం న్యాయం. అన్యాయం కాదు. కాబట్టి యీ న్యాయమైన పనిని మీరు వెంటనే చేసెయ్యండి-అలా చెయ్యలేని పక్షంలో వెంటనే వచ్చి మీ అమ్మాయిని తీసుకెళ్ళండి. అలా రాసేస్తాను. 'మీ అమ్మాయిని తీసుకెళ్ళిపొండి' అన్న మాట చదవగానే మామగారి గుండెల్లో రైళ్ళు పరిగెడతాయి. ఆ దెబ్బతో మనింటి ముందు బజాజ్ చేతక్ రెక్కలు గట్టుకుని వాల్తుంది.



BAPU Cultural Ass... ANDHRA...

బ్రిలియంట్....మోస్ట్ బ్రిలియంట్! ఈరోజు మన బుర్ర అద్భుతంగా పనిచేస్తోంది. ఇంటికెళ్ళగానే మొట్టమొదట చేసే పని ఇదే-మామగారికి ఉత్తరం రాసెయ్యటం....ఆ ఉత్తరాన్ని రజని చూస్తుందనుకో.... అనుకోవడమేమిటి? చూస్తుంది. వాళ్ళ నాన్నగారికి రాసే ప్రతి ఉత్తరాన్ని చూస్తుంది ఆమె అప్రూవల్ లేకుండా తను వాళ్ళ నాన్నగారికి ఉత్తరాన్ని పోస్ట్ చెయ్యటానికి వీల్లేదు. కాబట్టి యీ ఉత్తరాన్ని కూడా చూస్తుంది.... చూడనీ భయమేమిటి? భయమేమీ లేదు. కానీ ఆమె యీ ఉత్తరాన్ని చూసి యేం చేస్తుందో ఊహించుకుంటే మాత్రం భయం....ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చిం చేస్తుంది. అగ్రహోదగ్రమై మౌనవ్రతాన్ని స్వీకరించి, కోపగృహాన్ని చేరి....మాసిన చీరకట్టుకుని, మౌనముతోడ, నిరస్త భూషమై వాసెనకట్టుకట్టి నిడువాలిక కస్తూరి పట్టువెట్టి, లోగాసిలి, చీకటింటి కడగంకటిపై జలదాంత చంద్రరేఖాసదృశాంగియై పొరలె గాఢ మనోజ విషావ వేదనన్....అలా సత్యభామైపోయి....మా నాన్నగారొచ్చి తీసుకెళ్ళటం దేనికి....? నేనే వెళ్ళిపోతున్నానని....చకచకా సూట్‌కేసు సర్దుకొని—బయటకు వెళ్ళటానికి సన్నద్ధురాలౌతున్న రజనిని చూసి బిక్కమొహం వేసుకొని "సారీ రజనీ! తప్పైపోయిందని చెంపలు వేసుకొని-జుట్టు పీక్కొని, తలబాదుకొని-అప్పుడు గాని రజని కరిగిపోయి లోపల కొస్తుంది. దటీజ్ రజనీ! కాబట్టి ఆ పిచ్చి ఉత్తరాన్ని రాయకు-రాశావంటే రజని పిచ్చెక్కిస్తుంది. నవ్వుకున్నాడు—రజనిలో సత్యభామ ఎనిసార్లు కనిపిస్తుందో తనకు-

ఈ క్షణంలో నవ్వించి, మరుక్షణంలో యేడిపించి యీ క్షణంలో లాలించి మరుక్షణంలో దండించి, యీ క్షణంలో ఉత్తుంగ శిఖరాలకు ఎక్కించి, మరుక్షణంలో అంతులేని అగాధాల్లో తోసేసి, ఈ క్షణంలో కరుణామయిగా, మరుక్షణంలో క్రౌర్యానికి రాణిగా, యీ క్షణంలో అనురాగ దేవతగా, మరుక్షణంలో అగ్రహోదగ్రయైన వేత్రు వద్ద యురగాంగనగా, యీ క్షణంలో తనకోసం శృంగార ద్వారాల్ని తెరిచిన ఊర్వశిగా, మరుక్షణంలో ఆ ద్వారాల్ని మూసేసి తనను విరహపు విషపు కోరల్లోకి తోసేసే పార్వతిగా—ఆమె యీ రెండు రూపాల్లో—ఏది నిజమో, ఏది

మాయో తేల్చుకోలేక పోతున్నాడు....ఏ క్షణానికదే నిజమనిపిస్తుంది. ఆ క్షణం దాటిపోగానే అదీ మాయ అనిపిస్తుంది. తనకు రజని అర్థం కావటంలేదు. ఆమెలో ఏదో మాయ వుంది ఏదియో అపూర్వ మధుర శక్తి స్ఫురింపనుగాని అర్థమ్ముగాని భావగీతమె రజని!

"నమస్కారం సార్—"

"నమస్కారం—"

ఎవరో స్టూడెంట్స్—ఏ క్లాసువాళ్ళో గుర్తురావటం లేదు. వాళ్ళ ముఖాలు తెలుసు—వాళ్ల పేర్లు కూడా తెలుసు—కాని యే పేరు యే ముఖానిదో మాత్రం తెలియదు. తన పాత స్టూడెంట్స్ చూసినప్పుడల్లా తనకీ సమస్య ఎదురౌతుంది.

ఎక్కడో బ్రేక్ పడింది...తనింతకు ముందు ఆలోచిస్తున్న విషయానికి బ్రేక్ పడింది. ఆ అంతఃస్రవంతి అలా ప్రవహిస్తూనే ఉంటే ఎంత హాయి?

బ్రేక్ పడ్డప్పుడు ఎంత చిరాకు?

ఈ సైకిల్ కదలదు. గతుకుల రోడ్డు...ఎత్తువంపుల రోడ్డు.... ఇప్పుడు ఎత్తు...శక్తినంతా కూడదీసుకొని తొక్కుతున్నాడు. తొక్కోయ్! తొక్కోయ్, తొక్కు! తొయ్యోయ్... తొయ్యోయ్ తొయ్.... మొయ్యోయ్ మొయ్యోయ్ మొయ్! లాగండ్రా బాబు....లాగండ్రా బతుకు-లాగండ్రా గన్ను...కవిప్పుడు పట్టాల్సింది గన్ను! పెన్ను కాదు....అదిగో గోడలు.... పెద్దపెద్ద పాకుబట్టిన, పగుల్తున్న, కూలుతున్న గోడలు... ఆ గోడల మీద గన్స్... స్లోగన్స్....

తుపాకి గొట్టంలోంచే రాజ్యాధికారం వస్తుంది. మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి....అరచేతి అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు. ఒక వీరుడు మరణిస్తే ప్రభవింతురు వేనవేలు....ఆత్మను అమ్ముకున్నవాడు అమ్మను కూడా అమ్ముకుంటాడు. నక్సలైట్లే నిజమైన దేశభక్తులు!

ఎన్నికల్లో పాల్గొనడం అంటే మన తలలు నరికే తలారుల్ని గద్దె ఎక్కించడమన్నమాట....ఆకలితో అలమటించటం కంటే పోరాటంలో ప్రాణాలు కోల్పోవటం మిన్న!



ఎన్ని గన్స్...ఎన్ని స్లోగన్స్....! ఎన్ని గోడలో....ఎన్ని తెల్ల గోడలు ఎర్ర గోడలుగా మారాయో!

మైడియర్ చలం! తెలుగులో గొప్ప కవిత్వం రావడం లేదంటావా? తెలుగులో గొప్ప కవిత్వమంతా గోడల మీద రాయబడుతోంది. భావితరాల కోసం యీ గోడల్ని 'ప్రిజర్వ్' చెయ్యాలి. ఎరుపెక్కిన యీ గోడలన్నిటినీ 'ఆర్కియాలజీ డిపార్టుమెంటు' వాళ్ళకు అప్పజెప్పాలి.

గోడల్ని దాటాడు....స్లోగన్స్‌ని దాటాడు... అదిగో... మంకమ్మ తోట సెంటర్....భూషణం అండ్ సన్స్....వచ్చేసింది....తన గమ్యం.... తన డెస్టినేషన్....భూషణం....ది గాడ్! ది గాడ్ దట్ ఫెయిల్డ్ కాదు కదా! స్టీఫెన్ స్పెండర్, లూయీఫిషర్‌ల లాగా తనూ భూషణం మీద ఓ పుస్తకం రాసిపారెయ్యాల్సి వస్తుందేమో!

గాడీజ్ దేర్ ఆల్‌రైట్! ఎవరి మీదో కేకలేస్తున్నాడు. రవి నాగభూషణం షాపు ముందు సైకిల్ దిగాడు..... షాపు ముందు చాలా మంది వున్నారు.

భూషణం ఎవరి మీదో అరమైలు దూరం వినిపించేలా అరుస్తున్నాడు.

"ఆరునెల్ల నుంచి సామాను తీసుకుపోతున్నావు....ఒక్క పైసన్నియ్యలేదు మళ్ళీ ఏ ముఖం పెట్టుకొనొచ్చినవ్? ఇదివరకు తీసుకున్న సామానుకు పైసలు మొత్తం కట్టేదాకా మళ్ళీ పైస సామానియ్య వచ్చిందార్నిపో! ఇంతకాలం నీ పెళ్ళాం పిల్లల మొహంజూసి సామానిచ్చిన...." అంటున్నాడు భూషణం.

ఆ మాటలన్నీ తననే ఉద్దేశించి అంటున్నట్టుగా....వెంటనే అక్కణ్ణించి వుడాయించాలనిపించింది.

"అరే కోమటోడా! జర మాటలు మంచిగ రానియ్....! ఎక్కువ తక్కువ బోనిచ్చినవంటే పొడిచి పారేస్త. యేమనుకున్నావో మల్ల" అంటున్నాడు భూషణం షాపు ముందు నిల్చుని వున్న సుగుణాకరరావు జడ్ పి. ఆఫీసులో క్లర్కు....ఎప్పుడూ తాగి, తూలుతూ వుండే సుగుణాకరరావు

అంటే ఆ వీధిలో అందరికీ తెలుసు....ఆయన భార్య రోజూ ఎవరో ఒక రింటికెళ్ళి అప్పు తెచ్చి ఆరోజు గడిచేలా చేస్తుంది.

"పొడుస్తావురా....నువ్వు పొడిచేటంత మొనగాని వైనావురా—? యిరవై నాలుగ్గంటలు తాగి సోలైటోనివి! నువ్వు పొడుస్తావురా....పోరా పో....ఒక్క గుద్దు గుద్దితే రక్తంకక్కి చస్తవు....నీ అసుంటి మందిమీద బతికే కుక్కల్ని చాలా మందిని జూసిన...." అన్నాడు భూషణం.

"ఎవ్వన్నమకున్నావురా? అరే కోమటోడా! నీకు కొవ్వు పెరిగిందిరా! నోటికొచ్చినట్టల్లా వర్లుతున్నవు....నీయవ్వ...."

సుగుణాకరరావు భూషణం మీదికి పోయాడు. వెంటనే అక్కడున్న ఇద్దరు ముగ్గురు కలిసి అతన్ని ఆపేసి దూరంగా తీసికెళ్ళారు. సుగుణాకర రావు బూతులకు లంకించుకున్నాడు. అతని నోటి వెంట బూతులు ఒక ప్రవాహంలా వచ్చాయి.......జనమంతా చేరి ఆ బూతులు వింటూ నవ్వ సాగారు.

నాగభూషణంకూడా బూతులు మొదలుపెట్టాడు. ఒకర్ని మించి ఒకరు....అమ్మల్ని, అక్కల్ని, పెళ్ళాల్ని....తిట్లన్నీ వీళ్ళచుట్టే సృష్టించ బడ్డాయి. ఏదో రకంగా స్త్రీలనే అవమానించాలి....! తెలుగు భాషలో ఉన్న తిట్లన్నీ, బూతులన్నీ స్త్రీల చుట్టే తిరుగుతాయి.

గొడవ ప్రారంభం కావడంతో అక్కడ చాలామంది గుమిగూడి ఆ తిట్లన్నీ వినసాగారు. పైసా ఖర్చులేకుండా వాళ్ళందరికీ ఎంత వినోదం లభించిందో!

బూతుల్లోనూ యేదో ఆకర్షణ వుంది.

మనిషికి స్పష్టంగా తెలియనిదీ యేదో అవసరాన్ని ఈ బూతులు తీరుస్తున్నాయనిపిస్తుంది. బూతులు మాట్లాడుతున్న వాళ్ళకూ, వింటున్న వాళ్ళకూ యేదో తృప్తి! ఎంతో వినోదం! ఇలా ఎందుకు జరుగుతుంది? మానవుడి అంతరంగం ఎంత విచిత్రమైంది? అక్కడే ముందో ఏం జరుగు తుందో తెలిసికోవటం ఎంత కష్టం?

తను అక్కడ వుండటమా? వెళ్ళిపోవటమా? టు బీ? ఆర్ నాట్ టు బీ? దటీజ్ ది క్వశ్చన్! హామ్లెట్ పడ్డ అవస్థలో పడ్డాం....ప్రతీక్షణం



పడ్తూనే వుంటాం. ఈ మూడ్‌లో భూషణాన్ని సరుకులిమ్మని అడిగితే తననూ ఆలాగే తిడ్తాడేమో.

గుండె లోపల వణుకు....భయం....అన్ని తిట్లు తననే తిడితే తను బతుకుతాడా? ఆత్మహత్య చేసుకొని చచ్చిపోతాడు.

ప్రతీ నెలా జీతం రాగానే డబ్బులిచ్చే సరుకులు తీసుకురండి అంటుంది రజని.

కానీ తనే అలా చెయ్యలేక పోతున్నాడు.

"మీరొచ్చి యెంతసేపయిందీ సార్....మిమల్ని చూస్తనే లేను.... పొద్దునే ఈ తాగుబోతు లంజొడుకుతో ఈ తొల్లి జెయ్యబట్టి నా గిరాకంతా పోయిందీ మా అమ్మాయొచ్చి మీరక్కడ నిల్చున్నారని చెప్పిందాకా నేను మిమ్మల జూస్తానేలేను....యేం గావాల్నో చెప్పుండ్రి ..." అంటున్నాడు భూషణం తనసుద్దేశించి.

రవి అతని దగ్గరగా వెళ్ళి తన జేబులో వున్న రజని రాసిచ్చిన చిట్టీ తీసి అతని చేతికిచ్చి "కాస్త త్వరగా ఈ సామాన్లివ్వండి....కాలేజీకి టైమైపోతోంది....వెళ్ళాలి" అన్నాడు రవి.

"ఇప్పుదే ఇస్తసార్....ఒక్క నిముషంల....మీరు గిట్ల ఈ స్టూలు మీద కూర్చోండ్రి" అన్నాడు భూషణం.

రవి స్టూలు మీద కూర్చున్నాడు.

"అరెయ్ రాజేశం! సార్‌కు ఈ సామాను జల్దీ ఇచ్చెయ్...." అని భూషణం కేకేశాడు.

"మీరేమన్నా సంచి దెచ్చిండ్రా సార్!" అన్నాడు రాజేశం అనబడే కుర్రాడు.

రవి వెంటనే లేచి సైకిల్‌కున్న సంచీ, కాన్, కిరోసిన్ డబ్బా రాజేశం చేతికిచ్చాడు.

"కొంచెం త్వరగా ఇచ్చెయ్యాలి రాజేశం!" అన్నాడు రవి.

"ఒక్క పది నిమిషాలల్ల ఇస్తసార్. మీరు కూర్చోండి!" రాజేశం మళ్ళీ వచ్చి స్టూలుమీద కూర్చున్నాడు.

అక్కడున్న వాళ్ళందరికి భూషణం సుగుణాకరరావును గూర్చి ఆ కుటుంబానికి తను చేసిన సహాయాన్ని గూర్చి చెప్పసాగడు.

"నేను వాని పెళ్ళాం పిల్లల మొఖంజూసి సామానియ్యకపోతే వాళ్ళంతా ఆకలికి మాడి చచ్చేటోళ్ళు....పుణ్యానికి పోతే పాపం ఎదురైందన్నట్టు నేను జేసిన సహాయానికి ఇవాళ పీడితోటి ఇన్ని తిట్లు తినవలసొచ్చింది" అన్నాడు భూషణం

"ఎవ్వని పాపం వానికేలే భూషణం....నువ్వేం బాధపడకు" అని అన్నారు అక్కడి పెద్ద మనుషులంతా.

"తనబదులు తనేలేరేం సార్... సామానుకొస్తనే లేదు మీరు" అన్నాడు భూషణం రవివేపు తిరిగి.

డబ్బు లివ్వరేదేమని మర్యాదగా అడగటం ఇదే కాబోలు.

"పోయిన ఫస్టుకు ఒక ఎల్.ఐ.సి పాలసీ కట్టేదుంటే....ఒకేసారి నాలుగువందలు కట్టాను అందువల్ల నీకు డబ్బు ఇవ్వలేక పోయాను."

మెల్లగా తనలో తను చెప్పుకుంటున్నట్టుగా అన్నాడు

"మిమ్మల్నిప్పుడు పైసలడిగిన్నా సార్! మీ దగ్గర పైసలెక్కడబోవు సార్! నాకు గామాత్రం తెలియదనుకున్నారా? ఎవ్వరెసుంటోళ్ళో మాకు తెలుస్తదండి....మీకు ఎంత సామాను గావాల్నన్నా తీసుకపోండ్రి.... పైసలకేం ఫరవాలేదు...." అన్నాడు భూషణం.

"థాంక్యూ.... థాంక్యూ వెరీమచ్" అన్నాడు రవి.

"అరెయ్....రాజేశం! సార్ సామాను ప్యాక్ చేస్తివా?" కేకేశాడు భూషణం.

"చేసిన—ఒక్క గ్యాసు నూనె పోస్తే అయిపోతది—" రాజేశం.

రాజేశం సామానంతా తెచ్చి రవి ముందు పెట్టాడు.

"ఇవన్నీ సైకిల్ మీదనే తీసుకపోతరా?" అన్నాడు భూషణం.

"అదే చూస్తున్నా—రిక్షా మాట్లాడుకుంటే—" అన్నాడు రవి

"రిక్షా ఎందుకు సార్! మీ ఇల్లు ఇక్కడికి దగ్గర్నేగద! ఆ గ్యాసు నూనె డబ్బా మా రాజేశం దెస్తడు మిగతావి మీరు సైకిల్ మీద తీసుకపోండి—అరేయ్! రాజేశం ఆ గ్యాసు నూనె డబ్బాను నువ్వు పట్టుకెళ్ళి సారింట్లో పెట్టిరా పో!" అన్నాడు భూషణం.



అన్నీ సైకిల్‌కు అమర్చుకొని రవి సైకిలెక్కాడు. థాంక్గాడ్! భూషణం కరుణించాడు. రజని తెమ్మన్నవన్నీ తెస్తున్నాడు. చాలా సంతోషిస్తుంది – బిల్ ఎంతయ్యిందో అడగనేలేదు – అతడే రాసుకుంటాడులే!

టైమ్ చూశాడు. మైగాడ్! అప్పుడే తొమ్మిదైపోయింది.

రజని వంట పూర్తిచేసే టప్పటికి ఎంత టైమ్ అవుతుందో - పదింటికల్లా కాలేజీ కెళ్ళాలి. ఉత్తరాలు రాసుకోటానికి టైమే దొరకదు. రోజు ఇలాగే రేపు రాద్దాంలే అనుకోవటం. ఇలా ఎన్ని రేపులు నిన్నలై పోతున్నాయో? యేమైనా సరె! ఈ రోజు ఎట్‌లీస్ట్ ఒక్క సుధ కన్నా ఉత్తరం రాయాలి. సుధ ఉత్తరం వచ్చి అల్‌రెడీ వారం రోజులు దాటింది. మీ ఉత్తరం కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తుంటానని, మరచిపోకండి అని రాసింది కాని మరిచిపోయాడు. ఆమె ఉత్తరం చదివాక వెంటనే ఆ క్షణంలోనే ఆమెకు సమాధానం రాయాలన్న ఆవేశం కలిగింది. కాని రాయలేకపోయాడు. రజని యేదో పని చెప్పింది. ఆ తర్వాత కాలేజీ స్టూడెంట్స్ లెసన్స్‌కు ప్రిపేర్ కావటం - యేవో సమస్యలు - అంతే! సుధను మరిచిపోయాడు తనలోని రచయితను సజీవుడుగా కాపాడుతున్న సుధ తన అక్షరాల్లో అమృతం నింపి తనకందిస్తున్న సుధ - ఈ రాతలు మొక్క పిచ్చి. ఎవరర్థం చేసుకుంటారని? ఈ గుండెలోని వేదన ఎవరి గుండెలో పలుకుతుందని? ఎందుకీ ప్రయాస? ఎండమావుల సౌందర్యాన్ని అందుకోవాలని ఎందుకీ వెర్రి ప్రయత్నం? అనుకునే క్షణాల్లో సుధ ఉత్తరాలొక 'టానిక్'లా పనిచేశాయి. తనలోకి కొత్త రక్తాన్ని, కొత్త జీవాన్ని నూరిపోశాయి సుధ కోసం రాయాలి? సుధలాంటి ఎందరో అజ్ఞాతంలో ఉన్న ఆర్ద్రహృదయులైన పాఠకులకోసం రాయాలి. తన శ్రమ వృథా కాదు. తన బ్రతుకు వృథా కాదు.

సుధలాంటి పాఠకులున్నంత కాలం తను రాస్తుండాలి - తన హృదయాన్ని తన రచనల్లో ఆవిష్కరించాలి. తనలోని రచయితను సుధకోసం బ్రతికించుకోవాలి—ఈ రోజు సుధకు తప్పని సరిగా ఉత్తరం రాయాలి—

కొత్తగా ప్రారంభించబోయే ఓ పత్రిక వాళ్ళు తననో కథ పంపించమని అడిగారు. ఈ రోజు ఆ పత్రిక కోసం కథ రాద్దామనుకున్నాడు—ఎన్నాళ్ళ నుంచో రాద్దామనుకున్న కథ—కాని ఈ రోజిక రాయలేడు—మార్నింగ్ అవర్స్‌లో తప్ప తర్వాత రాయలేడు. రేపు ఇలా ఎన్ని రేపులు గడిచిపోయాయో? రోజుకు ఇరవై నాలుగ్గంటలే ఎందుకుండాలి? భూమి తన చుట్టూ తాను ఇంత వేగంగా తిరక్కపోతే యేం? కాస్త నింపాదిగా తిరక్కూడదూ? 24 గంటల్లోనే నువ్వు ఒకసారి నీ చుట్టూ నువ్వు తిరగాలని భూమికెవరు చెప్పారు? బహుశః సూర్యుడు చెప్పివుంటాడు. సూర్యునికెవరు చెప్పారు? అసలు ఇన్ని కోట్ల నక్షత్రాలు - కోట్ల కోట్ల గ్రహాలు వున్నపుడు ఒక్క భూమ్మిదనే ఈ సృష్టి ఎందుకు జరిగినట్టు? ఈ సృష్టి కంతటికీ కారకుడెవ్వడు? అసలు ఈ సృష్టికి అర్థమేమిటి? ఈ పుట్టటమేమిటి చావటమేమిటి? ఈ దుఃఖం, ఈ బాధ, ఈ ఆరాటం, ఈ ఆనందం, ఈ అన్వేషణ, ఈకలలు, ఈ కన్నీళ్ళు ఎందుకు? ఓ ఫైన్ మార్నింగ్ ఈ లోకానికి గుడ్ బై చెప్పి వెళ్ళిపోయే ఈ ప్రాణికోటికి ఇవన్నీ ఎందుకు?

ఈ ఎందుకు అనే ప్రశ్నకు సమాధానం ఎవరికీ తెలీదు. ఎన్నో బ్రిలియంట్ బుర్రలు ఈ ప్రశ్నకు సమాధానం కనుక్కోవాలని ప్రయత్నించాయి. అహోరాత్రులు శ్రమింపా . శ్రమిస్తూనే వున్నాయి. అయినా సమాధానం లేదు సో యూ డోన్ట్ బాదర్ ఎబౌట్ దట్....నువ్వు కోరుకుని ఈ ప్రపంచంలోకి రాలేదు. నువ్వు కోరుకొని ఈ ప్రపంచం లోంచి వెళ్ళిపోలేవు. మొదలు కొన్ని పేజీలు చివర కొన్ని పేజీలు మిస్సయి పోయి పుస్తకం లాంటిది మనిషి జీవితం. బ్రతికినంతకాలం బతకాలి. లైఫ్ ఈజ్ ఫర్ లివింగ్....దట్సాల్....అమ్మయ్య ఇల్లొచ్చేసింది. రజని యేం చేస్తోందో....ఈ సామానంతా చూ కనైనా ఆమె కోపం పోతుందా?

ఇంటి ముందు సైకిల్ దిగి సైకిల్ బెల్‌ను గణగణ మని మోగించాడు ఆ బెల్ విని రజని వస్తుందనుకున్నాడు. కాని రజని రాలేదు. సైకిల్‌కు స్టాండు వేసి గేటు తెరచి 'రజనీ' అంటూ కేకేశాడు. సమాధానం రాలేదు త్వరగా రాదేం? అన్నీ తెచ్చారా? అని అడగదేం?

'రజనీ!' మళ్ళీ పిలిచాడు.



'వస్తున్నా' లోపల్నుంచి సమాధానం.

'త్వరగా రా'

"బట్టలు పిండుతున్నాను. యేమిటంత తొందర?" అసహనంగా ఆమె గొంతు.

"వచ్చి ఈ సామాన్లన్నీ లోపల పెట్టుకో?"

"అన్నీ తెచ్చి మీరు లోపల పెట్టండి....ఈ బట్టలు ఆరేసి వచ్చేస్తా...."

ఈ మనిషి ఎప్పుడూ యింతే. పిలవగానే రాదు. "తెచ్చారా అన్నీ తెచ్చారా?" అంటూ పరవశించి పోదు. తనెంత కష్టపడ్డాడో, జేబులో పైసా లేకపోయినా అంత సామాను ఎలా తెచ్చాడో తెలుసుకుని తన ప్రయోజకత్వాన్ని ప్రశంసించదు.

రెండు సంచుల్నీ తీసికెళ్ళి లోపల పెట్టాడు. నూనె క్యాన్ తీసుకొచ్చి లోపల పెట్టాడు. అతడు సామాన్లు లోపల పెడ్తుండగానే రాజేశం వచ్చి కిరోసిన్ డబ్బాను యింట్లో పెట్టి వెళ్ళిపోయాడు. యింతసేపైనా రజని రాలేదు.

"రజనీ" ఈసారి చాలా కోపంగా ధ్వనించింది అతని గొంతు.

"యేమిటండీ ఆ కేకలు... వచ్చేస్తున్నాగా"

"సామానంతా ఒకసారి చూసుకోవా?"

"చూసుకుంటాను .... చేతి మీద ఉన్న పనిని వదిలిపెట్టి ఎలా రాను ?"

"ఇప్పుడా బట్టల కంత తొందరేమొచ్చింది"

"మీరు బజారు కెళ్ళొచ్చేలోగా ఈ బట్టలు పిండి ఆరేయటం చేద్దామని కూర్చున్నాను."

"గొప్పపని చేశావు"

"గొప్ప పనులు నేనేం చేస్తానులెండి"

"కనీసం ఏం తెచ్చానో చూడవా?"

"చూస్తాను—కాస్త తీరిక దొరికాక."

"అంత తీరికగా చూసుకునే దానివి. సామాను తెండి- ఈ నిమిషంలో తేకపోతే కొంపలంటుకు పోతాయి అన్నట్టుగా నన్నెందుకు చంపుతావు?"

"సామాను తెమ్మని చెప్పటం తప్పా? సామానైపోయి అయిదారు రోజులైంది, ఇప్పుడు కిరసనాయిలు తెచ్చారు కాబట్టి వంట చెయ్యగల్గుతాను. మొదలు ఈ కిరసనాయిల్ని స్టౌలో పోసుకోవాలి" అంటూ ఆమె కిరసనాయిలు డబ్బా తీసుకుని లోపలికి వెళ్ళింది.

"త్వరగా టిఫిన్ చెయ్యాలి....కాలేజీకి టైమైపోతోంది."

"ఇప్పుడేగా తెచ్చారు. అప్పుడే అంత తొందరపడ్తారేం?"

"ఇప్పుడు తొమ్మిది దాటింది. తొమ్మిదిన్నర కల్లా టిఫిన్ పెట్టాలి...."

"తొమ్మిదిన్నర దాకా ఎందుకు? ఇప్పుడే... ఈ నిమిషంలోనే చేసి పెడతాను. నేను మనిషిని కాదుగా....ఓ యంత్రాన్ని"

"అబ్బబ్బ....ఎందుకంత ఉక్రోషంతో మాట్లాడతావు. ఇప్పుడు నేను నిన్నేమన్నానని!"

"ఏమీ అన్లేదు పాపం. మీరు మగమహారాజులు. మీరేమన్నా చెల్లుతుంది."

"ఆ మాటే అనొద్దని నీకెన్నోసార్లు చెప్పాను. అందరు మగమహారాజుల్లా నేను ప్రవర్తించను. స్త్రీలంటే నాకు చాలా గౌరవముంది. ఆ విషయం నీకు తెలుసు."

"ఆమె మాట్లాడలేదు. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకోవడం మొదలెట్టింది.

వ్యంగ్యమనేది ఆడవాళ్ళకు పుట్టుకతోనే వస్తుందేమో. మొగవాడ్ని దెప్పకొట్టడం వాడేమన్నా అంటే బాధపడటం వాడినింకా బాధపెట్టడం వాడినింకా దెప్పగొట్టడం పోన్లే ఇక ఆ విషయాన్ని గూర్చి ఆలోచించకు. కొంచెం టైం దొరికింది. ఒకటి రెండు ఉత్తరాలు రాసెయ్యాలి.

టేబుల్ ముందు కూర్చున్నాడు.

ఈ మధ్య వచ్చిన ఉత్తరాలు తీశాడు.



ఎన్ని ఉత్తరాలకు సమాధానాలు రాయాలో లెక్కపెట్టాడు. ఆరింటికి రాయాలి. అందులో ఒకటి నాన్నగారికి... సాధ్యమైనంత త్వరలో మీకు రెండు వందలు పంపిస్తానని మిగతా అయిదు తన పుస్తకాలు చదివి అభిమానంతో రాసిన సాహితీ మిత్రులకు, వాళ్ళను 'అభిమానులు' లేక 'ఫ్యాన్స్' అనటం తనకు నచ్చదు. సాహితీ మిత్రులంటేనే తనకు బావుంటుంది. ఆఫ్టరాల్ అయిదుగురు ఫరవాలేదు. తనకు అయిదుగురే చాలు. పూర్వం పాండవులు తమకు ఐదూళ్ళిచ్చినా చాలు అన్నారట! పూర్ ఫెల్లోస్! ఆ ఐదు ఉత్తరాల్ని ఒక్కొక్కదాన్ని మరోసారి చదవటం మొదలెట్టాడు. అలా తన రచనల్ని గూర్చి వచ్చే ఉత్తరాల్ని చదవటం అతనికెంతో ఆనంద దాయకంగా ఉంటుంది. ఈ ప్రపంచానికి పూర్తిగా భిన్నమైన మరో ప్రపంచంలోకి వెళ్ళిపోతాడు. ఆ ప్రపంచంలో తనూ, తన నవలలు, తన పాత్రలు, తన ఆలోచనలు, తన అనుభూతులు, వాటిని పంచుకునే తన పాఠకులు- వీళ్ళు తప్ప మరెవ్వరూ ఉండరు. తనకై తాను సృష్టించుకున్న అస్వాప్నిక ప్రపంచంలో విహరించటం తనకెంతో హాయిగా ఉంటుంది. ఆ ఉత్తరాల్లో ఒక ఉత్తరాన్ని చదవటంలో మునిగిపోయాడు. "స్టౌ బత్తీలు కాలిపోయాయి. ఎంత ప్రయత్నించినా పైకెక్కటం లేదు. కొంచెం కొత్తవి తెచ్చిపెట్టండి" అంది....రజని అకస్మాత్తుగా లోపల్నించి వచ్చి.

ఆమె మాట వినిపించినా, ఆ మాట ఎవరి నుద్దేశించి అన్నదో అసలామాటకు అర్థమేమిటో అతనికి వెంటనే బోధపడలేదు. అతడు అలాగే ఉత్తరాలు చదువుతూ కూర్చుండిపోయాడు.

"మీకే చెబుతున్నాను. మరోసారి భూషణం షాపు దాకా వెళ్ళి స్టౌ బత్తీలు తెచ్చి పెట్టండి" అందామె. అతడు కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చి....

కిరోసిన్ వాసన ఆ గదంతా వ్యాపించింది.

"అబ్బబ్బ....యేమిటీ కిరోసిన్ కంపు"

విపరీతమైన చిరాకొచ్చేసిందతనికి.

"ఎప్పుడూ మల్లెపూల సువాసనలే కాదు.. అప్పుడప్పుడు కిరోసిన్ కంపు కూడా భరించాలి మహాశయా! వెంటనే వెళ్ళి స్టౌ బత్తీలు పట్టుకు రండి...."

"ఇదుగో రజని....మర్యాదగా చెబుతున్నాను కాస్సేపు నన్ను డిస్టర్బ్ చెయ్యకు. ఉత్తరాలు రాసుకోవాలి. ఇంత సేపూ నీ పనే చేశాను. ఇప్పుడిక నా పని చేసుకోనీయ్."

"బజారుకెళ్ళి స్టౌ బత్తీలు తెచ్చుకోవటం నా పనేనా?"

"వ్హాట్ దీ హెల్ యూ మీన్" అతడు పైకి వస్తున్న కోపాన్ని కంట్రోల్ చేసుకోలేక పోతున్నాడు.

"కాస్త తెలుగులో మాట్లాడండి. నాకు ఇంగ్లీషు రాదని మీకు తెలుసు...."

"ఒక్క ఇంగ్లీషే కాదు. నీకేమీ రాదు"

"అంతే...."

"టేబుల్ దగ్గర రాసుకుంటున్న వాడిని డిస్టర్బ్ చెయ్యొద్దనే ఇంగిత జ్ఞానం కూడా లేదు నీకు"

"స్టౌ బత్తీలు తెచ్చుకోకపోతే సారీ తేకపోతే వంటెలా చెయ్యను? తొమ్మిదిన్నరకు టిఫిన్ చెయ్యకపోతే మీకు కోపం రాదూ?"

"నిజమే....కాని ఆ వెధవ స్టౌ బత్తీల విషయం మొదటే ఎందుకు చెప్పలేదూ అని....ఆ లిస్టులో వాటిని కూడా ఎందుకు ఎక్కించ లేదూ అని...."

"అప్పుడు చూసుకోలేదు. తప్పయిపోయింది. తప్పును క్షమించి ఓ ఐదు నిమిషాల్లో తెచ్చిపెట్టమని ప్రార్థిస్తున్నాను సరేనా?"

"ఊ! నువ్వు ప్రార్థించినా, తపస్సు చేసినా నేనిప్పుడు బయటకు వెళ్ళను."

"వెళ్ళరా!"

"వెళ్ళను గాక వెళ్ళను"

"అంతేనా?"

"అంతే...."



"సర్లెండి....నా చావేదో నేనే చస్తాను."

ఆమె గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

పాడు స్టౌబత్తీలు.... మూడంతా నాశనం చేసి వెళ్ళిపోయింది.... ఇప్పుడికయేం రాస్తాడు? నోనోనో... రాయాల్సిందే.... తప్పకుండా రాయాల్సిందే.... రెండు కాకపోయినా కనీసం ఒక్కటైనా.... సుధకు రాయాలి. సుధ రాసిన ఉత్తరాన్ని చకచకా మరోసారి చదివాడు.

సుధ ఉత్తరాలు ఎంత అందంగా రాస్తుందో.... ఆమె ఉత్తరాన్ని చదివిన మరుక్షణంలోనే అతనిలో ఆమెకు సమాధానం రాయాలన్న ఆవేశం పెల్లుబికింది.

వెంటనే లెటర్ప్యాడ్ తీసి ఆమెకు ఉత్తరం రాయటం మొదలెట్టాడు

మైడియర్ సుధా,

నీ ఉత్తరం వారంరోజుల క్రితమే అందింది. ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ. ఎంత ప్రయత్నించినా నీకు వెంటనే సమాధానం రాయలేక పోయాను. ఎన్నో అవాంతరాలు, ఎన్నో సమస్యలు.... అవన్నీ ఇప్పుడిక్కడ యేకరువు పెట్టను.

నీ ప్రతీ ఉత్తరం నాకొకవరం అద్భుతమైన అనుభవము కూడ.

నీనుండి ఉత్తరాల్ని పొందటం రచయితగా నేనుసాధించిన మహత్తర రచయితగా నాకింతకంటె గొప్ప ప్రతిఫలమంటూ యేదీ వుండదు. ఇది నిజంగా విజయం

నేను కథలు, నవలలు రాస్తున్నది డబ్బునో, కీర్తినో, అవార్డులనో ఆశించికాదు. నీలాంటి వాళ్ళ హృదయంలో కొంచెం స్థానం సంపాదించడం కోసం. నా రచనలు చదివి, ఎక్కడో నీలాంటి యే ఒక హృదయమైనా స్పందిస్తే, యే ఒక్కరి కన్నుల్లో నైనా ఒక్క కన్నీటి బిందువు రాలితే, యే ఒక్కరి మేధస్సునైనా ఆలోచింపేట్టు చెస్తే, యే ఒక్కరి అంతరంగంలో నైనా వున్నత సంస్కారాన్ని ఆవిష్కరించ గలిగితే రచయితగా నా బ్రతుకు వృధాకాదని భావిస్తాను. నీ వుత్తరాలు రచయితగా నా బ్రతుకు

వృథాకాదని ఋజువు చేస్తాయి. నాలోని రచయితను ఎన్నో ఎదురు దెబ్బల నుండి కాపాడి సజీవుడిగా కాపాడుతాయి.

నాలోని రచయితను సజీవుడిగా కాపాడుకోవడానికి ఎంత స్ట్రగుల్ చేస్తానో, నీకు తెలీదు సుధా!

'నేను రచయితనని తెలియగానే' మీరేం రాశారు? యేయే పత్రికల్లో సీరియల్స్‌గా వచ్చాయి? మీరు రాసే రచనలకు ఎంత డబ్బిస్తారు? మీ నవలల్ని ఎవరైనా సినిమాలుగా తీశారా?' అని అడుగుతారు. అలాంటి వాళ్ళకు నేనేమని సమాధానం చెప్పను? రచయితగా నా సక్సెస్‌ను నేనెంత డబ్బు సంపాదించాను అన్నదాన్ని బట్టి జడ్జ్ చేస్తారే తప్ప నేను రాసిందాంట్లో వున్న లిటరరీ వ్యాల్యూస్‌ను బట్టికాదు. ఇలాంటివాళ్ళు మమ్మల్ని ఎంతగా వేధిస్తారో, ఎంతగా డీమోరలైజ్ చేస్తారో మాటల్లో చెప్పలేను. వీళ్ళకు ఒక రచయిత ఏం రాశాడో అక్కర్లేదు. వాటిని చదివి అర్థం చేసుకునే ఓపిక లేదు. వాడు రాసిన ఒక్క వాక్యంకూడా చదవ కుండానే వాడిని రచయితగా జడ్జ్ చేసే ప్రయత్నం చేస్తారు. ఎన్నోసార్లు ఈ నిర్దాక్షిణ్య ప్రపంచంలో మేము ఎవరికోసం రాస్తున్నాం.... ఎందుకోసం రాస్తున్నాం? అన్న సందేహం కలుగుతుంది. అలాంటి సమయంలోనే నీ వుత్తరాలు నన్ను ఆదుకుంటాయి. ఓ మిత్రుడిలా నా బాధల్ని, నా కనీళ్ళని పంచుకుంటాయి. ఓదారుస్తాయి. కొండంత బలాన్నిస్తాయి నాలోని రచయితలో కొత్త జీవాన్ని, కొత్త ఊపిరిని పోస్తాయి. నా చుట్టూవున్న జనం నామీదకు కంకర రాళ్ళను అనుక్షణం విసురుతుంటే నీ ఉత్తరాలు నామీద చల్లని మల్లెపూలను కురిపిస్తాయి. మంచి గంధాన్ని రాస్తాయి. ఈ ప్రపంచంలో కేవలం నీ వుత్తరాలకోసం బతకాలనిపిస్తుంది. ఇంకా ఎన్నో మంచి రచనలు చేసి నీనుండి నిరంతరం ఇలా వుత్తరాలు పొందే అర్హతను పొందినందుకు నిజంగా గర్విస్తున్నాను

ఈ మధ్య కొత్తగా యేమీ రాయలేదు. కానీ రాయాలని తపన.... ఆరాటం.... ఆవేదన అనుక్షణం నన్ను అశాంతిలో ముంచెత్తుతూనే వున్నాయి. చాలా రోజులుగా ఒక నవల నా మస్తిష్కంలో ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకోటానికి మదన పడుతున్నది. దాన్ని కాగితంమీద



పెట్టాలంటే ఇంకా కొంత మదనం జరగాలి. ఎంతో ఆలోచిస్తేగాని, మనసులో ఎన్నోసార్లు నలిగితేగాని, పాత్రలకు, సన్నివేశాలకు, సంభాషణలకు ఒక స్పష్టమైన రూపం యేర్పడితే గాని నాలోంచి ఒక రచన వెలువడదు- అందుకే నేను చాలా స్లో రైటర్‌ని.

నా 'కరుణ' నవలను నువ్వింకా చదవలేదన్నావు కదా? ఆ నవలిప్పుడు మార్కెట్లో లేదు. త్వరలోనే నీకు నా పర్సనల్ కాపీని రిజిష్టర్డ్ పోస్ట్‌లో పంపిస్తాను.

మంచి ముత్యాల్లాంటి నీ అక్షరాలు.... మల్లెపూల సౌరభం లాంటి నీ ఎక్స్‌ప్రెషన్, రచయిత హృదయంలోని అట్టడుగు పొరల్లోకి చూడగల్గే అసితర సాధ్యమైన నీ అంతర్దృష్టి.... ఇవన్నీ నాకెంత ఇష్టమో?

ఇంత అందంగా వుత్తరాలు రాయటం నీకెవరు నేర్పారు సుధా?

ఈ భూమ్మీద బ్రతికున్నంత వరకు నీనుండి ఎప్పుడూ ఇలాగే వుత్తరాలు అందుకోవాలని ఆశించే....

...నీ

రవి

వుత్తరం రాయటం పూర్తిచేసి డ్రాయర్‌లో వున్న కవరు తీసి అడ్రస్‌రాసి, వుత్తరాన్ని మడిచి, కవర్లో పెట్టి, గమ్‌తో కవర్‌ను మూసేసి లేచాడు.

ఎట్‌లాస్ట్ రాసేశాడు! ఇప్పుడెంత హాయిగా వుందో! మరుక్షణంలో ఈ వుత్తరం సుధ చదవగల్గితే ఎంత బావుండునో! అలా పింపించే మార్గమేదన్నా వుంటే ఈ ఉత్తరాన్ని వెంటనే పోస్ట్‌బాక్స్‌లో పడెయ్యాలి..

టైమ్ చూశాడు. 9.40.

టైమ్ లేదు. వెంటనే బయటపడాలి.

రజని టిఫిన్ యేమన్నా చేసిందా? చేసి వుండదు. తను స్టౌబత్తీలు తేలేదు గదా? ముసుగుతన్ని పడుకొని వుంటుంది. ఆమెను ఓదార్చే ఓపిక లేదు. 'రజనీ! తలుపులేసుకో. నేను కాలేజీకెళ్ళిపోతున్నాను' అన్నాడు బైటకొచ్చి సైకిల్ తీస్తూ

'ఒకసారి లోపలకు రండి' ముందు రూంలోకొచ్చింది రజని.

'ఎందుకు?' అతడు లోపలకొచ్చాడు.

'యేమిటి మీ ఉద్దేశ్యం?'

'దీంట్లో వుద్దేశ్యమేముంది?'

'తినకుండా వెళ్ళిపోవటంలో మీ వుద్దేశ్యం ఏమిటి అని అడుగుతున్నాను....'

'తినటానికి నువ్వేమీ చెయ్యలేదుగా?'

'చేశానో లేదో తెలుసుకున్నారా?'

"నేను స్టౌ బత్తీలు తేలేదుగా?"

"తేకపోతే యేం? ఎన్ని కష్టాలు పడైనా వంట చేసి పెట్టే బాధ్యత నాదేగా?"

"నీదేనని యెవరన్నారు?"

"నా చావు నన్ను చావమని మీరు హాయిగా ఉత్తరాలు రాసుకున్నారుగా.. ఇప్పుడేమో టైమయిపోయిందని వెళ్ళిపోతున్నారు. టిఫిన్ చేసి పెట్టకుండా కాలేజికి పంపించిందని నన్నాడిపోసుకోవాలనేగా మీ వుద్దేశం...."

"నిన్నెవ్వరూ ఆడిపోసుకోరు.... వీలుకానప్పుడు ఓ పూట తినకపోవటం వల్ల జరిగే ప్రమాదమేమీ లేదు. టైమైపోయింది. నాకు పీరియడుంది. దయచేసి నన్ను వెళ్ళనీయ్.

"దయచేసి టిఫిన్ చేసివెళ్ళండి టేబుల్ మీద వుప్మా పెట్టి చాలా సేపయింది.

"నువ్వు వుప్మా చేశావా?"

"చేశాను సరిగ్గా తొమ్మిది నలభై కే.... మీరన్న టైమ్ కే చేశాను"

"ఎలా చేశావు? స్టౌ పని చెయ్యటం లేదన్నావు?"

"ఎలాగో చేశాను.... కాలిపోయిన బత్తులనే పైకెక్కించి చేశాను. దయచేసి టిఫిన్ చేసి వెళ్ళండి ఆకలితో కాలేజికి పంపించానన్న బాధనుండి నన్ను రక్షించండి...." వుబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకోవటానికి ప్రయత్నించిందామె—



అతడు నిశ్శబ్దంగా లోపలకొచ్చి టేబుల్ ముందు కూర్చొని చెంచాతో వుప్మా నోట్లో వేసుకోవడం మొదలెట్టాడు.

"సారీ రజనీ! కాలేజీ నుండి వచ్చేటప్పుడు స్టౌ బత్తులు తెస్తాను."

"అక్కర్లేదు .... నేనే బజారు కెళ్ళి తెచ్చుకుంటాను....ప్రతి దానికీ మీమీద ఆధారపడడం....మిమ్మల్ని తెమ్మనడం....మీరు విసుక్కోవటం...."

"ప్లీజ్ రజనీ, ట్రైటు అండర్ స్టాండ్ మీ....బజారు నుంచి రాగానే మళ్ళీ వెళ్ళమంటే...."

ఒక్కనిముషం ఇద్దరి మధ్య నిశ్శబ్దం....

"అప్పట్లో మా అక్కయ్య మన కోసం గ్యాస్ స్టవ్ తీసుకుంటానంది. ఒక్క అయిదు వందలివ్వండి. మిగతా డబ్బు ఎలాగో తను అడ్జస్ట్ చేస్తానంది. ఐదు వందలు పంపించండని అడిగితే మీకప్పుడెంత కోపమొచ్చిందో! నెలనెలా నాన్నగారికి పంపించటానికి డబ్బు వుంటుంది. అడిగిన వాళ్ళందరికీ చందాలివ్వడానికి డబ్బుంటుంది. అడ్డమైన పుస్తకాలన్నీ కొనిపడెయ్యడానికి డబ్బు వుంటుంది కాని ఎంత బతిమాలినా మీకు గ్యాస్ స్టవ్ తీసుకోవడానికి మాత్రం మనస్కరించ లేదు. ఈ కిరోసిన్ స్టవ్ తో చావమన్నారు"

అన్నీ తెలిసి కూడా ఎందుకలా మాట్లాడుతున్నావో నాకర్థం కాదు. మన దగ్గర యెప్పుడయినా అంత డబ్బు ఒకేసారి వుందా? వుంటే తీసుకోవటానికేం? సాధ్యమయినంత వరకు నిన్ను సుఖపెట్టాలనే కోరుకుంటాను తప్ప...."

"మీరు నిజంగా అలా కోరుకుంటే ఎలాగైనా మీరా డబ్బు ఇచ్చేవారే మీ నాన్నగారికి ఎంతమంది దగ్గరో అప్పుచేసి ఎన్నిసార్లు వందలు వందలు పంపించలేదు?"

"అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు....ఎన్నో కష్టాలు పడి చదివించిన వాడికి అంతో యింతో పంపించలేకపోతే నేనెంత గిల్టీగా ఫీలౌతానో తెలుసా?"

"కట్టుకున్నది ఎన్ని కష్టాలు పడ్డా ఫరవాలేదు....గిల్టీగా ఫీల్ కారు...."

"రజనీ! ప్లీజ్ స్టాపిట్" అరవినట్టుగా అన్నాడతను.

క్షణం సేపు నిశ్శబ్దం.

"ఇంత ఆవేశంగా మాట్లాడతావను కోలేదు" మళ్ళీ అన్నాడు.

"ఇప్పుడు నేనేమన్నాను?"

"నువ్వెంత కష్టపడ్డా నేను గిల్టీగా ఫీల్ కానా? మనం ఒకర్నొకరం అర్థం చేసుకుంటాం కాబట్టి యేమున్నా ఇబ్బందులుంటే ఎదుర్కొందామని, వాళ్ళవల్ల మాటరావద్దని వాళ్ళకు డబ్బు పంపిస్తున్నాను. ఈ మాత్రం అర్థం చేసుకోలేవా? పరిస్థితి కొంచెం చక్కబడగానే గ్యాస్‌స్టౌ తీసుకుందామని చెప్పానా?"

"పరిస్థితి ఈ జన్మలో చక్కబడుతుందా? నా గతి ఎప్పుడూ ఇంతే."

"డోన్ట్ టాక్ లైక్ దట్. ఎన్ని కష్టాలు పడైనా సరే నీకు నెల రోజుల్లోగా గ్యాస్ స్టౌ కొనిస్తాను సరేనా."

"ఏం అక్కర్లేదు. మీరంత కష్టపడాల్సిన అవసరమేమీ లేదు. పిచ్చి దాన్ని ఏదో వాగాను"

"ఇప్పుడు నిన్ను పిచ్చిదానివని ఎవరూ అనలేదు. కిరాణా కొట్లో, బట్టల కొట్లో అప్పు తీరగానే గ్యాస్ స్టౌ తీసుకుంటాను....మా కొలీగ్ ఒకాయన బుక్ చేశాడు....ఆయన కక్కర్లేదట....మనకిస్తానన్నాడు."

"అప్పులెలా తీరుతాయి? ఏదన్నా చేస్తే గదా?"

"ఏం చెయ్యమంటావు?"

"ఆ పత్రికలు రాసే బదులు కథలు రాయగూడదూ? నవలలు రాయగూడదూ? అది మీకు చేతనైన పనేగా? ఎన్నో పోటీలు పెడ్తున్నారు. రాసి ఏ పోటీకయినా పంపించొచ్చుగా?"

"ఆ విషయం నీకర్థం కాదు. ఎప్పుడంటే అప్పుడు నేను రాయలేనని నీ కెన్నోసార్లు చెప్పాను"

"పోనీయ్ ట్యూషన్లు చెప్పొచ్చుగా...."

"నేను ట్యూషన్లు చెప్పలేనని చెప్పాను"



"ఎందుకు చెప్పలేరు. మీతోటి వాళ్ళందరూ చెబుతున్నప్పుడు మీరెందుకు చెప్పలేరూ?"

"నాతోటి వాళ్ళందరూ చేసే పనులు నేను చెయ్యలేను. ఈ విషయం నీకెన్నోసార్లు చెప్పాను. అయినా నీ కర్థం కాదు. నువ్వు నన్ను జన్మలో అర్థంచేసుకోలేవు. అర్థం చేసుకునేటంత సంస్కారంగానీ, విశాల హృదయంగానీ నీలో లేవు."

"దయచేసి మెల్లగా మాట్లాడండి. నిజమే. నేను మిమ్మల్ని అర్థం చేసుకోలేను. నాలో మీకున్నంత సంస్కారం లేదు. నేను మీ అంత చదువుకోనూలేదు. మీ అదృష్టం బాగాలేక ఎంతో చదువుకున్న మీకు, ఎంతో విశాల హృదయం వున్న మీకు నేను దొరికాను. మీకు నేను ఏ విధంగానూ తగినదాన్ని కానని నాకు తెలుసు. త్వరలోనే నాదారి నేను చూసుకుంటాను లెండి. నావల్ల మీకు ఎలాంటి ఇబ్బంది కల్గదు...."

కన్నీళ్ళు ధారాపాతంగా కారుతోంటే రుద్ధమైపోతున్న కంఠంతో అందామె.

"నాదారి నేను చూసుకుంటానంటే.... ఏమిటి? నీ ఉద్దేశ్యమేమిటి?"

"ఏమీలేదు" ఆమె ఇంకా అలా ఏడుస్తూనే అక్కడ్నించి వెళ్ళిపోయింది.

"ఏమీ లేదని తప్పించుకోకు.... నాదారి నేను చూసుకుంటాను అనటంలోని నీ వుద్దేశ్యమేమిటో చెప్పాలి. చెప్పకపోతే ఊరుకోను" అరచినట్టుగా అన్నాడతను.

"వుద్దేశ్యం ఏమిటో మీకర్థంకాలేదా?"

"కాలేదు"

"త్వరలోనే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను—ఆ తర్వాత మీరు హాయిగా వుండొచ్చు...."

"ఛీ! నీకు నిజంగా పిచ్చెక్కిందీ. ఇలా మాట్లాడొద్దని నీకెన్నోసార్లు చెప్పాను. నువ్వు పెద్దగా చదువుకోలేదని నేనెప్పుడూ అన్లేదు. కొన్ని విషయాల్ని ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు అర్థం చేసుకోలేవనే నా బాధ. ఇంత మాత్రానికే నిన్ను నేను ఎంతో వేదిస్తున్నట్టుగా నాదారి నేను చూసుకుంటా

నంటావా? నీకంత బాధ కలిగిస్తున్నానంటే నాకూడా నా జీవితం మీద విరక్తి పుడుతోంది. నా జీవితమొక పెద్ద ఫెయిల్యూర్! ఎవర్ని సంతోష పెట్టాలని నాశాయశక్తులా ప్రయత్నిస్తున్నానో వాళ్ళనే ఏడిపిస్తున్నానంటే నేను మాత్రం ఎందుకు బ్రతకటం? నీ అదృష్టం బాగాలేకనే నాలాంటి షార్ట్ టెంపర్డ్ ఫెల్లో నీకు దొరికాడేమో! నిన్నెప్పుడూ ఏడిపించేవాడు, నీ ఏకోరికల్ని తీర్చలేనివాడు, నువ్వంటే ఏ మాత్రం కూడా ప్రేమాభిమానాలు లేనివాడు, ఎక్కువ డబ్బులు సంపాదించలేనివాడు— ఇలాంటి వాడిని నేను కాని నువ్వుమాత్రం ఏం సుఖపడ్తున్నావని? నీలాగే నేనుకూడా నా దారి నేను చూసుకుంటాను ... లేకపోతే ఓ ఫైన్ మార్నింగ్ ఇద్దరమూ కట్టకట్టుకొని చద్దాం-సరేనా"

అతడు వెంటనే దిగ్గున లేచి చేతులు కడుక్కున్నాడు ప్లేట్లో వున్న వుప్మా అంతా అలాగే వుంది

ఆమె కన్నులు కన్నీటికాలువలైపోయాయి.

అతడు త్వరత్వరగా సైకిల్ను బయటికు తీసి సాధ్యమైనంత త్వరగా వెళ్ళటానికి ప్రయత్నించాడు.

## 2

ఆడవాళ్ళలా ఎందుకు ప్రవర్తిస్తారు? ఇంత కర్కశంగా యెందుకు మాట్లాడతారు? మొగవాడి ఆయువుపట్టుమీద దెబ్బకొట్టి వాడు బాధతో విల విల్లాడిపోతోంటే చూసి ఎంజాయ్ చేస్తారు.... ఈజిట్ నాట్ సాడిజం? మైడియర్ రైటర్! హౌడుయూ ఎక్స్ప్లెయిన్ దిస్? హౌడుయూ ఎనలైజ్ దిస్? ఐడోన్ట్నో....ఐడోన్ట్నో....

ఫ్రెయిలిటీ.... దై నేమ్ ఈజ్ వుమన్!

క్రుయాలిటీ.... దై నేమ్ ఈజ్ వుమన్!



భూమధ్యరేఖ దగ్గరకన్నా ఆడదాని భూమధ్యరేఖ దగ్గర వేడి ఎక్కువ.

స్త్రీ బుద్ధిః ప్రళయాంతకం

స్త్రీకి కూడా శరీరం వుంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు వుంది. దానికి జ్ఞానం ఇవ్వాలి ఆమెకు హృదయం వుంది దానికి అనుభవం ఇవ్వాలి—అనే సంగతి గుర్తించని ఈ దేశానికి, నేను రాసే ఈ సంగతులు అర్థమవుతాయా?

ప్రతి సక్సెస్ ఫుల్ పురుషుడి వెనక ఓ స్త్రీ వుండితీరుతుంది

స్త్రీ మంత్రిలా సలహాలిచ్చి, దాసిలా సేవలుచేసి, తల్లిలా భోజనం పెట్టి, రంభలా పడకగదిలో సుఖాన్నిచ్చి ..

స్త్రీని గురించి మొగవాడు ఎన్ని సిద్ధాంతాలు చేశాడో.... ఎన్ని సామెతల్ని సృష్టించాడో.... ఎంత కవిత్వాన్ని రాసుకున్నాడో ఆమె హృదయంలో యేముందో తెల్సుకోవాలని ఎంత శోధించాడో.... అయినా స్త్రీ మగ బుద్ధికి అందదు.... స్త్రీని స్త్రీలా తప్ప ఒక 'హ్యూమన్ బీయింగ్'గా తనతోటి మనిషిగా చూడటం నేర్చుకోలేదు. తనూ అంతేనా? వాట్ ఈజ్ రాంగ్? ఎక్కడో పొరపాటు జరిగింది.

ఆమెను ప్రేమించాడు. బుద్ధి తెలిసినప్పట్నుంచి స్త్రీని గూర్చి తను కన్న కలలన్నింటినీ ఆమెలో చూసుకున్నాడు.... ఆమెను అనుక్షణం ఆనంద డోలికల్లో విహరింప జేయాలని ఆరాట పడ్డాడు ఆమెకు ఎన్నో విషయాలు చెప్పాలని, ఆమెను విజ్ఞాన వంతురాల్ని చెయ్యాలని.... రొటీన్ లౌకిక విలువలకు అతీతంగా ఆలోచించేట్టు చెయ్యాలని.... ఆమె హృదయాన్ని కళాత్మక హృదయంగా మార్చాలని ఆరాట పడ్డాడు. కాని ఫలితం శూన్యం బిగ్ ఫెయిల్యూర్! ఆమెను ఆమెలోకంలోంచి బయట పడెయ్యలేక పోయాడు.

తన కలలు, తన కళాత్మక విలువలు, తన కళాత్మక హృదయం, తన తపన, తన ఆరాటం, తన అన్వేషణ, తన అశాంతి, తన ఆదర్శాలు, ఇవేవీ ఆమెకక్కర్లేదు. ఆమెకు తను సంపాదించాలి. చేతి నిండా డబ్బుం

డాలి....ఇంటినిండా కమ్‌ఫర్ట్స్ వుండాలి....ఎవడి దగ్గరా అప్పు చెయ్యకూడదు. యెక్కడికీ వెళ్ళకూడదు....యే ఉద్యోగాల్లోనూ తలదూర్చగూడదు- ఇల్లు....కాలేజీ....ఇవి రెండే రెండు... ఇంతకంటే వున్నత సంస్కారాన్ని ఆమెలో ప్రవేశపెట్టలేక పోయాడు. తను చదువుకోలేదు. పెద్ద అందగత్తె కాదు. అందుకే ఆయన తన మీద విసుక్కుంటున్నాడు. నేనాయకు తగిన దాన్ని కాను....నేనే గనుక ఆయన జీవితంలో ప్రవేశించి వుండకపోతే ఆయనకెంతో డబ్బున్న వాళ్ళు పిల్లనిచ్చేవాళ్ళు....ఎంతో చదువుకున్నది.... యెంతో అందమైనది ఆయనకు దొరికేది....ఇదొక కాంప్లెక్స్!

రోజు రోజుకు ఆమెలో ఈ కాంప్లెక్స్ పెరిగిపోతున్నదే గాని తరిగిపోవడం లేదు. తన దారి తను చూసుకుంటుందట! అంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పటమా? ఆమెకు ఆత్మహత్య చేసుకోవాలనిపించేంతగా ఆమెను తను పీడిస్తున్నాడా? ఆమె అలా ఆత్మహత్య చేసుకున్న మరునాడు దేశంలోని పత్రికల్లో ఈ వార్త యెంత ప్రముఖంగా ప్రచురింపబడుతుందో?

'కట్న పిశాచి కోరల్లో చిక్కి తన ప్రాణాలని బలి చేసుకున్న మరో యిల్లాలి విషాద గాథ' అంటూ పత్రికలన్నీ ఫస్ట్ పేజీలో బాక్సులు కట్టి ప్రచురిస్తాయి.

'వాడో లెక్చరరట! పదిమందికి పాఠాలు చెప్పాల్సిన వాడు....సమాజాన్ని సరియైన మార్గంలో పెట్టాల్సిన వాడు....వాడే ఇంత దారుణానికి ఒడిగడితే....కంచే చేను మేస్తే యిక యీ సమాజం గతి యేం కాను?' అంటూ సంపాదకులందరూ సంపాదకీయాలు రాస్తారు. తనో హంతకుడు. తనో దేశద్రోహి, తనో రాక్షసుడు—తనో శాడిస్ట్....తనో దుష్టుడు. తనో దుర్మార్గుడు, హృదయం లేని పశువు! ఇలా ప్రపంచమంతా తనను నడిబజార్లో నిలబెట్టి కంకర రాళ్ళతో కొడుతోంటే, రక్తసిక్తమైన శరీరంతో రోడ్డు మీద దొర్లుతుంటే—అప్పుడు గాని రజని ఆత్మ శాంతిస్తుంది... అప్పుడు గాని ఆమె కసి చల్లారుతుంది.



NAND

ఇప్పుడేం చేస్తూ ఉంటుంది? యేడుస్తూ పడుకొని ఉంటుందేమో? తిండి తినదు—నిద్రపోదు, తను వెళ్ళి ఓదార్చే వరకు అలాగే వుంటుంది. ఎన్నిరోజులయినా కృంగి, కృశించి, నశించిపోతుందే తప్ప తిండి తినదు. రోషం ఆమెలోని నిద్రాహారాల్ని జయించింది. పస్తులుండటం యీ ఆడవాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య..ఉపవాసాలుండి కావాలనుకున్నది సాధించటం మహాత్మాగాంధీగారు ఆడవాళ్ళనుండే నేర్చుకున్నాడేమో! గాంధీగారి పద్ధతులన్నీ అహింసాత్మకం.. సందేహం లేదు.

బట్ ఇట్స్ మోరల్ వయలెన్స్ అన్నారెవరో! నైతిక హింస. ఎవరన్నారు? సరోజినీ నాయుడు? వేద్ మెహతా? చర్చిల్? ఎవడో లే- కానీ బాగా అన్నాడు. హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్! ఫిజికల్ వయలెన్స్‌కంటే
మోరల్ వయలెన్స్ యెంత శక్తివంతమైనదో శ్వరరావు. మందికి తెలీదు. కానీ
ఆడవాళ్ళకు తెలుసు. రజనికి బాగా తెలుస

"నమస్కారం సార్" మీరు రైటర్ గదా! మీకు మంచి రీడ
సస్ కోసం ఎట్లాగూ నోట్స్ రాను
"నమస్కారం" ర్చి క్వశ్చన్....ఆన్సర్ రూపంలో....
కాలేజీకి వెళుతున్న స్టూడెంట్ ాయిటాఫ్ ్యా రాస్తే
సైకిల్ మీద—బడుగో సుధాకర్! స్కూట అందే వ—తి సైకిల్ కద
లదు. ఎదురు గాలి- ఇంకా కాలేజ్ కిలోమీటం దూరం వుంది పదయిపోయింది. పదింటికి క్లాసుంది. తను యీ రోజు కూడా లేటే! క్లాస్ కెళ్ళగానే సారీ! కొంచెం లేటయ్యింది

'ఈ సార్‌కు 'సారీ' ఊతపదంలా వుంది' అన్నాడో స్టూడెంట్ తనకు వినిపించేలా. ఈ పరిస్థితి రాకూడదని యెన్నిసార్లు అనుకున్నాడో- కానీ వస్తూనే వుంటుంది.

"హల్లో సర్" వెనుక నుండి చాలా పరిచితమైన కంఠం-పక్కనే సైకిల్ మీద వస్తున్న నాగేశ్వరరావు.

"హల్లో" అన్నాడు రవి.

"ఫస్ట్ పీరియడుందా?" అన్నాడు నాగేశ్వరరావు.

"ఉంది. ఎదురు గాలికి సైకిల్ కదలట్లేదు" —రవి.

"ఓ స్కూటర్ కొనెయ్యకూడదూ?"- నాగేశ్వరరావు.

"స్కూటరా? నేనా?" రవి నవ్వాడు.

"ఎందుకంత విషాదంగా నవ్వుతారు? మీరు స్కూటర్ కొనలేరా?" నాగేశ్వరరావు.

"స్కూటర్ మాట దేవుడెరుగు కనీసం ఈ సైకిల్‌కు కొత్త టైర్ వేయించుకోలేక పోతున్నాను"—రవి.

"అదేమిటీ! మీరు రైటర్ గదా! మీ రైటింగ్ మీద డబ్బేమీ రాదా? యీ రోజుల్లో నవలలు రాసే వాళ్ళు బాగా సంపాదిస్తున్నారని విన్నానే—" నాగేశ్వరరావు.

చెప్పి "సంపాదించే... సంపాదిస్తున్నారెండి! కానీ నాలాంటి వాడేమీ అమెను తను ఏంచేస్తున్నాడా? ఆమె దేశంలోని పత్రికల్లో ఈ వార్త ...క్సెసయిందట కదా! నేను చదవలేదను తుందో?

...ను వెస్టరన్ కంట్రీస్‌లో ఒక్క... 'కట్న పిశాచి కోరల్లో చిక్కి ...యనీర్ అయిపోతాడు"—నాగేశ్వరరావు. ...ద గాథ' ...టూ న...

"నిజమే ననుకోండి... ...ఎ మనది వెస్టరన్ కంట్రీ కాదుకదా" రవి నవ్వటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"మీరొప్పుకుంటానంటే మీరు బాగా డబ్బు సంపాదించటానికి ఓ మార్గం చూపిస్తాను"—నాగేశ్వరరావు.

"ట్యూషన్‌లు చెప్పమంటారా?"—రవి.

"కాదు....అయినా మన ఆర్ట్స్ సబ్జెక్ట్స్‌కు ట్యూషన్స్‌కు పెద్దగా రావ్లెండి"—నాగేశ్వరరావు.

"చిట్ ఫండ్ లాంటి దేమయినా స్టార్ట్ చెయ్యమంటారా?"—రవి.

"కాదండీ బాబూ! మీరు చిట్‌ఫండ్ లాంటిదేం నడుపుకార్లెండి.... అలాంటివి నడపాలంటే సిగ్గు, శరమూ వదిలెయ్యాల్సి వుంటుంది. మీరాపని చెయ్యలేరని నాకు తెలుసు"—నాగేశ్వరరావు.



"మరింకేం చెయ్యమంటారు?"—రవి.

"మీకు బాగా చేతనయ్యే పనే...."

"ఏమిటో చెప్పండి?"

"నా మాట విన్నారంటే మీరు బోల్డు డబ్బు సంపాదించవచ్చు మీ సమస్యలు చాలా తీరిపోతాయి. కాలం కలిసొస్తే మీరో స్కూటర్ కూడా కొనుక్కోవచ్చు"—నాగేశ్వరరావు.

"సస్పెన్స్‌తో చంపక యేమిటో చెప్పెయ్యండి"

"చెప్పమంటారా? మీ శ్రేయోభిలాషిగా చెపుతున్నాను. అపార్థ చేసుకోకండి"—నాగేశ్వరరావు.

"ప్లీజ్! యేమిటో త్వరగా చెప్పెయ్యండి"—రవి

"మీరు గైడ్స్ రాయండి"—నాగేశ్వరరావు.

"ఏమిటి రాయమంటారూ?"

"గైడ్సండీ బాబూ గైడ్స్....మీరు రైటర్ గదా! మీకు మంచి లిటరబుల్ స్టయిల్ వుంటుంది. మీరు క్లాసెస్ కోసం ఎట్లాగూ నోట్స్ రాసుకుంటారు. దాన్నే కొంచెం మార్చి క్వశ్చన్....ఆన్సర్ రూపంలో.... ప్యూర్‌లీ ఫ్రమ్ ఎగ్జామినేషన్ పాయింటాఫ్ వ్యూ రాస్తే నేను పబ్లిష్ చేయించి మీకు మంచి రెమ్యూనరేషన్ అందేలా చూస్తాను."

రవి ఆలోచిస్తూ సైకిల్ తొక్కసాగాడు.

"మీకీ రంగంలో చాలా ఎక్స్‌పీరియన్స్ వున్నట్టుందే" రవి.

"మీరెవ్వరికీ చెప్పనంటే మీకో రహస్యం చెప్తాను."

"చెప్పండి" రవి.

"ఆల్ రెడీ నేను రాసిన చాలా గైడ్‌లు ఇప్పుడు మార్కెట్‌లో వున్నాయి" నాగేశ్వరరావు.

"రియల్లీ....మాకెవరికీ ఈ విషయం తెలియదే" రవి.

"ఎలా తెలుస్తుందీ....నేను 'కిరణ్ కుమార్' అనే పెన్ నేమ్‌తో రాస్తాను. నా గైడ్స్‌కు పబ్లిషర్‌ని కూడా నేనే. కిరణ్ సిరీస్ అని వస్తాయి చూడండి.... అవన్నీ మేం పబ్లిష్ చేసినవే....మీరు మంచి రైటర్....బాగా

రాయగలరు. మీ చేత ఒక గైడ్ రాయించాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. ఓ పదిహేను రోజులు కష్టపడ్డారంటే ఓ గైడై పోతుంది.... మీ ఫస్ట్ గైడ్ సక్సెసయి, సేల్స్ బాగా వుంటే మీచేత ఇంకెన్నో రాయించుకొంటాం. మీకూ కొంత అడిషనల్ ఇన్‌కమ్ వుంటుంది" నాగేశ్వరరావు.

ఐడియా బాగానే వుంది గైడ్ రాస్తే ఎంతిస్తాడో....? వర్త్ కన్సిడరింగ్....వ్వాట్ ఎ ఫాల్ మై కంట్రీ మెన్...? నువ్వు గైడ్ రాస్తావా....? రవీందర్ దిగ్రేట్....తన నవలల్లో ఎన్నో ఆదర్శాలు పల్లించే రవీందర్ ది గ్రేట్ గైడ్ రాయటమా? నాగేశ్వరరావు లాగే తనూ వేరే పేరు పెట్టుకొని రాయొచ్చా? అలా అయితే ఎవరికి తెలీదు. ఎవరికీ తెలియకుండా చేస్తే తప్పు కాదన్న మాట. అడిషనల్ ఇన్‌కమ్! రజని చాలా సంతోషిస్తుంది. వెంటనే ఓ గ్యాస్ స్టౌ కొనిపారెయొచ్చు.

"ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నారు."

"ఫస్ట్ పీరియడ్ వుంది. మనం ఆల్ రెడీ లేట్—కాలేజీ చేరటానికి ఇంకెంతసేపు పడుతుందా అని" రవి.

"స్టూడెంట్సంతా ఎలక్షన్ల హడావుడిలో వున్నారు. మీరు ఎంత పరుగెత్తుకొని వెళ్ళినా క్లాసులో ఎవరూ ఉండరు."

"ఎవరూ ఉండరనుకొని మనం వెళ్ళక పోవటం బావుంటుందంటారా?"

"వెళ్ళాలి....కానీ పరుగెత్తుకొని వెళ్ళాల్సినంత అవసరం లేదు. ఈ స్టూడెంట్స్‌కు చదువులెందుకండి? ఎలక్షన్స్ కావాలి....? రాజకీయాలు కావాలి....రేపు ఎగ్జామ్స్‌లో యేదో గైడ్ చదివి ప్యాసయిపోతాడు....మీరు సీరియస్‌గా ప్రిపేరయి చెప్పబోతే ఎవడూ వినడు. పైగా మీకసలు చెప్ప రాదంటారు."

"అలా అని నేననుకోను....కష్టపడి ప్రిపేరయి బాగా చెప్పే లెక్చరర్స్‌ని స్టూడెంట్స్ చాలా గౌరవిస్తారు."

"యూ ఆర్ టూ యంగ్ మిస్టర్ రవి! కొన్ని రోజులు పోతేగాని మీరీ భ్రమల్లోంచి బయటపడరు. ఇంతకూ నేను చెప్పిన విషయాన్ని గూర్చి మీరేమీ చెప్పలేదు."



"చెప్పటానికేమీ లేదు."

"అంతే!"

ఇద్దరూ సైకిల్స్ తొక్కుతూ కాలేజీని సమీపించారు. స్టూడెంట్స్ చాలామంది సైకిళ్ళమీద కొందరూ, నడిచి కొందరు కాలేజీ చేరుకుంటున్నారు. లెక్చరర్లు కొందరు స్కూటర్ల మీద, కొందరు సైకిళ్ళమీద కొందరు రిక్షాల మీద కాలేజీకి వెళుతున్నారు.

"యేదో ఒకటి చెప్పండి....బలవంతమేమీ లేదనుకోండి. మీకిష్టమైతే రాయండి. మీరు స్క్రిప్టు మా చేతికివ్వగానే అయిదు వందలిస్తాం— పుస్తకం మార్కెట్‌లో కొచ్చాక మరో అయిదు వందలిస్తాం....ఫర్ ఎవ్రీ రీప్రింట్ మరో అయిదువందలు ...బోనస్ ఆలోచించి చెప్పండి."

ఈయన తనను ఇంతగా టెంప్ట్ చేస్తున్నాడెందుకు? కొంచెం పైన వున్న పున్నతంగా ఆలోచించే వాడ్ని ఈ లోకం సహించదు. వాడ్ని గట్టిగా పట్టి కిందకు లాగేసి తమ స్థాయికి దిగజార్చి తమలో కలుపుకోవాలి. అప్పుడు వీళ్ళంతా విజయగర్వంతో ఊగిపోతూ పండగ చేసుకుంటారు. తను వీళ్ళకు లొంగిపోకూడదు. తను పతనం కాకూడదు.

కాలేజీ గేటులో ప్రవేశించారు.

"అయామ్ సారీ నాగేశ్వరరావుగారూ....నేను గైడ్స్ రాయలేను. ఇట్స్ ఎగెనెస్ట్ మై ప్రిన్సిపుల్" అన్నాడు రవి.

"ఇట్స్ ఆల్ రైట్....మీకు కొంచెం సహాయం చేసినట్టుంటుందని చెప్పాను....కిరణ్ గైడ్స్ నేను రాసేవేనని దయచేసి ఎవరికీ చెప్పకండి" నాగేశ్వరరావు.

"అలాగే."

ఇద్దరూ సైకిల్ షెడ్ వైపుగా వెళ్ళి, సైకిళ్ళను షెడ్‌లో పార్క్ చేసి కాలేజీవేపు నడిచారు.

సైకిల్ షెడ్ దగ్గరే వాళ్ళకు మరో అయిదారుగురు వాళ్ళ కొలీగ్స్ కలిశారు.

అందరూ 'హల్లో' అంటే 'హల్లో' అని పలకరించుకున్నారు.

కాలేజీ బయట గుంపులు గుంపులుగా విద్యార్థులు నిల్చొని ఒకరి కొకరు కరపత్రాల్ని ఇచ్చుకుంటున్నారు. ఎవరిచేతిలో చూసినా కరపత్రాలే. 'హలో' అంటే 'హలో' షేక్‌హాండ్....ఓ పక్కకు తీసికెళ్ళి మాట్లాడటం లెక్చరర్లకూ కూడా కరపత్రాలందించారు. కాలేజీ ముందు పెద్ద బ్యానర్లు కట్టారు. గోడలకు పెద్ద పోస్టర్లు అంటించారు.

"ప్లీజ్ ఎలెక్ట్ విజయకుమార్, బికాం ఫైనల్, యాజ్ యువర్ ప్రెసిడెంట్" అని అన్నింటికంటే పైన కొట్టవస్తున్నట్టు కనిపిస్తున్న బ్యానర్ అందరి దృష్టిని ఆకర్షించింది.

"ప్లీజ్ ఎలెక్ట్ ప్రభాకర్ బి.ఎ. ఫైనల్ యాజ్ యువర్ ప్రెసిడెంట్ అని తాటికాయంత అక్షరాలతో మెరిసిపోతూ కనిపిస్తున్నది మరో బ్యానర్.

"ప్లీజ్ ఎలెక్ట్ నరేందర్ రెడ్డి బి.ఎస్ సి. ఫైనల్ యాజ్ యువర్ ప్రెసిడెంట్" అని దాని పక్కనే తాటికాయలకంటే పెద్ద అక్షరాలతో మెరిసిపోతున్న మరో బ్యానర్.

"ప్లీజ్ ఎలెక్ట్ మోహనరావు బి.ఎ. (సెకండ్ ఇయర్) యాజ్ యువర్ జనరల్ సెక్రటరీ" అని మరో బ్యానర్.

ఇలా ఓ ఇరవై దాకా బ్యానర్లు.

లెక్కలేనన్ని కరపత్రాలు....చాలా మంది విద్యార్థులు కరపత్రాలను చిన్న చిన్న బాణాలుగా మార్చి ఒకరిపైకి ఒకరు విసురుకుంటున్నారు.

"స్టూడెంట్స్ అంతా బయటే చాలా తీవ్రంగా కాన్వాసింగ్ చేసుకుంటున్నారు. ఇక లోపల క్లాసుల్లో ఎవరు వున్నారని మనం వెళ్ళటం.... సైన్ చేసి ఇంటికెళ్ళిపోవటం బెటర్" అన్నాడు సూర్యనారాయణ కామర్స్ లెక్చరర్.

"ఇంటికెళ్ళి మాత్రం చేసేదేముంది....గేమ్స్ రూమ్‌లో కెళ్ళి హాయిగా కారమ్స్ ఆడుకుందాం—" అన్నాడు రమేష్ కుమార్—ఫిజిక్స్ లెక్చరర్.

"అసలీ ఎలక్షన్స్ బాన్‌చేస్తే యేమౌతుంది?" అన్నాడు వెంకటేశ్వర రావు తెలుగు లెక్చరర్.



"ఆ మాట మరీ గట్టిగా అనకండి....స్టూడెంట్స్ విన్నారంటే పెద్ద గొడవై పోతుంది" అన్నాడు నాగేశ్వరరావు ఇంగ్లీష్ లెక్చరర్.

కాలేజీ గేటుకిరుప్రక్కలో స్టూడెంట్స్ కరపత్రాల కట్టలతో నిల్చొని లోపల కెళుతున్న వాళ్ళందరికీ అందిస్తున్నారు.

తాజ్ స్టాండ్స్ ఫర్ బ్యూటీ.

ఐ స్టాండ్ ఫర్ డ్యూటీ.

"ప్లీజ్ ఎలెక్ట్ రవీందర్ రెడ్డి యాజ్ యువర్ జాయింట్ సెక్రటరీ.

ఎంట్రెన్స్ గేటు మీద వేలాడుతున్న పెద్ద బ్యానర్.

లెక్చరర్లందరూ వచ్చి గేటు దగ్గర నిల్చున్నారు. దాదాపు పది ఫీట్లు వెడల్పుగా వున్న ఆ గేటు లోంచి ఒక్కడు తప్ప ఎక్కువ మంది వెళ్ళటానికి చోటు లేకుండా ఇరుప్రక్కలా విద్యార్థులు నిల్చున్నారు.

"అడిగో....ఇక్బాల్ సాబ్ వస్తున్నాడు...." అన్నాడు నాగేశ్వర రావు.

అందరూ వెనక్కి తిరిగి చూశారు.

"కాలేజీ ముందు ఆగిన రిక్షాలో ఇక్బాల్ అలీ జరా ఇధర్ ఆవో భాయీ...." అని గేటు దగ్గర నిల్చున్న లెక్చరర్లను పిలుస్తున్నాడు.

"మిస్టర్ రవీ! మీ హెడ్డు మిమ్మల్నే పిలుస్తున్నట్టుంది-" అన్నాడు నాగేశ్వరరావు.

రవి రిక్షాలో వున్న ఇక్బాల్ అలీని చూశాడు. అతడో ప్రాణంతో ఉన్న మనిషిలా లేడు. శవంలా కనిపించాడు.

జుట్టంతా రేగి వుంది. ఎర్రగా జ్యోతుల్లా కళ్ళు అక్కడక్కడ చిరిగిపోయి నలిగిపోయిన బట్టలు....అతన్ని తీసుకొచ్చిన రిక్షా వాడు అతని కంటే శుభ్రమైన బట్టలేసుకున్నాడు.

"ఈ స్థితిలో ఇతడెందుకు కాలేజీ కొచ్చాడు?" అంటూ రవి అతడి దగ్గర కెళ్ళాడు.

కాళ్ళు చాపుకొని వెనక్కి ఒరిగి పడుకున్నాడు ఇక్బాల్ అలీ. రవిని చూడగానే లేవటానికి ప్రయత్నించాడు.

"యేం ఇక్బాల్ సాబ్? మీ హెల్తెలా వుంది?" అన్నాడు రవి అతడి దగ్గరగా వెళ్ళి.

గుప్పుమని వచ్చిన విస్కీవాసనతో రవి తల తిరిగిపోయింది.... మైగాడ్! ఇతడు మళ్ళీ తాగి కాలేజీకొచ్చాడా....?

"హెల్త్ కో గోలీమార్ దో—డోన్ట్ కేర్....దాన్ని పట్టించుకున్నంతకాలం అది మనల్ని పట్టించుకుంటుంది" అన్నాడు ఇక్బాల్.

అతడు రిక్షాలోంచి కిందకు దిగటానికి యెంత ప్రయత్నించినా దిగలేకపోయాడు.

రిక్షావాడు, రవి కలిసి అతన్ని అతి కష్టంగా రిక్షాలోంచి క్రిందకు దింపారు.

అక్కడ వున్న విద్యార్థులంతా రిక్షా చుట్టూ చేరి గొప్ప ఆసక్తితో అతన్ని చూశారు.

తన బరువునంతా రవి మీద పడేసి నెమ్మదిగా నడవసాగాడు ఇక్బాల్.

గేటు దగ్గరకు రాగానే నిల్చున్న లెక్చరర్లు అంతా "హలో ఇక్బాల్ సాబ్! హౌ ఆర్ యూ?" అన్నారు.

"ఐ యామ్ సేఫ్....ఐ హోప్ యూ ఆర్ అల్ సో ఇన్ ది సేమ్ సేఫ్" అన్నాడు ఇక్బాల్.

అందరూ గొల్లున నవ్వారు.

ఈ స్థితిలో కూడా ఇతడు జోక్స్ వేస్తూనే వున్నాడు-గ్రేట్ ఫెల్లో—

అందరూ కలిసి అతన్ని ఆ గేట్‌లోంచి లోపలకు తీసుకుని వెళ్ళారు.

వాళ్ళంతా లోపలికి వెళ్ళగానే స్టూడెంట్స్-"ఉమర్ ఖయ్యాంగాడు మళ్లొచ్చిండ్రో" అని కేకలేశారు.

కాలేజీ వరండాలోంచి లెక్చరర్లందరూ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వచ్చారు.



"ఏం ఇక్బాల్ సాబ్! డాక్టర్ మిమ్మల్ని తాగొద్దని చెప్పినా ఇంకా తాగుతూనే వున్నారా?" అన్నాడు నాగేశ్వరరావు.

"తాగితే చస్తానని వాళ్ళు చెప్పారు. తాగకపోతే చస్తానని నేను చెప్పాను....బీస్ సాల్ సే యే ఆల్కహాల్ మేరా దోస్త్‌హై....ఇస్కో అబ్ మై కైసే ఛోడా సక్తా హూ? ఐ విల్ బి ఎ ట్రెయిటర్ ఇఫ్ ఐ లీవ్ మై ఫ్రెండ్! గెడ్ అండ్ ఫిలాసఫర్ ఎట్ దిస్ జంక్చర్" అన్నాడు ఇక్బాల్.

మళ్ళీ అందరూ గొల్లున నవ్వారు.

ఒక్కొక్కరే అంటెండెన్స్ రిజిష్టర్లో సంతకం చేసి స్టాఫ్‌రూమ్ వేపు వెళ్ళటం మొదలెట్టారు.

ప్రిన్సిపాల్ యింకా రాలేదు.

"ఇక్బాల్ సాబ్! నాకు క్లాసుంది...క్లాసయిపోయాక కలుద్దాం—మీరిక్కడే కూర్చోండి" అన్నాడు రవి.

"స్టూడెంట్సంతా బయట్నే వున్నారు గదా! క్లాసెక్కడిదీ....ప్రిన్సిపాల్‌ని కలవాలి కూర్చోండి" అన్నాడు ఇక్బాల్ ప్రిన్సిపాల్ కూర్చునే సీటుకు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ,

"కొందరు క్లాసులో కూడా వుంటారు. వెళ్ళి చూసొస్తాను. స్టూడెంట్సెవరూ లేకపోతే మళ్ళీ వెంటనే యిక్కడికే వస్తాను"

"అచ్ఛా భాయి! జావో....యూ ఆర్ టూ యంగ్........అందుకే 'క్లాసు క్లాసు' అని ఇట్ల పరుగెత్తుతున్నావు...."

రవి నవ్వుతూ ఆ రూమ్‌లోంచి బయటకెళ్ళాడు. స్టాఫ్‌రూమ్‌లోకి వెళ్ళి, రిజిష్టర్, డస్టర్, చాక్‌పీసులు తీసుకుని క్లాసువేపు నడిచాడు.

వరండా నిండా స్టూడెంట్స్...వాళ్ళ మధ్యలోంచి దారి చేసుకుని వెళ్ళటం కష్టమే అవుతున్నది. ఎవరి చేతిలో చూసినా కరపత్రాల కట్ట....ఎదురయిన ప్రతివాడికీ కరపత్రాలు యివ్వడం....షేక్‌హాండ్ చెయ్యటం-నమస్కారం పెట్టటం....'మరచిపోవద్దు భాయ్' అనటం....క్లాసుల లోపల పిల్లలెవరూ లేరు....ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్ రవి చేతిక్కూడా కరపత్రాలివ్వబోయారు. రవి త్వరత్వరగా తన క్లాసుని వెతుక్కుంటూ వెళ్ళాడు

రూమ్ నెంబరు 15. బి.ఏ. ఫైనలియర్....టైము చూశాడు....పదింబావు. ఫరవాలేదు. 15నిముషాలు ఆలస్యంగానయినా క్లాసుకు వెళ్ళగల్గుతున్నాడు. మధ్యలో ఈ ఇక్బాల్ ఒకడు....అమ్మయ్య రూము వచ్చేసింది. ఏడుగురు ఎనమండుగుడు స్టూడెంట్స్ బయటే నిల్చొని వున్నారు. ఎవరి చేతిలో చూసినా పుస్తకాలు కనిపించటం లేదు. కరపత్రాల కట్టలే....

"కమాన్....గెటిన్...." అన్నాడు రవి రూమ్ లోపలకెడుతూ.

"సార్! అందరూ కాన్వాసింగ్‌కు పోయింద్రు...." అన్నాడు ఒక స్టూడెంట్.

"పోతే ఏం....మీరున్నారుగా?"

"మేం గూడా బోతం సార్" అన్నాడు మరో స్టూడెంట్.

"కనీసం ఒక్కరు వున్నా నేను క్లాసు తీసుకుంటాను" అన్నాడు రవి.

"మన క్లాసునుంచి నలుగురు కంటెస్ట్ చేస్తున్నారు సార్....ఈ రోజునుండి ఈ క్లాసు వాళ్ళందరూ క్లాసులకు వెళ్ళకుండా 'కాన్వాస్' చెయ్యాల్నని నిన్ననే నిర్ణయించుకున్నాం సార్...." అన్నాడు మొదట మాట్లాడిన స్టూడెంట్.

"అలాగా....ఆల్‌రైట్....వద్దు మొర్రో అంటుంటే బలవంతంగా క్లాసు తీసుకోవటం శుద్ధ దండగ....క్లాసు అటెండ్ చెయ్యదల్చుకోని స్టూడెంట్స్ యిక్కడెందుకు నిల్చున్నారు? వెళ్ళండి-వెళ్ళి కాన్వాస్ చేసుకోండి" అన్నాడు రవి క్లాసులోంచి బయటకి వస్తూ.

తనకు తెలియకుండానే తనకు కోపమొచ్చేస్తోందని గమనించాడు.

రవి వెళ్ళిపోతుంటే అతన్ని నలుగురు స్టూడెంట్స్ అనుసరించారు.

"సార్! మాకు క్లాసు అటెండ్ చెయ్యాల్నినే వుంది. కాని మేం అటెండ్ చేస్తే వాళ్ళూరుకోరు సార్! సగంమందికి పైగా క్లాసులకు రావాల్ననే వుంది. కాని వాళ్ళ భయానికి రాలేకపోతున్నం" అన్నాడు వాళ్ళలో ఎంతో బుద్ధిమంతుడిగా కనిపిస్తున్న ఓ స్టూడెంట్.



ఆ స్టూడెంట్ రవికి బాగా తెలుసు. ఈశ్వర్రావు....తెలివిగలవాడు. కష్టపడి చదివేవాడు కూడా. ఎన్నోసార్లు తన దగ్గరికి వచ్చి సందేహాలను తీర్చుకున్నాడు. సోకాల్డ్ సైలెంట్ మెజారిటీ.

"ఐ నో" అన్నాడు రవి.

"థ్యాంక్యూ సార్" అన్నాడు ఈశ్వరరావు.

"ఎలక్షన్స్ అయిపోయేదాకా ఇంతేనా?" అన్నాడు రవి.

"అసలు ఎలక్షన్స్ అయితయా అనేది పెద్ద డౌటు సార్" అని అన్నాడు ఈశ్వరరావుతో ఎప్పుడూ వుండే సత్యనారాయణ.

"ఎందుకు?" అన్నాడు రవి.

"చాలా గొడవలయ్యేటట్టున్నాయి సార్! రెండు గ్రూపులు....చాలా తీవ్రంగా పనిచేస్తున్నాయి. ఇయ్యాల్నో, రేపో కొట్లాటయితది తలలు పగులుతాయి" అన్నాడు.

"హల్లో మిష్టర్ రవీ! యేమిటి తిరిగొచ్చేస్తున్నారు? క్లాసులో పిల్లలు ఎవరూ లేరా?" అన్నాడు ఎకనమిక్స్ లెక్చరర్ మురళీమోహన్.

"ఔనండి! మీరూ క్లాసునుండే తిరిగొచ్చేస్తున్నట్టుందే...." అన్నాడు రవి.

"ఔను! క్లాసు తీసుకోవాలని హైదరాబాద్‌నుండి అర్ధరాత్రి లేచి హడావిడిగా వస్తే క్లాసులో స్టూడెంట్సెవరూ లేరు. ఈ ఎలక్షన్స్ అయిపోయే వరకు క్లాసులు జరిగేటట్టు లేవు" అన్నాడు మురళీమోహన్.

"ఈశ్వరరావు, సత్యనారాయణ యీ విషయమే చెప్తున్నారు. మీరు నిన్న హైదరాబాద్ వెళ్ళారా యేమిటి?"

"ఔను! మీకు చెప్పే అవకాశమే రాలేదు. రీసర్చ్ గురించి మా గైడ్‌గార్ని కలుద్దామని వెళ్ళాను....ఎఫ్.ఐ.పి. కోసం అప్లయ్ చేద్దామని. ఫామ్ మీద గైడు సంతకం కావాలి" అన్నాడు మురళీమోహన్.

"ఏమండోయ్ ఎఫ్.ఐ.పి. అంటున్నారు, మీరు ఎఫ్.ఐ.పి. మీద వెళ్ళిపోతున్నారా? అన్నాడు సీతారామారావు.

కామర్స్ లెక్చరర్.. ది వాకింగ్ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ది కాలేజ్ అంటారందరూ అతన్ని ఆ కాలేజీలో.

"కానండి! అనుకుంటున్నాను" అన్నాడు మురళీమోహన్.

"ఎఫ్.ఐ.పి. అంటే ఫాకల్టీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ కాదుట. ఫ్యామిలీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ అట... రీసర్చ్ పేరుమీద హాయిగా మూడేళ్ళు ఫుల్ సాలరీ తీసుకుంటూ ఇంటి పనులు చేసుకోవచ్చు యు.జి.సి వాడి పుణ్యమా అని"

అన్నాడు సీతారామారావు. సీతారామారావు పూర్తి చేయకుండానే "అందరూ అంతేనంటారా?"

"ఎట్ లీస్ట్ నేను చూసిన వాళ్ళందరూ అంతే....ఎఫ్.ఐ.పి. పేరుతో ఇళ్ళు కట్టుకోవడం—సంబంధాలు చూసి బిడ్డల పెళ్ళిళ్ళు చేసుకోవటం-ఎవరండీ సిన్సియర్ రీసర్చ్ చేసింది? చేసిన వాడెవడన్నా వుంటే డిగ్రీ సంపాదించాలన్న తపన తప్ప నిజంగా రీసర్చ్ చేయాలన్న ఇంటరెస్ట్ యెక్కడేడ్చింది? అసలు ఈ థీస్‌లన్నీ దండగ. వాటిల్లో పనికొచ్చే థీసిస్ కనీసం ఒక్కటి చూపించండి?" అన్నాడు సీతారామారావు.

వాళ్ళు ముగ్గురూ స్టాఫ్ రూమ్‌వేపు నడుస్తోంటే వాళ్ళకు హిస్టరీ లెక్చరర్ గోవిందరావు ఎదురయ్యాడు.

"హల్లో" అన్నాడు గోవిందరావు.

"హల్లో గోవిందరావుగారూ! ఏమిటి విశేషం?" అన్నాడు సీతారామారావు గోవిందరావుతో షేక్‌హాండ్ నిస్తూ.

"పెద్ద విశేషమే! ఈ రోజు కాలేజీకి ఇక్బాలొచ్చాడు" అన్నాడు గోవిందరావు.

"ఇక్బాలొచ్చాడా? ఎలా వున్నాడు? ఆ మధ్యెప్పుడో హార్టెటాక్ వచ్చినప్పుడు పోతాడనుకున్నాం" అన్నాడు సీతారామారావు.

"అతడంత ఈజీగా ఏం పోడు. మన నరాల్లో ప్రవహిస్తున్నది వట్టి రక్తమైతే అతడిలో విస్కీ ప్రవహిస్తున్నది....డెఫినెట్‌గా మనకంటే ఎక్కువకాలమే బతుకుతాడు" అన్నాడు గోవిందరావు.

"ఈ రోజుకూడా తాగే వచ్చాడా?"-సీతారామారావు

"సుబ్బరంగా"—గోవిందరావు.

"పెద్దాయనొస్తే గొడవైపోతుందే?"- సీతారామారావు.



"పెద్దాయన యిప్పుడే వచ్చాడు....రౌండ్స్‌కని యిప్పుడే బయటకు వెళ్తున్నాడు కూడా. క్లాసులో ఎవరయినా వున్నారేమోనని నేనిలా వస్తున్నా" గోవిందరావు.

"క్లాసులో ఎవరూ లేరులెండి. ఇక్బాల్‌ను పెద్దాయనకు ఎదురు పడకుండా చూడాలి....పెద్దసీనై పోతుంది" అంటూ సీతారామారావు కొంచెం వేగంగా నడవసాగాడు.

"మీరిద్దరూ పాత దోస్తులుకదా! ఈ ఇక్బాల్ మొదటినుంచీ ఇలాగే వుండేవాడా?" అడిగాడు రవి.

"లేదండీ....హి ఈజ్ ఎ వెరీ టాలెంటెడ్ ఫెలో! జెమ్ ఆఫ్ ఎ మ్యాన్....అతని రెడీ విట్-అతని సెన్సాఫ్ హ్యూమర్ మీకు తెలిసినవే-అతను గొప్ప స్పోర్ట్స్‌మన్ కూడా....అది మీకు తెలియదు టెన్నిస్, క్రికెట్, బిలియర్డ్స్, చెస్, బ్రిడ్జి మొదలైన ఆటల్లో అతనికి బ్రహ్మాండమైన ప్రావీణ్యం వుంది. ఒకప్పుడు అతడు ఈ ఊరి ఆఫీసర్స్ క్లబ్‌లో గొప్ప స్టార్. కలెక్టర్, ఎస్.పి, స్పెషల్ జడ్జి... మొదలయిన టాప్ ఆఫీసర్స్‌కు, వాళ్ళ భార్యలకు ఎంత దగ్గరివాడో! అప్పట్లో రాజశేఖర్ అని ఒక లెక్చరర్ వుండేవాడు క్లబ్‌కు రాగానే "డేరిజ్ ఇక్బాల్" అంటూ అతన్ని పిలిపించుకుని ఒక్క క్షణంకూడా వదిలేవాడు కాదు"—సీతారామారావు.

"అదంతా సరేనయ్యా! లెక్చరర్‌గా యెలా వుండేవాడు?"—రవి.

"మొదట్లో పాఠాలు బాగానే చెప్పేవాడు. స్టూడెంట్స్ అతనంటే చాలా ఇష్టపడేవాళ్ళు. అప్పటి ఇతని స్టూడెంట్స్ ఇతనంటే యిప్పటికీ ఎంతో అభిమానం చూపిస్తారు"-సీతారామారావు.

"అదిసరే-ఈ తాగడమెప్పటినుంచి?"-మురళీమోహన్.

"మొదటినుంచీ తాగేవాడే—కానీ యిలా ఇరవై నాలుగు గంటలూ తాగేవాడు కాదు....అసలు అతను పెళ్ళి చేసుకుని వుంటే ఇంతగా పతనమై పోయేవాడు కాదు"-సీతారామారావు.

"యేమిటి? అతడు పెళ్ళి చేసుకోలేదా?"—రవి.

"అయ్యో! మీకా విషయం తెలియనే తెలియదా? ఈ కాలేజీలో ఆ విషయం అందరికీ తెలుసు"-సీతారామారావు.

"అరె! వింతగా వుందే! ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"-రవి.

"నాకు పూర్తి వివరాలు తెలియదుగాని అప్పట్లో ఈయన ఒక హిందువుల అమ్మాయి ప్రేమలో పడ్డాట్ట. ఆ అమ్మాయి యితని స్టూడెంటేనని విన్నాను. ఆ అమ్మాయి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియగానే ఆ అమ్మాయిని కాలేజీకి పంపించటం మానిపించి పెళ్ళి చేసేశారుట. ఈలోగా ఇతగాడు విస్కీ బాటిల్‌ని పెళ్ళాడేశాడు"-సీతారామారావు.

"పూర్ ఫెలో"-రవి.

వాళ్ళు నలుగురు వరండాలో క్రిక్కిరిసి వున్న స్టూడెంట్స్‌ని తప్పించుకుంటూ స్టాఫ్‌రూమ్ వేపు నడవసాగారు.

ఆ కాలేజీలో స్టాఫ్‌రూమ్, ప్రిన్సిపాల్‌రూమ్....రెండూ ఎదురెదురుగా వున్నాయి. మధ్యలో పెద్ద వరండా....చాలామంది స్టూడెంట్స్ ఆ వరండాలో చేరి గొప్ప రణగొణ ధ్వనిని సృష్టిస్తున్నారు.

అప్పుడే వచ్చి, తన రూమ్‌లో కూర్చొని, క్లర్కు తెచ్చిన ఫైళ్ళని చూస్తున్న ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు క్లర్కుకేసి విసుగ్గా చూసి, తన ముందు కూర్చున్న సీనియర్ లెక్చరర్ రామయ్యతో చెప్పసాగాడు....

"రాగానే ఫైళ్ళ కట్టని తెచ్చి నా ముందు పడేశాడు. నేనిక రౌండ్స్‌కెప్పుడు వెళ్ళేది? ఎకడమిక్ వర్కు చూసేదెలా? ప్రిన్సిపాల్ అన్నవాడు ఓ గ్లోరిఫైడ్ క్లర్కండీ! కాయితాలమీద సంతకాలు చెయ్యటంతోటే వాడి ఓపికంతా నశించిపోతుంది. వాడిక వేరే వర్కు యేం చేస్తాడు చెప్పండి"

"ఔను సార్!" తలూపాడు రామయ్య.

"బయటంతా గొడవగా వుంది. నా ప్రాణానికి ఈ ఎలక్షనొకటి. ఈ ఎలక్షన్స్ అయిపోయే లోపుగా యెందరి తలలు పగుల్తాయో! మన తలలే పగుల్తాయో! కాసేపు రౌండ్సుకెళ్ళొద్దాం పదండి....ఈ ఫైళ్ళు తరువాత చూస్తానయ్యా! నువ్వెళ్ళు" అన్నాడు ప్రిన్సిపాల్ సీట్లోంచి లేస్తూ.

"అవి ఎరియర్ బిల్సు సార్....సార్లు ఇప్పటికే ఆలస్యమైపోయిందని...." క్లర్కు సుబ్బారావు ఏదో చెప్పబోయాడు.

"గొడవ చేస్తారు....నాకు తెలుసు....వీళ్ళకు క్లాసులకు వెళ్ళమంటే కోపమొస్తుంది—కాలేజీలో మూడింటిదాకా ఉండమంటే కోపమొస్తుంది....



ట్యూషన్లు చెప్పొద్దంటే కోపమొస్తుంది. కాని వాళ్ళకొచ్చే ప్రతిపైసా టంచన్‌గా రావలసిందే....ఒక్క నిమిషం కూడా ఆలస్యం కావద్దు.... ఎప్పుడూ ఏవో ఎరియర్స్ వస్తూనే వుండాలి. ఐనా మాకు జీతాలు చాలటం లేదని గొడవ చేస్తూనే వుండాలి....నాకు తెలుసు సుబ్బారావ్! రౌండ్సుకు వెళ్ళొచ్చి సంతకం చేస్తాను....అంతకన్నా ప్రిన్సిపాల్ చేసే ఘనకార్యం యింకేమీ లేదు....సిస్టమ్ ఈజ్ లైక్ దట్....నువ్వూ నేనూ చేసేదేమీ లేదు. నువ్వు కాస్త ముందో, వెనకో బిల్స్ తయారు చెయ్యాలి....నేనూ కాస్త ముందో వెనకో వాటిమీద సంతకాలు పెట్టాలి....దట్సాల్!"

"ఔను సార్" అన్నాడు రామయ్య ప్రిన్సిపాల్‌ను అనుసరిస్తూ.

ప్రిన్సిపాల్ బయటికెళ్ళగానే పిల్లలంతా "ప్రిన్సిపాల్ వస్తాండ్రో!" అంటూ కొందరు బయటకు, కొందరు లోపలకు గబగబా వెళ్ళిపోసాగారు.

"ఇదిగో....లుక్ హియర్! మీరంతా యిలా వరండాలో గుమిగూడి అల్లరి చేస్తే ఊరుకునేది లేదు....అందరూ క్లాసుల్లోకి వెళ్ళండి....కమాన్! వరండాలో యెవరూ వుండగూడదు....కమాన్! గో టు యువర్ క్లాసెస్! గో టు యువర్ క్లాసెస్...." పెద్దగా అరిచినట్టుగా అన్నాడు ప్రిన్సిపాల్.

రెండు మూడు నిమిషాల్లో వరండా అంతా ఖాళీ అయిపోయింది. స్టాఫ్ రూమ్‌ను ఆనుకుని వరసగా క్లాసురూములున్నాయి. ప్రిన్సిపాల్ స్టాఫ్ రూమ్ ముందుకొచ్చి పిల్చుని అక్కడున్న అటెండర్‌తో "లోపలున్న సార్లనందరిని బయటకు రమ్మను" అన్నాడు.

సరిగ్గా అప్పుడే లోపల ఇక్బాల్ ఒక జోక్ చెయ్యడం, అక్కడున్న లెక్చరర్లందరూ గొల్లున నవ్వటం జరిగింది.

"ఇక్బాల్ మాటలా వుంది—ఇక్బాలేనా?" అన్నాడు ప్రిన్సిపాల్ రామయ్యకేసి చూస్తూ.

"అతడే సార్!" అన్నాడు రామయ్య.

"ఇక్బాల్ కాలేజీకొచ్చాడా? హౌ కుడ్ ఇట్ హాపెన్" అంటూ ప్రిన్సిపాల్ స్టాఫ్ రూమ్‌లోకి అడుగుపెట్టాడు.

సరిగ్గా అప్పుడే రవి. సీతారామారావు, మురళీమోహన్, గోవిందరావులు ప్రిన్సిపాల్ వెనుకే ఆ రూములోకి ప్రవేశించారు.

లోపలున్న లెక్చరర్లందరూ ఇక్బాల్ చుట్టూ చేరి అతన్ని మరో జోక్ చెప్పమని అడుగుతున్నారు. 'సార్లనందర్నీ ప్రిన్సిపాల్‌గారు బైటకు రమ్మంటున్నా'డన్న అటెండర్ మాటను వాళ్ళెవరూ వినిపించుకోవటం లేదు.

సాధారణంగా ప్రిన్సిపాలెప్పుడూ స్టాఫ్ రూమ్‌లోకి రాడు! అలాంటిది ఆకస్మాత్తుగా ప్రిన్సిపాల్ స్టాఫ్‌రూమ్‌లో ప్రత్యక్షం కావడంతో ఎంతో సందడిగా వున్న ఆ రూమ్‌లో వెంటనే నిశ్శబ్దం ఆవరించింది.

అందరూ యేదో తప్పు చేస్తూ దొరికిపోయినట్టుగా లేచి నిల్చున్నారు, ఒక్క ఇక్బాల్ తప్ప.

"గుడ్మార్నింగ్ సార్" అంటూ ఇక్బాల్ కూడా లేచి నిల్చోవటానికి ప్రయత్నించాడు. కాని అతని కాళ్ళు, చేతులు అతనికి సహకరించలేదు.

"ఆరోగ్యం ఎలా వుంది?" పొడిగా అడిగాడు ప్రిన్సిపాల్.

తను లేచి నిల్చోలేక పోతున్నానని, చేతులతో తన కాళ్ళవేపు చూపిస్తూ—

"ఇలా వుంది" అన్నాడు ఇక్బాల్.

అతడలా చూపిస్తున్న క్షణంలో అక్కడున్న వాళ్ళందరూ ఎంతో ప్రయత్నంతోగాని గొల్లున నవ్వేయ్యాలన్న కోరికను అణుచుకోలేక పోయారు.

"తాగటం మానేశారా? ఎట్ లీస్ట్ చనిపోతానన్న భయంతో నన్నా—"

"అప్పుడప్పుడూ మానేస్తున్నాను సార్—బట్...."

"మీరు....మీ అవతారం....కనీసం లేచి నిల్చోలేని మీ స్థితి....ఈ పరిస్థితిలో మీరు కాలేజికి రాకపోతేయేం? ఇప్పుడు కూడా మీరు తాగే కాలేజీ కొచ్చారు....ఇంత దూరం నిల్చున్న నాకే వాసనతో తల తిరిగిపోతోంది.... ఇలా తాగి ఓ లెక్చరర్ కాలేజీకొస్తే మన గురించి స్టూడెంట్స్ యేమను కుంటారు? మన పరువేమన్నా వుంటుందా? మన గురించి సొసైటీకి ఆల్‌రెడీ చాలా పూర్ ఓపీనియన్ ఉంది—కాలేజి లెక్చరర్లు పాఠాలు చెప్పరు. వాళ్ళ స్వంత పనులు చూసుకుంటారు అని. అలాంటిది ఇలా తాగి తూలిపోతూ, నలిగిన బట్టలతో, రేగిన జుట్టుతో, ఎర్రటి కళ్ళతో కంపు కొడుతూ ఓ లెక్చరర్ కాలేజికొస్తే జనం యేమనుకుంటారు? మీకిదివరకెన్ని సార్లు చెప్పాను తాగి కాలేజికి రావద్దు అని" చాలా గంభీరంగా ధ్వనించింది ప్రిన్సిపాల్ గొంతు.



"ఆల్‌రైట్ సర్! ఐయామ్ గిల్టీ....ఐ వోన్ మై క్రయిమ్! బట్— ఇందులో క్రైమ్ చెయ్యని వాళ్ళెవరో చెప్పండి....డబ్బులు తీసుకొని మార్కులు వెయ్యటంకంటే తాగటం పెద్ద క్రైమా? లెక్చరర్‌గా జీతం తీసుకుంటూ ఎల్.ఐ.సి. ఏజెంట్స్‌గానో, పీర్‌లెస్ ఏజెంట్స్‌గానో పనిచెయ్యటం కంటే పెద్ద క్రయిమా? వాళ్ళకు నాకు ఒకటే డిఫరెన్స్....వాళ్ళు ముసుగేసుకున్నారు. నేనా ముసుగు తీసేశాను...." అనేశాడు ఇక్బాల్. మాట్లాడటం పూర్తిచేసి ఎంతో అలసిపోయినట్టుగా మొఖం పెట్టాడు.

"మిష్టర్ ఇక్బాల్! మీరేం చెప్పటానికి ప్రయత్నిస్తున్నారో నాకు అర్థమయింది. కాని మన తప్పును కప్పిపుచ్చుకోవటానికి వేరొకర్ని...." అన్నాడు ప్రిన్సిపాల్.

"బట్ ఐ వోనిట్! ఐ వోనిట్!" అంటూ అతడు తనలో తాను గొణుక్కున్నట్టుగా మాట్లాడుతూ గుండెను చేత్తోపట్టుకొని కుర్చీలో వెనక్కి వొరిగిపోయాడు.

మరు క్షణంలో అతడు బాధతో గింగిర్లు తిరిగి పోసాగాడు. అక్కడున్న వాళ్ళకు వెంటనే యేం జరిగిందో అర్థం కాలేదు.

అందరూ అతని చుట్టూ చేరి "ఇక్బాల్ సాబ్....ఇక్బాల్ సాబ్.... యేమైంది? యేమైంది?" అన్నారు.

అతడు గుండెమీద కొట్టుకుంటూ బాధతో విలవిల్లాడిపోసాగాడు. వెంటనే అతన్ని ఓ నలుగురు కలిసి కుర్చీలోంచి దించి ప్రిన్సిపాల్ రూమ్‌లోకి తీసుకెళ్ళి అక్కడున్న సోఫా మీద పడుకో బెట్టారు.

"హి హాడ్ ఎట్టాక్!" అని ఒకరంటే "గుండెపోటు" అని మరొకరు అంటూ కంగారు పడ్డారు.

"డాక్టర్ని పిలవండి" అని ఒకరంటే "హాస్పటల్‌కు తీసుకెళ్ళండి" అని ఇంకొకరు.

సోఫా మీద పడుకోబెట్టగానే అతనికి స్పృహ పోయింది.

సీతారామారావు అతని నాడి చూడసాగాడు.

"రమాకాంతరావు రాలేదా? అతనొస్తే అతని కార్లో ఇక్బాల్‌ను వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్ళండి" అరిచాడు ప్రిన్సిపాల్.

"రమాకాంతరావు దొర! అప్పుడే కాలేజి కొస్తాడా సార్!" అన్నా రెవరో లెక్చరర్ల గుంపులోంచి.

"మరిప్పుడేం చేద్దాం?" అన్నాడు ప్రిన్సిపాల్.

"అంబులెన్స్ పంపించమని హాస్పిటల్‌కు ఫోన్ చేద్దాం సార్! అన్నాడు కాంతారావు.

"అంబులెన్స్ పంపించమంటే వాళ్ళు పంపిస్తారా? పేషెంట్ చని పోయిన ఆరు నెల్లకు గానీ అంబులెన్స్ రాదు" అన్నాడు సీతారామారావు.

"ఐదు నిమిషాల్లో అంబులెన్స్ వచ్చి ఇక్కడ వాల్తుందో లేదో చూడండి" అంటూ కాంతారావ్ ఫోన్ ఎత్తి ఓ నెంబర్ డయల్ చేస్తూ, తనంటే ఏమిటో ఋజువు చేయాలన్న పట్టుదలతో మాట్లాడు తున్నాడు.

"అదిగో....రమాకాంతరావు వచ్చేశాడు" రవి.

"మిస్టర్ రమాకాంతరావు....! మీ కారు తెచ్చారా?" ప్రిన్సిపాల్.

"కార్లోనే వచ్చాను సార్....హైద్రాబాద్ వెళ్ళాల్సిన పనుంది...." అన్నాడు రమాకాంతరావు.

"అలాగే వెళ్దరు గాని మొదట ఇక్బాల్ సాబ్‌ను తీసుకెళ్ళి హాస్పిటల్లో అడ్మిట్ చెయ్యండి."

"అలాగేసార్....కార్ను ఇక్కడికి గేటు దగ్గరకు తెస్తాను" రమాకాంతరావు బయటికి వెళ్ళాడు.

విద్యార్థులంతా పెద్ద గుంపుగా చేరి ఇక్బాల్‌ను కార్లోకి యెక్కిస్తున్న దృశ్యాన్ని చూడసాగారు.

"ఏమైంది? ఏమైంది?"

"మస్తు తాగొచ్చిండు."



"లెక్చరర్లు కూడ గింత తాగితే?"

"గిదేం లెక్చరరో? రిక్షా వోనికంటో అధ్వాన్నగున్నడు."

"లెక్చరర్లంటే ఏండను కున్నవు మరి........? తాగుడు....పేక ఆడటం....కాలేజికొచ్చి సంతకం పెట్టి పోవటం....వాళ్ళు చెప్పేది లేదు. మనం వినేదిలేదు."

"మనం క్లాసుల్లోనే కూచోక పోతిమి వాళ్ళ నెట్ల జెప్పుమన్నవు?"

"ఎప్పుడులేంది ఇయ్యాళ రమాకాంతరావు దొరొచ్చిండ్రో! పది రోజులకొకపారి వచి గీన నెలరోజుల జీతమెట్ల తీసుకుంటుండ్రా?"

"దొర! గాయన్నెవడడుగుతడ్రా? ఎం.పి. గారి తమ్ముడు. అయనంటే ప్రిన్సిపాల్‌కు కూడా భయమే."

స్టూడెంట్లందలా అలా మాట్లాడుకుంటూ కారు వెళ్ళిపోగానే వాళ్ళూ వెళ్ళిపోయారు.

"దిస్ విల్ బి హిజ్ లాస్ట్ స్ట్రోక్...." అన్నాడు సీతారామారావు స్టాఫ్‌రూమ్‌లో కొచ్చి కూర్చుంటూ.

"అంటే.... ఈ దెబ్బతో పోతాడనా మీ ఉద్దేశ్యం" గోవిందరావు.

"అంతే....పోతాడు....వియ్ వోంట్ సీ హిమ్ ఎగైన్ ఎలైవ్!" అని అన్నాడు సీతారామారావు.

"పోడు సార్....చూడండి....మళ్ళీ కాలేజీ కొస్తాడు. మళ్ళీ మనం దరి పరువు తీస్తాడు" గోవిందరావు.

"చూశారా ఆ తురకాడి కెంత పొగరో! వాడు చేసిన తప్పును కప్పి పుచ్చుకోటానికి మనందర్నీ ఎన్ని మాటలన్నాడో—" భార్య పేరు మీద ఎల్.ఐ.సి. ఏజెన్సీ తీసుకున్న వెంకటేశ్వరరావు అన్నాడు.

"ఉన్నమాటే అన్నాడు" అన్నాడు సీతారామారావు.

"ఏమిటండి వున్నమాట—? మన ప్రొఫెషన్‌లో కొంచెం తీరిక ఎక్కువ వుంటుంది తీరిక సమయంలో వేరే ఏదన్నా పని చేసుకొని మన ఆదాయాన్ని కొంచెం పెంచుకుంటే తప్పేమిటి....?" వెంకటేశ్వరరావు.

"తప్పేం లేదు....మనం మన విద్యార్థులకు న్యాయం చెయ్య గల్గితే.... కాని చెయ్యగల్గుతున్నామా అన్నదే సందేహం...." సీతారామా రావు.

"మనమేం చేస్తామండి. వాళ్ళకసలు చదువుకోవాలని ఉంటే గదా మనం చదువు చెప్పటానికి. ఈ రోజు చూడండి....క్లాసుకు వెళితే క్లాసులో ఎవ్వరూ లేరు....అంతా బయట వరండాల్లో తిరుగుతూ కాన్వాస్ చేసుకుంటు న్నారు—ఇంత డిస్టర్బెన్స్‌లో మనం క్లాసు తీసుకున్నా ఏం చెప్పగలం? అసలు గవర్నమెంటు కాలేజీల్లో ఈ స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్ ఎందుకు పెట్టాలి?" ఆవేశంగా అన్నాడు గోవిందరావు.

"అడ్డమైన వాడల్లా లెక్చరర్ల మీద యేడవడమేగాని లెక్చరర్ల ప్రాబ్లెమ్స్ నెవడూ అర్థం చేసుకోడేమిటి?" అన్నాడు ఇంగ్లీషు లెక్చరర్ శ్రీనివాసరెడ్డి.

"లెక్చరర్ల ప్రాబ్లెమ్స్ ఏమిటి?" అన్నాడు రవి.

"ఎంత అమాయకంగా అడుగుతున్నారు. లెక్చరర్స్ ప్రాబ్లెమ్స్ ఏమిటో మీకు తెలీదా" అన్నాడు శ్రీనివాసరెడ్డి చాలా కోపంగా.

"నిజంగా తెలియదు....తెలుసుకోవాలనే అడిగాను" రవి.

"హి ఈజ్ టూ యంగ్! ఆయనకింకా చాలా విషయాలు తెలియవు. మీరు సీనియర్....మీరే చెప్పండి—తప్పేముంది?" మురళీమోహన్.

"తప్పేం లేదు. ఇవ్వాళ ఓ మున్సిపల్ ఆఫీస్‌లో పనిచేసే గుమాస్తా ఏం సంపాదిస్తున్నాడు? ఓ బ్యాంక్‌లో పనిచేసే అటెండర్ ఎంత సంపా దిస్తున్నాడు? ఓ ఎక్సైజ్ ఆఫీస్‌లో పనిచేసే ఎల్.డి.సి ఎంత సంపాదిస్తు న్నాడు? ఓ పోలీసు సబ్ఇన్‌స్పెక్టర్ ఎంత సంపాదిస్తున్నాడు? వీళ్ళకంటే ఎన్నో రెట్లు ఎక్కువ క్వాలిఫికేషన్ వున్న ఓ కాలేజి లెక్చరర్ ఎంత సంపాదిస్తున్నాడు? వీడికి జీతం తప్ప వేరే ఆధారమేలేదే? అలాంటప్పుడు అడిషనల్ ఇన్‌కమ్ కోసం తీరిక సమయంలో వేరే యేదన్నా పని చేసు కుంటే అదో పెద్ద క్రైమా—? ఇవ్వాళో రేపో చచ్చే తాగుబోతు వెధవకి అంత ఫోజా?" అన్నాడు చాలా ఆవేశంగా శ్రీనివాసరెడ్డి.



శ్రీనివాసరెడ్డికి ఆ ఊళ్ళో ఓ జనరల్ స్టోరుంది. అయిదారు ఓట్టీలు నడిపిస్తాడు.

"జీతం తప్ప వేరే ఆధారం లేదంటే నా కర్థం కాలేదు—మీరన్న ఆ వేరే ఉద్యోగస్తులందరూ వేరే ఆధారాలను కలిగి ఉన్నారని అర్థమైంది.

"వేరే ఆధారాలంటే లంచాలనేనా?" అన్నాడు రవి.

అందరూ నవ్వారు.

"ఆ విషయాన్ని మీరింత స్పష్టంగా చెబితే ఎట్లా?" అన్నాడు సీతా రామారావు.

"అంటే మనమంతా లంచం అనేదాన్ని సమర్థిస్తున్నామన్న మాట మన ప్రొఫెషన్‌కూడా దాన్ని విస్తరింప జెయ్యాలని కోరుకుంటున్నా మన్న మాట" రవి.

"మన ప్రొఫెషన్‌కూడా లంచాలని విస్తరింప జెయ్యాలని అనటం లేదు.... లీజర్ టైమ్‌లో వేరే పనులు చేసుకోవటంలో తప్పు లేదంటు న్నాను. కష్టపడి నాలుగురాళ్ళు సంపాదించుకోవటంలో తప్పులేదంటు న్నాను" అరచినట్టుగా అన్నాడు శ్రీనివాసరెడ్డి.

"వేరే పనులంటే.... ఎంత చెత్త పనులైనా చెయ్యొచ్చా? వేరే ప్రొఫెన్‌కుండే లేని నొబిలిటీ మన ప్రొఫెషన్‌కుంది. మనల్ని అనుక్షణం మన స్టూడెంట్స్ అబ్జర్వ్ చేస్తుంటారు మనల్ని అనుకరించటానికి ప్రయ త్నిస్తుంటారు ఆ విధంగా మనకు సామాజిక బాధ్యత ఎక్కువ వుంది. మనం స్టూడెంట్స్‌కి ఎగ్జాంపుల్‌గా వుండాలి మనం మన స్టూడెంట్స్‌కు ఆదర్శంగా వుండాలి అట్లా వున్నప్పుడు మనం మన బాధ్యతను...."-రవి పూర్తి చెయ్యకుండానే శ్రీనివాసరెడ్డి మాట్లాడటం మొదలు పెట్టాడు.

"తిండి బట్టా సరిగ్గా లేకుండానే బజార్లో బికారిలా తిరిగే వాన్నెవడూ ఆదర్శంగా స్వీకరించరు.... ముందు అది తెలుసుకోవాలి...." శ్రీనివాస రెడ్డి మళ్ళీ కోపంగా అన్నాడు.

8)

"మనకు తిండీ బట్టా లేకుండా తిరిగే పరిస్థితి ఎందుకు ఏర్పడుతుంది?" —రవి.

"కేవలం జీతంమీద ఆధారపడితే మనగతి అంతే" అన్నాడు శ్రీనివాసరెడ్డి.

"కేవలం జీతంమీద ఆధారపడి బతకలేమంటారా? మన జీతాలిప్పుడు బాగానే వున్నాయనుకుంటానే.... ఐథింక్ వియ్ ఆర్ వెల్ పెయిడ్"—రవి

"ఆహాహ.... ఐథింక్ వియ్యార్ వెరీవెల్ పెయిడ్" —రవి గొంతును అనుకరిస్తూ అతన్ని వెక్కిరించాడు శ్రీనివాసరెడ్డి.

"నెలనెలా మీకు డబ్బులు చాలా మిగులుతున్నాయనుకుంటాను. ఇదివరకిటిలా ఈ మధ్య అప్పులకోసం ఎవరిదగ్గరకూ పరుగెత్తటం లేదా?" అన్నాడతడే మళ్ళీ. అతని గొంతులో ఎంతో కసి ద్వేషం తొణికిసలాడాయి తను ఒకసారి మురళీమోహన్‌ను అప్పడుగుతోంటే శ్రీనివాసరెడ్డి చూసిన విషయం గుర్తొచ్చింది అతడు తనను భలేగా దెబ్బకొట్టానని తృప్తిపడుతున్నాడు.... నిజంగానే దెబ్బకొట్టాడు.... తిరిగి తను అతనిని దెబ్బకొట్టలేక పోతున్నాడు. లోపలెక్కడో బాధ.... అవమానం.... ప్రతీకారం తీర్చుకోలేక పోతున్నానన్న ఆవేదనతో సతమత మవుతున్నాడు

"ఇలాంటి 'డిస్కషన్స్'లో స్వంత విషయాలు తీసుకు రావల్సిన అవసరంలేదు.... మీ అభిప్రాయం మీరు చెప్పారు. ఆయన అభిప్రాయం ఆయన చెప్పాడు.... మీరంత కోపంగా...." అన్నాడు మురళీమోహన్.

"కోపమేమీ లేదండి.... ఆయనేదో పెద్ద ఆదర్శవాది అయినట్టు .. మిగతా వాళ్ళంతా వెధవలయినట్టు మాట్లాడితే ఎవడికైనా వళ్ళు మండుతుంది మరి...." — శ్రీనివాసరెడ్డి.

"నేను మిగతా వాళ్ళంతా వెధవలని అన్నానా?"—రవి.

శ్రీరంగాచారి, తెలుగు లెక్చరర్, స్టాఫ్‌రూమ్‌లోకి విసురుగా ప్రవేశించి "మన డి ఏ బిల్ మీద సంతకాలు ప్రిన్సిపాల్ గారు ఇంకా చేయలేదుట.... అంటే ఆ ఈరోజుకూడా బిల్ డి టి ఓ కు పోదు. రేపుకూడా



మనకు ఆడబ్బురాదు. . వేరే కాలేజీల వాళ్ళందరూ తీసేసుకున్నారు.. యేం ఆఫీసో! యేం ప్రిన్సిపాలో!" అన్నాడు.

"తబ్బెందుకండి బాబూ! లెక్చరర్లందరూ జీతాలెక్కువైపోయి వాళ్ళ జేబులనిండా, ఇంటినిండా డబ్బు మూల్గుతోంటే, దాన్నేం చెయ్యాలో తెలియక సతమతమై పోతోంటే మీరు రేపుకూడా డబ్బు రాదని బాధపడిపోతారేమటి?" అన్నాడు శ్రీనివాసరెడ్డి

"పోనీండిగాని.... బిల్స్‌మీద ప్రిన్సిపాలింకా సంతకాలు పెట్టలేదా? సురేందర్‌కు చెప్పండి.... అతడు వెళ్ళి కూర్చుంటే తప్ప ఆయన సంతకాలు పెట్టడు...."—అన్నాడు వెంకటేశ్వరరావు.

"సురేందర్ ఈరోజు కాలేజి కొచ్చాడా? హైదరాబాద్‌లో యేదో మీటింగ్ కెళ్ళాలని చెప్పాడే?"—అన్నాడు శ్రీరంగాచారి

"ఆ మీటింగ్ నిన్ననే అయిపోయింది.... ఈరోజు కాలేజికి వచ్చే వుండాలి. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో చూద్దాం రండి" అంటూ వెంకటేశ్వరరావు లేచాడు శ్రీరంగాచారి అతన్ని అనుసరించాడు సురేందర్ లెక్చరర్ల అసోసియేషన్‌కు సెక్రటరీ

"సంతకాలు పెట్టడానికి ప్రిన్సిపాల్ కెందుకో అంత బద్ధకం ... లెక్చరర్ల డ్యూటీలంటూ వుపన్యాసాలివ్వమంటే ఎన్ని గంటలయినా పరవాలేదు. దంచేస్తాడు" అన్నాడు గోవిందరావు.

"దంచటానికేం? అందరూ దంచుతారు. చెప్పేదొకటి, చేసేదొకటి ఇన్ని నీతులు చెప్పే ఈయనేం చేస్తున్నాడో? ఈయన ప్రతాపమంతా లెక్చరర్లమీదనే. స్టూడెంట్స్ జోలికి పోడు. వాళ్ళు అంటే చచ్చే భయం. వరండాల్లో రోజూ స్టూడెంట్స్ ఇంత గోల చేస్తున్నారు గదా! వాళ్ళ దగ్గరకు వెళ్ళే దమ్ములేదు. వాళ్ళను కంట్రోల్ చేసే దమ్ములేదు. ఇంత గోలలో వీళ్ళు క్లాసులెలా తీసుకుంటారని ఆలోచించలేదు ఫలానారోజు మీరాక్లాసు ఎందుకు తీసుకోలేదని మన మొహానొక మెమొ పడెయ్యటానికి మాత్రం తయారు." అన్నాడు యేనాడూ క్లాసులకు సరిగ్గా వెళ్ళని ఇంగ్లీష్ లెక్చరర్ అర్జునరావు!

"చాలామంది ప్రిన్సిపాల్స్ కంటె ఈయన బెటర్ లెండి కనీసం కాలేజీలో వుంటాడు.... లంచగొండికాదు." అన్నాడు సీతారామారావు.

"కాలేజీలో వుండగానే యేం లాభమండి, అటు బిల్డింగ్ మీద సంతకాలు పెట్టడూ, ఇటు కూర్చుంటే ఆ రూమ్‌లో కూర్చుని వచ్చిన వాడితోనల్లా హస్కు వేసుకుంటాడు. అసలిప్పుడు ఇక్బాల్ సాబ్‌కి హార్ట్ ఎటాక్ ఎందుకొచ్చిందంటారు?" -అర్జునరావు.

ఈ అర్జున్‌రావు ఎప్పుడూ ప్రిన్సిపాల్‌ని ఇలా ఎందుకు విమర్శిస్తుంటాడో తనకర్థంకాని విషయం. అసలు వీళ్ళందరూ ఎన్ని గంటలైనా ప్రిన్సిపాల్‌ని గూర్చి మాట్లాడుకోగలరు ఇంకే విషయం అక్కర్లేదు.

"ఎందుకొచ్చిందంటారు?" అన్నాడు మురళీమోహన్.

"ప్రిన్సిపాల్ 'తాగి కాలేజీకొస్తావా?' అని అంత గట్టిగా మాట్లాడటం వల్లనే అతనికి గుండెపోటొచ్చింది" అన్నాడు అర్జునరావు.

"చాలా పొరపాటు. ఇక్బాల్‌కు గుండెపోటు రావటం ఇది మూడో సారి" అన్నారు సీతారామరావు, మురళీ మోహన్లు ఒకేసారి.

"ఏమో.... ఆయనంత హార్ష్‌గా మాట్లాడకపోతే ఇక్బాల్‌కి వాళ...." -అర్జునరావు.

"పెద్ద హార్ష్‌గా యేం మాట్లాడలేదు లెండి. లైఫ్‌లో యేనాడూ యే విషయాన్నీ సీరియస్‌గా తీసుకోని ఇక్బాల్ ఇవాళ ప్రిన్సిపాల్ మాటల్ని సీరియస్‌గా తీసుకుంటాడా? అబ్సర్డ్! క్రానిక్ హార్ట్‌పేషెంట్! యేక్షణంలోనయినా పోవచ్చునని డాక్టర్లు ఎప్పుడో చెప్పారు. ఇక్కడంటే అన్నారు గాని బయటెక్కడైనా ఈ మాట అనకండి మీరామాట నలుగురు ముస్లిమ్స్ వున్నదగ్గర అన్నారంటే ప్రిన్సిపాలే ఇక్బాల్‌ను చంపాడన్న వదంతి వ్యాపించి అదో పెద్ద గొడవైపోతుంది." - సీతారామారావు.

"మీకు ప్రిన్సిపాల్ మీద ప్రయోగించటానికి ఎన్నో ఆయుధాలున్నాయి. దయచేసి ఈ ఆయుధాన్ని వదిలెయ్యండి. అట్లా మాట్లాడితే కాలేజికి నష్టం: ఇంకోళ్ళుకూడా గొడవపెడతాయి" — మురళీమోహన్.

"ప్రిన్సిపాల్ అంటే ఎప్పుడూ తోకతొక్కిన తాచుపాములా లేసావు అయనంటే ఎందుకయ్యా నీకంతకోపం? క్లాసులు తీసుకోవటం లేదని



రెండు మెమోలిచ్చాడు. ఆదీ స్టూడెంట్స్ వెళ్ళి రిటెన్ కంప్లెయింటిస్తే స్టూడెంట్స్ నుండి అలాంటి కంప్లెయింట్స్ రాకుండా చూసుకోవాలిగాని ప్రిన్సిపాల్‌మీద యేడిస్తే యేం లాభం?" —శ్రీనివాసరెడ్డి.

"ఎవడేశాడిప్పుడు? క్లాసులెవడు తీసుకోవటంలేదు. మీలాగా నాకు దుకాణాలు, ట్యూషన్లు లేవు తెలుసా?" — అర్జున్‌రావు.

"నాకు దుకాణాలు, ట్యూషన్లూ వున్నప్పటికీ నేను రెగ్యులర్‌గా క్లాసెస్ తీసుకుంటాను మీలాగా ఇరవైనాలుగంటలూ పేకాడుతూ వచ్చిన జీతమంతా పేకాటమీదనే తగలెయ్యను. తెలుసా? వీడేదో నాలుగురాళ్ళు సంపాదించుకుంటున్నాడన్న కడుపుమంట! నా అఫీషియల్ డ్యూటీని సక్రమంగా చేస్తూ నాలీజర్ టైమును నేనట్లా ఉపయోగించుకుంటే యేం? దుకాణాలున్నాయని, ట్యూషన్లు నడుపుతున్నాడని ప్రతివాడూ నామీద యేడ్చి చస్తారెందుకు"—శ్రీనివాసరెడ్డి.

"బయట సిట్యుయేషన్ చాలా ఎక్స్‌ప్లోజివ్‌గా వుంది అంటూ స్టాఫ్ రూమ్‌లో ప్రవేశించాడు నాగేశ్వరరావు.

"బయటేంటు.... లోపలకూడా ఎక్స్‌ప్లోజివ్‌గానే వుంది సంగతేమిటో చెప్పండి"— సీతారామారావు.

"క్యాన్వాస్ చేస్తున్న స్టూడెంట్స్ ఒకర్ని కొందరు వేరే గ్రూపు స్టూడెంట్స్ కొట్టారట. దెబ్బలు తిన్న స్టూడెంటుకు చెందిన గ్రూపువాళ్ళు చాలా కోపంతో వున్నార్ట. వాళ్ళ సపోర్టర్స్‌ను తీసుకురావడం కోసం వాళ్ళ వాళ్ళు కొందరు ఊళ్ళోకి వెళ్ళారట "—నాగేశ్వరరావు.

"ఎవరు చెప్పారు?...." — మురళీమోహన్.

"ఇప్పుడే బి.ఏ. సెకండియర్ స్టూడెంట్స్ కొందరు కన్చెప్పారు. యేదో గొడవ జరుగుతుందని ఇటుగాని, అటుగాని, స్టూడెంట్స్ చాలామంది ఇళ్ళల్లోకి వెళ్ళిపోతున్నారు...."—నాగేశ్వరరావు.

"ఈ విషయం ప్రిన్సిపాల్‌కు తెలుసా? కనీసం స్టూడెంట్స్ యూనియన్ అడ్వైజర్ కాంతారావుకు తెలుసా?" - సీతారామారావు.

"కాంతారావు ఇక్బాల్‌ను హాస్పిటల్‌లో జాయిన్ చేయించటానికి

యింతకు ముందు కార్లో వెళ్ళాడు గదా....ఇంకా వచ్చినట్టు లేదు"—నాగేశ్వరరావు

"ఎందుకయినా మంచిది! ఈ విషయం ప్రిన్సిపాల్‌గారికి తెలియజేస్తే బాగుంటుందేమో" – సీతారామారావు.

"మన కెందుకులెండి....ఈ విషయం మీకెలా తెలుసు? స్టూడెంట్స్ పాలిటిక్స్‌తో మీకు సంబంధం వుందా? అంటూ మనల్ని సస్పెక్ట్ చేస్తాడు" నాగేశ్వరరావు.

"అసలీ కాలేజీని ఓ నెలరోజులపాటు క్లోజ్ చేసి పడేస్తే పీడా వదిలిపోతుంది ఈ వెధవల కసలు చదువులెందుకండి?"—గోవిందరావు.

"నెలరోజులు కాదు....అసలు మొత్తమే మూసిపడేస్తే....? యీ మామూలురకం కాలేజీల వల్ల యేం ప్రయోజనం యేర్పిందని? దేశంలో నిరుద్యోగుల్ని పెంచడానికి తప్ప యీ కాలేజీ లెందుకు పనికొస్తాయి?"—సీతారామారావు.

"కాలేజీలని మొత్తమే మూసేస్తే మన మాటేమికందోయ్? మన మందరమూ నిరుద్యోగులమై పోమూ?"—గోవిందరావు

"పోనీయండి! ఆ మధ్య చైనాలో సాంస్కృతిక విప్లవ కాలంలో యూనివర్శిటీలను మూసేసి అటు స్టూడెంట్స్‌ను, యిటు లెక్చరర్లను పల్లెటూళ్ళకు పంపించి వర్క్ చెయ్యమన్నారట ...యిక్కడా ఎవడయినా అలాంటి పని చేస్తే దేశం బాగుపడును"—సీతారామారావు.

"చైనాలో కాబట్టి సాధ్యమైంది ...యిక్కడ యీ కుళ్ళిపోయిన వ్యవస్థలో అది సాధ్యమౌతుందంటారా?"—రవి

"ప్రతివాడూ ఇది కుళ్ళిపోయిన వ్యవస్థ....కుళ్ళిపోయిన వ్యవస్థ అనేవాడే! దీన్ని బాగుచేసే మార్గమేమిటో ఎవడూ చెప్పడేమిటి?"—శ్రీనివాసరెడ్డి.

"మీకు వినే ఓపిక వుంటే చెప్పటానికి సిద్ధమే-బాగుచేసే మార్గాలు చాలా వున్నాయి బాగుచెయ్యాలన్న పట్టుదల, చిత్తశుద్ధి వుండాలే గాని"—రవి.



"లాభం లేదండి....ఈ వ్యవస్థలో ఏమీ చెయ్యలేం....ఈ వ్యవస్థను పూర్తిగా తోసివేయాల్సిందే"—సీతారామారావు.

"వ్యవస్థను తోసివేయాల్సిందే అంటే....ఇప్పుడున్న వాళ్ళందర్నీ చంపెయ్యాలనేనా? స్మశానంలోంచి కొత్త సిస్టమ్‌ను పుట్టిస్తానంటారు....అంతేనా?"—శ్రీనివాసరెడ్డి.

"చంపెయ్యాలని కాదు! ఈ వ్యవస్థని....ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థని మార్చాలని....ప్రతి మాటను మీరిలా వక్రంగా అర్థం చేసుకుంటారెందుకు?"—రవి.

"నాకలాగే అర్థమౌతుందిలెండి! నేను మీలాగ పెద్ద మార్క్సిస్టును-ఐడియలిస్టును కాదుగా? మీలాగ ప్రతిదాన్ని నేను ఎర్రకళ్ళద్దాలతో చూడను" శ్రీనివాసరెడ్డి.

"నేను ఐడియలిస్టునని, మార్క్సిస్టునని ఎప్పుడూ ఎవరితోనూ చెప్పుకోలేదు ఎందుకలా మాట్లాడతారు?"—రవి

శ్రీరంగాచారి, వెంకటేశ్వరరావు, సురేందర్ డి.ఎ. గురించి, స్కేల్స్ గురించి మాట్లాడుకుంటూ స్టాఫ్ రూమ్‌లో ప్రవేశించారు.

"హల్లో సురేందర్....హైదరాబాద్ నుండి ఎప్పుడొచ్చారు!"—మురళీమోహన్.

"ఈరోజు పొద్దుటే....డైరెక్టుగా కాలేజీకే వచ్చాను"—సురేందర్.

"మన స్కేల్స్ గురించి జి.వో. వచ్చేస్తోందన్నారు. ఇంతవరకు యేమీ లేదేమిటి?" మురళీమోహన్.

"వస్తుందండీ! వస్తుంది....నిన్నంతా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్‌లో దీన్ని గురించే చర్చించాం....వారం పదిరోజుల్లో జి.వో. రాకపోతే డైరెక్టు యాక్షన్‌కు దిగాల్సి వస్తుందని ఎడ్యుకేషన్ మినిస్టర్‌కు చెప్పటం కూడా జరిగింది....ఈ వారం, పదిరోజుల్లో తప్పకుండా వస్తుంది"—సురేందర్.

"మీరు ఆర్నెల్ల నుంచి ఇలాగే చెపుతున్నారు. యేమౌతుందో యేమిటో?"—మురళీమోహన్.

"మీరలా తొందర పడితే ఎలా చెప్పండి....ఈ దరిద్రపు గవర్న

మెంట్‌లో' ఒక చిన్న పేపర్ ఒక చోటినుండి ఒక చోటికి 'కదలాలంటే' ఎంత కష్టమొ మీకు తెలీదు"—సురేందర్.

"అది సరేగానీ డి ఎ బిల్స్ మీద ప్రిన్సిపాల్ సంతకాలు చేశాడా? ప్రోగ్రెస్ ఏదన్నా వస్తుందా?"—అర్జునరావు.

"ఇప్పుడే చేయించే వస్తున్నాగా....అయినా ఈ డి ఎ. మీకు రాదే?" సురేందర్.

"అదేమిటి? నాకెందుకు రాదు"—అర్జున్‌రావు.

"ఇప్పుడొచ్చే డి.ఏ. స్టేట్ స్కేల్స్ వాళ్ళది....యు జి.సి. స్కేల్స్ వాళ్ళ డి.ఏ గురించి యింకా జి.వో. రాలేదు" సురేందర్.

"నాది స్టేట్ స్కేల్ కాదా?" అర్జున్‌రావు.

"మీరు యే స్కేల్‌లో ఉన్నారో మీకు తెలియదా? మీది యు జి.సి. స్కేల్ మహాశయా!"—సురేందర్.

"అయితే నాకీ 'డి.ఏ. ఎరియర్స్' రావా?"—అర్జునరావు.

"వస్తాయి. కొంచెం ఓపిక పట్టండి....యు.జి.సి. వాళ్ళకు వేరే జీ వో. వస్తుంది" సురేందర్.

"ఏం స్కేల్సో! ఏం జీ వో.లో! ఇవన్నీ చచ్చినా నాకర్థం కావు."

"మీ కర్థమయ్యే విషయం ఒకటే ఒకటి"—శ్రీనివాసరెడ్డి.

"ఏమిటది?"—సుధాకర్.

"రష్మి....అయనకు 'రష్మి కింగాఫ్ కరీంగర్' అన్న బిరుదు ఉంది తెలుసా?" శ్రీనివాసరెడ్డి.

"నిజంగానా? కంగ్రాచ్యులేషన్స్!" సురేందర్.

"వెధవ యు.జి సి. స్కేల్స్....నాకూడా స్టేట్ స్కేల్స్ ఇప్పించండి"—అర్జున్‌రావు.

హాస్పిటల్‌కు వెళ్ళి కాంతారావు, ఇస్మాయిల్ స్టాఫ్‌రూమ్‌లోకి వచ్చారు.

"ఇక్బాల్ కెలావుంది? హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించారా? డాక్టర్ ఎగ్జామిన్ చేసాడా?" అక్కడున్న వాళ్ళంతా అడిగారు.



"మనం వెళ్ళాక అడ్మిట్ చేయించక పోవడమేమిటి? మాకు దారిలోనే అంబులెన్స్ ఎదురయింది తెలుసా? నేను ఫోన్ చేసాక అంబులెన్స్ రాకపోవటమేమిటి?"— కాంతారావు.

"అది సరే! ఇక్బాల్ ఎలా వున్నాడో చెప్పండి"—సీతారామారావు.

"హాస్పిటల్‌కు వెళ్ళాక నిమిషాల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అడ్మిట్ చేయించాను. కార్డియాలజిస్ట్, డాక్టర్ అశోక్‌రావు దగ్గరకెళ్ళి.... హీ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్ యూ నో....వెంటనే ఎగ్జామిన్ చేయించాను. డాక్టర్ అశోక్ నేను వెళ్ళినప్పుడు యింకెవరో పేషెంట్‌ను ఎగ్జామిన్ చేస్తున్నాడు....నేను వెళ్ళి మా కొలీగ్‌ను మీరు వెంటనే చూడాలని రిక్వెస్ట్ చెయ్యగానే వచ్చాడు. ఆ టైమ్‌లో యింకెవ్వరు వెళ్ళినా డాక్టర్ అశోక్ రావు మొహం కూడా చూసేవాడు కాడు"—కాంతారావు.

"కాంతన్నా! నువ్వు చాలా 'గొప్పవాడివేనే' అందరమూ వొప్పుకుంటాము ముందు ఇక్బాల్ సాబ్ ఎలా వున్నాడో చెప్పు" — శ్రీనివాసరెడ్డి.

"లాభం లేదు. అతను కోమాలో వున్నాడు హైదరాబాద్ తీసుకెళితే ప్రయోజనం ఏమయినా వుంటుందా? అని అడిగాను. అంబులెన్స్‌ను హైదరాబాద్ దాకా పంపించాలని మా లక్ష్మణ్‌కు చెప్పాను. అంబులెన్స్ రెడీగా వుంది కానీ డాక్టర్ అశోక్ వద్దన్నాడు. వాళ్ళ దగ్గర బంధువు లెవరయినా వుంటే ఇన్‌ఫామ్ చెయ్యమన్నాడు" కాంతారావు.

"ఇన్‌ఫామ్ చేశారా మరి?" -సీతారామారావు.

"ఇక్బాల్ సాబ్‌కు నలుగురు చెల్లెళ్ళు తప్ప వేరే దగ్గరి బంధువు లెవరూ లేరు....తండ్రి మాకు నాలుగేళ్ళ క్రితమే చనిపోయాడు యింటికెళ్ళి వాళ్ళ తల్లిని తీసుకొచ్చాం. యిప్పుడు ఆమె హాస్పిటల్‌లో అతని పక్కనే వుంది. కానీ పాపం ఆమెకు ఏమీ తెలీదు కదలలేని పరిస్థితిలో వుంది. ఇద్దరు సిస్టర్స్ ఆదిలాబాద్‌లో ఉంటారట! వాళ్ళను వెంటనే తీసుకు రమ్మని ఓ మనిషిని పంపించాను" — కాంతారావు.

"పూర్ మాన్! మన మందరమూ ఒకసారి వెళ్ళి చూసి వద్దామా?" సీతారామారావు.

"నిష్ప్రయోజనం! అతను కోమాలో ఉన్నాడు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో....ఎవర్నీ రానివ్వటం లేదు" — కాంతారావు.

"కాంతారావ్ సాబ్ రికమెండ్ చేసాక కూడా రానివ్వరా?"–రవి.

అందరూ నవ్వారు.

"అఫ్‌కోర్స్! అఫ్‌కోర్స్! కాంతారావు కొలీగ్స్ అంటే మిమ్మల్ని అందర్నీ తప్పకుండా వెళ్ళనిస్తారు. కానీ కోమాలో వున్న మనిషిని చూసి ప్రయోజన మేమిటని? నేనన్నీ అరేంజ్‌మెంట్స్ చేసే వచ్చాను."

"మీరింత ఇన్‌ఫ్లూయెన్స్ ఎలా సంపాదించారు కాంతారావు సాబ్! యూ ఆర్ రియల్లీ గ్రేట్! మిమ్మల్ని వట్టి జి కాంతారావు అనొద్దు.... జి స్టాండ్స్ ఫర్ గ్రేట్! గ్రేట్ కాంతారావు అనాలి?" నాగేశ్వరరావు.

"అఫ్ కోర్స్!" కాంతారావు.

అందరూ నవ్వారు.

"ఇప్పుడే కాదు....గత పదేళ్ళుగా ఇక్బాల్ కోమాలోనే వుంటున్నాడు" సీతారామారావు.

స్టాఫ్ రూంలోకి అటెండర్ అయిలయ్య వచ్చి "సార్! కాంతారావు సార్‌ను ప్రిన్సిపాల్ రమ్మంటున్నాడు సార్!" అని చెప్పాడు

"నన్నా? వస్తున్నానని చెప్పు" కాంతారావు

"ఈ పది పదిహేను రోజులు మీ ఎడ్వయిజర్ షిప్‌కో పెద్ద పరీక్ష" నాగేశ్వరరావు.

"ఎందుకు?"

"స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్ అయిపోయే వరకు కాలేజీలో యే క్షణం ఏం జరుగుతుందో చెప్పలేము" నాగేశ్వరరావు.

"ఓ....అదా! యేమీ జరగదు మైడియర్ నాగేశ్వరరావు....ఇలాంటి ఎలక్షన్స్ ఎన్నైనా కండక్ట్ చెయ్యగలను–వీళ్ళలో ఎన్ని గ్రూపులున్నాయో బయట వీళ్ళను కంట్రోల్ చేసే నాయకులెవరో....ఎవడ్ని ఎలా ఎదుర్కోవాలో అన్నీ తెలుసండి....అనవసరంగా ఆయన లోపల కూర్చుని ప్రతి దానికి బెంబేలు పడిపోతూ 'కాంతారావుకో బులావో, కాంతారావుకో బులావో' అంటూ కంగారుపడిపోతాడు" కాంతారావు.



"పరిస్థితిని మరీ అంత తక్కువంచనా వెయ్యకండి....చాలా ఎక్స్‌ప్లోసివ్‌గా వుంది" నాగేశ్వరరావు.

"అటమిక్ ఎక్స్‌ప్లోజన్ నైనా చల్లార్చగలను....అఫ్టరాల్ వీళ్ళెంతండి....బయట వీళ్ళను కంట్రోల్ చేసే ఇరుపక్షాల నాయకులు నాకు దగ్గరిమిత్రులు....నేనెట్లా చెబితే అట్లా చేస్తారు" కాంతారావు.

"సార్....మిమ్మల్ని జల్దీ రమ్మంటుండు సార్" అంటూ అంటెండర్ అయిలయ్య కంగారుగా మళ్ళీ వచ్చాడు.

"వరేయ్ అయిలయ్యా! ఎందుకురా అంత కంగారు? ఏమీ జరగదు. కాకపోతే ఈ పోరగాండ్లు ఒకని మీద ఒకరు అరచుకుంటారు....ఒకని పోస్టర్లొకరు చింపేసుకుంటారు....అంతకన్నా ఇంకేమీ జరగదు" అంటూ కాంతారావు లేచి ప్రిన్సిపాల్ రూమ్‌లో కెళ్ళాడు.

"ఈ ఊళ్ళోని ప్రతి ఇంపార్టెంట్ మాన్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అంటాడు. అదెంత వరకు నిజమంటారు?" అన్నాడు నాగేశ్వరరావు సీతారామారావువేపు తిరిగి.

"కొంతవరకు నిజమేనేమో....ప్రతి వి.ఐ.పి. తోనూ పరిచయం చేసుకునే ఆర్ట్ ఈయనకు బాగానే అలవడినట్టుంది. ఎ గుడ్ గో గెట్టర్-" సీతారామారావు

"మొత్తమ్మీద స్టూడెంట్స్ యూనియన్ ఎడ్వయిజర్ పదవికి ఇంతకన్నా సూటెబుల్ మనిషి ఈ కాలేజీలో మరొకడు దొరకడని మన ప్రిన్సిపాల్ గారి నమ్మకం" గోవిందరావు.

"వట్టి గొప్పలు చెప్పుకోవటమే కాదండి....! పనులు చేయించగలడు....స్టూడెంట్స్‌తో మంచి సంబంధాలు పెట్టుకుంటాడు...." సీతారామారావు.

"సిగ్గూ శరమూ వదలిపెడితే మనమూ మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఎడ్వయిజర్స్‌మి కావచ్చు" గోవిందరావు.

"ఇదేమిటి? మీరొక్కసారే సిగ్గూ శరము దాకా వెళ్ళారు....?" శ్రీనివాసరెడ్డి.

"ఔనండి! స్టూడెంట్స్‌తో తిని, స్టూడెంట్స్‌తో తాగి, వాళ్ళ దగ్గర

సిగరెట్లు అమ్ముకొన్నాని గోలచేసిన వాడి కాళ్ళుపట్టుకొని, గడుమపట్టుకొని యే లెవెల్ కంటే ఆ లెవెల్‌కు దిగజారితే ఎవరయినా సక్సెస్‌ఫుల్ అడ్వయిజర్ కావచ్చు ఎడ్వయిజర్ షిప్ అంత పాడు పని ఈ ప్రపంచంలో మరొకటి లేదు" గోవిందరావు

"అయినా మీరు ఈ సంవత్సరం ఆ ఎడ్వయిజర్ షిప్ కోసం ప్రయత్నించారు! అదే ఆశ్చర్యం!" శ్రీనివాస రెడ్డి.

"మిష్టర్ రెడ్డి! అనవసరంగా నోరు పారేసుకోకండి.... నేను యే అడ్వయిజర్ షిప్ కోసమూ ప్రయత్నించలేదు" గోవిందరావు.

రవి శ్రీనివాస రెడ్డికేసి చూశాడు... వీళ్ళిద్దరూ తీవ్రంగానే పోట్లాడుకునేట్టున్నారు. ఈ రెడ్డి ప్రతిదాన్ని ఏదో అంటాడు. ఫెళ్ళు మని కట్టె విరిచినట్టు మాట్లాడుతాడు. అందరూ తనకు బానిసలు అనుకుంటాడు.... రియల్ ఫ్యూడల్ మెంటాలిటి! ఎవరూ ఇతనికి తగినట్టుగా జవాబు చెప్పలేకపోతున్నారు....ఎప్పుడో తనే అతనికి తగిన జవాబు చెప్పాలి.

"మీరు ఎడ్వయిజర్‌షిప్ కోసం ప్రయత్నించినట్టు నేను ఋజువు చెయ్యగలను ఋజువు చెయ్యలేకపోతే నా ఉద్యోగానికి రాజీనామా చేస్తాను" శ్రీనివాసరెడ్డి దూకుడుగా ముందుకొస్తూ....

"ఋజువు చేస్తారా....చెయ్యండి. మీరు ఋజువు చేసేట్టయితే నేనూ నా ఉద్యోగానికి రిజైన్ చేస్తాను... కమాన్!" అని అన్నాడు ఆవేశంతో గోవిందరావు కూడా లేచి నిల్చొని.

"యేమిటిది? ఊర్కోండి....బయట స్టూడెంట్స్... లోపల మనం పోట్లాడుకోవడం యేమిటిది? మనమే ఇలా పోట్లాడుకుంటే ఉడుకు రక్తంతో ఉన్న కుర్రకుర్ర-వాళ్ళనని యేం లాభం? మనలోనే డిసిప్లిన్ లేకపోయినపుడు స్టూడెంట్స్‌లో డిసిప్లిన్ ఎలా వుంటుంది?" సీతారామారావు.

"అది కాదండి... ఋజువు చేస్తానన్నాడుగా....చెయ్య నీయండి.... ఈయనగారు అందరి మీద ఇలాగే ఛార్జెస్ వేస్తూ వుంటాడు. వెనకటికి పల్లెటూళ్ళో చూపించిన దొరతనాన్ని ఈయనగారు ఇప్పుడు మన మీద చూపించబోతున్నాడు" గోవిందరావు.



"మిష్టర్ గోవిందరావు....! ప్లీజ్! ఊరుకోండి....!" సీతారామారావు.

"ఊరుకోండి....ఊరుకుంటున్న కొద్దీ ఈయన నెత్తికెక్కి కూర్చుంటున్నాడు ఈ కాలేజిలో నాకు ఎదురు లేదనుకుంటున్నాడు. ఈ కాలేజీని తన స్వంత జాగీరనుకుంటున్నాడు. ఈ రోజుతో తాడో పేడో తేలిపోవాలి ...కమాన్! ఋజువు చెయ్యండి....ఋజువు చెయ్యలేకపోతే రాజీనామా చెయ్యాలి ఆ మాట మీదే వుండాలి. మళ్ళీ వెనక్కి పోవద్దు- కమాన్!" గోవిందరావు

"డెఫినెట్‌గా ఋజువు చేస్తాను" శ్రీనివాస రెడ్డి కొణుక్కుంటూ.

"ఇద్దరూ దయచేసి ఊరుకోండి...." అరిచినట్టుగా అన్నాడు సురేందర్.

అకస్మాత్తుగా స్టాఫ్ రూమ్ బయట ఏదో పెద్ద గోల—విద్యార్థుల కేకలు చాలామంది వేగంగా పరుగెత్తుతున్న చప్పుడు కొందరు స్టూడెంట్స్ స్టాఫ్‌రూమ్‌లోకి వచ్చారు పరుగెత్తుకుంటూ

లెక్చరర్లంతా ఒకరి మొహాలొకరు చూసుకొని ఏం జరిగిందో చూద్దామని బయటకు పడివారు

విద్యార్థులంతా కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ వైపు పరుగెత్తుతున్నారు. కెమిస్ట్రీ డిపార్ట్‌మెంటు తలుపులు పగిలిపోతున్నాయి. కిటికీలకున్న గ్లాస్ పేన్స్ బద్దలైపోతున్నాయి. ఏ క్షణంలోనైనా తలుపులు పగిలిపోయి ఆ గుంపంతా లోపలకు ప్రవేశించవచ్చు.

కొందరు స్టూడెంట్స్ కాలేజీ బయటకు పరుగెత్తుకున్నారు. ప్రిన్సిపాల్, రంగారావు, రామస్వామి బయట కొచ్చి ఏం జరుగుతున్నదో చూస్తున్నారు.

బయటకు పరుగెత్తుతున్న ఓ విద్యార్థుల గుంపు నాపి "ఏమైంది-? ఏమైంది?" అని అడిగారు లెక్చరర్లు

"మొదట యు.యస్.యు. వాళ్ళనొకన్ని కొట్టింద్రు సాబ్! ఆ కొట్టిన వాళ్ళు కెమిస్ట్రీ డిపార్ట్‌మెంటులో దాక్కున్నరు. వాళ్ళకోసం యు.యస్.యూ

గుంపు కెమిస్ట్రీ డిపార్ట్ మెంట్ పై దాడిచేస్తున్నరు" అన్నాడా గుంపులో ఉన్న ఒక విద్యార్థి.

"ఈ రోజు మొత్తం కెమిస్ట్రీ డిపార్ట్ మెంట్ లాబ్‌తో సహా మొత్తం స్మాషయిపోయేట్టుందే!" సీతారామారావు.

"పోలీసులకు ఫోన్ చేశారా....?" ప్రిన్సిపాల్ నుద్దేశించి అన్నాడు శ్రీనివాసరెడ్డి.

"ఇంతకు ముందే చేశాం" కాంతారావు.

"పోలీసులొస్తే వ్యవహారం ఇంకా పాడైపోతుందేమో...." సీతారామారావు.

"పాడైపోనీయండి....ఆ పోలీసులను పిలవటంకంటే మనం చెయ్యగల్గిందేముంది?" ప్రిన్సిపాల్.

అలా వాళ్ళు మాట్లాడుకుంటుండగానే కెమిస్ట్రీలాబ్ లోంచి కేకలు. గ్లాసులు పగిలిపోతున్న చప్పుడు. కిటికీలు విరిగిపోతున్న చప్పుడు కెమిస్ట్రీ స్టాఫ్‌రూమ్ తలుపులు బద్దలైపోయాయి. గుంపు లోపలకు దూరింది.

ప్రిన్సిపాల్‌లో వణుకు ప్రారంభమైంది.

"మీరు బయట నిల్చోవటం ఎందుకు సార్? మీరు లోపలకెళ్ళండి. ఏమీకాదు... ఈ పాటికి పోలీసులు బయల్దేరే వుంటారు" అన్నాడు కాంతారావు.

"కెమిస్ట్రీ లెక్చరర్లంతా స్టాఫ్‌రూమ్‌లోనే ఉన్నారా? సూర్యప్రకాశ్ ఈరోజు కాలేజి కొచ్చాడా?" అన్నాడు ప్రిన్సిపాల్ లోపలకెడ్తూ.

"ఏమీ చింతించక్కర్లేదు సార్....మీరు లోపలకెళ్ళి కూర్చోండి" అన్నాడు కాంతారావు.

ప్రిన్సిపాల్‌తోబాటు మిగతా లెక్చరర్లుకూడా ప్రిన్సిపాల్ రూమ్‌లో కెళ్ళారు. కాలేజి బయట పోలీసు వాహనాలు ఆగుతున్న చప్పుడు.

దబదబ మంటూ పోలీసులు కిందకు దూకుతున్న చప్పుడు.... గుర్రపు డెక్కల చప్పుడులా కాళ్ళ బూట్ల చప్పుడు.... పోలీసులు గబగబా పరిగెత్తుతున్న చప్పుడు....



"పోలీసులొచ్చేశారు" అంటూ కాంతారావు బయటకు పరుగెత్తబోయాడు. కాని లోపలకు చొచ్చుకుని వస్తున్న స్టూడెంట్స్‌ని చూసి ఆగిపోయాడు.

"పోలీసు లొచ్చిండ్రు.... పోలీసు లొచ్చిండ్రు" అని అరుస్తూ కాలేజి ఆవరణలోంచి తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోతున్న విద్యార్థులంతా చెల్లా చెదురుగా ఎవరికి తోచిన దిక్కుగా వాళ్ళు పరుగెత్తటం మొదలెట్టారు. అందులో కొందరు స్టాఫ్ రూంలోకి, కొందరు ప్రిన్సిపాల్ రూంలోకి దూరారు.

అలా పరుగెత్తుతున్న స్టూడెంట్స్‌ను స్టీలు హెల్మెట్స్ పెట్టుకొని, చంకన రైఫిల్, చేతిలో లాఠీలు పట్టుకున్న పోలీసులు వెంటాడటం మొదలెట్టారు. ఎవరు దొరికితే వాళ్ళను చితకబాదటం.... వ్యాన్‌లోకి ఎక్కించటము మొదలెట్టారు.

"కిసీ కోభీ నహీ ఛోడో! పకడో మా కెలవ్ డోంకో! మారో మా కెలవ్ డోంకో! కిసీ కోభీ నహీ ఛోడో! నహీ ఛోడో!" పోలీసుల అరుపులు

"కొట్టకుర్రి! చంపకుర్రి! కాళ్ళు మొక్త! దండం బెడ్త! నాకేం తెల్వదు ... నేనేం జెయ్యలే! కొట్టకుండ్రి! చంపకుండ్రి! అయ్యో! అమ్మో! అయ్యో! అమ్మో! చంపుతాండ్రురో నాయినో...." అంటూ యేడుస్తూ పెడబొబ్బలు బెడ్తూ ఎటు దారి దొరికితే అటు పరుగెత్తుతున్న స్టూడెంట్స్.

స్టూడెంట్లను వెంటాడుతున్న కొందరు పోలీసులు స్టాఫ్ రూంలోకి దూసుకొని వచ్చారు తరువాత ప్రిన్సిపాల్ రూంలోకి కూడా ప్రవేశించారు.

దొరికిన వాళ్ళను దొరికినట్టే బాదటం మొదలెట్టారు.

"వాళ్ళను కొట్టకండి.... వాళ్ళను కొట్టకండి.... వాళ్ళకేమీ తెలీదు.... వాళ్ళు అమాయకులు! వాళ్ళు అమాయకులు!" అరిచాడు ప్రిన్సిపాల్ కాని ప్రిన్సిపాల్ మాటను ఎవరూ వినిపించుకోలేదు.

లెక్చరర్ల వెనక్కి, ప్రిన్సిపాల్ వెనక్కి వచ్చి తల దాచుకున్న విద్యార్థులను లాగి కొడుతోంటే లెక్చరర్లకు, ప్రిన్సిపాల్‌కు కూడా దెబ్బలు తగిలాయి.

స్టూడెంట్స్‌లాగే వున్న కొందరు లెక్చరర్లను కూడా కొట్టబోతే "నేను లెక్చరర్‌ను.... ఐయామ్ ఎ లెక్చరర్....! లెక్చరర్!" అని గట్టిగా అరిచారు. అరిచిన తర్వాత వారిని వదిలిపెట్టారు.

కుర్చీల వెనక, టేబుళ్ళ వెనక దాక్కున్న స్టూడెంట్స్‌ను కొట్టబోయిన పోలీసులు కుర్చీలను, టేబుళ్ళను కూడా ధ్వంసం చేశారు. విరిగిన కుర్చీలతో, పగిలిన కిటికీల అద్దాలతో ఆ రూమ్ చాలా భయంకరంగా మారిపోయింది

కొన్ని సెకండ్లలో ప్రిన్సిపాల్ రూమంతా అలా మారిపోవటంతో అక్కడున్న లెక్చరర్లకు దిగ్భ్రాంతితో నోటమాట రాలేదు.

బూట్లు టకటక లాడించుకుంటూ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి ఎస్. ఐ. రమేష్ ప్రవేశించాడు

"ఇన్‌స్పెక్టర్ రమేష్! మీ పోలీసులు లెక్చరర్లను కూడా కొడుతున్నారు ఫర్నిచరంతా నాశనం చేస్తున్నారు.... స్టాప్ దెమ్! ప్లీజ్ స్టాప్ దెమ్!" అన్నాడు ప్రిన్సిపాల్.

"సారీ సర్! లెక్చరర్లు కూడా స్టూడెంట్స్‌లాగే వున్నారు. వెన్ దేరీజ్ ఎ ట్రబుల్ ఇన్ యువర్ కాలేజ్, ఇలాంటివి తప్పవు" అన్నాడు ఎస్. ఐ. రమేష్

"అసలు ట్రబులిక్కడ కాదు.... కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో.... మొదలు అక్కడ కెళ్ళండి" అరిచాడు ఎడ్వైజర్ కాంతారావు.

"డోన్ట్‌వర్రీ, మా వాళ్ళు అక్కడకూడా వెళ్ళారు...." అన్నాడు రమేష్.

ప్రిన్సిపాల్ రూమ్‌లో దూకిన పోలీసులు కొట్టటం ఆపేసి ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆర్డర్స్ కోసం చూస్తున్నారు. విద్యార్థులంతా హృదయ విదారకంగా యేడవడం మొదలెట్టారు.

"వీళ్ళందర్నీ తీసుకెళ్ళి వ్యానెక్కించండి-" అన్నాడు ఎస్. ఐ.

లోపలున్న స్టూడెంట్స్ నందర్నీ వ్యాన్ ఎక్కించమంటున్నారని ప్రిన్సిపాల్‌కు అర్థమైంది.



"వీళ్ళందర్నీ ఎందుకు? వీళ్ళందరూ అమాయకులు" అరిచారు ప్రిన్సిపాల్.

"మీకందరూ అమాయకుల్లాగే కనబడ్తారు. కమాన్.... వ్యానెక్కించండి" గర్జించాడు రమేష్.

స్టూడెంట్స్‌లో కొందరు— "మమ్మల్ని వదిలిపెట్టండి సార్! మాకేం తెల్వదు సార్!" అని ఏడుస్తూనే ఎస్.ఐ.ని బతిమాలారు.

బయటింకా భీభత్సం జరిగింది.

స్టాఫ్‌రూంలో దూకిన పోలీసులు ఇంకా దురుసుగా, క్రూరంగా ప్రవర్తించారు. స్టూడెంట్స్‌లా వున్న ఇద్దరు లెక్చరర్లకూ కూడా దెబ్బలు తగిలాయి.

పోలీసులు కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ దాకా వెళ్ళేటప్పటికి చాలామంది స్టూడెంట్స్ పారిపోయారు.

అక్కడ దొరికిన ఐదారుగురు స్టూడెంట్స్‌ని మాత్రం చాలా క్రూరంగా కొట్టి అరెస్ట్ చేశారు.

కెమిస్ట్రీ లాబ్‌లో దూరి అక్కడ దాక్కున్న కొందరు విద్యార్థులకు పోలీసులకు జరిగిన ఘర్షణలో కెమిస్ట్రీలాబ్ మొత్తం ధ్వంసమైపోయింది.

అంతకుముందు అక్కడ విద్యార్థులకు మధ్య జరిగిన కొట్లాటలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవార్ని జీపెక్కించి హాస్పిటల్‌కు పంపించారు.

కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో వున్న లెక్చరర్లకూ కూడా పోలీసుల లాఠీ దెబ్బలు తగిలాయి. విద్యార్థుల మధ్య జరిగిన కొట్లాటలో మాత్రం లెక్చరర్లకేమీ కాలేదు.

కాలేజీ అన్నివైపులనుండి రక్తాలు కారుతున్న విద్యార్థులను పోలీసులు పట్టి తెచ్చి వ్యానెక్కించసాగారు.... రెచ్చిపోయిన విద్యార్థులు "పోలీస్ డౌన్, డౌన్! ప్రిన్సిపాల్ డౌన్ డౌన్!" అని తమ శక్తికొద్దీ అరవసాగారు.

పోలీసుల మధ్యలోంచి ప్రభాకర్ బయటకొచ్చి ప్రిన్సిపాల్ రూమ్‌లోకి పరుగెత్తాడు. అతనివెంట మిగతా స్టూడెంట్స్ ఇద్దరు రిజర్వు కానిస్టేబుల్స్ కూడా లోపలకు పరుగెత్తారు

ప్రభాకర్ ప్రిన్సిపాల్ ముందుకొచ్చి అరవటం మొదలెట్టాడు-

"పోలీసుల్ని మీరే రమ్మన్నారా సార్? మమ్మల్నిట్ల కొట్టమని మీరే చెప్పింద్రా సార్? మమ్ముల వేరేగ్రూపు గూండాలు కొట్టినప్పుడు యేం జేసింద్రు? లెక్చరర్లు కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌ను జె.వి.పి కార్యాలయంగా మార్చినప్పుడేం జేసింద్రు సార్? మేం ఎన్ని కంప్లెయింట్సిచ్చినా బుట్టల బడేసి గిప్పుడు పోలీసుల బిలిపించి మమ్ముల గొట్టిపిస్తారా? చూడుండ్రి.... మా రక్తం చూడుండ్రి.... మా వీపులెట్ల బగిలినయో చూడుండ్రి.... మమ్మల్ని గిట్ల రక్తాలొచ్చేటట్లు కొట్టించిండ్రు గద! ఇగ ఈ కాలేజెట్ల నడుస్తదో మేం జూస్తం.... మీ ప్రిన్సిపాల్ గిరి ఎట్ల నడుస్తదో మేం జూస్తం...." ప్రభాకర్ తనకూ మిగతా స్టూడెంట్స్‌కూ కారిన రక్తాన్ని చూపిస్తూ ఆవేశంతో బిగ్గరగా ఆ గదంతా దద్దరిల్లేలా అరిచాడు.

బయట "ప్రిన్సిపాల్ డౌన్‌డౌన్! ప్రిన్సిపాల్ డౌన్‌డౌన్! పోలీస్ డౌన్‌డౌన్! జె.వి.పి. డౌన్‌డౌన్!" అన్న కేకలు మిన్నుముట్టాయి

"ఈ విషయంలో నేను జేసిందేమీ లేదు ప్రభాకర్! కాలేజీలో గొడవైనప్పుడు పోలీసులకు తెలియజేయటం నా బాధ్యత" అన్నాడు ప్రిన్సిపాల్.

"గొడవెందుకయింది సార్? మీరు సకాలంలో చర్య తీసుకుంటే ఇవ్వాళ ఈ గొడవయ్యేదా? దీనికంతకీ మీ అసమర్థతే కారణం సార్! బయటేం జరుగుతున్నదో మీకక్కర్లేదు.... రూమ్‌లో కూర్చొని కాగితాల మీద సంతకాలు పెట్టటం తప్ప రోజూ మీరేం జేస్తున్నారు? మీ లెక్చరర్లు స్టూడెంట్ల రాజకీయాల్లో ఎట్ల జోక్యంచేసుకుంటున్నరో చూస్తున్నారా? లోపలకూర్చొని పోలీసులకు ఫోన్‌జేసి మమ్ముల కొట్టిస్తరు!" ప్రభాకర్ అలా మాట్లాడుతుండగానే వెనక నిల్చున్న విద్యార్థుల గుంపులోంచి—



"లంజకొడుకు! లఫ్డీకొడుకు! దొంగముండ కొడుకు! దొంగలంజె కొడుకు! వీని ...." అన్న బూతులు బాణాల్లా దూసుకువచ్చాయి. రెచ్చిపోయిన స్టూడెంట్స్ నోటికొచ్చినట్లల్లా అరిచారు.

మళ్ళీ పోలీసులు విజృంభించారు.

విద్యార్థుల మీద మళ్ళీ లాఠీ దెబ్బల వర్షం.... విద్యార్థులింకా బిగ్గరగా అరిచారు.

"పోలీస్ డౌన్‌డౌన్! ప్రిన్సిపాల్ డౌన్‌డౌన్! పోలీస్ డౌన్‌డౌన్...!" అన్న కేకలకు రమేష్ మండిపడ్డాడు.

"కమాన్.... అందర్నీ వ్యాన్లెక్కించండి...." అరిచాడు సబిన్స్‌పెక్టర్ రమేష్....

మిన్నుముట్టుతున్న కేకలతో కొందరు.... దయనీయమైన యేడుపులతో మరికొందరు.... మొత్తం మీద దొరికినంత మేరకు వ్యాన్లెక్కించారు స్టూడెంట్సనందర్నీ.

ఇంతలో ప్రిన్సిపాల్ రూమ్‌లో ఫోన్ మోగింది కాంతారావు ఫోనెత్తాడు.

"హల్లో.... సబిన్‌స్పెక్టర్ రమేష్ కావాలా? ఒక్క నిముషం లైన్‌లో వుండండి" అంటుండగానే రమేష్ ఫోనందుకున్నాడు.

"హల్లో.... నమస్కారం సార్.... ఎవ్రీథింగ్ ఈజ్ కంట్రోల్డ్ సర్.... ఎవ్రీథింగ్ ఈజ్ అండర్ కంట్రోల్ సర్.... అక్కర్లేదు సర్... ఎవ్రీథింగ్ ఈజ్ అండర్ కంట్రోల్ సర్.... ఇట్స్ నథింగ్ సర్.... ఇట్స్ ఏన్ ఎలిక్షన్ క్లాస్ బిట్వీన్ టూ గ్రూప్స్— యు.ఎస్.యు అండ్ జె.వి.పి... నథింగ్ సర్.... నో సర్.... ప్రిన్సిపాల్.... స్టాఫ్ అందరూ వున్నారు సార్.... వాళ్ళకెవరికీ యేం కాలేదు సార్.... దే ఆర్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్ సర్.... ఓ.కె సర్!" ఇన్‌స్పెక్టర్ ఫోన్ పెట్టేశాడు.

సురేందర్ కోపంగా రమేష్ వైపు చూశాడు

"దే ఆర్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్ అంటారేమిటి? మా లెక్చరర్లకు కూడా కొందరికి దెబ్బలు తగిలాయి. యూ మస్ట్ అపోలజైజ్!" అరిచాడు సురేందర్.

"మిష్టర్! మీ పేరేమో నాకు తెల్వదు" అన్నాడు ఎస్.ఐ. కఠినంగా.

"సురేందర్!"

"మిష్టర్ సురేందర్! మీరిక్కడ లెక్చరరా?"

"ఔను.... ఐయామ్ ఆల్ సో సెక్రెటరీ ఆఫ్ లెక్చరర్స్ అసోసియేషన్."

"ఐ డోన్ట్ కేర్! కాని మీరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకొని మాట్లాడాలి"

"అంతే?"

కాంతారావు వచ్చి ఆగమని సురేందర్‌కు సైగ చేశాడు.

"మిమ్మల్ని అపోలజీ కోరుకోవాలా? ఎందుకు? మా డ్యూటీ మేం చేసినందుకా?"

"కనిపించిన వాడినల్లా కొట్టటమేనా మీ డ్యూటీ? ఇప్పుడు మీరు కొట్టి కొట్టి తీసుకెళుతున్న విద్యార్థులంతా అమాయకులమని ప్రిన్సిపాల్ గారు చెబుతున్నా వినిపించుకోరెందుకు?" అన్నాడు సురేందర్.

ఇన్‌స్పెక్టర్ రమేష్ ప్రిన్సిపాల్ వైపు తిరిగాడు.

"మిష్టర్ ప్రిన్సిపాల్! మీ సోకాల్డ్ సెక్రటరీ ఆఫ్ లెక్చరర్స్ అసోసియేషన్‌ను మీరు కంట్రోల్ చేస్తారా? లేక నన్ను కంట్రోల్ చేయమంటారా?"

ప్రిన్సిపాల్ వెంటనే యేమీ మాట్లాడలేకపోయాడు.

"సురేందర్ ప్లీజ్! మీరూరుకోండి! ప్లీజ్!" బతిమాలుతున్నట్టుగా అన్నాడు కాంతారావు.

"ఈ క్షణంలో నిన్ను అరెస్ట్ చేసి వాళ్ళతోబాటు వ్యానెక్కిస్తాను.. బి కేర్‌ఫుల్ మిష్టర్ సురేందర్!" కఠినంగా అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తన బూట్లతో పెద్ద శబ్దం చేస్తూ ఆ రూమ్‌లోంచి బయటకెళ్ళిపోయాడు.

లెక్చరర్లంతా నిశ్శబ్దంగా నిల్చుండిపోయారే తప్ప ఎవరూ నోరు మెదపలేదు



బయట వ్యాన్‌లెక్కిన స్టూడెంట్స్ 'పోలీస్ డౌన్‌డౌన్! ప్రిన్సిపాల్ డౌన్‌డౌన్!" అంటూ అరుస్తూనే వున్నారు. పోలీస్ వ్యాన్స్, జీప్ స్టార్టయి వెళ్ళిపోతున్న చప్పుడు.

కాలేజీలో యేడెనిమిది మంది కానిస్టేబిల్స్‌ను కాపలా పెట్టి మిగతా పోలీసులంతా వెళ్ళిపోయారు.

కాలేజంతా నిశ్శబ్దంగా మారిపోయింది.

లెక్చరర్లు, అటెండర్లు గేటుముందు పోలీసులు తప్ప విద్యార్థులెవరూ లేరు. బయట ఎక్కడెక్కడో వున్న లెక్చరర్లంతా ప్రిన్సిపాల్ రూమ్‌లో కొచ్చారు.

"దిసీజ్ టూమచ్ సర్! ఆఫ్టరాల్ ఒక పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్... ఇంతమంది లెక్చరర్లు....గెజిటెడ్ ఆఫీసర్స్‌తో అంత దురుసుగా మాట్లాడుతోంటే మీరేమీ మాట్లాడరేమిటి?" కోపంగా ధ్వనించింది సురేందర్ కంఠం.

"చూడండి.... పరిస్థితి ఇలా హఠాత్తుగా మన చేతులు దాటిపోతుందని నేనూహించలేదు.... ఆయామ్ రియల్లీ సారీ" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఆలా సిట్యుయేషన్ మన చేతుల్లోంచి జారిపోవటం యెలా జరిగింది సార్? పోలీసుల్ని కాలేజీ లోపలకు పిలిపించవలసినంత పరిస్థితిని" రవి పూర్తి చెయ్యకుండానే-

"మిస్టర్ రవీ! నా పొజిషన్ కూడా అర్థం చేసుకోవాలి మీరు. ఇలా జరుగుతుందని...." అన్నాడు ప్రిన్సిపాల్.

"పరిస్థితి విషమిస్తోందని అందరూ చెప్పకుంటుంటే మన ఎడ్వైజర్‌గారేమో ఎవ్రీథింగ్ ఈజ్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్ అంటూ కూర్చున్నాడు. మీరూ మీ 'ఎడ్వైజర్'గారూ కలిసి పరిస్థితిని ఇంత దూరం తీసుకొచ్చారు. స్టూడెంట్స్‌ని, లెక్చరర్స్‌ని పోలీసులచేత కొట్టించారు...." —రవి.

"గోరుచుట్టు మీద రోకటిపోటులా ఇదంతా చాలక....పోలీస్ యిన్‌స్పెక్టర్ చేత తిట్టించారు...." - సురేందర్.

"దీనికంతటికీ ఎడ్వైజరే కారణం" వెనుక నిల్చున్న ఐదారుగురు లెక్చరర్లు ఒకేసారి అరిచారు.

"మీరంతా మాట్లాడితే నా ఎడ్వయిజర్ షిప్‌కు నేనిప్పుడే రాజినామా చేస్తాను....యెవరిని పెట్టుకుంటారో పెట్టుకోండి....వెధవ ఎడ్వయిజర్‌షిప్ యెవడిక్కావాలి?" కాంతారావు అప్పటి కప్పుడు కలమూ, కాగితమూ తీసు కొని రిజిగ్నేషన్ లెటర్ వ్రాయడం మొదలుపెట్టాడు.

"మిష్టర్ కాంతారావ్! ప్లీజ్....తొందరపడకండి....లెటజ్ హావ్ ఎ స్టాఫ్ మీటింగ్....అన్ని విషయాలు అక్కడ డిస్కస్ చేద్దాం...రామయ్య గారూ! వెంటనే నోటీసు పంపించండి స్టాఫ్ నందర్కీ....యిప్పుడు టైమెం తయింది? పన్నెండున్నర...పన్నెండు నలభై ఐదుకు అందర్నీ రూమ్ నెం వన్‌లో సమావేశం కమ్మని నోటీసు పంపించండి...." అన్నాడు ప్రిన్సిపాల్.

"అలాగే సార్...." అన్నాడు రామయ్య.

ఆ కాలేజీలో ప్రిన్సిపాల్ తరువాత అందరికంటే సీనియర్ లెక్చ రర్.

"అందరం రూమ్ నెం. వన్‌లో సమావేశమవుదాం. అక్కడ అన్నీ చర్చిద్దాం...." అన్నాడు ప్రిన్సిపాల్ అక్కడున్న లెక్చరర్ల నందరినీ వుద్దే శించి.

లెక్చరర్లందరూ ప్రిన్సిపాల్ రూమ్ నుండి బయటకొచ్చి ఆ కాలే జీలో వున్న లెక్చర్ హాల్స్‌లో కల్లా పెద్దదయిన రూమ్ నెం. ఒకటి వైపు కదిలారు.

"వియ్ మస్ట్ ప్రొటెస్ట్ దిస్....వియ్ మస్ట్ ప్రొటెస్ట్....దీసీజ్ టూమచ్....సింప్లీ టూమచ్" అన్నాడు గోవిందరావు బయటికి నడుస్తూ.

"ఔను! వియ్ మస్ట్ ప్రొటెస్ట్...." అన్నారు అక్కడున్న మిగతా వాళ్ళందరూ.

"ప్రొటెస్ట్ అంటే ఏం చేద్దామని?"—సీతారామారావు.

"ఏమైనా చేద్దాం—వాడు అపోలజీ కోరేంతవరకూ స్ట్రయిక్ చేద్దాం" గోవిందరావు.

"మనం స్ట్రయిక్ చేస్తే అడిగే వాడెవడు....? రేపట్నుంచి కాలేజే మూసేస్తారు"—మురళీమోహన్.



"మనం ఏదో ఒకటి చేసి తీరాలి....వాడి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేద్దాం! ఫాస్ట్ చేద్దాం! యేదయినా చేద్దాం! కానీ యింత అవమానాన్ని భరించి కూడా యేం చెయ్యకుండా వుండటమా...?" ఆవేశంగా అన్నాడు రవి

"ధర్నా చేద్దామా....? వాడు వెంటనే తీసుకెళ్ళి లాకప్‌లో పడేసి బాదటం మొదలెడతాడు. అసలు పోలీసు వాడి జోలికే వెళ్ళగూడదు.... మోస్ట్ డేంజరస్"—నాగేశ్వరరావు

"అంటే....ఇంత ఇన్‌సల్ట్‌ను భరించి కూడా...."—రవి.

"ఇన్సల్టేముంది? పోలీసు వాడిని పిల్చాక కొట్టకుండా వుంటాడా? కొట్టటమే వాడి పని"—నాగేశ్వరరావు

అందరూ వెళ్ళి రూమ్ నెం ఒకటిలో కూర్చుని యెక్కడి వాళ్ళ క్కడ తమలో తాము మాట్లాడుకోవడం మొదలెట్టారు.

రవి వెళ్ళి మురళీమోహన్ పక్కన కూర్చున్నాడు.

కళ్ళు మూసుకుంటే అన్నీ యిందాకటి దృశ్యాలే!

అంతా క్షణంలో జరిగిపోయింది

అంతా యేదో నాటకంలో, యేదో సినిమాలో జరిగిపోయినట్టుగా జరిగింది.

అంతా తను చూస్తున్నాడు....సైలెంట్ స్పెక్టేటరుగా—జరుగుతున్న సంఘటనల్ని ఇన్‌ఫ్లుయెన్స్ చెయ్యలేడు....ఈ కాలేజి....ఈ లెక్చరర్లు.... ఈ ప్రిన్సిపాల్....ఈ స్టూడెంట్స్....ఈ పోలీసులు....

ఈ ఇన్‌స్పెక్టర్లు—ఇదంతా ఒక పెద్ద మెషీన్....ఆ మెషీన్‌లో తనో చిన్న నలుసు....ఒక నట్, ఒక బోల్టు, హౌ ఇన్‌సిగ్నిఫికెంట్....! హౌ హెల్ప్‌లెస్! ఆ మెషీన్ ఈ సిస్టమ్ నడిపిస్తుంది. ఈ సిస్టమ్‌ను డబ్బున్న వాళ్ళు నడిపిస్తారు భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ధనవంతుడి చుట్టూ తిరుగుతోంది! ఈ సిస్టమ్‌ను ఎవడు మార్చాలి? అందరూ ఈ సిస్టమ్‌ను కాపాడటానికే పని చేస్తున్నారు.

లెక్చరర్లు, పోలీసులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు....అంతా ఈ సిస్టమ్‌ను కాపాడుతూ ఉన్నవాళ్ళే. దీని కొమ్ము కాస్తున్నవాళ్ళే. ఈ సిస్టమ్

వాళ్ళను కొట్టినా, తిట్టినా, తన్నినా, మీద ఉమ్మేసినా నీళ్ళల్లో చలనం లేదేమిటి? గబగం గబగబ గుర్రపు డెక్కల చప్పుడు చేసూ పరుగెత్తిసట్టుగా పోలీసులు కాలేజికి....మారో....మారో....కిసీకో నహీ ఛోడో....అమ్మో! అయ్యో! దండం పెడ్తా....కాళ్ళు మొక్త....నన్నొదిలి పెట్టండ్రి—నన్నొదిలి పెట్టండి....నహీ ఛోడో మాకే లవ్ డోంకో....మాదర్ చో దోంకో కిసీకో నహీ ఛోడో లెక్చరర్లం మమ్మల్నికూడా కొడ్తారా....నహీమారో—హమ్ కో నహీ మారో....యెక్యా ఖద్మాషీ హై భయి... లెక్చరరోంకో భీ మా రేక్యా....హమ్‌కో బద్మాష్ బోల్తే మాకే లవ్ దే... కౌన్ హైవో—మార్ డాలుంగా మాకెలవ్ డోంకో....నహీ, నహీ హమ్ తుమ్‌కో బద్మాష్ నహీ బోలే....చచ్చాన్రా బాబోయ్—చచ్చాను—" యేడ్పులు, పెడబొబ్బలు, హాహాకారాలు.

పోలీసుల ఈ రూపాన్ని తనెన్నడూ చూళ్ళేదు. పోలీసులు, ది ప్రొటెక్టర్స్ ఆఫ్ దిస్ సిస్టమ్. మంచీ, చెడూ, న్యాయం, అన్యాయం యేదీ వాడికక్కర్లేదు. ఎల్లప్పుడు డబ్బున్న వాళ్ళ పక్షమే! అదొక్కటే న్యాయం, అదొక్కటే ధర్మం. సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ.... అన్ని ధర్మాలను వదిలేసి పోలీసు వాడిని శరణువేడు. అదొక్కటే నిన్ను రక్షిస్తుంది. పోలీసు వాడి జోలికెళ్ళకు. మోస్ట్ డేంజరస్. పాపం ప్రభాకర్! తల పగిలింది నొసలు చిట్లింది. మోచేయి విరిగింది. అదిగో గ్రేట్ సూర్యప్రకాష్ హాల్లోకి ఎంటరౌతున్నాడు. హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ. ఇవ్వాళ్ళ జరిగిన ఈ నాటకానికి సూత్ర ధారుడు.

"అబ్బే! నాకేం తెలియదండి. పాఠాలు చెప్పుకొని ఇంటికెళ్ళిపోతాను. అంతే! ఈ గొడవలతో నాకేమీ సంబంధం లేదు."

ఆహా! ఎంత బాగా చెప్పారండి. ఒక అబద్ధాన్ని పదిసార్లు చెప్పేస్తే నిజమైపోతుంది. దాట్ గో బెల్లింగ్ గోబెల్స్! దాట్ హిట్లరింగ్ హిట్లర్! దాట్ సూర్యప్రకాషింగ్ సూర్యప్రకాష్! ఈ పెద్దాయనింకా రాదేమిటి—? పూర్ ఫెల్లో యేం చేస్తాడో? యేం చేస్తాడు? ఈ సిస్టమ్‌లో అతడూ ఓ నలుసు. ఎ కాగ్ ఇన్ ది మెషిన్!



"ప్రిన్సిపాల్ షిప్పంటే బెడాఫ్ రోజెస్ కాదండి—ఇట్స్ ఎ బెడాఫ్ థారన్." ఐ ఫాల్ అపాన్ ది థారన్స్ ఆఫ్ లైఫ్! అవర్ స్వీటెస్ట్ సాంగ్స్ ఆర్ దోజ్ దట్ టెల్ అవర్ సాడెస్ట్ థాట్స్. మరపురాని బాధకన్నా మధురమే లేదు. సమయానికి రావటం శాస్త్రీయమయితే సమయానికి రాక పోవటం కృష్ణ శాస్త్రీయమట! ఆంధ్రా షెల్లీ కృష్ణశాస్త్రి.

ఎవ్వరని యెంతురో నన్ను నాకు కన్నీటి సరుల దొంతరలు గలవు. నా కమూల్యమపూర్వమానంద మొసగు— నిరుపమ నితాంత దుఃఖంపు నిధులు కలవు.

రజని కూడా ఉన్నాయి నిరుపమ నితాంత దుఃఖంపు నిధులు! ఏం చేస్తున్నదో? ఇంకా ఏడుస్తూనే ఉంటుందా? పాపం—తను కష్టపడి చేసిన ఉప్మా తినకుండానే వచ్చేశాడు. తను వెళ్ళేవరకు ఏడుస్తూనే వుంటుంది. వెధవ మీటింగ్ ఎప్పుడైపోతుందో—వెళ్ళగానే రజనిని దగ్గరకు తీసుకొని ఓదార్చాలి, కడుపులో పేగులు గుర్రుమంటున్నాయి. పాపం రజని కెంత ఆకలిగా వుందో! తను వెళ్ళే వరకు తినదు. ఎన్నిసార్లు చెప్పినా అంతే! ప్రపంచం ఎంత మారినా ఈ దేశపు ఆడవాళ్ళు మాత్రం మారరు.

"12-45 అయిపోయింది. శిశుపాలుడింకా రాదేమిటి?" అందరికీ వినిపించేలా అన్నాడు అర్జునరావు.

ప్రిన్సిపాల్ నెప్పుడూ శిశుపాలుడని పిలవటం అర్జున్‌రావుకు అత్యంత ఆనందదాయకమైన విషయం.

అర్జున్‌రావు మాట వినగానే చాలా మంది లెక్చరర్లు నవ్వారు.

"నూరు తప్పులు పూర్తవ్వాలిగా—అప్పుడు గానీ వస్తాడేమో!" అన్నాడు సూర్యప్రకాష్!

"మరి శ్రీ కృష్ణుడు రెడీగా వున్నాడా?" అన్నాడు శ్రీ రంగాచారి.

"మన అర్జున్‌రావే శ్రీకృష్ణుడు. అర్జునుడు ఆయనే, శ్రీ కృష్ణుడూ ఆయనే, నరనారాయణుడు" అన్నాడు సూర్యప్రకాష్.

మళ్ళీ అందరు గొల్లున నవ్వారు.

ప్రిన్సిపాల్ మీద ఎవరు ఏ జోకేసినా అందరూ అలాగే గొల్లున నవ్వుతారు.

"ఇంతకు ముందు ఈ గొడవంతా జరిగినప్పుడు మీరు మీ డిపార్ట్‌మెంట్‌లోనే వున్నారా?" అన్నాడు సీతారామారావు సూర్యప్రకాష్ కేసి తిరిగి.

"డిపార్ట్‌మెంట్‌లో వుండకపోతే ఇంకెక్కడుంటామండి?"

సూర్యుడిలా ఎప్పుడూ ప్రకాశిస్తూ వుంటాడు. తెల్లనివాడు—ఆజానుబాహుడు తెల్లగా నిగనిగ లాడుతున్న లాల్చీ, పైజామా ధరిస్తాడు

"మీకైతే ఏం కాలేదుగా?"

"యేం కాలేదు కాని యేవన్నా అయ్యేదే సమయానికి పోలీసులు రాకపోతే—" సూర్యప్రకాష్.

"మీరేనయం—అన్నింటికంటే సేఫ్ అనుకున్న ప్రిన్సిపాల్ రూంలో వున్న మేం లాఠీల రుచి బాగానే చూశాల్సొచ్చింది" సురేందర్.

"ఇంకో కొన్ని సెకండ్లు ఆలస్యమయితే మేం లాఠీలేం కర్మ—? బాంబుల రుచి, పిస్టళ్ళ రుచి, అన్నింటి రుచి చూసే పైకెళ్ళిపోయేవాళ్ళం" సూర్యప్రకాష్.

"ఏమిటీ? వాళ్ళ దగ్గర బాంబులు, పిస్తోళ్ళు కూడా వున్నాయా?" శ్రీ రంగాచారి.

"యేమనుకున్నారు మరి? వాళ్ళేమన్నా పూలదండలతో వచ్చారనుకుంటున్నారా? ఒకర్నో ఇద్దర్నో అంతం చెయ్యాలనే వచ్చారు—" సూర్యప్రకాష్.

రవి అసహనంగా అటూ ఇటూ కదిలాడు.

లైస్! వైట్ లైస్! అనడల్టరేటెడ్ ప్యూర్ లైస్! మంచివాళ్ళు ప్రాయంగా ఇంత గొప్ప అబద్ధం ఆడటం కూడా ఒక గొప్ప కళే! చుట్టూ వున్న వాళ్ళచేత దాన్ని నమ్మించటం ఇంకా గొప్ప కళ!

"వాళ్ళ దగ్గర బాంబులు, పిస్తోళ్ళు వున్నాయా? డర్టీ డ్యామ్‌లైస్!" అన్నాడు రవి పక్కనున్న మురళీ మోహన్‌కు మాత్రమే వినిపించేలా.

"మిమ్మల్ని మీరు కాస్సేపు కంట్రోల్ చేసుకోండి. ఇప్పుడు మనం ఏం మాట్లాడినా కెమిస్ట్రీ డిపార్ట్‌మెంటును ఎటాక్ చెయ్యమని మనమే



వాళ్ళకు సలహా ఇచ్చినట్టు రుజువు చేసే ప్రయత్నంచేస్తాడు సూర్యప్రకాష్!" గుస గుసగా అన్నాడు మురళీమోహన్.

"అది నిజమే—కానీ వాడంత వైల్డ్ చార్జెస్ చేస్తోంటే నోరు మూసుకొని ఎలా వుండటం?" రవి.

"వుండక చేసేదేమీ లేదు" మురళీమోహన్.

ప్రిన్సిపాల్, రామయ్య, కాంతారావు ఇంకా కొందరు లెక్చరర్లు కలిసి ఆ హాల్లో ప్రవేశించారు

ప్రిన్సిపాల్ వెళ్ళి ప్లాట్ ఫామ్ మీదున్న కుర్చీ మీద కూర్చున్నాడు.

ఆ హాల్లో కూర్చున్న దాదాపు 40 మంది లెక్చరర్లు ప్రిన్సిపాల్ రాగానే లేచి నిల్చొని ఆయన కూర్చున్నాక కూర్చున్నారు.

అంత సేపూ ఒకరితో ఒకరు మాట్లాడుతున్న ఆ 40 మంది లెక్చరర్లు నిశ్శబ్దంగా మారిపోయి ప్రిన్సిపాల్ కేసి చూడసాగారు.

ఒక్క నిమిషం అక్కడ నిశ్శబ్దంగా కూర్చున్న వాళ్ళ నందర్నీ పరిశీలనగా చూసి ప్రిన్సిపాల్ లేచి నిల్చొని మాట్లాడటం మొదలెట్టాడు.

డియర్ కొలీగ్స్,

చాలా అసాధారణ పరిస్థితుల్లో మనమిక్కడ ఈ రోజు సమావేశమయ్యాం.

ఈ రోజు మన కాలేజీలో కొన్ని దురదృష్టకరమైన సంఘటనలు జరిగాయి అందుకు నేను చాలా విచారిస్తున్నాను. ఇలాంటి విధ్వంసక సంఘటనలు మన కాలేజీలో జరుగుతాయని—ఆ కారణంగా పోలీసులను పిలిపించవలసి వస్తుందని—నేను కలలో కూడా అనుకోలేదు. అఫ్‌కోర్స్! స్టూడెంట్ వయలెన్స్ అనేది దేశంలో అతి సాధారణమై పోయిందనుకోండి. కానీ సాధారణంగా పీస్‌ఫుల్‌గా వుండే మన కాలేజీలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయంటే నిజంగా నేనెంత విచారపడుతున్నానో చెప్పటానికి నాకు మాటలు దొరకటంలేదు. ఇట్స్ రియల్లీ ఎ బ్యాడ్ డే—ఎ వెరీ వెరీ బ్యాడ్ డే — ఇట్స్ వెరీ షేమ్ ఫుల్! మన విద్యార్థులిలా చేశారంటే నేను చాలా సిగ్గుపడుతున్నాను .. బాధపడుతున్నాను. ఇట్స్ ఎ సార్టాఫ్

ఎ షాక్ టు మీ....నా ఫీలింగ్స్‌ని మీకు ఎలా తెలియజేయాలో తెలియటం లేదు...."

ప్రిన్సిపాల్ ఐదారు క్షణాల వరకు ఆగాడు.

జేబులో వున్న కర్చీఫ్ తీసి చెమటతో నిండిన ముఖమంతా తుడుచుకున్నాడు కళ్ళద్దాలు తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు లావుగా, ఎత్తుగా, ఎర్రగా ఉంటాడు. ఫుల్‌సూట్ వేసుకుని చాలా హుందాగా కనిపించటానికి ప్రయత్నిస్తాడు.

ఆ హాల్లో కూర్చున్న 40 మంది లెక్చరర్లు ప్రిన్సిపాల్ కేసి కళ్ళప్పగించి అతని ప్రతి మాటను జాగ్రత్తగా వినసాగారు.

కళ్ళద్దాలు కళ్ళకు తగిలించుకుని ప్రిన్సిపాల్ మళ్ళీ మాట్లాడటం మొదలెట్టాడు.

"ఈ రోజు జరిగిన సంఘటనలకు రాబోయే స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్ కారణమని మీకందరికీ తెలుసు. ఎలక్షన్స్ ఇంకా పదిరోజులుండగానే వాతావరణం ఇంతగా వేడెక్కిపోతుందని మేమనుకోలేదు....

విద్యార్థుల్లో రెండు క్లియర్ గ్రూప్స్ ఉన్నాయి వీళ్ళ వెనుక ఈ ఊళ్లోని ముఖ్యమైన రాజకీయ నాయకులు, పార్టీలున్నాయి.

"ఈ ఎలక్షన్ కాంపైన్ స్టార్టయినప్పట్నుంచి ఈ రెండు గ్రూపుల వాళ్ళు ఒకరి మీద ఒకరు ఎన్నో కంప్లెయింట్స్ ఇచ్చారు. అందులో కల్పించినవి కొన్ని....నిజాలు కొన్ని—చాలా సున్నితమైన పరిస్థితి....మన విద్యార్థి సంఘ సలహాదారు ఇరుపక్షాల నాయకులతోను తరచుగా కలుస్తూ ఏ గొడవా జరక్కుండా చూశాడు. వాళ్ళ కంప్లెయింట్స్‌ను బట్టి ఎవరిమీద చర్య తీసుకున్నా పెద్ద గొడవై పోతుందని మేం ఎవరిమీదా చర్య తీసుకోలేదు ...చాలా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఒక పక్షం వారు కొందరు లెక్చరర్స్‌మీద కూడా కంప్లెయింట్ చేశారు ... తమ ప్రతి పక్షానికి బాహాటంగా సపోర్ట్ చేస్తున్నారని...." ప్రిన్సిపాల్ మళ్ళీ కాసేపు ఆగాడు.



లెక్చరర్లంతా నిశ్శబ్దంగా ప్రిన్సిపాల్ మాటలు వింటున్నారు .... ఎవరా లెక్చరర్లు? పేర్లు కూడా చెప్పేస్తాడా?

రవి మళ్ళీ అసహనంగా తన సీట్లో అటూ ఇటూ కదిలాడు. ఆ లెక్చరర్ల పేర్లు కూడా చెబితే బావుండును "ఆ లెక్చరర్లెవరో చెప్పండి సార్!" అని తను డిమాండ్ చేస్తే....మొదటి ప్రశ్న తనే వేస్తే? వద్దు....వద్దు....కొంతసేపు నిశ్శబ్దంగా ఉండటమే మంచిది. ఇంకా ఎంతకాలం ఈ నిశ్శబ్దం? సహనం గాడిద లక్షణం! పద ముందుకు ఫైర్ ది ఫస్ట్ షాట్! అఫెన్స్ ఈజ్ ది బెస్ట్ డిఫెన్స్! ఆకలితో, అవమానంతో చావటంకంటే పోరాటంలో చావటం మేలు. కమాన్! జ్వలించు....త్యజించు....తెగించు....నో, నో, నో, నువ్వింకా చిన్నవాడివి....లాభం లేదు. ఆవేశానికి కళ్ళెం వెయ్....తలుపు గొళ్ళెం....హారతి పళ్ళెం....కాదేదీ కవిత కనర్హం....

"అసలు ఈ రోజు ఏం జరిగిందో పరిస్థితి హఠాత్తుగా ఎలా మన చేతులు దాటిపోయిందో నేను చెప్పటంకంటే మన స్టూడెంట్స్ యూనియన్ ఎడ్వైజర్ మిస్టర్ కాంతారావు చెప్పటం బావుంటుందని అనుకుంటున్నాను."

ప్రిన్సిపాల్ తన సీట్లో కూర్చున్నాడు. అందరి కళ్ళూ కాంతారావు మీదకు మళ్ళాయి.

కాంతారావు వేదిక మీదకొచ్చాడు..... అతను కొంచెం పొట్టిగా, సన్నగా ఉంటాడు. ఇన్‌షర్ట్ వేసి ఎత్తుమడమల బూట్లు వేసుకుంటాడు. చేతిలో ఎప్పుడూ ఒక బ్యాగ్ ఉంటుంది. అందర్నీ ఒకసారి చూసి-

"గౌరవనీయులైన ప్రిన్సిపాల్‌గారికి, నా మిత్రులు సహోద్యోగులైన మీ అందరికీ నమస్కారం, లేడీస్ అండ్ జెంటిల్మన్!" గంభీరంగా అన్నాడు కాంతారావు. అందరూ గొల్లున నవ్వారు.

"సారీ లేడీస్ ఎవరూ లేనట్టుంది ఈ సభలో....మన స్టాఫ్‌లో వున్న ఇద్దరు లేడీ లెక్చరర్స్ కూడా ఈరోజు శలవు పెట్టారన్న విషయం మరిచి పోయాను. అలవాటులో పొరపాటు" మళ్ళీ కొందరు నవ్వారు.

"ఫరవాలేదు.... అసలు విషయం మొదలెట్టండి" అన్నాడు ముందు సీట్లో కూర్చున్న సురేందర్.

"మిస్టర్ సురేందర్! కొంచెం ఓపిక పట్టండి! ఇది మీ అసోసియేషన్ మీటింగ్ కాదు. నాలుగు నిమిషాల్లో చేతులు దులుపుకొని వెళ్ళిపోవటానికి...." కాంతారావు.

"మీ మాటలకు నా తీవ్ర అభ్యంతరం తెలియజేస్తున్నాను! ఇక్కడ మా అసోసియేషన్ ప్రసక్తి తీసుకురావలసిన అవసరమేముంది? మీరు అనవసరంగా అన్న ఆ మాటల్ని ఉపసంహరించుకోవాలి" ఖంగున మ్రోగింది సురేందర్ కంఠం....

"కాదు' ఉపసంహరించుకోవాల్సిందే!" అన్నాడు రవి లేచి ఇంకో అయిదారుగురు యువలెక్చరర్లు కూడా లేచి, ఉపసంహరించుకోవా"లన్నారు.

"మిస్టర్ కాంతారావు! అసలు విషయం చెప్పకుండా వేరే విషయాలెందుకు? జరిగిందేమిటో చెప్పండి" అన్నాడు ప్రిన్సిపాల్

"ఆల్‌రైట్ సర్!" అన్నాడు కాంతారావు టేబుల్‌మీద పెట్టిన తన బ్యాగ్‌లోంచి యేవో కాగితాలు బయటకు తీస్తూ....

కాంతారావు లెక్చరర్స్ అసోసియేషన్‌కు సెక్రటరీ కావాలని ప్రయత్నించాడు. కాని ఎక్కువ మంది సురేందర్‌ను సపోర్ట్ చేయటం వల్ల మెదలకుండా ఊరుకున్నాడు. అప్పట్నుంచి ఎప్పుడు ఎక్కడ ఎలాంటి అవకాశం వచ్చినా సురేందర్‌ను దెబ్బతీయటానికి ప్రయత్నిస్తాడని అక్కడ కూర్చున్న చాలా మందికి తెలుసు.

తన చేతుల్లో వున్న కాగితాలను అటూ ఇటూ తిరగేస్తూ కాంతారావు మాట్లాడటం మొదలెట్టాడు.....

"ఇంకో పది రోజుల తర్వాత జరుగబోయే స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్‌లో మొత్తం 45 మంది పోటీ చేస్తున్నారు. అందులో ప్రెసిడెంట్‌కు నలుగురు, జనరల్ సెక్రటరీకి ఐదుగురు, వైస్ ప్రెసిడెంట్‌కు ముగ్గురు, జాయింట్ సెక్రటరీకి నల్గురు, కల్చరల్ సెక్రటరీకి ముగ్గురు...."

"ఈ వివరాలన్నీ ఇప్పుడు మిమ్మల్ని ఎవరు చెప్పమంటున్నారు?



Association

షీర్ వేస్టాఫ్ టైమ్! ఈరోజేం జరిగిందో చెప్పండి...." అన్నాడు సురేందర్.

"మిస్టర్ సురేందర్! ఈ రోజు జరిగిన సంఘటనలకు స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్‌కు చాలా సంబంధముంది.... ఏ సంఘటన ముందో యే సంఘటన వెనకో చెప్పటానికి ఈ ఎలక్షన్స్‌లో ఎంతమంది పోటీ చేస్తున్నారో, ఎన్ని పొలిటికల్ పార్టీలు ఈ ఎలక్షన్స్ వెనుక వున్నాయో మొదలైన విషయాలన్నీ చెప్పాలి.... అట్లా చెబితేనే ఈరోజు జరిగిన సంఘటనలు మీకు అర్థమౌతాయి.... మీకంత ఓపిక లేకపోతే...."

కాంతారావు యేదో అనబోతుంటే అతన్ని ఆపేసి ప్రిన్సిపాల్ అన్నాడు.

"సురేందర్‌గారూ! మీరు కొంచెం ఓపిక పట్టండి. ఆయన అన్ని విషయాలు చెబుతాడు...."

"థాంక్యూసర్! సో ఈ ఎలక్షన్స్‌లో మొత్తం 45మంది స్టూడెంట్స్ పోటీ చేస్తున్నారు ... అన్నిటికంటే ప్రెసిడెంట్ అండ్ సెక్రటరీ పదవులకు పోటీ చాలా తీవ్రంగా వుంది. ఈ 45 మంది వెనుక నాలుగు రాజకీయ పార్టీలు పనిచేస్తున్నాయి. అందులో ప్రధానంగా రెండు పార్టీల మధ్య పోటీ తీవ్రంగా వుంది.... ఆ పార్టీల పేర్లు చెప్పటం బావుండదు క్షమించండి!"

"ఎందుకు బావుండదు? ఆ విషయం ఎవరికి తెలియదని... అందరికీ తెలుసు.." అన్నాడు వెనక కూర్చున్న గోవిందరావు.

"అందరికీ తెలిసినప్పుడు నేను చెప్పకపోతే మాత్రం యేం" అన్నాడు కాంతారావు.

అందరూ మళ్ళీ గొల్లున నవ్వారు.

కాంతారావు మళ్ళీ యేవో కాగితాలకోసం తన బ్యాగ్ అంతా వెతకటం మొదలెట్టాడు. అందరూ అసహనంగా ఓ నిముషం సేపు ఎదురు చూశారు.

"అసలు విషయమేమిటో చెప్పకుండా మమ్మల్నిలా ఎంతసేపు కూర్చోబెట్టారేంటి! వాటీజ్ దిస్? ఇదేమన్నా స్టాఫ్ మీటింగా లేక ఎడ్వైజర్ గారి ఏక పాత్రాభినయమా?" అరిచాడు సురేందర్.

"అట్లా ఇంట్లో పెండ్లాంమీద అరచినట్లు అరుస్తారేమిటి? సభా మర్యాదంటే యేమిటో తెలుసుకోండి." సురేందర్ కంటె పెద్ద గొంతుతో అరిచాడు కాంతారావు..

కొందరు లెక్చరర్లు నవ్వారు... కొందరు చప్పట్లు కొట్టారు.. కొందరు లెక్చరర్లు "డిసీజ్ టూమచ్" అంటూ అరిచారు.

'సైలెన్స్ ప్లీజ్' అంటూ ప్రిన్సిపాల్ లేచి నిల్చొని తన శక్తికొద్దీ అరిచాడు.

కొంచెంసేపు నిశ్శబ్దం..

"ఆయన తను అన్నమాట ఉపసంహరించుకోవాలి సార్!" అంత వరకు ఈ మీటింగ్ జరగటానికి వీల్లేదు.." అన్నాడు సురేందర్.

"ఔను...ఔను" అంటూ కొందరు లెక్చరర్లు అరిచారు. "నేనేమన్నా నని ఉపసంహరించుకోవాలి... నేను మాట్లాడుతోంటే మాటిమాటికి అడ్డు తగిలినందుకు మీరసలు క్షమాపణ చెప్పుకోవాలి." అన్నాడు కాంతారావు.

"యేం జరిగిందో చెప్పకుండా మీరు పదే పదే గంటలకొద్దీ బ్యాగు వెదకడమేమిటి? ఇదివరకు జరిగినదంతా అలావుంచి ఇలా బ్యాగు వెదకడం హాస్యాస్పదంగా వుంది. తలలు పగిలి, రక్తం చిందీ మన స్టూడెంట్స్ పోలీస్‌స్టేషన్ కెళ్తే... మనమేమో ఇలా అసలు విషయం వదిలేసి చిన్న విషయాల మీద గంటల గంటలు టైమ్ వేస్ట్ చేస్తున్నాము... యేం జరిగిందో చెప్పటానికెందుకింత రాద్ధాంతం? చెప్పటం చేతకాకపోతే దిగిపోండి..." చాలా కోపంగా అన్నాడు సురేందర్.

కాంతారావు వెంటనే ప్రిన్సిపాల్ వైపు తిరిగాడు.

"సర్! అతడు చాలా అవమానకరంగా మాట్లాడుతున్నాడు. అతడు వెంటనే అలా మాట్లాడినందుకు క్షమాపణ చెప్పకపోతే నేను స్టూడెంట్స్ యూనియన్ ఎడ్వైజర్‌షిప్‌కు ఇప్పుడే రాజీనామా చేస్తున్నాను.." అంటూ కాంతారావు తన బ్యాగ్‌లోంచి ఓ తెల్లని కాగితం తీసి తన రాజీనామా లెటర్ రాయసాగాడు.

అక్కడ కూర్చున్న లెక్చరర్లంతా మళ్ళీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం, చప్పట్లు కొట్టడం మొదలెట్టారు.



"మిష్టర్ కాంతారావు. తొందరపడకండి.. ప్లీజ్! సురేందర్ గారూ! దయచేసి మీరాయనకు అడ్డు పడకండి... ఆయన చెప్పేదేదో ఆయన్ని చెప్పనీయండి" బ్రతిమాలినట్లుగా అన్నాడు ప్రిన్సిపాల్.

కాస్సేపు నిశ్శబ్దం.

"అసలు ఇదంతా యేదో గొప్ప ప్లాన్‌తో.. గొప్ప డిజైన్‌తో జరుగుతోంది సార్" అంతసేపూ నిశ్శబ్దంగా కూర్చున్న సూర్యప్రకాష్ లేచాడు.

అందరూ ఆశ్చర్యంగా అతనికేసి చూశారు.

"ప్లానేమిటి? డిజైనేమిటి?" అన్నాడు ప్రిన్సిపాల్.

"అతన్ని మాట్లాడనీయకుండా పదే పదే అతనికి అడ్డు తగలటంలో ఉద్దేశ్య మేమిటి? అసలు విషయాన్ని పక్కదారులు పట్టించాలనేగా.. తలలు పగిలింది విద్యార్థులకే కాదు. లెక్చరర్ల తలలు కూడా పగిలాయి. తలలేకాదు....ప్రాణాలు కూడా పోయేవే! వాళ్ళు స్టూడెంట్స్ కాదు.... మర్డరర్స్....మనుషుల రక్తం తాగి బతికే రాక్షసులు. వాళ్ళను సమర్థించా లనే ఈ మీటింగ్‌ను పక్కదార్లు పట్టించాలన్న ఉద్దేశ్యంతోనే స్టూడెంట్స్ యూనియన్ ఎడ్వయిజర్‌ను మాట్లాడనీయకుండా చెయ్యటం జరుగుతోంది." చాలా ఆవేశంగా ప్రతి మాట వత్తి పలుకుతూ మాట్లాడాడు సూర్యప్రకాష్.

ఐదారుగురు లెక్చరర్లు "హియర్....హియర్...." అంటూ చప్పట్లు కొట్టారు.

వెంటనే సురేందర్ లేచాడు.

"సూర్యప్రకాష్‌గారు అనవసరంగా ఏదేదో ఊహించుకుంటున్నారు. నేనెవర్నీ సమర్థించటానికి ప్రయత్నించటం లేదు. మీటింగ్‌ను పక్కదార్లు పట్టించుకోదలచుకోలేదు. చెప్పేదేమిటో త్వరగా చెప్పండి అంటున్నాను. అంతే! ఇందులో డిజైన్లు, ప్లాన్లు ఏమీలేవు. సూర్యప్రకాష్‌గారి ఊహా శక్తికి నా జోహార్లు."

వెంటనే రవి మరికొందరు "హియర్....హియర్...." అంటూ చప్పట్లు కొట్టారు.

వెంటనే ప్రిన్సిపాల్ లేచి నిల్చున్నాడు.

సభలో మళ్ళీ సంపూర్ణమైన నిశ్శబ్దం ఏర్పడింది.

"మనమంతా బాగా చదువుకున్న వాళ్ళం. సామాజిక సమస్యల గురించి ఆలోచించే వాళ్ళం....బుద్ధి జీవులం. దేశ భవిష్యత్తు మన మీద ఆధారపడి వుంది. మనం ఆదర్శవంతులంగా, ఉన్నత సంస్కారం కల్గిన వాళ్ళంగా వుంటే మనం ఆదర్శవంతులైన సంస్కారవంతులయిన విద్యార్థులను దేశానికి సమర్పించగల్గుతాం. ఇట్లాంటి మీటింగ్స్‌లో మనమే ఇలా పోట్లాడుకుంటే దేశం అధోగతి పాలవుతుంది. మనలో కొంత సహన శక్తి. ఓర్పు, హుందాతనం వుండాలి. కాస్సేపు ఓపిగ్గా నిశ్శబ్దంగా వుండలేరా? స్టూడెంట్స్‌ను కంట్రోల్ చెయ్యటం ఈజీ అనిపిస్తోంది మిమల్ని చూస్తుంటే. ఇక్కడ నాలుగు విషయాలా మాట్లాడుకోవాలి గాని అస్తవ్యస్తతని సృష్టించకూడదు గదా! కాస్సేపు నిశ్శబ్దంగా వుండండి. ఒక పది నిమిషాల్లో ఈ రోజు జరిగిన సంఘటనల్ని క్లుప్తంగా చెప్పమని ఎడ్వాయిజర్ కాంతారావు గారిని కోరుతున్నాను."

ప్రిన్సిపాల్ కూర్చున్నాడు.

అందరూ నిశ్శబ్దంగా కాంతారావువైపు చూశారు.

"థాంక్యూ సర్! ఇంతకు ముందు బ్యాగ్‌లో నేను వెతికింది ఏమిటంటే స్టూడెంట్స్ అనేక విషయాల మీద ప్రిన్సిపాల్‌గారికి ఇచ్చిన కంప్లెయింట్ లెటర్స్."

"ప్లీజ్ లీవ్‌దెమ్ ఎ సైడ్! ఈ రోజు జరిగిన విషయం చెప్పండి-" కోపంగా అన్నాడు ప్రిన్సిపాల్.

"ఆల్‌రైట్ సర్....! సారీ సర్....! ఈ రోజు పదకొండున్నర ప్రాంతంలో స్టూడెంట్స్‌లో ఒక వర్గం వారు మరో వర్గానికి చెందిన ఒక స్టూడెంట్ మీద చెయ్యి చేసుకున్నారు" అన్నాడు కాంతారావు.

"యే వర్గం వాళ్ళు యే వర్గం వాడిమీద చెయ్యి చేసుకున్నారో స్పష్టంగా చెప్పండి....ఏదీ దాచనక్కరలేదు" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఆల్‌రైట్ సర్....జె.వి.పి. వాళ్ళు యూ.ఎస్.యు.కి చెందిన ఒక స్టూడెంట్ మీద చెయ్యి చేసుకున్నారు. వెంటనే యూ ఎస్.యూ. వాళ్ళ



నాయకుడు ప్రభాకర్ వచ్చి ప్రిన్సిపాల్‌కు కంప్లెయింట్ చేశాడు. అప్పుడు స్టాఫ్ రూంలో వున్న నన్ను పిలిచి ప్రిన్సిపాల్‌గారు ఈ విషయం చెప్పారు. ఈ విషయంలో ఏం చేస్తే బాగుంటుందో తేల్చుకోవడానికి నేనూ, ప్రిన్సిపాల్ గారూ, మరికొందరు సీనియర్ లెక్చరర్స్ కలిసి ఆలోచిస్తున్నాము. వెంటనే యాక్షన్ తీసుకోవాలని. తన వర్గానికి చెందిన స్టూడెంట్‌ను కొట్టిన వాళ్ళను కాలేజీ నుంచి బహిష్కరించాలని ప్రభాకర్ పట్టుబట్టాడు" కాంతారావు.

"కొట్టిన వాళ్ళ పేర్లు చెప్పాడా?" అడిగాడు సీతారామారావు.

"చెప్పాడు" అంటూ కాంతారావు మళ్ళీ బ్యాగ్ వెనకడం మొదలెట్టాడు.

వెంటనే ప్రిన్సిపాల్ లేచి ...

"కొట బడిన వాడి పేరు సురేంద్రనాథ్ బి.కామ్ సెకండియర్.... కొట్టారని చెప్పబడిన వాళ్ళు వీరయ్య (బి.ఎస్.సి. ఫైనలియర్), పాపిరెడ్డి బి.ఎ. ఫైనలియర్" అన్నాడు.

"థాంక్యూ సర్....! ప్రిన్సిపాల్‌గారు వీరయ్య, పాపిరెడ్డిలకోసం అటెండర్‌ను పంపించారు. క్లాసెస్ జరగటం లేదు కాబట్టి వాళ్ళు ఎక్కడున్నారో తెలియలేదు. వాళ్ళకోసం వెళ్ళిన అటెండర్ వాళ్ళు కాలేజీలో ఎక్కడా లేరని వచ్చేశాడు. యేం చేయాలా అని ఆలోచిస్తుండగానే చాలా దురుసుగా మాట్లాడుతూ ప్రభాకర్ ప్రిన్సిపాల్ రూమ్‌లోంచి బయటకెళ్ళిపోయాడు.

అతడు బయటకెళ్ళిన అరగంటలోనే ఒక పెద్ద గుంపు కాలేజీలోకి చొచ్చుకొని రావటం....కెమిస్ట్రీ డిపార్ట్‌మెంటును ధ్వంసం చేసి లోపల దాక్కున్న కొందరు స్టూడెంట్స్‌ను కొట్టటం జరిగింది. బయటనించి వచ్చిన గుంపులో చాలా మంది బయటి వాళ్ళే వున్నారు. ఆ గుంపు కాలేజీ గేటులో అడుగు పెడుతున్నపుడే పరిస్థితి అదుపు తప్పిపోతున్నదని గమనించి ప్రిన్సిపాల్‌గారు పోలీసులకు ఫోన్ చెయ్యటం జరిగింది. పోలీస్ వారు సకాలంలోనే వచ్చారు. వాళ్ళు రావటం యే కొంచెం ఆలస్యమైనా ఇవాళ మన కాలేజీలో జరిగిన హింసాకాండలో ఇద్దరో ముగ్గురో ప్రాణాలు పోగొట్టుకునేవాళ్ళు. డి.ఎస్.పి. రామచందర్ నాకు బాగా తెలిసినవాడు కావటం వల్ల నేను ఫోన్

చెయ్యగానే పోలీసులను పంపించాడు. లేకపోతే ఈ రోజు కాలేజీలో రక్తం ప్రవహించేది. యూనో డి.ఎస్.పి. రామచందర్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటూ కాంతారావు ఇంకా యేదో చెప్పబోతుండగా ప్రిన్సిపాల్ లేచి "చాలు మిష్టర్ కాంతారావు. మీరు కూర్చోండి" అన్నాడు.

"థాంక్యూ సార్!" అంటూ కాంతారావు తన బాగ్ సర్దుకొని వచ్చి తన సీట్లో కూర్చున్నాడు.

"ఫ్రెండ్స్! జరిగిందేమిటో కాంతారావు క్లుప్తంగా తెలియజేశారు. కాలేజీలో చాలా విపరీత పరిస్థితి నెలకొన్నది. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి అన్న విషయంలో మీ అభిప్రాయాల్ని తెలియజేయాలని కోరుతున్నాను. అంతే కాదు. మన స్టాఫ్‌లో కూడా ఎవరైనా తమ తమ అభిప్రాయాలు చెప్పొచ్చు, సలహాలు కూడా ఇయ్యొచ్చు. సభ్యుల్ని తమ అభిప్రాయాల్ని సాధ్యమైనంత క్లుప్తంగా....టు ది పాయింట్....తెలియజేయాలని కోరుతున్నాను. ఒకరు మాట్లాడుతున్నప్పుడు మరొకరు కలగ జేసుకోవద్దని, గందరగోళం సృష్టించ గూడదని కోరుతున్నాను."

ప్రిన్సిపాల్ కూర్చోబోతుండగా తను మాట్లాడదల్చుకున్నానన్న విషయాన్ని సురేందర్ ప్రిన్సిపాల్‌కు తెలిపాడు.

"రండి సురేందర్! వచ్చి మాట్లాడండి" అన్నాడు ప్రిన్సిపాల్.

సురేందర్ వేదిక మీదకొచ్చిన మరుక్షణంలో చాలా వేగంగా మాట్లాడటం మొదలెట్టాడు.

"ఫ్రెండ్స్....నేను ఎక్కువ టైమ్ తీసుకోను....ఇక్కడ మనం ఆలోచించాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే కాలేజీకి నిజంగా పోలీసులను పిలవాల్సిన అవసరం ఏర్పడిందా? సురేంద్రనాథ్ అనే స్టూడెంట్‌పైన ఎవరో చేయి చేసుకున్నప్పుడు వెంటనే మనమే ఏదో చర్య తీసుకుంటే మన స్టూడెంట్ యూనియన్ ఎడ్వయిజర్ గారికి తన బెస్ట్ ఫ్రెండ్‌కు ఫోన్ చేయాల్సిన అవసరం యేర్పడేదా? ఆయన తక్షణం మన ఎడ్వయిజర్‌గార్ని ఆదుకోటానికి పంపించిన ఆ పోలీసు వాళ్ళు అటు మన స్టూడెంట్స్‌ను, ఇటు మన కొలీగ్స్‌ను చితక బాదాల్సిన పరిస్థితి యేర్పడేదా? అసలు విషయం



ఏమిటంటే...." సురేందర్ ఇంకా ఏదో మాట్లాడుతుండగానే కాంతారావు విసురుగా తన సీట్లోంచి లేచాడు.

"సురేందర్‌గారి మాటల పట్ల నా తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాను. ఆ మాటలు, ఆ ధోరణి నన్ను దూషించటమే పనిగా వస్తున్నాయి. నేనే వెళ్ళి బలిసి పోలీసుల్ని పిలిపించి స్టూడెంట్స్‌ని, లెక్చరర్స్‌ని కొట్టించానన్న అర్థం లాగటానికి సురేందర్ ప్రయత్నిస్తున్నారు. ఈ ఎడ్వయిజర్ పని నాకింక అనవసరం! ఇప్పుడే రిజైన్ చేసి పడేస్తున్నాను. నేనసలు ఈ మీటింగ్‌లోనే వుండదలచుకోలేదు. ఈ అడ్వయిజర్ పనియెడల, ఈ మీటింగ్ పట్ల నా తీవ్ర నిరసన తెలియజేస్తూ ఇప్పుడే వాకౌట్ చేస్తున్నాను." అంటూనే తను రాసిన రిజిగ్నేషన్ లెటర్ ప్రిన్సిపాల్ ముందు పడేసి కాంతారావు ఆ హాల్లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

కన్ను మూసి తెరిచేలోగా జరిగిన ఈ సంఘటన అక్కడున్న వాళ్ళందర్నీ ఆశ్చర్యపరిచింది. కాంతారావు బయటకు వెళ్ళగానే అతని వెంటనే రామయ్య, శ్రీ రంగాచారి కూడా బయటకు వెళ్ళి అతన్ని లోపలకు రమ్మని బతిమిలాడటం మొదలెట్టారు.

"మిష్టర్ సురేందర్! దయచేసి మీ అభిప్రాయం మీరు చెప్పండి....ఇంకొకరు మాట్లాడిన దానిమీద కామెంట్ చెయ్యకండి....ప్లీజ్" అన్నాడు ప్రిన్సిపాల్.

"నేను కామెంటేం చేశాను సార్....! పోలీసుల్ని పిలవకుండా ఈ హింసాకాండ లేకుండా చెయ్యగల్గే వాళ్ళం కాదా అన్నాను....అంతమాత్రానికి ఆయన లేచి అలా పరుగెత్తుతాడేం? పరుగెత్తనీయండి" అన్నాడు సురేందర్.

"పరుగెత్తనిస్తే ఈ ఎడ్వయిజర్ పని ఎవరు చెయ్యాలి? అరచినట్టుగా అన్నాడు ప్రిన్సిపాల్.

"ఇంతమంది లెక్చరర్స్‌లో మీకు ఆయన తప్ప ఎడ్వయిజర్ పని చెయ్యటానికింకెవరూ దొరకలేదా?" అన్నాడు సురేందర్.

"ఎవరున్నారండి....సీనియర్ లెక్చరర్స్‌ని ఎవర్ని పిలిచి అడిగినా మా కొద్దంటే మాకొద్దని చేతులు దులుపుకుంటూ వెళ్ళిపోయారు.

ప్రిన్సిపాల్ ఏం చేస్తాడూ? ఎవరికో ఒకరికి ఆ పని అప్పజెప్పాలి గదా....అడక్కుండానే అతనొకడు చేస్తానని ముందుకొచ్చాడు అతని కున్న లొసుగులు అతనికున్నాయి. నాకు తెలుసు! ఆమాత్రం వర్క్ చేస్తానని ఎవరూ ముందుకు రాలేదు కదండి! అదో పనికిరాని పని అని ప్రతి వారు దాన్ని వదిలించుకోవాలనే చూస్తే ఎలా? నాకూ ఈ ప్రిన్సిపాల్ షిప్ వదిలెయ్యాలనే ఉంది....కాని ఎంతకాలమని తప్పించుకుంటాం? ఎవరో ఒకరు చెయ్యాలిగా" అన్నాడు ప్రిన్సిపాల్.

ఈలోగా బయటి కెళ్ళిపోయిన కాంతారావును రామయ్య, శ్రీరంగా వారి కలిసి మళ్ళీ లోపలకు తీసుకొచ్చి అతని సీట్లో కూర్చోబెట్టారు.

"తప్పించు కొమ్మని ఎవరూ చెప్పటం లేదు సార్! చేసే పనేమిటో జాగ్రత్తగా, బాధ్యతా యుతంగా అన్ని కోణాల నుంచి ఆలోచించి చెయ్య మంటున్నాము." అన్నాడు సురేందర్.

"స్టూడెంట్స్ యూనియన్ ఎడ్వయిజర్ షిప్ సీనియర్ లెక్చరర్లే చేయాలని రూలేమయినా ఉందా సార్? యువకులు శక్తి మంతులు అయిన జూనియర్ లెక్చరర్స్ ఎందరో ఆ బాధ్యతను స్వీకరించటానికి సిద్ధంగా వున్నారు. కాని మీరు వాళ్ళనెవ్వర్నీ అడగలేదు" అకస్మాత్తుగా అన్నాడు వెనుక కూర్చున్న ఆ కాలేజీ జూనియర్ లెక్చరర్ల లీడర్ సుధాకర్.

"ఔను సార్....మీరు యంగ్ లెక్చరర్ల నెవర్నీ అడగలేదు...." అన్నారు మరో ముగ్గురు యంగ్ లెక్చరర్లు ఒకేసారి లేచి.

"ఇప్పటికయినా మించిపోయిందీ లేదు మిస్టర్ సుధాకర్! ఎడ్వయిజర్ షిప్ మీరు తీసుకొండి. నాకేం అభ్యంతరం లేదు! ఇప్పుడే మీకు ఛార్జ్ ఇచ్చేస్తాను. రేపు స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్ కూడా మీరే కండక్ట్ చెయ్యండి....కమాన్! ఛార్జి యిచ్చేస్తాను రండి!" అన్నాడు కాంతారావు తన సీట్లోంచి లేచి నిల్చొని.

"మిస్టర్ కాంతారావు! కొంచెం తమాయించుకోండి! అడ్వయిజర్‌గా ఒకర్ని నామినేట్ చెయ్యవల్సిందీ మీరు గాదు" చాలా దృఢంగా ధ్వనించింది ప్రిన్సిపాల్ గొంతు.



"సారీ సర్! నేను ఆవేశపడ్డాను" అనబోయాడు కాంతారావు.

"పోన్లెండి! అసలు విషయమేమిటంటే ఎడ్వయిజర్‌గా సీనియర్ లెక్చరర్నే నామినేట్ చేయాలి. అతనా బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తాడన్న నమ్మకం ప్రిన్సిపాల్‌కి కలగాలి....ఇది చాలా సెన్సిటివ్ జాబ్ కదా" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఔను సార్! అన్నీ సీనియర్ లెక్చరర్లకు, టీచర్ ప్రమోటీలకే ఇవ్వండి.. ఎంత వయసు ముళ్ళిన వాళ్ళయితే అంత మంచిది. బాగా బాధ్యతలను నిర్వహించగలరు. ఎప్పుడూ జీ.వో. లను గూర్చి మాట్లాడే టీచర్ ప్రమోటీ లయితే బెస్ట్!" అన్నాడు సుధాకర్.

"యేమిటా దూకుడు! టీచర్ ప్రమోటీ లెప్పుడూ జీ.వో.ల గురించే మాట్లాడుతారా? పాఠాలు చెప్పరా? ఈ యువక లెక్చరర్లేమో పొడిచేశారా? పిల్లకాకి కేమి తెలుసు ఉండేలు దెబ్బ! అన్నట్లు వయసులో వున్నామని మిడిసి పడుతున్నారు" గొప్ప ఆవేశంతో కొట్టుకుపోతూ మాట్లాడసాగాడు శ్రీరంగావారి.

తెల్లటి ధోవతి, లాల్చీ, పైన ఉత్తరీయం వేసుకున్న శ్రీరంగావారి మీద ఉన్న ఉత్తరీయాన్ని చేతితో జులిపిస్తూ మాట్లాడుతోంటే అందరూ గొల్లున నవ్వారు.

"మిస్టర్ రంగావారి! దయచేసి కూర్చోండి....మనం అనవసర విషయాలని గూర్చి మాట్లాడుతూ ఇప్పటికే చాలా టైమ్ వేస్ట్ చేశాం దయచేసి ప్రస్తుత విషయాన్ని గూర్చి తప్ప అనవసర విషయాలని గూర్చి మాట్లాడకండి. మిస్టర్ సురేందర్! మీరింకా మాట్లాడ వలసిందీ ఏమయినా వుందా?" అన్నాడు ప్రిన్సిపాల్ అంతసేపూ వేదిక మీద నిలుచున్న సురేందర్‌తో.

"ఔను సార్! కాలేజికి పోలీసులని పిల్చారు ఆ పోలీసులొచ్చి వాళ్ళ కంటికి కనిపించిన వాళ్ళ నందర్నీ బాదేశారు.

"మేం లెక్చరర్లం" "మేం లెక్చరర్లం"...."మమ్మల్ని కొట్టకండి" "మమ్మల్ని కొట్టకండి" అని కేకలు పెడుతున్నా వాళ్ళు ఆగలేదు. లెక్చరర్లే కాదు ప్రిన్సిపాల్ చెపుతున్నా వాళ్ళు ఆగలేదు ప్రిన్సిపాల్ రూంలో

దూరి ఫర్నిచరంతా ధ్వంసం చేశారు. ఇదేమిటని అడిగినందుకు ఎస్.ఐ. చాలా దురుసుగా మాట్లాడాడు. నన్ను కూడా అరెస్టు చేయిస్తానని బెదిరించాడు. ఈ పోలీసు జులుంని మనం ఖండించాలి. ఇందుకు మన నిరసన ఏదో ఒక రూపంలో తెలియజెయ్యాలి. ఎలా తెలియజేస్తే బావుంటుందో ఇప్పుడు మనం నిర్ణయించాలి. నా అభిప్రాయ మేమిటంటే ఆ పోలీసు ఎస్.ఐ. అపాలజీ కోరాలని ఈ సమావేశం డిమాండ్ చెయ్యాలి. అఫ్‌కోర్స్ పోలీసువాడు వెంటనే అపోలజీ కోరుకోడనుకోండి. ఒక రెండు రోజులు టైమిచ్చి ఆ రెండు రోజులు గడిచేలోగా పోలీసువాళ్ళ తరఫున ఎవరయినా అపాలజీ కోరుకోకపోతే స్ట్రయిక్ చెయ్యాలి! అంతకంటే వేరే మార్గం లేదు" అన్నాడు సురేందర్.

సురేందర్ నోటినుండి స్ట్రయిక్ అనే మాట వెలువడగానే సభలో పెద్దకలకలం, కేకలు, చప్పట్లు....

"నోనోనో ...మేమేం స్ట్రయిక్ చెయ్యం....మేం టెంపొరరీ వాళ్ళం....మేం స్ట్రయిక్ చేసిన క్షణంలో మాకు ఉద్యోగాలూడుతాయి" అరిచాడు సుధాకర్.

"ఔను... ఔను....మా టెన్ ఏవన్ వాళ్ళ ప్రాబ్లెమ్స్‌ని యే అసోసియేషనూ పట్టించుకోదు. రేపు మాకందరికీ పోస్టింగ్ ఆర్డర్సు వస్తే మా గతేం కావాలి" అని అరిచాయి మరికొన్ని కంఠాలు.

ఆ మాటలకు కొందరు వంత పాడారు.

తను కూర్చున్న సీట్లోంచి విసురుగా లేచాడు రవి .... పొంగి పొరలిపోతున్న ఆవేశాన్ని అతను యిక ఆపుకోలేక పోయాడు....రవి వేదిక మీదకు రాగానే అందరూ నిశ్శబ్దంగా మారిపోయి అతనికేసి చూడ సాగారు.

మైడియర్ ఫ్రెండ్స్,

ఈ రోజు కాలేజీలో దారుణమయిన, అత్యంత భయంకరమయిన సంఘటనలు జరిగాయి. టీచర్స్‌గా మనం అందరం తలలు వంచుకోవల్సిన సంఘటనలు మన కళ్ళముందే అమాయకులయిన విద్యార్థుల్ని చితక బాదుతోంటే 'ఇదేమిటి' అని అడిగినందుకు మనలని కూడా కొట్టారు. ఇంత



జరిగినా దాదాపు గంటసేపట్నుంచి మనం అసలు విషయాలు వదిలేసి యేవేవో మనలోని వ్యక్తి పరమయిన విభేదాలని ఇక్కడ చర్చించుకుంటూ టైమంతా వేస్ట్ చేశాం....అసలు కాలేజికి పోలీసు లెందుకొచ్చారు? ప్రిన్సిపాల్ గారు సకాలంలో యాక్షన్ తీసుకుంటే పోలీసుల అవసరం పడేదా? అన్న విషయాన్ని చర్చించండి. ప్రిన్సిపాల్ గారు సకాలంలో చర్య తీసుకోలేదు. అందువల్లనే పరిస్థితి మన చేతులు దాటిపోయింది. పోలీసుల్ని పిల్చారు. పోలీసులు వచ్చారు. వచ్చిన వాళ్ళు ప్రిన్సిపాల్ గారిని అడగొచ్చు గదా! అసలు జరిగిన అల్లరి ఏమిటి? ఎక్కడ? సరే, ముఖ్య సమస్య కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ గదా! పోలీసుల్ని అక్కడకు పంపితే యింత బీభత్సం జరిగి వుండేది కాదు. కాని పోలీసులు ఇష్టాను సారం చెలరేగి కనిపించిన స్టూడెంట్సల్లా పరుగులు పెట్టించారు. స్టాఫ్ రూంలో దూరారు. ప్రిన్సిపాల్ గారి రూంలోనూ దూరారు. అడ్డమొచ్చిన వాళ్ళను స్టూడెంట్లా లేక లెక్చరర్లా అన్నది గమనించక కొట్టారు. ప్రిన్సిపాల్ గారి మాట కూడా వాళ్ళు వినిపియ్యలేదు. యే పాప మెరుగని ఎంతోమంది విద్యార్థుల కాళ్ళు చేతులు విరగగొట్టింది చాలక వాళ్ళందరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసికెళ్ళారు. వాళ్ళను అక్కడ కూడా ఎంత హింసిస్తున్నారో.... అయినా మనం చేసేదేమీ లేదు. యేమిటీ అన్యాయం అని మన సెక్రెటరీ సురేందర్ అడిగితే పోలీసినస్పెక్టర్ సురేందర్‌ను ఘోరంగా అవమానించాడు. అరెస్ట్ చేస్తానని బెదిరించాడు.

సురేందర్ ఒక వ్యక్తిగా మాట్లాడలేదు. మనందరి ప్రతినిధిగా మాట్లాడాడు. ఎస్.ఐ. సురేందర్‌ను అవమానించడమంటే మనందర్నీ అవమానించడమే... మనంతా....బాగా చదువుకున్న వాళ్ళం... బుద్ధి జీవులం భావిభారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దాల్సిన వాళ్ళం. మనల్ని, మన స్టూడెంట్స్‌ని ఇంత ఘోరంగా అవమానిస్తే మనం మెదలకుండా ఊరుకుంటే ఈ దేశంలోని మొత్తం ఉపాధ్యాయ జాతికే అవమానం....ముఖం మీద ఉమ్మేసినా పోనీలే అని తుడుచుకొనిపోయే మనస్తత్వం చాలా ప్రమాదకరం... అలాంటి మనస్తత్వం జాతిని నిర్వీర్యం చేస్తుంది. జాతి జవసత్త్వాలను హరించి వేస్తుంది....ఆ మనస్తత్వం నుంచి బయటపడాలి.

అందుచేత మనం కదలాలి. దీనికి నిర్ద్వంద్వంగా నిరసన ప్రకటించాలి. సురేందర్ అన్నట్టుగా క్షమాపణ కోరాలని అడుగుదాం. పోలీసువాళ్ళు అపోలజీ ఇవ్వరు. కాబట్టి మనం వేరే పద్ధతుల్ని అనుసరించాలి. స్ట్రయిక్ చేద్దాం... అందరమూ పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేద్దాం ...ఊరంతా మౌనంగా తిరుగుదాం. అవసరమయితే ఆమరణ నిరాహారదీక్ష చేద్దాం ప్రజా చైతన్యాన్ని జాగృతం చేద్దాం. పోలీసు వాళ్ళకు బుద్ధి చెబుదాం. నా ప్రియమైన యువక మిత్రులారా! టెంపొరరీ వాళ్ళమని, జాబ్స్ పోతాయని భయపడకండి. మీ జాబ్స్ ఎక్కడికీ పోవు. నేనూ టెంపొరరీ వాడినే....మనం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్నాము నిరసన తెలియజేసే హక్కు ఈ దేశపు ప్రతి పౌరుడికుంది. కాబట్టి నిరసన తెలుపుదాం. ఇందులో ఎవ్వరూ జారిపోగూడదు. అందరూ కలిసికట్టుగా చెయ్యాలి ఈ పని. అదీ, ఎప్పుడో కాదు. ఇప్పుడే! ఈ క్షణమే. లేవండి. ఒక ఊరేగింపుగా కలెక్టరు దగ్గరకు వెళదాం....ఎస్ పి. దగ్గరకు వెళదాం. అవసరమైతే నిరాహార దీక్ష మొదలెడదాం ...కానీ మెదలకుండా మాత్రం ఊరుకోవద్దు. సహనం గాడిద లక్షణం. అదే విషయం మరచిపోవద్దు. మీద ఉమ్మేసినా తుడుచుకొని పోయే వాడిని జాతి క్షమించదు. అందులో జాతికొక మార్గం చూపించాల్సిన అధ్యాపకులే అలా చేస్తే చరిత్ర క్షమించదు ఇదే నేను చెప్పదల్చుకున్న విషయం!"

రవి ముగించగానే కొందరు "హియర్....హియర్" అంటూ కేకలు పెడుతూ చప్పట్లుకొట్టారు.

రవి మాట్లాడటం ముగించి తన సీటు దగ్గరకొచ్చి కూర్చున్నాడు.... సభలో యేం జరుగుతుందో తెలియటం లేదు. చప్పట్లు, కేకలు వినిపిస్తున్నాయి. తనంత ఆవేశంగా మాట్లాడతానని తనే అనుకోలేదు. తనలో ఏదో మహత్తరమైన శక్తి ప్రవేశించింది ఒక ఝంఝామారుతంలా ఆ శక్తి తనను నిలువెల్లా కుదిపివేసింది.

సభలో కలకలం ఎక్కువైంది. అందరూ ఒకరితో ఒకరు మాట్లాడుతూ, చర్చిస్తూ పెద్ద గందరగోళాన్ని సృష్టించారు.



"సైలెన్స్ ప్లీజ్! సైలెన్స్ ప్లీజ్....!" అంటూ ప్రిన్సిపాల్ రెండు మూడు సార్లు అరిచాక గానీ నిశ్శబ్దమేర్పడలేదు.

"మిష్టర్ రవీందర్! మీరింకా చిన్నవారు. అందుకే మీలో అంత ఆవేశం....కానీ ఆవేశం ఒక్కటే సమస్యల్ని పరిష్కరించదు—" అన్నాడు ప్రిన్సిపాల్ రవికేసి చూస్తూ.

తనకు వెంటనే యేమనాలో తోచలేదు....కాలేజీలో తను యేం మాట్లాడినా ప్రతివాడూ "నువ్వింకా చిన్నవాడివి" అంటూ తను మాట్లాడిన మాటల్లోని వాస్తవాన్ని నీరుగార్చటానికి ప్రయత్నిస్తారు. వీళ్ళనెలా ఎదుర్కోవాలి? సురేందర్ తన సీట్లోంచి లేచాడు

"అతని ఏజ్‌కీ అతడు మాట్లాడిన మాటలకీ సంబంధమేమీ లేదు సార్. చిన్నవాడైతేనేం? చెయ్యాల్సిందేదో సరిగ్గా చెప్పాడు. మనం నిరసన తెలియ జేసుకోవలసిందే, ఇలా గాజులు తొడిగించుకుని మొహాలమీదికి ముసుగులు లాక్కుంటూ కూచోగూడదు.

రవి చేసిన సూచనలతో నేను యేకీభవిస్తున్నాను....ఇప్పుడే మనం ప్రిన్సిపాల్ గారితో స ఊరేగింపుగా వెళ్ళి కలెక్టర్‌గార్ని కలవటం అన్నిటి కంటే ఉత్తమమైన మార్గం! దాని వల్ల ప్రయోజనం లేకపోతే అప్పుడు ఎస్.పి. ఆఫీసు ముందు ధర్నా చెయ్యటం....ఆ విధంగా తీర్మానం జేసి కదులుదాం."

"నో....నో....నో....మీరలాంటి రిసొల్యూషన్ ప్యాస్ చేస్తానంటే నేనిప్పుడే వాకౌట్ చేసి వెళ్ళిపోతాను." అన్నాడు కాంతారావు తన సీట్లోంచి లేచి.

"వాకౌంట్ చేసి వెళతానన్నవాడు నిజంగా వెళ్ళిపోగూడదూ? ఊరికే బెదిరించిందానికంటే ..." అన్నారెవరో వెనక సీట్లోంచి. కాంతారావు ఆ మాట విననట్టుగా నటించాడు.

"మాట మాటకూ మీరు వాకౌట్ చేస్తాననటం యేమీ బాగాలేదం!" విసుగ్గా అన్నాడు ప్రిన్సిపాల్.

"పోలీసులకు వ్యతిరేకంగా నేను ఎట్టి పరిస్థితులలోను ప్రొటెస్ట్ చెయ్యను. ఎందుకు చెయ్యాలి? వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేశారు. పోలీసువాళ్ళ

కొట్టిక ముద్దుపెట్టుకుంటారా? వాళ్ళే రాకపోతే ఇవ్వాళ కాలేజీ పరిస్థితి ఏమై పోయేది? కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మొత్తం సర్వనాశనమైపోయేది! లక్షల రూపాయల విలువచేసే లాబ్ తగలబడిపోతే ఎవరు బాధ్యులు? ఇద్దరో ముగ్గురో చచ్చేవాళ్ళు కూడా....అప్పుడేం చేసేవాళ్ళు? స్టూడెంట్లకు దెబ్బలు తగిలాయనే ఇంత బాధపడిపోతున్నారే...ఇద్దరో ముగ్గురో చస్తే? చచ్చిన వాళ్ళు స్టూడెంట్స్ కాదా? వాళ్ళదీ రక్తం కాదా? వాళ్ళకు అమ్మానాన్నలు లేరా? అంత ప్రమాదం జరక్కుండా ఆపినందుకు మనం పోలీసులకు థాంక్స్ చెప్పాలి....ఇలాంటి సందర్భాల్లో కొందరు అమాయకులకు కూడా దెబ్బలు తగుల్తాయి. దాన్ని గోరంతని కొండంతగా చెయ్యాల్సిన అవసరం లేదు....లెక్చరర్ల కెవరికండి దెబ్బలుతాకింది....ఎవరికీ తాకలేదు....స్టూడెంట్స్‌ను కొట్టబోతున్నప్పుడు లాఠీ కొసలు ఎవరికయినా తాకాయేమో...." కాంతారావు.

"లాఠీ కొసలు కాదు మిస్టర్! లాఠీలే తగిలాయి. ఇదిగో చూడండి. నా మోచెయ్యి చిట్లి రక్తం కారింది...." అంటూ ముందుకు దూసుకొని వచ్చిన తన మోచేతిని చూపించాడు గోవిందరావు.

"ఆల్‌రైట్! ఆల్‌రైట్! లెక్చరర్లకు కూడా దెబ్బలు తగిలాయి-ఎంత మందికి తగిలాయి? ఇద్దరికో....ముగ్గురికో....ఆ గందరగోళంలో తగిలి ఉంటాయి....దానికేం చేస్తాం? దాన్నేదో పెద్దగా ఎగ్జాజిరేట్ చేసుకొని గాడిదలు గిడిదలు అనటం....ఉమ్మేసినా తుడుచుకొని పోతున్నామని మనల్ని రెచ్చగొట్టటం, మనందరినీ హింసకు పురికొల్పటం....దటీజ్ టూ మచ్! అసలు పోలీసులు రాకపోతే యేం జరిగేదో ఆలోచించండి....!" అన్నాడు కాంతారావు.

'ఏమిటండీ ఆలోచించేది? దీనికంతటికి కారణం మీరు....ప్రమాదకరంగా పరిస్థితి ఉందని చెబుతోంటే 'ఏం కాదు! ఏం కాదు....!' అంటూ కబుర్లు చెప్పి ప్రిన్సిపాల్‌ను తప్పుదారి పట్టించేసి... బెస్ట్ ఫ్రెండ్స్ అంటూ పోలీసుల్ని పిలిచి....ఇంత హింసాకాండ మీ వల్ల జరిగింది. దీనంతటికి మీరే బాధ్యులు!" తన సీట్లోంచి లేచి అరచినట్టుగా అన్నాడు రవి.

"నేనా? నో....నువ్వు మిస్టర్....నువ్వు దీనికంతటికీ మూలకారణం



నువ్వేనంటాను లెక్చరర్లను పోలీసుల మీదకు రెచ్చగొడుతున్నావు. దీని ఫలితాలేమిటో తెలియక, ఇదంతా ఓ ఆటలా వుంది నీకు! అసలు నేనీ మీటింగ్‌లో వుండి నా టైమ్ వేస్ట్ చెయ్యదల్చుకోలేదు. మీరేమన్నా చేసుకోండి....నేను వెళ్ళిపోతున్నాను" అంటూ తన బ్యాగ్ తీసుకొని కాంతారావు బయటకెళ్ళిపోయాడు.

అందరూ "వన్‌మోర్ వాకౌంట్" అంటూ గొల్లున నవ్వారు. చప్పట్లు కొట్టారు.

మళ్ళీ రామయ్య, శ్రీ రంగాచారి కాంతారావు వెంటే బయటకు వెళ్ళి అతన్ని బయట వరండాలో ఆపేశారు.

"సైలెన్స్ ప్లీజ్!" అంటూ ప్రిన్సిపాల్ మళ్ళీ అరిచాడు. కొంచెం నిశ్శబ్దం యేర్పడగానే ప్రిన్సిపాలే మాట్లాడటం మొదలెట్టాడు.

"జరిగిందానికి మీరు బాధ్యులంటే మీరు బాధ్యులంటూ మనం ఒకరి మీదొకరం బురద చల్లుకోవటం వల్ల ప్రయోజనంలేదు. అందరమూ బాధ్యులమే. కాంతారావు తనంతట తాను పోలీసుల్ని రప్పించలేదు. నేను ఫోన్ చెయ్యమంటేనే చేశాడు. ఆల్‌రైట్! జరిగిందేదో జరిగిపోయింది. పోలీసులను కాలేజీకి పిలిపించటం యే ప్రిన్సిపాల్‌కూ ఇష్టం ఉండదు. చాలా దురదృష్టకరమయిన సంఘటన. కానీ కొన్ని సార్లు తప్పనిసరౌతుంది. సరే! వాళ్ళు లెక్చరర్స్‌ని కూడా కొట్టారు కాబట్టి మనం నిరసన తెల్పవల్సిందే- నిరసన తెల్పుదాము. అలా ఒక తీర్మానం చేసి దాని కాపీ ఎస్.పి.కి నేను స్వయంగా తీసికెళ్ళి ఇస్తాను. మనం నిరసన తెలియజేసినట్టుగా పత్రికల్లో కూడా వచ్చేట్టు చూద్దాం. అది సరిపోతుందనుకుంటాను. ఇంతకంటే ఎక్కువగా పోలీసులతో మనం ఘర్షణ పడటం మంచిదీ కాదని నా ఉద్దేశ్యం. మన స్టూడెంట్స్ క్షేమం దృష్ట్యా, మీ అందరి క్షేమం దృష్ట్యా, ముఖ్యంగా మన కాలేజీ క్షేమం దృష్ట్యా నేనీ మాటలు చెబుతున్నాను....తర్వాత మీ ఇష్టం...." అన్నాడు ప్రిన్సిపాల్.

సభలో చాలా మంది "ప్రిన్సిపాల్ చెప్పింది బాగుంది....బాగుంది.... మనం నిరసన తెలియజేద్దాం" అన్నారు

ఈలోగా బయటకు వెళ్ళిన కాంతారావును తీసుకొని శ్రీ రంగాచారి,

రామయ్య వచ్చారు. వాళ్ళు ముగ్గురు తమ తమ సీట్లలో కూర్చుండిపోయారు

"అంటే కనీసం అపోలజీ ఇవ్వాలని కూడా అడగడం లేదా....?" అన్నాడు సురేందర్.

"కొంచెం పట్టూ విడుపూ ఉండాలి మిష్టర్ సురేందర్! రామయ్యగారూ! మినిట్స్ బుక్‌లో రిజల్యూషన్ రాయండి...." ప్రిన్సిపాల్.

"యస్సార్!" అంటూ రామయ్య తన ముందున్న మినిట్స్ బుక్ తీసి రాయటం మొదలెట్టాడు.

"ప్రిన్సిపాల్ అండ్ మెంబర్స్ ఆఫ్ ది స్టాఫ్ ఆఫ్ గవర్నమెంట్ కాలేజ్, కరీంనగర్, ఎక్స్‌ప్రెస్ దేర్ డీప్ రిగ్రెట్ మెంట్...." ప్రిన్సిపాల్ డిక్టేట్ చేస్తోంటే రామయ్య రాయటం మొదలెట్టాడు.

"ఎవరూ మాట్లాడరేం?" అన్నాడు రవి తన పక్కన కూర్చున్న మురళీమోహన్‌తో.

"ఎవరూ మాట్లాడరు.... ప్రిన్సిపాల్ ఇప్పుడు డిక్టేట్ చేస్తున్న తీర్మానం ఏకగ్రీవంగా పాసౌతుంది. మీరు కూడా మాట్లాడకుండా ఊరుకోవటం బెటర్" అన్నాడు మురళీమోహన్.

వ్హాట్ ఎ ఫాల్! వ్హాట్ ఎ ఫాల్ మై కంట్రీమెన్! ఇంత ఘోరమా? వీళ్ళల్లో చీమూ నెత్తురూ ప్రవహించటం లేదా? వీళ్ళల్లో రోషం నాశనమైపోయిందా? చివరకు కొట్టినా సహించి ఊరుకుంటారా? నో! నో! నో! ఐ కాంట్ బి ఎ పార్టీ టు ఇట్....లేచి వెళ్ళిపోవాలి....నేను వాకౌట్ చేస్తున్నానని డిక్లేర్ చేసి వెళ్ళిపోవాలి. అందరూ గొల్లున నవ్వుతారేమో... తననూ కాంతారావులాగే ఓ పిచ్చివాడికింద జమ కడ్తారేమో....సురేందర్ మాట్లాడడేమిటి? సీతారామారావు. సీనియర్ మోస్ట్ లెక్చరర్.... పెద్ద లెఫ్టిస్టు! ఆయనను గురువుగా, గైడ్, ఫ్రెండ్ అండ్ ఫిలాసఫర్‌గా భావించుకున్నానే! ఆయనా మాట్లాడడేమిటి? నేనిప్పుడేం చేయాలి? వెంటనే వెళ్ళిపోవాలి.... వాకౌట్ చేయాలి.... కడుపులో పేగులు గుర్రుమంటున్నాయి.... ఆకలి.... ఆకలి.... టైమ్ రెండున్నర దాటింది.... ఇంకా స్పేపు ఈ మీటింగ్‌లో కూర్చుంటే నాకు పిచ్చెక్కటం ఖాయం.... వెళ్ళిపోవాలి.... ఈ మనుషులకు దూరంగా వెళ్ళిపోవాలి. ఈ మీటింగ్‌లకు దూరంగా వెళ్ళిపోవాలి.... ఆకలి.... కడుపును కోసేస్తోంది.... పిచ్చిపిల్ల! ఇంకా యేడుస్తూనే వుంటుంది తను వెళ్ళి ఓదార్చేదాకా తిండి తినదు.... వెళ్ళిపోవాలి.... వెంటనే వెళ్ళిపోవాలి....



వాళ్ళు రిజల్యూషన్ రాసేశారు. రామయ్య లేచి రిజల్యూషన్ చదివాడు. 'బావుంది బావుంది' అంటూ అందరూ చప్పట్లు కొట్టారు.

ఆ మీటింగ్‌లో వున్న అందరికీ వెళ్ళిపోయే మూడ్ వచ్చేసింది.... ఎవరికీ అక్కడ కూర్చునే ఓపిక లేదు

ప్రిన్సిపాల్ లేచాడు.

"ఈరోజు జరిగిన సంఘటనల దృష్ట్యా మనం యేం చేస్తే బాగుంటుందో ఆలోచించాలి...."

ప్రిన్సిపాల్ పూర్తి చెయ్యకముందే సభలో చాలామంది కాలేజీని కొంతకాలం మూసెయ్యటం మంచిది సార్!' అని అరిచారు.

"నేనూ అలాగే అనుకుంటున్నాను.... రామయ్యగారూ! పరిస్థితి మెరుగు పడేవరకు కాలేజీని నిరవధికంగా మూసెయ్యటం మంచిది కాలేజీని నిరవధికంగా మూసేస్తున్నట్లు మరో రిజల్యూషన్ రాయండి" అన్నాడు ప్రిన్సిపాల్.

"అలాగే సార్" అన్నాడు రామయ్య.

"కాలేజీ మూసేముందు కాలేజీలో ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయో విచారించేది లేదా అని అడగదల్చుకున్నాను" అకస్మాత్తుగా తన సీట్లోంచి లేచి అన్నాడు సూర్యప్రకాష్.

"పోనీయండి సూర్యప్రకాష్‌గారూ! మీటింగ్‌ను అనవసరంగా పొడిగించకండి. ఇప్పటికే బోరై చచ్చిపోతున్నాము" అన్నాడు శ్రీనివాసరెడ్డి.

"అలా ఎలా పోనిస్తామండి? అసలు విషయమే చర్చించలేదు....ఈరోజు నా మీద ఒక హత్యా ప్రయత్నం జరిగింది.... అది ఎలా జరిగిందో ఎందుకు జరిగిందో తేలాలి.... అంతవరదాకా ఈ మీటింగిలా కొనసాగవల్సిందే!" దృఢంగా అన్నాడు సూర్యప్రకాష్.

అందరూ "ఆc! ఆc!" అంటూ నిట్టూర్చారు.

"బాబోయ్! ఈ మీటింగ్ పూర్తయ్యేసరికి అర్ధరాత్రయ్యేట్టుగా ఉంది...." అన్నాడు శ్రీనివాసరెడ్డి

"అర్ధరాత్రి గానియ్యండి.... తెల్లవారనీయండి.... నా మీద జరిగిన హత్యా ప్రయత్నానికి కారణమెవరో తేలాలి...." అన్నాడు సూర్యప్రకాష్.

"హత్యా ప్రయత్నమేమిటి?" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఈరోజు కాలేజీలో నన్ను చంపటానికి ప్రయత్నం జరిగింది. కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ కొచ్చిన గూండాలు నా కోసమే వచ్చారు.... అందులో అందరూ బయటి వాళ్ళే! వాళ్ళ దగ్గర పిస్టళ్ళు, బాంబులు వున్నాయి. వాళ్ళను బాగా రెచ్చగొట్టి నా అంతం చూడమని నా మీదకు పంపించింది మన కాలేజీలోనే పని చేస్తున్న ఒక లెక్చరర్ అంటే ఆశ్చర్య పడవచ్చు.... కానీ అది నిజం!" అన్నాడు సూర్యప్రకాష్.

సభలో మళ్ళీ గందరగోళం....

"మన కాలేజీలో పనిచేసే లెక్చరరే? ఎవరు? ఎవరాయన? అంటూ కేకలు వేశారు

"అతని మీద హత్యా ప్రయత్నం చేయించింది ఎవరని అతని ఉద్దేశ్యం?" అన్నాడు రవి మురళీమోహన్‌తో.

"మీరే అంటాడేమో!" అన్నాడు మురళీమోహన్.

"నా మీద అంత అభాండం వేస్తాడా?" గొణిగాడు రవి. లోప లెక్కడో వణుకు.... ఇవ్వాళ మార్కెట్ దగ్గర తనను చూశాడు. బహుశా ప్రభాకర్‌తో మాట్లాడుతున్నప్పుడు కూడా చూసే వుంటాడు.

"నాకేమీ కాలేదు సార్.... నేను ప్రాణాలతోనే వున్నాను ...ఎందు వల్లననుకున్నారు? ఈ రోజు నామీద హత్యా ప్రయత్నం జరుగుతుందని నాకు ముందే తెలుసు కాబట్టి....నేను కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మీద ఎటాక్ జరిగినప్పుడు లేట్రిన్ లోపల తల దాచుకున్నాను కాబట్టి బతికి బయట పడ్డాను. నా కోసం వచ్చిన గూండాలు అక్కడున్న మిగతా లెక్చరర్లను "సూర్యప్రకాష్‌గాడేడీ? సూర్యప్రకాష్‌గాడేడీ?" అని ఎన్నోసార్లు అడిగారు. వెంటనే చెప్పకపోతే వాళ్ళ ప్రాణాలను కూడా తీసేస్తామని బెదిరించారు ..



ఈలోగా పోలీసులొచ్చారు. పోలీసులు రావటం ఇక్కడ చాలామందికి ఇష్టం లేదు. వాళ్ళేదో స్టూడెంట్స్‌ను కొట్టారని కాదు.... పోలీసులు రావటంవల్ల నేను బతికి బయట పడ్డానని...." అన్నాడు సూర్యప్రకాష్.

"మీరు చాలా దారుణంగా మాట్లాడుతున్నారు.... మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలియటం లేదు" అన్నాడు సురేందర్.

"నాకు తెలుసు.... నాకు బాగా తెలుసు.... మన లెక్చరర్స్‌లోనే ఒకరు నన్ను హత్య చేయించాలని ప్రయత్నించారని నాకు బాగా తెలుసు" అన్నాడు సూర్యప్రకాష్ దృఢంగా.

"చెప్పండి.... ఆ లెక్చరరెవరో చెప్పండి.... ఆరోపించటమే కాదు దాన్ని ఋజువు చెయ్యాలి" అన్నాడు సురేందర్.

"డెఫినిట్‌గా ఋజువు చేస్తాను."

"అయితే ఎవరో చెప్పండి."

"మిస్టర్ రవీందర్! లెక్చరర్ ఇన్ పొలిటికల్ సైన్స్ అన్నాడు సూర్యప్రకాష్.

మళ్ళీ మీటింగ్‌లో గందరగోళం.... "రవీందరా? నో నో" అని కొందరు.... "రవీందరా? దట్స్ టూ మచ్" అని ఇంకొందరు.... "రవీందరా? నోనో!" అని మరికొందరు....

విసురుగా లేచాడు రవి.

"యూ ఆర్ టాకింగ్ రబ్బిష్! అబ్ సల్యూట్ రబ్బిష్! యూ ఆర్ ఎ లయర్.... యూ....యూ....యూ...." రవి నోటివెంట మాటరాలేదు.

ఆవేశం అతన్ని కుదిపేసింది.

అతని కళ్ళకేమీ కనిపించటం లేదు. యేదో మాట్లాడాలని.... తన సర్వశక్తుల్నీ కూడదీసుకొని పెద్దగా అరవాలని.... కాని "యూ....యూ... యూ...." అనటం తప్ప ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.

ఒకేసారి సురేందర్, సీతారామారావు, మురళీమోహన్ లేచి రవిని కంట్రోల్ చెయ్యటానికి ప్రయత్నించారు.

"రవీ! నేను మాట్లాడతాను... మీరు కూర్చోండి.. కూర్చోండి" అన్నాడు సీతారామారావు. కళ్ళు గట్టిగా మూసుకొని కూర్చుండిపోయాడు రవి.

"మిష్టర్ సూర్యప్రకాష్! మీరొక పెద్ద అభాండం వేశారు. దీన్ని మీరు ఋజువు చెయ్యకపోతే పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయి" అన్నాడు సీతారామారావు.

"ఋజువు చేస్తాను... ఈ రోజు మార్కెట్ దగ్గర రవీందర్‌తో ఇద్దరు యు ఎస్ యు లీడర్లు ఒక అరగంటసేపు ముచ్చటించారో లేదో అయన్నే అడగండి.... కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మీదకు గూండాలను లీడ్ చేసిన ప్రభాకర్ ప్రతిరోజూ రవీందర్ ఇంటికి వెళ్తాడో లేదో అడగండి.. మీకు చాలామందికి తెలియదు.... మిష్టర్ రవీందర్ కమ్యూనిస్టు పార్టీ కార్డ్‌హోల్డర్! నేను ఋజువు చెయ్యగలను!" అన్నాడు సూర్యప్రకాష్.

"మిష్టర్ సూర్యప్రకాష్! నీ బుర్రలో పుట్టిన భ్రాషంతా నిజమని నమ్మించటానికి ప్రయత్నిస్తున్నావు. నకిల్సాళ ప్రభాకర్, గోపాల్ చాలా కాకతాళీయంగా బజార్లో కలిశారు. వాళ్ళిద్దరూ నా ఫైనలియర్ స్టూడెంట్లు! నా స్టూడెంట్స్‌తో నేను మాట్లాడగూడదా? మాట్లాడినంత మాత్రాన నేను వాళ్ళ పార్టీ మెంబర్నయిపోయి నిన్ను హత్య చెయ్యటానికి ప్రయత్నిస్తానా? ఇదంతా నాన్‌సెన్స్! ఆ మాటకొస్తే పార్టీ మెంబర్‌వి నువ్వు... పక్కా జె.వి.పి. వర్కర్‌వు.. కాకీ నిక్కర్ వేసుకొని రోజూ స్టూడెంట్స్ చేత డ్రిల్ చేయిస్తావు.... కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌ని నీ పార్టీ ఆఫీస్‌గా మార్చావు. ఓ స్టూడెంట్‌ను కొట్టిన వాళ్ళకు నీ డిపార్ట్‌మెంట్‌లో ఆశ్రయమిచ్చావు. అందుకే వాళ్ళు నీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మీద ఎటాక్ చేశారు కావాలంటే ఇదంతా నేను ఋజువు చేస్తాను" అన్నాడు రవి.

ఆవేశంతో ఊగిపోతూ ఒక మహాప్రవాహంలో కొట్టుకుపోతున్నట్టుగా మాట్లాడాడు రవి కంఠాన్ని హెచ్చించి ఒక మహత్తరమైన ఆవేశ తీవ్రతతో మాట్లాడిన అతని ప్రతిమాటను అక్కడ కూర్చున్న వాళ్ళంతా నిశ్శబ్దంగా విన్నారు.



"మీరొక పార్టీ వర్కర్ అన్న విషయం ప్రపంచానికంతటికీ తెలుసు. అందువల్ల అందరూ మీలాంటి వాళ్ళే అనుకుంటున్నారు.

తన స్టూడెంట్స్‌తో మాట్లాడినంత మాత్రాన అది మిమ్మల్ని హత్య చెయ్యమని ప్రోత్సహించినట్టవుతుందా? ఒక సీనియర్ లెక్చరర్ మీద మీలాంటి అభాండం వేసే ముందు కొంచెం ఆలోచించాల్సింది....గాజు మేడలో జన్మించేవాడు ఇతరుల మీదకు రాళ్ళు విసరటం క్షేమం కాదన్న ప్రాథమిక సత్యాన్ని తెలుసుకోండి" అన్నాడు సీతారామారావు.

"తెలుసునండీ తెలుసు....అన్నీ తెలుసు... పాఠాల పేరుతో మీరు స్టూడెంట్స్‌కెంత మార్క్సిజమ్ బోధిస్తారో తెలుసు వాళ్ళనెంత తప్పుదార్లు పట్టిస్తున్నారో తెలుసు....ఔను. నేను జె.వి.పి. వర్కర్‌నే....కాని జె.వి.పి. అనేది ఒక పొలిటికల్ పార్టీ కాదే! అది ఒక సాంస్కృతిక సంస్థ మాత్రమే" అన్నాడు సూర్యప్రకాష్.

ప్రిన్సిపాల్ లేచి నిల్చున్నాడు.

"దయచేసి అందరూ కూర్చోండి....ఈ మీటింగ్‌నిక ఇలా కొనసాగించ దల్చుకోలేదు....ఈ మీటింగ్ ఏ ఉద్దేశ్యంతోనయితే యేర్పాటు చేశానో అది అడుగంటిపోయి మీరు మీ పరస్పర విద్వేషాలను ప్రదర్శించుకోవటానికి అవకాశం కల్పించినట్టయింది ఇందుకు నేనెంతో విచారిస్తున్నాను. మీరు యింత గందరగోళాన్ని సృష్టిస్తారనుకోలేదు కాలేజీలో ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది....

ఆ సంఘటన ఎందుకు జరిగింది? అలాంటివి యికముందు జరక్కుండా వుండాలంటే యేం చెయ్యాలి? అన్న విషయాలను గూర్చి మాట్లాడి నిర్ణయాలు తీసుకుందామనుకున్నాను మీరందరూ నాతో సహకరిస్తారనుకున్నాను. అలా జరగలేదు. ఇంతటితో మీటింగును ముగిస్తున్నాను.... అలాగే కాలేజిని కూడా కొంత కాలంవరకు మూసేస్తున్నాను. థాంక్యూ జెంటిల్మెన్... థాంక్యూ" అంటూ ప్రిన్సిపాల్ బయటకు వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్! అతడు నామీదొక తీవ్ర ఆరోపణ గావించాడు.

ఆ ఆరోపణలోని నిజానిజాలను తేల్చటానికి ఒక ఎంక్వయిరీ కమిటీని వెయ్యండి.... తన ఆరోపణను నిరూపించమనండి" అన్నాడు రవి.

"మిస్టర్ రవీందర్! అతని ఛార్జ్‌ను నేను సీరియస్‌గా తీసుకోవటం లేదు. నేనే కాదు ... ఈ మీటింగ్‌లో వున్న వాళ్ళెవరూ సీరియస్‌గా తీసుకోవటం లేదు. ఎంక్వయిరీ కమిటీ పూర్తిగా అనవసరం. సూర్యప్రకాష్‌గారూ మీకంతగా అనుమానం వుంటే పోలీస్ కంప్లెయింట్ ఇవ్వండి. వాళ్ళు ఎంక్వయిరీ చేస్తారు" అన్నాడు ప్రిన్సిపాల్.

సూర్యప్రకాష్ మాట్లాడలేదు.

మరి స్టూడెంట్స్ మాటేమిటి సార్? ఈరోజు కొట్లాటల్లో కలగజేసుకున్న స్టూడెంట్స్ మీద మీరేమీ చర్య తీసుకోరా" అన్నాడు శ్రీరంగాచారి.

"ఇప్పుడిక మనమేమీ చెయ్యటానికి వీల్లేదు. అది పోలీస్ కేస్ అయిపోయింది. పోలీసులు వాళ్ళని అరెస్ట్ చేశారు. అంతా వాళ్ళే చూసుకుంటారు" అన్నాడు ప్రిన్సిపాల్.

చాలామంది లెక్చరర్లకు ఓపిక నశించింది. అందరూ లేచి నిల్చున్నారు. కొందరు బయటకు వెళ్ళి నిల్చున్నారు.

"పోలీసులేం చేస్తారు సార్! ఈరోజు సాయంత్రానికంతా వాళ్ళను వదిలి పెట్టేస్తారు మళ్ళా కాలేజీ తెరిచే రోజు ఈరోజు లెక్చరర్ల మీద దాడి చేసిన హీరోలందరూ చక్కగా కాలేజీకి వచ్చేస్తారు" అన్నాడు శ్రీరంగాచారి.

"అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" విసుగ్గా అన్నాడు ప్రిన్సిపాల్.

"ఈరోజు కొట్లాటల్లో ప్రమేయం వున్న వాళ్ళందర్నీ బహిష్కరించండి! బుద్ధొస్తుంది దొంగ వెధవలకు" అన్నాడు శ్రీరంగాచారి.

"అలుసు-సరే! వాళ్ళెవరో ఎలా తెలుస్తుంది? మీరు చెప్పగలరా?" అన్నాడు ప్రిన్సిపాల్.

"వాళ్ళెవరో మీకు తెలుసు....పోలీస్ వ్యాన్ ఎక్కేముందు మీ రూమ్‌లోకి దూసుకొని వచ్చి మిమ్మల్ని బూతులు తిట్టి వెళ్ళారు. వాళ్ళే



వాళ్ళందర్నీ మీరు చూసారు! ఇక్కడున్న లెక్చరర్లందరూ చూసారు. వాళ్ళ లీడర్ని కూడా అందరూ చూసారు. వాళ్ళను వెంటనే ఎక్స్‌పెల్ చెయ్యండి....

మీ ఎదుటికొచ్చి మిమ్మల్ని బూతులు తిట్టిన వాళ్ళను కూడా మీరు ఏం చేయకుండా ఊరుకుంటే రేపు ఈ కాలేజీలో మేం ఎలా పని చెయ్యగలం.... మీరు హెడాఫ్ ది ఇన్స్టిట్యూషన్ కదా, మిమ్మల్నే అవమానించిన వాళ్ళు మమ్మల్ని లెక్కచేస్తారా? ఈ కాలేజీకేమన్నా పరువూ ప్రతిష్టా వుంటాయా?

మీరు తప్పకుండా చర్య తీసుకోవాలి.... లేకపోతే మాకంత దమ్ము లేదు మేం గాజులు తొడుక్కుని కూచున్నాము. మాకు పౌరుషం లేదు.... మాకు మగతనం లేదు" అని నల్గురి ముందు ఒప్పుకోవాలి" ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు శ్రీరంగాచారి.

"రంగాచారిగారూ! యాభయ్యేళ్ళు పైబడిన మీరు కూడా ఇంత ఆవేశంగా మాట్లాడుతున్నారంటే చాలా ఆశ్చర్యంగా వుంది ..." అని ప్రిన్సిపాల్ ఇంకేదో చెప్పబోతుండగా సూర్యప్రకాష్ లేచి నిల్చున్నాడు.

"యాభయ్యేళ్ళు పైబడితేనేం? అరవయ్యేళ్ళు పైబడితేనేం? అతడు న్యాయం మాట్లాడుతున్నాడు. మామీద దాడిచేసి మమ్మల్ని కొట్టి, మా డిపార్ట్‌మెంటంతా సర్వనాశనం చేసి, మా దగ్గరకొచ్చి మమ్మల్ని బూతులు తిట్టినా కూడా మీరు వాళ్ళమీద చర్య తీసుకోవటానికి భయపడ్తున్నారంటే-" అన్నాడు సూర్యప్రకాష్.

"భయపడటం కాదు! కేసు పోలీసుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఏ యాక్షన్ తీసుకున్నా వాళ్ళు తీసుకోవాలి.......మనమేమీ చెయ్యలేం ..." అన్నాడు ప్రిన్సిపాల్.

"మన లెవెల్లో చెయ్యాల్సింది మనమూ చెయ్యొచ్చు! ఎందుకు చెయ్యగూడదు? రిజల్యూషన్ రాయండి. ప్రభాకర్, గోపాల్, నరేందర్, సాంబయ్య.... ఈ నలుగురే వాళ్ళ రింగ్ లీడర్స్... వీళ్ళే ఈ రోజు మా డిపార్ట్‌మెంట్ మీదకొచ్చి స్టాఫ్‌ని, స్టూడెంట్స్‌ను కొట్టి, లేబరేటరీ అంతా ధ్వంసంచేసి....మిమ్మల్ని నానా దుర్భాషలాడి కాలేజీలో ఇంత భీభత్సాన్ని

సృష్టించారు. వీళ్ళను ఎక్స్‌పెల్ చేస్తే కాలేజీ బాగుపడుతుంది. రాయండి సార్! రిజల్యూషన్ రాయండి" అన్నాడు సూర్యప్రకాష్

"రాయండి సార్....రాయండి....వాళ్ళను ఎక్స్‌పెల్ చేయాల్సిందే! ఎక్స్‌పెల్ చెయాల్సిందే" అని అరిచారు యింకో అయిదారుగురు లెక్చరర్లు.

"మొత్తం స్టాఫంతా ఇదే అభిప్రాయంతో వుంటే వాళ్ళను ఎక్స్‌పెల్ చెయ్యటానికి నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ప్రిన్సిపాల్.

వెంటనే రవి లేచి నిల్చున్నాడు.

"సూర్యప్రకాష్ ఎవర్ని ఎక్స్‌పెల్ చెయ్యమంటే వాళ్ళని ఎక్స్‌పెల్ చేస్తారా? అతనొక పార్టీకి సంబంధించిన వ్యక్తి అతనికి సహజంగా తన ప్రతిపక్షానికి చెందిన స్టూడెంట్స్ మీద కోపం వుంటుంది. ఇదే అవకాశమని ఆయన వాళ్ళందరి పేర్లను చెప్పి వాళ్ళందర్నీ కాలేజీనుంచి బయటకు పంపించాలని చూస్తున్నాడు. ఆయన చెప్పిన ఆ నలుగురిలో ఒక్క ప్రభాకర్ తప్ప మిగతా స్టూడెంట్స్‌వరూ యీ రోజు కాలేజీలో కనిపించ లేదు" అన్నాడు రవి

"చూశారా! చూశారా! ఇప్పుడు అసలు సంగతి బయటపడుతున్నది. వాళ్ళను ప్రోత్సహిస్తున్నది.... వాళ్ళకి మార్గం చూపుతున్నది ఎవరో మీ కిప్పుడయినా అర్థమయిందా సార్! లెక్చరర్లను చంపటానికి సిద్ధమయిన వాళ్ళను వెనకేసుకొస్తున్నాడంటే యీ కుట్రలో అతనికి భాగమున్నట్టా లేనట్టా? చెప్పండి సార్! మీరే చెప్పండి" గొంతు చించుకున్నాడు సూర్యప్రకాష్.

"నేను సపోర్ట్ చెయ్యటంలేదు. న్యాయం మాట్లాడుతున్నాను. ఇదే అవకాశంగా తీసుకొని తనకు వ్యతిరేకులైన.... సారీ.... వ్యతిరేకులుగా భావింపబడుతున్న కొందరు స్టూడెంట్స్‌కి శిక్ష పడాలని చూస్తున్న ఒక వ్యక్తి కుటిల ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తున్నాను.... ఈ రోజు ఈ గొడవ జరగటానికి ముందు సురేంద్రనాథ్ అనే స్టూడెంట్‌ను వేరే ఇద్దరు స్టూడెంట్స్ కొట్టారు ఆ ఇద్దరు స్టూడెంట్స్ మీద యాక్షన్ తీసుకొమ్మని ఎవరూ అడగరెందుకు? అసలు ఈనాటి గొడవకంతా ఆ సంఘటనే కారణ

Cultural Academy JANDIAL



మన్న విషయాన్ని మరచిపోతున్నారు" రవి కూడా గొంతు చించుకొని మాట్లాడాడు.

"ఒక పని చేస్తే బావుంటుంది సార్" అన్నాడు అంతసేపూ ఒక్క మాటైనా మాట్లాడని రామయ్య.

"చెప్పండి" అన్నాడు ప్రిన్సిపాల్.

అందరూ నిశ్శబ్దంగా రామయ్యగారేం చెబుతాడోనని ఎదురు చూడ సాగారు.

"కాలేజీలో ఇంక గొడవ జరిగాక మనం మన లెవెల్లో యేదో ఒక చర్య తీసుకోకపోతే బావుండదు. కాబట్టి మనం ఈరోజు సురేంద్రనాథ్‌ను కొట్టిన ఆ వీరయ్యను, పాపిరెడ్డిని, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మీద దాడి చేసిన ప్రభాకర్‌ను సస్పెండ్ చేద్దాం ఒక ఎంక్వయిరీ కమిటీని వేసి వాళ్ళ పరిశీలనల్ని విన్న తరువాత ఏం చేయాలో నిర్ణయిద్దాము" అన్నాడు రామయ్య.

"అలా బావుంటుంది.... బావుంటుంది.... ఆ పని చెయ్యండి. వెంటనే రిజల్యూషన్ రాయండి" ఇంచుమించు అక్కడున్న లెక్చరర్లంతా యేక కంఠంతో అన్నారు.

"ఇంకేం? అందరూ ఒప్పుకుంటున్నారుగా.... రిజల్యూషన్ రాయండి...." అన్నాడు ప్రిన్సిపాల్.

రామయ్య రిజల్యూషన్ రాయటం మొదలెట్టాడు.

"మా డిపార్ట్‌మెంట్ మీద వందమంది దాడిచేస్తే ఒక్కడ్నే సస్పెండ్ చేయడమేమిటి? అసలు సస్పెన్షన్ అనేది ఒక శిక్షే కాదు...." అన్నాడు సూర్యప్రకాష్.

కాని అతని మాటను వినిపించుకోడాని కక్కడ ఎవరికీ ఓపిక లేదు

అందరూ లేచి నిల్చున్నారు.

రామయ్య రిజల్యూషన్ రాశాడు.

రామయ్యే సమావేశ కర్తగా, మరో ముగ్గురు సీనియర్ లెక్చరర్స్‌ని సభ్యులుగా నియమిస్తూ, ఒక విచారణ సంఘాన్ని యేర్పాటుచేసి పది రోజు

ల్లోగా ఆ కమిటీ తన నివేదికను ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని ఒక తీర్మానము, ఈరోజు గొడవకు కారణమైన ముగ్గురు విద్యార్థులను 'సస్పెండ్' చేయాలని మరో తీర్మానం రాసేసి, ఆ సమావేశంలో ఆమోదించబడిన మొత్తం నాల్గు తీర్మానాల్ని రామయ్య చదివి వినిపించాడు. ఎక్కువ మంది చప్పట్లు కొట్టారు. "అందరూ 'మినిట్స్ బుక్'లో సంతకాలు చేసివెళ్ళండి" అన్నాడు రామయ్య

ప్రిన్సిపాల్ "థాంక్యూ జెంటిల్మన్!" అంటూ లేచి తన రూమ్‌లోకెళ్ళిపోయాడు.

"ఏం మీటింగ్‌రా బాబూ! ఇలాంటి మీటింగ్‌లు ఇంకో రెండు తగులుతున్నాయంటే మనకు పిచ్చెక్కుతుంది" అన్నాడు శ్రీనివాసరెడ్డి.

"కరెక్ట్ సర్!" అన్నారు అతని చుట్టూ వున్న వాళ్ళంతా.

అందరూ 'మినిట్స్ బుక్' మీద పడ్డారు. ఒకరి తర్వాతొకరు చకచకా సంతకాలు పెట్టేసి బయటకు పరుగెత్తుతున్నట్టుగా వెళ్ళసాగారు.

"ఇంకేం?" కాలేజీ మూసేశారుగా.... మీకు రోజూ హైదరాబాద్‌కు ఇక్కడకూ షట్లింగ్ తప్పిపోయింది" అన్నాడు వెంకటేశ్వరరావు రోజూ హైదరాబాద్‌నుండి వచ్చి వెళ్ళే సాంబశివరావు, చంద్రమౌళి మొదలైన లెక్చరర్లతో.

"మీరిక హాయిగా గైడ్లు రాసుకోవచ్చు" అన్నాడు శ్రీనివాసరెడ్డి తగ్గు స్వరంతో నాగేశ్వరరావుతో.

"గట్టిగా అనకండి.... నేను గైడ్‌లు రాసే విషయం అందరికీ తెలిస్తే బాపుండదు" అన్నాడు మెల్లగా నాగేశ్వరరావు.

"ఏం రహస్యమయ్యా మీ రహస్యం! మీరు గైడ్లు రాసే విషయం అందరికీ తెలుసు" అన్నాడు శ్రీనివాసరెడ్డి.

కాలేజీ గేటు దగ్గర పోలీసులు కాపలా వున్నారు అప్పుడే జీపు దిగిన డి యస్ పి. ప్రిన్సిపాల్ రూంలోకెళుతుంటే లెక్చరర్లంతా సైకిల్ షెడ్‌వైపు వెళ్ళి కొందరు సైకిళ్ళ మీద కొందరు స్కూటర్ల మీద వెళ్ళిపోసాగారు.



మినిట్స్ బుక్‌లో సంతకం చేసి గుంపులోంచి బయటికొచ్చి టైం చూశాడు రవి

మూడు గంటలు దాటిపోయింది.

"వెళ్ళిపోదామా?" అన్నాడు మురళీమోహన్.

"వెళ్ళక ఇంకా చేసేదేముంది? కమాన్! అన్నాడు రవి సైకిల్ షెడ్ వేపు దారి తీస్తూ.

"మీటింగ్‌లో అంత గొడవ జరుగుతున్నా మీరేమీ మాట్లాడరేమిటి?" అన్నాడు రవి

"ఏం మాట్లాడమంటావు? ఇలాంటి మీటింగ్స్‌లో నేనెక్కువగా మాట్లాడనని నీకు తెలుసుగా.... నాకు లెఫ్ట్ మూవ్‌మెంట్ అంటే సింపతీ వుంది కానీ నీలాగా నేను ఇలాంటి-మీటింగ్స్‌లో మాట్లాడలేను.... ఐ విష్ ఐ కుడ్ ఎక్స్‌ప్రెస్ మై ఒపీనియన్స్ ... కాని నాకంత ధైర్యం లేదు. నిన్ను నేను ఎడ్మైర్ చెయ్యటానికిదే కారణం" అన్నాడు మురళీమోహన్.

సైకిల్ షెడ్‌లోంచి, సైకిల్ తీసి, అన్‌లాక్ చేసి సైకిలెక్కి తొక్కటము మొదలెట్టాడు. మురళీమోహన్ అతన్ని అనుసరించాడు.

"మొత్తం మీద మీరు వాళ్ళ ఆటలు సాగనీయకుండా చేశారు. మీరంత గట్టిగా జోక్యం చేసుకోకపోతే వాళ్ళు ఆ నల్గుర్నీ ఎక్స్‌పెల్ చేయించే వాళ్ళే...." అన్నాడు మురళీమోహన్.

రవికి మాట్లాడాలనిపించలేదు.... విపరీతంగా దాహంగా వుంది.... ఎంతో అలసిపోయాడు. ఆకలి ... దాహం.... తనంత ధైర్యంగా మాట్లాడతానని తనకే తెలీదు. ఈ రాజకీయాలకు దూరంగా వుండాలని ఎప్పటికప్పుడు అనుకోవటమే కాని తప్పటం లేదు రోట్లో తలదూర్చి రోకటిపోటుకు భయపడి లాభం లేదు.... కాని వీళ్ళెవరూ మాట్లాడరేమిటి? సో కాల్డ్ లెఫ్టిస్టులు? సీతారామారావు, సురేందర్, గోవిందరావు.... ఎవరూ గట్టిగా మాట్లాడరేమిటి? వాడిమీద హత్యా ప్రయత్నమే చేశాడట పోలీసులకో చెప్పి అరెస్ట్ చేయిస్తాడట!

సూర్యప్రకాష్, శ్రీరంగాచారి స్కూటర్ మీద రవి, మురళీమోహన్‌లను దాటి రయ్యిమని వెళ్ళిపోయారు.

వాడికి స్కూటరుంది. డబ్బుంది.... ఊళ్ళో బోల్డు ప్లాట్లు ఉన్నాయి. ప్లాట్లు కొంటాడు, అమ్ముతాడు. ప్లాట్లమ్మటమే కాదు ఇళ్ళు కూడా కట్టిస్తాడు. కాలనీలకు కాలనీలే కట్టిస్తాడు.... లక్షలకు లక్షలే సంపాదిస్తాడు....ఆ కాలనీల నన్నింటిని జె వి పి. క్యాంపులుగా మార్చేస్తాడు. వెరీ క్లెవర్.... వెరీ పవర్ ఫుల్.... అతనితో తలపడే శక్తి తనకుందా? లేదు. "ఇవన్నీ మనకెందుకండీ" అంటుంది రజని! మీ పని మీరు చేసుకోని రాక వేరే విషయాల్లో ఎందుకు తల దూరుస్తారు? ఇవ్వాళ కాలేజీలో జరిగిన గొడవ.... తనకూ సూర్యప్రకాష్ కూ మధ్య జరిగిన వాగ్యుద్ధం....ఇదంతా రజనికి చెబితే ఎంత షాకై పోతుందో! పూర్ థింగ్! తను వెళ్ళేటప్పటికి ఏమైనా తింటుందో.... తినదో.... మూడు దాటింది.... నీరసం....సైకిల్ తొక్కలేడు.... విపరీతంగా అలసిపోయాడు. ఎక్కడో పడిపోతాడు.... తనమీంచి ఏ లారీనో ఏ బస్సో వెళ్ళిపోతుంది. లారీ కిందపడి లెక్చరర్ దుర్మరణం" అని రేపు పత్రికల్లో వచ్చేస్తుంది.

"రేపట్నుంచి కాలేజీ లేదుగా! ఇక్కడే ఉంటారా? ఎటైనా వెళ్తారా?" అన్నాడు మురళీమోహన్.

"బహుశా ఎక్కడికీ వెళ్ళను. ఇక్కడే వుంటాను."

"ఈ మధ్య మీరేమీ రాయటం లేదేమిటి?"

"రాయాలని అనుకోవటమే కాని యేమీ రాయలేక పోతున్నాను. అసలు రాసేంత మన స్థిమితంగానీ, టైమ్ గానీ దొరకటం లేదు...."

"రేపట్నుంచే ఏదన్నా మొదలెట్టండి. కనీసం ఓ పదిహేను రోజులైనా కాలేజీ వుండదు.

"మొత్తం మీద కాలేజీ క్లోజయినందుకు లెక్చరర్లందరూ లోలోపల సంతోషిస్తున్నట్టుగానే వుంది."

"ఔను- మన వాళ్ళందరికీ చదువు చెప్పటంకంటే ముఖ్యమైన పనులు చాలా వున్నాయి గదా! మీరు కూడా ఈ టైమ్ ను ఉపయోగించుకోండి ఏదన్నా రాయండి."

"రాయాలనే వుంది. కాని ఎన్నో ప్రాబ్లెమ్స్".

"ప్రాబ్లెమ్స్ ఏమిటి?"



"మా నాన్నగారు వెంటనే ఓ రెండువందల రూపాయలు పంపించమని తన సమస్యలన్నీ ఏకరువు పెడ్తూ పెద్ద ఉత్తరం రాశాడు.... ఆయనకు వెంటనే ఆ డబ్బు పంపించకపోతే నాకు మనస్థిమితం వుండేలా లేదు.

"రెండు వందలా? చూద్దాం.... నా దగ్గర కూడా లేవు.. కాని రేపు పొద్దున్నే లేచి పేటకు బయల్దేరితే రెండువందలు దొరక్కపోవు.. ఆ సమస్యను గురించి ఆలోచించకు... రేపు నేను ఎలాగైనా అడ్జస్ట్ చేస్తాను."

"థాంక్స్! అయితే చాలా రోజులుగా రాయాలనుకుంటున్న కథ ఒకటి రేపు తప్పకుండా మొదలెడతాను."

"గుడ్! తప్పకుండా రాయండి... అయితే నేను రేపు ఉదయం కలుస్తాను."

మురళీమోహన్ రోడ్డు దిగి పక్క వీధిలో వున్న తన ఇంటివైపు వెళ్ళిపోయాడు.

థాంక్ గాడ్! మురళీమోహన్ రక్షించాడు. రేపతడు తప్పకుండా రెండు వందలు తెచ్చిస్తాడు తను నాన్నగారికి 'మనియార్డర్' చెయ్యొచ్చు. తన గుండెల మీద నుంచి పెద్ద బరువు తొలగిపోతుంది. కాని....ఈ ఆకలి ఈ దాహం ...తొలగిపోవు. అసలు రజని వంట చేసిందా? స్టౌ బత్తీలు లేవని అలాగే కూర్చుందో యేమో అంత పని చెయ్యదు. ఎలాగో వంట చేసే వుంటుంది

"ఏం మీటింగండీ బాబూ! చచ్చిపోయాం" అంటూ వెనుక నుంచి గోవిందరావు వచ్చాడు

రవి నీరసంగా నవ్వాడు.

"ఆ కాంతారావుగాడేమిటండీ- మాటమాటకు కొత్తల్లుడిలా అలుగుతాడేమిటి? ప్రిన్సిపాల్ కేమో వాడంటే యెక్కడలేని గురి ...అతను తప్ప ఆ ఎడ్వైజర్ షిప్ ఇంకెవ్వరూ చెయ్యలేరనుకుంటాడు."

రవి కేమీ మాట్లాడాలనిపించలేదు.

"ఎందుకైనా మంచిది. కొంచెం జాగ్రత్తగా వుండండి...."అన్నాడు గోవిందరావు రవికి దగ్గరగా వచ్చి తగ్గు స్వరంతో.

అతడు అంటున్న దేమిటో రవి కర్థంకాలేదు.

"సూర్యప్రకాశ్‌తో శత్రుత్వం చాలా ప్రమాదకరం. వాడు మిమ్మల్ని బాగా సస్పెక్ట్ చేస్తున్నాడు. మీ మీదేమయినా అఘాయిత్యం జరిపించడానికి ప్రయత్నించవచ్చు ఈ వారం పదిరోజులు ఇంట్లోనే వుండండి బయటకు వెళ్ళకండి సాధ్యమయినంత వరకు...." అన్నాడు గోవిందరావ్ యింకా తగ్గించి.

భయం.... తన నరాల్లో భయం వ్యాపిస్తోంది.

అఘాయిత్యమంటే? కొట్టిస్తాడా? చంపేస్తాడా? వాడి చేతికింద చాకుల్లాంటి కుర్రాళ్ళెందరో వున్నారు.... ఓ చాకుతో తనను పొడిపించేస్తాడా?

"అఘాయిత్యమంటే యేం చేస్తాడంటారు....?" అన్నాడు రవి తన లోపల జరుగుతున్న సంచలనాన్ని బయటకు కనిపించనీయకుండా

"ఏమైనా చెయ్యొచ్చు. మీరయితే కొన్ని రోజులు జాగ్రత్తగా వుండండి. సాధ్యమైనంత వరకు బయటకు వెళ్ళకండి."

అఘాయిత్యమా? దానర్థం ఏమైనా కావచ్చు. చంపెయ్యొచ్చు ... చిత్తుగా తన్నేసి 'ఎకీలు కాకీలు' విరిచేసి, దేనికీ పనికిరాకుండా చేసేయవచ్చు.

తన నెవరు రక్షిస్తారు?

పెద్ద మొనగాడిలా తనొక్కడే వాడితో తలపడ్డాడు.

గొప్ప గొప్పవాళ్ళంతా నోరు మూసుకొని కూర్చుంటే తనేమో నోటికొచ్చినట్లల్లా వాగాడు.

నిజమే....

వాడు తన మీద పగబట్టాడు. తన అంతం చూడటానికి ప్రయత్నిస్తాడు ...

తను సైకిల్ మీద వెళుతోంటే వెనుక నుండి యెవరయినా వచ్చి తన తల మీద బాదేస్తాడు. తన తల పగిలిపోతుంది.

రక్తం మడుగులో తను... భయం.... వణుకు....తనసంతా పొగలా కమ్మిన భయం.

రవి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.



ఓ లారీ రయ్యిమని అతని పక్కనుండి దూసుకుపోయింది..... వెంట్రుకవాసిలో తప్పిపోయింది. లేకపోతే ఆ లారీ తనను గుద్దేసేదే... ఆ లారీ సూర్యప్రకాష్‌దేనేమో! ఇంతకు ముందే వెళ్ళాడు. తనను గుద్దెయ్యమని అతడే యీ లారీని పంపించాడేమో!

ఆలోచించకు....పిచ్చెక్కుతుంది. త్వరగా ఇల్లొచ్చేస్తే బాగుండును-రజని ఒళ్ళో తల దాచుకొని అన్నీ మరిచిపోతే బాగుండును.

ఆకలి....బాధ... భయం....నీరసం....నిరాశ....నిస్పృహ ఇవన్నీ కలిపితే రవి.

ఓ మహా రచయితా! ఇప్పటికి ఈ నీ మనఃస్థితిని చిత్రిస్తూ ఒక నవల రాసెయ్. యిటు రజనీ అటు సుధా కూడా మెచ్చుకుంటారు. ముందు జరిగిన మీటింగ్....అదొక్కటే చాలు నవల రాయటానికి.

అబ్బా! అబ్బా! ఏం మీటింగ్‌రా బాబూ అది? సంత, సంత!!

అఘాయిత్యం! అఘాయిత్యం! తల పగలవచ్చు! రక్తం కారవచ్చు-ప్రాణం పోవచ్చు. ఏదయినా కావచ్చు.

అదిగో మరో లారీ....చాలా వేగంగా వస్తోంది.... . తన చేతులు వణుకుతున్నాయి. సైకిల్ పట్టుదప్పిపోతోంది.... . కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఆ లారీని సూర్యప్రకాషే పంపించాడు. ఆ లారీ తనను గుద్దేస్తుంది. తప్పదు ...రక్తం మడుగులో ముద్దగా మారిపోయిన తను....రయ్యిమని లారీ రవి పక్కనుంచి వెళ్ళిపోయింది.

లారీ వెళ్ళిపోయింది.

తను బతికే వున్నాడు.

బతికే వుండాలి.

ఇలా అనుక్షణం చస్తూ బతకకూడదు

వాడెవడో చంపుతాడని ఇప్పుడే చావకూడదు అయినా శ్రీకృష్ణ పరమాత్మ చెప్పినట్లు చచ్చేది నువ్వు కాదు—చంపేదీ వాడు కాదు. అందరూ నిమిత్తమాత్రులు... అయినా చచ్చేది నీ శరీరం మాత్రమే! ఆత్మకు చావు లేదు....

పాత దుస్తుల్ని వదిలేసి కొత్త దుస్తుల్ని ధరించినట్టు-ఆత్మ ఒక శరీరాన్ని వదిలేసి ఇంకో శరీరాన్ని ధరిస్తుంది. డబ్బాల్ మైడియర్ పీకి పంజా! మైడియర్ పార్థా! ఎవరు అన్న? యెవడు తమ్ముడు? ఎవడు తండ్రి? ఎవరు తల్లి? ఎవడు కొడుకు? ఎవరు కూతురు? అంతా మిథ్య! నీకై నువ్వు కల్పించుకున్న బంధనాలు. ఈ శరీరమూ అంతే! నీకై నువ్వు కల్పించుకున్న ఒక భ్రమ....వదిలెయ్....ఈ పాత వలువల్ని వదిలేసి కొత్త వలువల్ని ధరించు. కమాన్! చచ్చిపో....ఆ వచ్చే బస్సు కింద పడిపో! కాని పడలేడు. పడలేవు....యేదీ నీ చేతిలో లేదు. అంతా నా చేతిలో వుంది....నీకొక స్వంతమైన అస్తిత్వమంటూ లేదు..... నా చేతిలో నువ్వో కీలుబొమ్మవు. నువ్వో బానిసవు....మైడియర్ శ్రీకృష్ణ పరమాత్మా! గో టూ హెల్!

నవ్వుకున్నాడు.

ఫరవాలేదు. ఎంతటి విపత్కర పరిస్థితిలోనయినా నిన్ను చూసి నువ్వు నవ్వుకునే అలవాటును పోగొట్టుకోలేదు. బ్రేవో మైడియర్ యంగ్ మాన్! అది నిన్ను రక్షిస్తుంది.

సైకిల్ ఎంత తొక్కి తొక్కి తొక్కి తొక్కినా ఇల్లు రాదేమిటి?

దాహం....ఆకలి... భయం పోయింది. థాంక్స్ టు శ్రీకృష్ణా....!! థాంక్స్ టు గీత! కాని ఆకలిని, దాహాన్ని పోగొట్టదేం? మాయం టావ్....నా ముద్దుల వేదాంతీ! మిథ్యంటావ్! పాలికాపు నుదుటి చెమట.

"నమస్కారం సార్" అన్నాడు రోడ్డు పక్కన నిల్చున్న శ్రీనివాస్.

ఓహో! నువ్వా? సడెన్‌గా ఎవరోననుకున్నాను.

"హల్లో శ్రీనివాస్! యేమిటి సంగతి? నిన్ను పోలీసులు పట్టుకుపోలేదు కదా!" అన్నాడు రవి సైకిల్ ఆపి.

"లేదు సార్! క్లాసు లయితలేవని నేను కాలేజీకే వస్తలేను సార్!" అన్నాడు శ్రీనివాస్.

"చాలా మంచి పని చేశావు. కాలేజీ క్లోజ్ చేశారు. రేపు నువ్వు మీ వూరెళ్ళిపోవచ్చు" రవి.



"బావు సార్! రేపు పోతున్న సార్! ఈ రోజు మీ ఇంటికొస్త—యేమన్న పుస్తకాలుంటే ఇవ్వుండ్రి సార్" - శ్రీనివాస్.

"అలాగే! కొన్ని క్వశ్చన్స్ కూడా రాసిస్తాను. ఇంటి దగ్గర వాటికి ఆన్సర్స్ రాసుకు రావాలి. రాత్రి యేడు, యెనిమిది మధ్యలో రా" అన్నాడు రవి.

"మంచిది సార్! మిమ్ముల జూసి బయటి కెళ్ళిన. లేకపోతే బయటి కెళ్ళేటట్టు లేదు. టౌన్‌ల పోలీసులు 144 పెట్టిండ్రు. స్టూడెంట్లు కనబడితే చాలు, పట్టుకపోతాండ్రు" అన్నాడు శ్రీనివాస్ రోడ్డు పక్కనే వున్న తన రూమ్‌లో కెళ్తూ.

రవి సైకిల్ తొక్కటం మొదలెట్టాడు.

సెక్షన్ 144తో ఆగారు. కర్ఫ్యూ పెట్టేసినా అడిగేవాడు లేడు.

శ్రీనివాస్ చాలా మంచివాడు. ఇంటర్మీడియేట్ తర్వాత చదువు ఆపేస్తానంటే తిట్టాడు. వాళ్ళ అమ్మ, నాన్నల దగ్గర కెళ్ళి వాళ్ళను ఒప్పించి, తను ఫీజు కట్టి శ్రీనివాస్‌ను కాలేజీలో అడ్మిట్ చేయించాడు. తల్లి దండ్రుల మీద ఆధార పడకుండా హైస్కూల్ పిల్లలకు ట్యూషన్లు చెప్పి ఆర్థికంగా తన కాళ్ళ మీద తను నిలబడగలుగుతున్నాడు. అలాంటి స్టూడెంట్సంటే తనకి యిష్టం. తనకి చేతనయిన సహాయం చేస్తున్నాడు. ఫస్టియర్ మంచి మార్కులతో పాసయ్యాడు. సెకండియర్లోకి వచ్చాడు. బాగా చదువుతాడు. ఎన్నో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ గురించి అతడికి చెప్పాడు. వాటి కోసం ఎలా ప్రిపేర్ కావాలో చెప్పాడు. యేమేం మాగజైన్స్ చదవాలో చెప్పాడు.

తనింటికి తరచుగా వస్తుంటాడు.

తను తెప్పించే మాగజైన్స్ చదువుతాడు.

'హిందూ' పేపర్ చదవడం అలవాటు చేసుకున్నాడు

శ్రీనివాస్ బి.ఎ. అయిపోగానే తప్పకుండా యేదైనా ఉద్యోగం సంపాదిస్తాడు.

అమ్మయ్య! తనుండే రోడ్ మీదకు వచ్చేశాడు.

అమ్మయ్య! ఇల్లొచ్చేసింది! మైహోమ్! మై స్వీట్ హోమ్! వచ్చేసింది!

## 3

కాంపౌండు గేటు తెరచుకొని లోపలకెళ్ళి సైకిల్‌కు స్టాండ్ వేసేశాడు.

తలుపులు మూసేసి వున్నాయి.

తలుపుల మీద కొట్టి 'రజనీ! తలుపు తీయ్' అన్నాడు.

రజని వచ్చి తలుపు తీసింది.

రజని కళ్ళల్లోకి చూసాడు. ఆమె వెంటనే వెనక్కి తిరిగి లోపలకెళ్ళి పడుకుంది.

అతడు లోపలకొచ్చి తలుపులు గడియ పెట్టేసి గదిలోకి అడుగు పెట్టాడు.

రజని ముసుగు తన్నేసి పడుకొని వుంది

యేమిటీ? యేమిటీ మనిషి? ఈ మనిషికి హృదయం వుందా? దయా దాక్షిణ్యాలున్నాయా? స్త్రీ సహజమైన ప్రేమ, సానుభూతి, దయ, కరుణ, జాలి... అన్నీ అడుగంటి పోయాయా?

పొద్దున తిండి తినకుండా హడావిడిగా వెళ్ళిపోయి, కాలేజీలో పోలీసుల చేత దెబ్బలు తిని, పీడకలలాంటి ఆ మీటింగ్‌లో పాల్గొని, అలసిపోయి, ఆకలి, దాహం, అశాంతి, ఆవేదనలతో వచ్చిన భర్తను ఇలా ఇంత ఉదాసీనంగా చూసే మనిషినేమనాలి?

'దిసీజ్ టూమచ్!' తను భరించలేడు... తన లోపలనుంచి తన్నుకొని వస్తున్న లావానిక ఆపలేడు. ఆఫ్టరాల్, తనూ మనిషే! తనకూ రక్త మాంసాలున్నాయి. తనకూ ఆకలి దాహాలున్నాయి. ఇంటికి రాగానే వచ్చారా? మీకోసమే చూస్తున్నా! ఇంత ఆలస్యం చేశారేమిటి? యేం జరిగింది? భోజ



నానికి ఎందుకు రాలేదు? మీకోసం ఎన్ని యుగాలుగా ఎదురుచూస్తున్నానో! అబ్బబ్బబ్బ! ఎప్పుడూ ఆలస్యమే ఎప్పుడూ యేవో పనులు. తలమీదికేదో తెచ్చుకుంటారు. బాధపడతారు.

అశాంతి ఆవేదనలతో సతమతమై పోతారు. త్వరగా కాళ్ళూ చేతులూ కడుక్కోండి వడ్డిస్తాను ఎంత ఆకలిగా ఉన్నారో! త్వరగా కానీయండి అంటూ చకచకా నాలుగు చల్లటి మాటలు మాట్లాడితే తన హృదయం ఎంత శాంతించేది.

కాని మాట్లాడదు....మైడియర్ గ్రేట్ రజనీ...నువ్వెందుకు మాట్లాడుతావు?

చకచకా విసురుగా బట్టలు విడిచేసి లుంగీ కట్టుకొని బాత్‌రూం వైపు వెళ్ళాడు.

ఆమె కోపం పోగొట్టాలంటే యేం చెయ్యాలి? కాళ్ళు పట్టుకోవాలి. యెడమకాలితో తన్నించుకోవాలి.

"జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తనర్చు లతాంతాయుధు కన్న తండ్రి శిరమున్ వామ పాదంబు నందొలంగంద్రోచె లతాంగి...."

అలా తన్నినప్పుడు కూడా యేమాత్రం కోపగించుకోకుండా చెల్వగు నీ పద పల్లవంబు మత్తను పులకాగ్ర కంటక వితానము దాకిన నొచ్చునంచు....అనాలి....డామిట్!

ప్రబంధ కాలంలో స్త్రీలను గౌరవించలేదని ఎవడంటాడు? ఇంటర్నేషనల్ వుమెన్స్ లిబ్బర్స్‌కు సత్యభామ శ్రీకృష్ణున్ని ఎడమకాలితో తన్నిందని శ్రీకృష్ణుడు కోపగించుకోకుండా నన్ను తన్నటం వలన అత్యంత కోమలమైన నీ కాలుకు ఎంత నొప్పి పుట్టిందోనని బాధపడి పోయాడని చెప్పాలి.

చల్లని నీళ్ళు మొహం మీద చల్లుకుంటోంటే ఎంత హాయిగా వుందో! చల్లని నీళ్ళు కన్నతల్లి లాంటివి. కడుపులోని పేగుల్ని ఆకలి

అసిడ్‌లా తినేస్తోంది. కనీసం లేచి అన్నం పెడుతుందా? పెట్టదు....మంచి నీళ్ళన్నా యిస్తుందా....ఇవ్వదు. అయినా ఆమె నీకు మంచినీళ్ళెందుకివ్వాలి? నీకు చేతులు లేవా? రజనీ! మంచినీళ్ళు! రజనీ టీ! సోపెక్కడ? రజనీ టవలెక్కడ? రజనీ నా బనియన్ డ్రాయర్ ఎక్కడ? రజనీ కాలేజీకి ఈరోజు యే బట్టలు వేసుకొని వెళ్ళమంటావు? రజనీ! నా పెన్నెక్కడ? నా పుస్తకాలెక్కడ? నా డైరీ ఎక్కడ? నా బ్యాగెక్కడ? అసలు నేనెక్కడ? బ్లడీ ఫూల్! బుద్ధిలేదు. ఆమె మీద అంతగా ఎందుకు ఆధారపడాలి? ఇలాంటి చిన్నచిన్న పనులన్నీ నువ్వు చేసుకోలేవూ? చేసుకోలేనని కాదు.....ఆమె చేత చేయించుకుంటే యేదో తృప్తి ...... యేదో ఆనందం....

అనుక్షణం ఆమెను పిలవటం పసిపిల్లాడిలా ఆమెచేత తన పనులన్నీ చేయించుకోవటం, పసిపిల్లాడికంటె అన్యాయం అని ఆమె చేత అనిపించుకోవటం యేకో పిచ్చి అనిర్వచనీయమయిన ఆనందం, సెంటిమెంట్స్... యూ ఆర్ ఎ బ్లడీ సెంటిమెంటల్ ఫూల్! సెంటిమెంట్స్‌కు బానిస! నిన్నా దేవుడు కూడా బాగుచెయ్యలేడు.

మొఖం కడుక్కొని ఇంట్లోకొచ్చాడు.

ఆమె ఇంకా అలాగే పడుకొని ఉంది.

టవెల్ వెతుక్కొని మొఖం తుడుచుకొని, తల దువ్వుకుంటూ "చచ్చేంత ఆకలేస్తోంది! కాస్త లేచి అన్నం పెడుతావా?" అన్నాడు.

"అన్నీ టేబుల్ మీదున్నాయి పెట్టుకొని తినండి" అందామె ఎడమ వైపునుండి కుడివైపుకు తిరిగి.

"నువ్వు పెట్టవన్నమాట?" అన్నాడు ఆమెకు దగ్గరగా వచ్చి.

"తలనొప్పిగా ఉంది. మీరే పెట్టుకోండి."

"తల నొప్పిగా ఉంటే యేదైనా టాబ్లెట్ వేసుకోలేక పోయావా? ఇంట్లో వున్నాయిగా...."

"అక్కరలేదు! అదే తగ్గిపోతుంది."

"తగ్గిపోదు....యింట్లో టాబ్లెట్ లేకపోతే బజారుకెళ్ళి తెస్తాను."

"అక్కరలేదు! మీరన్నం తినండి...."



"నువ్వు తిన్నావా?"

"తిన్నాను."

గబుక్కున వెళ్ళి 'టేబుల్' మీదున్న అన్నం, కూరల మీది మూతలు తీసి చూశాడు. వండినవి వండినట్టే వున్నాయి

"ఎందుకబద్ధం చెప్తావు? నువ్వు అన్నం తినలేదు. ఇద్దరం కలిసి తిందాంరా... నాకు బాగా ఆకలిగా వుంది ప్లీజ్!"

"మీరు తినండి....నాకు ఆకలిగా లేదు."

అతడు విసురుగా వెళ్ళి ఆమె కప్పుకున్న దుప్పటిని లాగేసి 'ఏమిటి నీ ఉద్దేశ్యం?' అన్నాడు.

యేడ్చి, యేడ్చి ఎర్ర జీరలతో నిండిపోయిన ఆమె కళ్ళు వాడి రాలిపోవటానికి సిద్ధంగా వున్న ఎర్రగులాబీలా మారిపోయిన ఆమె ముఖం.... నొసలు మీద బొట్టు లేదు. పక్కనిండా పరచుకున్న జుట్టు....తను వెళ్ళినప్పుడు కట్టుకున్న చీరా, జాకెట్‌ను మార్చుకోలేదు. అంటే స్నానం చెయ్యలేదన్నమాట! ఇంత భయంకరంగా ఎందుకు మారిపోయింది? తనామెను అంతగా బాధపెట్టేమాట యేమన్నాడు?

"మైగాడ్! యేమిటిది? ఎందుకిలా వున్నావు" అన్నాడు.

అతనా మాట అన్న మరుక్షణంలో ఆమెకు కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

"ఏమిటిది? ఎందుకిలా అయిపోతున్నావు? పొద్దున్న జరిగిన దానికేనా సారీ రజనీ! అయామ్ రియల్లీ సారీ" అని ఆమె ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకోబోయాడు.

ఆమె పవిట కొంగుతో తన కన్నీళ్ళను తుడుచుకొని మరోపక్కకు తిరిగి పడుకుంది.

"ఇదుగో రజనీ! సారీ అన్నప్పుడు వూరుకోవాలి. ఈరోజు కాలేజీలో పెద్దగొడవైంది స్టూడెంట్స్ రెండు వర్గాలుగా చీలిపోయి కొట్టుకున్నారు పోలీసులొచ్చి దొరికిన ప్రతీ స్టూడెంట్‌నూ అడ్డమొచ్చిన ప్రతి లెక్చరర్‌నూ కొట్టారు. ప్రిన్సిపాల్ స్టాఫ్ మీటింగ్ పెడితే అక్కడ కూడా పెద్ద గొడవైపోయింది. విసిగి, వేసారి వచ్చాను. దయచేసి నన్నింకా అడ్డ

గించకు. ఇద్దరం కొంచెం అన్నం తిందాం లే!" అన్నాడు సాధ్యమైనంత ప్రశాంతంగా.

"మిమ్మల్నేం విసిగించాను ? నాకాకలిగా లేదు..... లేస్తే కళ్ళు తిరుగుతున్నాయి. దయచేసి ఈ ఒక్కసారికి మీరు పెట్టుకొని తినండి. నాకు నిజంగా ఆకలిగా లేదు."

"పొద్దుట్నుంచి మంచినీళ్ళు కూడా ముట్టనిదానికి ఆకలిగా లేకపోవడమేమిటి? ఆల్‌రైట్! తినకు! నేనూ తినను....సరేనా?" అంటూ అతడు టేబుల్ మీదున్న గ్లాసుతో మంచినీళ్ళు ముంచుకొని గబగబ తాగేసి ముందు రూంలోకెళ్ళి కూర్చున్నాడు.

దీన్ని యెవరంటారు హింసకాదని? మానసిక హింసకంటే మించిన హింస ఇంకొకటి లేదు. భౌతిక హింసకంటే మానసిక హింస చాలా శక్తివంతమైంది గుండెను పిల్చి పిల్చి, పీడించి పీడించి పిప్పి చేసే హింస! ఓ మహాత్మా! ఓ మహర్షీ! చచ్చి యే స్వర్గాన ఉన్నావో గాని ఈ దేశ ప్రజలకు ముఖ్యంగా స్త్రీలకు బహ్మాండమైన ఆయుధం అందజేసి వెళ్ళావు. ఆకలి, దాహం. బాధ, హైపరాబాధ, ఆ బీడ్స్‌లో, కోఠీలో, ఏ హాస్టల్లో అనుభవించిన ఆకలిబాధ మళ్ళీ పేగుల్ని పిండేస్తోంది.

కిరణ్మయి....మార్లిన్ మన్రో గురుదత్, కాగజ్‌కేఫూల్, అభీన జావో ఛోడ్‌కర్....అభీతోదిల్ భరానహీ....రేడియోలో ఇప్పుడేమన్నా పాటలొస్తాయా? అందరూ "టేప్ రికార్డర్‌లు, టూ ఇన్ వన్‌లు" కొనేస్తున్నారు.

తనూ ఓ టూ ఇన్ వన్ కొనుక్కొని, అభీనజావో ఛోడ్‌కర్.... రసిక్ బలమా....హంచ్ ఫిర్‌నికలా....ఓ నిర్దయ్ ప్రీతమ్....మనసున మల్లెల మాలలూగెనే....ఆకాశవీధిలో....సావిరహే తవదీనారాధా....నగుమోము కనలేని....వింటూ కూర్చుంటే! కలలు....కలలు....అలలు-అలలు-అలలుగా కలలు. ఆకలిలో, వేదనలో, బాధల్లో, గాథల్లో హైదరాబాధల్లో కలలు....కలలు....కలలు కని బతికాడు. కలలు తిని బతికాడు. కలలుతాగి బతికాడు.



ఓ పదేళ్ళు టాగోర్ గీతాంజలిని తాగి బతికానంటే ఎవరైనా నమ్ముతారా! మైడియర్ చలం! నేను నమ్ముతాను! కాని ఈ కడుపు నమ్మదే! యాభై రోజులెలా ఈ కడుపును సైలెంట్‌గా వుంచగల్గావు మహాత్మా....? హాఫ్ నేకెడ్ ఫకీర్! ఉపవాసాలుండి బ్రిటిష్ సామ్రాజ్యానికి గోరీ కట్టావు. కలకత్తాలో లక్షలమంది ప్రాణాల్ని రక్షించావు. హి ఈజ్ మై వన్ మాన్ బౌండరీ ఫోర్స్! పంజాబ్‌లో లక్షల మంది సైనికులు చెయ్యలేని పనిని కలకత్తాలో ఒక్కడు....ఒక్క బక్కచిక్కిన హాఫ్‌నేకెడ్ ఫకీర్ చేశాడు. ఓ మహాత్మా! ఓ మహర్షీ! యూ ఆర్ రియల్లీ గ్రేట్. దిస్ ఫాస్ట్! దిస్ మోరల్ వయలెన్స్ ఈజ్ రియల్లీ గ్రేట్! ఒక్కపూట తిండి లేకుండా ఉండలేకపోతున్నామే! టేబుల్ మీద అన్నీ ఉన్నాయి. వెళ్ళు! చక చకా పెట్టేసుకో. ఈ ఆకలిని చల్లార్చుకో....ఈ ఆకలి నిన్నంతా దహించి వేస్తుంది. దావానలంలా నీ శరీరంలోని అణువణువునూ దహించేస్తుంది. కమాన్! గెటప్.... ఆమె సంగతేమిటి? వదిలేసెయ్....ఆకలితో....బాధతో విలవిల్లాడిపోతూ, కళ్ళనిండా ధారాపాతంగా ప్రవహిస్తున్న కన్నీళ్ళతో....కళ్ళు కావవి.... కన్నీటి జలపాతాలు. ఆకలితో, బాధతో, కన్నీళ్ళతో, కృంగి, కృశించి, నశించి పోతుంటే....నిన్నే నమ్ముకొని నిన్నే సర్వస్వ మనుకొని....పుట్టి పెరిగిన ఊరును, కనిపించిన తల్లి దండ్రులను, అందర్ని వదిలి నీతో వచ్చిన నీ అర్ధాంగి. నీ సహధర్మ చారిణి. ఆమెను ఆకలి అనే పెద్ద పులికి అప్పగించి, ఆ పెద్ద పులి ఆమెను నిర్దాక్షిణ్యంగా కబళించివేస్తుంటే నువ్వేమో హాయిగా కడుపునిండా మెక్కేసి చెక్కేస్తావా? గిల్ట్....సెన్సాఫ్ గిల్ట్!

తింటే సెన్సాఫ్ గిల్ట్ తినేస్తుంది. తినకపోతే ఆకలి తినేస్తుంది. కాబట్టి తిన్నా తినకపోయినా యేదో ఒకటి తనను తినటం ఖాయం. తినకపోతే కడుపుకి గాయం తింటే మనసుకు గాయం. తిన్నా, తినకపోయినా ఏదో ఒకటి తనను తినటం తప్పనిసరి....తాగితే మరచిపోగలను... కాని తాగలేను. మరచిపోతే తాగగలను. కాని మరవలేను. కాబట్టి మనసుగతి ఇంతే...కడుపుగతి ఇంతే మనసున్న మనిషికి సుఖము లేదంతే! మరి కడుపున్న మనిషికి? మనసు గొప్పదా? కడుపు గొప్పదా....? మైడియర్

ఆత్రేయా! ఏది గొప్పది? మనసే గొప్పదంటావు నువ్వు! కడుపే గొప్పదంటాను నేను.

"పోస్ట్ మాన్!" బయట్నించి కేక.

రవి దిగ్గున లేచాడు.

"నమస్కారం సార్!" అన్నాడు గేట్ దగ్గర నిల్చున్న పోస్ట్ మాన్.

"ఇప్పుడు పోస్టేమిటి పోచయ్యా!" అన్నాడు రవి.

"ఈవినింగ్ పోస్ట్ సార్!" అంటూ పోచయ్య రవి చేతిలో రెండు ఉత్తరాలు పెట్టాడు.

"ఈ రోజు నాకు మార్నింగ్ పోస్టేమీ రాలేదా?...." అన్నాడు రవి.

"వచ్చింది గద! పొద్దున రెండు ఉత్తరాలు అమ్మగారికి ఇచ్చిన గదా!" అంటూ పోచయ్య సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

ఎప్పుడింటికొచ్చినా "ఈ రోజు పోస్టేమైనా వచ్చిందా రజనీ—?" అంటూ అడిగే తను ఈ రోజు ఆ విషయం అడగటమే మరిచి పోయాడు.

పోస్ట్‌మాన్ ఇచ్చిన రెండు ఉత్తరాల్ని చకచకా ఓపెన్ చేసి చదివేశాడు.

ఒకటేమో తను పంపించిన కథను ప్రచురణకు స్వీకరించామని, వీలు వెంబడి ప్రచురిస్తామని వచ్చిన ఉత్తరం.

రెండవది మీరు రాసిన 'కరుణ' ఎంతో బావుందని ప్రశంసిస్తూ గుంటూరు నుండి తనకిదివరకు పరిచయంలేని అమూల్య అనే అమ్మాయి రాసిన ఉత్తరం.

ఆ రెండుత్తరాలు చదివేటప్పటికి గుండె లెందుకో ఎంతో తేలికై పోయినట్టనిపించాయి. సో ఎట్ లాస్ట్ 'పిలుపు' ప్రచురింపబడుతోందన్న మాట! మూడు పత్రికల నుండి తిరిగొచ్చిన ఆ కథ అంగీకరించబడిందంటే వెలుగు చూడబోతోందంటే— యేదో సాధించానన్న తృప్తి. ఈ పత్రిక వాడు కూడా దాన్ని తిప్పి పంపిస్తే చించేద్దామనుకున్నాడు. బాయిలర్‌లో వేసి దాన్ని తగలబెట్టేద్దామనుకున్నాడు. కాని ఫరవాలేదు. తెలుగు పబ్లిషర్లు ఆ



కథను బ్రతికించుకున్నారు. ఆ కథ మంచి కథ అని తనకు తెలుసు ఆ కథను పూర్తిచేసిన రోజు ఎంత హాయిగా ఫీలయ్యాడో— తిరిగొచ్చినరోజు ఎంత మిజరబుల్‌గా ఫీలయ్యాడో—మళ్ళీ ఈ రోజున ఎంత రిలీఫ్‌ను అనుభవిస్తున్నాడో!

వెంటనే లోపలకెళ్ళాడు.

ఆమె ఇంకా అలాగే పడుకొని వుంది.

"రజనీ! గుడ్ న్యూస్!" ఉత్సాహంగా అన్నాడతను.

ఆమె మొఖం మీది నుంచి దుప్పటి తీసేసి అతనికేసి యేమిటన్నట్టుగా చూసింది

"మనకథ 'పిలుపు'ను 'ప్రగతి' వాళ్ళు ప్రచురించటానికంగీకరించారు. ఆ కథ ఇప్పటికైనా—ఇంత ఆలస్యంగానైనా వెలుగు చూస్తోంది" అన్నాడు ఆమె పక్కన కూర్చొని ఆమెకా లెటర్ అందిస్తూ—

వాడిపోయిన ఆ ముఖం ఒక్క క్షణం సజీవంగా మారిపోయింది. కాని ఓ చిన్న చిరునవ్వు మెరిసినట్టుగా మెరిసి మాయమైపోయింది.

"కమాన్ రజనీ! ప్లీజ్ గెటప్! మరిచేపోయాను—మార్నింగ్ పోస్ట్‌లో కూడా లెటర్స్ వచ్చాయటకదా!" అన్నాడు.

"సారీ! మీ కివ్వటం మరిచిపోయాను" అంటూ ఆమె తన తలగడ కింద పెట్టుకున్న ఒక ఇన్‌లాండ్ లెటర్, ఒక కార్డు తీసి అతని చేతికిచ్చింది.

ఇన్‌లాండ్ లెటర్ మీది అక్షరాలు చూడగానే అవి నాన్నగారు రాసిందని అర్థమైంది.

ఉత్తరం చింపే వుంది.

నాన్నగారు రాసిన ఉత్తరాన్ని చకచకా చదివేశాడు.

చిరంజీవి రవీందర్‌ను మీనాన్న ఆశీర్వదించి వ్రాయునది.

నీకు ఇది వరకే ఒక ఉత్తరం వ్రాశాను. ఇక్కడ నాట్లు పెట్టిస్తున్నానని, వెంటనే రెండు వందల రూపాయలు పంపించవలసిందని రాశాను. కాని ఇవ్వాల్టి వరకు 'మనీ ఆర్డర్' రాలేదు. రోజూ మనీ ఆర్డర్ కోసం చూస్తున్నాను. కాని నువ్వా విషయమే మరచిపోయి నట్టున్నావు. నిన్ను మేం

ఎంత కష్టపడి హైదరాబాద్‌లో చదివించామో మరిచేపోయావు. అన్నీ మరిచిపోయావు. నెలకు ఆరేడు వందలొస్తోంటే ఆ డబ్బంతా ఏం చేస్తున్నావో తెలియటంలేదు. వందలకు వందలు ఖర్చుపెట్టి చీరలు కొనటం, సినిమాలకు, షికార్లకు వెళ్ళటం తప్ప మా సంగతేమీ పట్టించుకోవటం లేదు. పెళ్ళయి కాపురం పెట్టగానే నువ్వింతగా మారిపోతావని మేం కలలో కూడా అనుకోలేదు. చేతిలో ఒక్క పైసా లేక మేం దినదిన గండంగా బతుకుతుంటే మీరేమో పైసలను మంచి నీళ్ళలా ఖర్చుపెడ్తూ మేం కనీసం బతికామా చచ్చామా అని కూడా చూడటం లేదు. ఇదీ నాట్లు పెట్టే సమయం చేతిలో పైసలు లేక నాట్లు పెట్టించటం ఆలస్యమయితే చేసిన కష్టమంతా నాశనమై పోతుంది. ఇప్పటికైనా వెంటనే రెండు వందల రూపాయలు మనీ ఆర్డర్ చెయ్యగలవు. వృథా ఖర్చులు కొన్ని తగ్గించుకో గలరు. కోడలికు ఈ విషయం ఎన్నోసార్లు చెప్పాను. అయినా మీరు మా మాటల్ని యేమీ లెక్కచేస్తున్నట్టు లేదు. వెంటనే ఉత్తరం రాయగలవు. మనీ ఆర్డర్ చెయ్యగలవు.

ఇట్లు,
మీ నాన్న.

ఉత్తరం పూర్తి చెయ్యగానే రజని ఎందుకంతగా కుమిలిపోయిందో అర్థమైంది.

"ఇప్పుడర్థమైంది! నువ్వలా ఉండడానికి కారణం ఈ ఉత్తరమన్న మాట!" అన్నాడు ఆమె పక్కన కూర్చుంటూ.

ఆమె కన్నులు మళ్ళీ శ్రావణమేఘాలై పోయాయి-

"మీరు నాకెన్ని చీరలు కొనిచ్చారు? నేనేం వృథా ఖర్చులు పెడ్తున్నాను? మీ నాన్నగారికి నేనంటే ఎందుకింత కోపం?" వెక్కి వెక్కి యేడుస్తూ అంది.

"రజనీ! నీకేమైనా పిచ్చా? ఆయనలా రాసినంత మాత్రాన నువ్వింతగా బాధపడిపోవాలా?"

"బాధుండదు? నా స్థానంలో మీరుంటే తెలిసేది. మీరు సంపాదించే డబ్బంతా వాళ్ళకొక్కకుండా నేనే తింటున్నానని మీవాళ్ళ ఉద్దేశ్యం....అసలు నేనొక్కదాన్ని లేకపోతే మీవాళ్ళందరూ ఎంతో హాయిగా ఉండేవాళ్ళు.... యేదన్నా విషం తెచ్చివ్వండి....మింగేసి చస్తాను అప్పుడు మీ వాళ్ళందరి కళ్ళు చల్లబడతాయి...."



"నీకు నిజంగా పిచ్చెక్కింది ఆయనేదో డబ్బులవసరం ఉండి ఏవో తన కష్టాలు చెప్పుకున్నాడు...."

"ఆయనే కష్టపడ్తున్నారు... మనమేమో నోట్లకట్టల్లో దొర్లుతున్నాం. ఈరోజు కిర్సనాయిల్లేక, స్టౌ బత్తీలు లేక నేనెంత అవస్థపడ్డానో ఆ భగవంతుని కెరుక...."

"అబ్బబ్బ! అది నిజమేనమ్మా! కానీ వాళ్ళు పల్లెటూళ్ళో ఉంటున్నారు. బస్తీలో ఉండే ఖర్చులేమిటో... బస్తీ జీవితమంటే యేమిటో వాళ్ళకు తెలియదు... వంద రూపాయలంటేనే అక్కడెంతో ఎక్కువ— అట్లాంటిది మనకు ఆరువందలొస్తున్నాయంటే వాళ్ళకు ఎంతో డబ్బని పిస్తుంది ఈ డబ్బంతా వీళ్ళేం జేస్తున్నారు? అన్న సందేహం కలుగుతుంది అంతే తప్ప...."

"నేను చీరలు కొనుక్కోగా ఎప్పుడు చూశాడీయన? పెళ్ళి అయినప్పట్నించి మీరు నాకెన్ని చీరలు కొనిచ్చారు? ఇప్పటివరకు మీ అంతట మీరు కనీసం ఒక్కటి....యే హైదరాబాద్ వెళ్ళినప్పుడో... యే విజయవాడ వెళ్ళినపుడో ఒక్క చీర నాకోసం తెచ్చారా? మీరు నాకు చీరలు తేవటం లేదని మిమ్మల్ని నేనేమైనా సాధించానా? ఆయనెందుకలా రాయాలి?"

"ఆయన రాస్తే ఇప్పుడు నన్నేం చేయమంటావు? ఆయనమీది కోపాన్నంతా నామీద చూపిస్తావేమిటి?"

"మీరు వాళ్ళతో యెప్పుడూ గట్టిగా మాట్లాడకపోవటంవల్ల నే వాళ్ళు నన్నిలా ఆడిపోసుకుంటున్నారు. వాళ్ళంటే మీకు భయం-ప్రేమ-అభిమానం. ఇదేమై పోయినా ఫరవాలేదు. ఎంత బాధపడ్డా....ఎంత కుమిలిపోయినా ఫరవా లేదు....వాళ్ళు మాత్రం బాధపడొద్దు-"

"పిచ్చిగా మాట్లాడకు రజనీ? హృదయపూర్వకంగా చెబుతున్నాను- ఎవరైనా నీ తర్వాతనే....వాళ్ళు పాపం బద్ధమనస్కులై పోతున్నారు ఈ

వయస్సులో వాళ్ళతో కటువుగా మాట్లాడి వాళ్ళను బాధపెట్టటం నా కిష్టం లేదు. ఈ వయసులో వాళ్ళను ఆదుకోవల్సిన బాధ్యత మనమీద లేదా చెప్పు? వాళ్ళకోసం మనం కొంచెం కష్టపడాలి తప్పదు"

"ఇప్పుడు కష్టపడటం లేదా? మీరు వాళ్ళకు డబ్బు పంపిస్తుంటే నేనేమైనా వద్దని మిమ్మల్ని ఆపానా? ఆ డబ్బుతో నాకు చీరలు కొనివ్వండి, నగలు కొనివ్వండి అని మీ వెంట పడ్డానా? చీరెలు చీరెలు అని ఆయనెందుకలా రాయాలి?"

ఆమె కళ్ళల్లో మళ్ళీ కన్నీళ్ళు....గాద్గదికంగా మారిపోతున్న కంఠం

"అబ్బబ్బబ్బ! ఈ ఏడ్వటం అంటే నాకు పరమ చిరాకు. మాట్లాడుతున్నదానివి అలా మాట్లాడరాదూ? నీ బాధేమిటో చెప్పరాదూ? అనుక్షణం ఎందుకా ఏడ్పు? ఈ ఆడవాళ్ళకు ఇంత సులభంగా ఎందుకొస్తాయో ఈ కన్నీళ్ళు? పొద్దుట్నుంచి తిండిలేక....కాలేజీకెళ్ళి అక్కడో పెద్ద గొడవలో ఇరుక్కొని ఇల్లని ఇంటికొస్తే నరకాన్ని చూపిస్తున్నావు...."

"ఔనండి! నేను మీకు నరకాన్నే చూపిస్తాను నేనో రాక్షసిని.... నేను మీకు ఏవిధంగానూ తగినదాన్ని కాను—మీ అంత చదువుకోలేదు. మీ అంత సంస్కారం లేదు—" ఆమె దుఃఖం ఇంకా ఎక్కువౌతోంటే ఆమె గొంతు పూడుకుపోతోంది

"స్టాప్ దట్ నాన్‌సెన్స్! అలా మాట్లాడొద్దని నీకెన్నోసార్లు చెప్పాను. నువ్వు పెద్ద చదువులు చదవలేదని నేనెప్పుడూ అనుకోలేదు. నీకై నువ్వే ఈయనకు నేను తగినదాన్ని కాదేమోననే ఫీలింగ్‌తో ఒక ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ డెవలప్ చేసుకొని బాధపడ్తున్నావు. నన్ను బాధపెడ్తున్నావు నీలో నీకే కలిగిన ఈ భావాన్ని నాకు అంటగట్టాలని చూస్తున్నావు. నువ్వలా మాట్లాడినప్పుడల్లా నేనెంత బాధపడిపోతున్నానో, నా మనసెంతటి క్షోభకు గురవుతున్నదో నీ కర్థం కాదు. నీలో అలాంటి భావం కలగకూడదని, కలిగినా దాన్ని వెంటనే పోగొట్టాలని ఎంతగా నిన్ను నా హృదయంలోకి తీసుకున్నానో—నిన్ను ఎంతగా ప్రేమించానో... యౌవనంలోకి అడుగు పెట్టినప్పట్నుంచి నాకు కాబోయే అర్ధాంగి గూర్చి కన్న కలల



నన్నింటినీ నీలో ఎలా చూసుకున్నానో—లాభంలేదు—ఇవన్నీ నీకు చెప్పి లాభం లేదు-అరణ్యరోదన! నీ కర్థంకాదు—"

అతడామె పక్కనుంచి లేచి వెళ్ళిపోవటానికి ప్రయత్నించాడు. కాని ఆమె అతన్ని తనమీదకు లాక్కుంది. పసిపిల్లలా అతని గుండెలమీద వాలిపోయి అతనికి అతుక్కుపోయింది....తన అంతరాంతరాల్లోంచి సుడిగుండంలా ఉప్పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవటానికి ప్రయత్నించింది.

అతడామెను తన గుండెలకు హత్తుకున్నాడు.

దగ్గరగా....ఇంకా దగ్గరగా చేర్చుకొని ఆమెను పూర్తిగా తనలో ఇముడ్చుకోవటానికి ప్రయత్నించాడు.... చెల్లా చెదరైపోయిన ఆమె ముంగురుల్ని సవరించి, ఆమె కన్నీళ్ళను తుడిచి, ఆమె పెదవులతో తన ఆకలిని దాహాన్ని తీర్చుకోవడానికి ఆరాటపడి....ఇలా ఇద్దరిమధ్య దూరాలన్నీ తొలగిపోయి, అపార్థాలన్నీ అంతమై, అడ్డుగోడలన్నీ కూలిపోయి, రెండు ప్రాణాలుగా అంతమై, యేకప్రాణిగా ఆవిర్భవించిన ఆ క్షణాలు అనంతమై, శాశ్వతమై ఒక నిర్మల నిర్వాణాన్ని సాధిస్తే ...మళ్ళీ ఈ మామూలు ప్రపంచంలోకి రాకుండా అలాగే ఈ సృష్టి నిలిచేవరకు ఉండిపోతే....

"లేవండి! భోజనం చేద్దురుగానీ...." ఆమె అతని చెవిలో గుసగుసగా.

"భోజనం చేద్దురుగానీ కాదు. భోజనం చేద్దాం లేవండి! అనాలి" అన్నాడతను ఆమెనలాగే పొదివిపట్టుకొని.

ఆమె అతని మొఖాన్నంతా ముద్దులతో నింపేసింది.

"భోజనం అక్కర్లేదు రాజీ! నీ ముద్దులతో కడుపు నిండింది.... నిజంగా"

"చాల్లెండి....ఇక లేవండి-భోజనం చేద్దాం"

"ఆ మాట నీతో అనిపించటానికే కొన్ని యుగాలుగా ఎదురుచూస్తున్నాను."

ఇద్దరూ పక్కమీది నుంచి లేచారు.

"దొరగారి డిక్షనరీలో యుగానికర్థమేమిటో. కొన్ని నిముషాలే యుగాలనా?"

ఆమె త్వరగా మొఖం కడుక్కొని డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చేసి ఇద్దరికీ రెండు ప్లేట్లలో అన్నం పెట్టేసింది.

"కాలేజీలో ఈరోజు పెద్దగొడవ జరిగింది అని ఎన్నిసార్లు చెప్పినా యేమిటా గొడవని అడగవెందుకు?" అన్నం తినటం మొదలెడ్తూ.

"మీ కాలేజీలో ఎప్పుడూ యేవో గొడవలు జరుగుతూనే ఉంటాయి. లెక్చరర్లు పాఠాలు చెప్పరు. స్టూడెంట్లు క్లాసుల్లో కూర్చోరు.... ఇవి రెండూ తప్ప అక్కడ ఎన్నైనా జరుగుతాయి.... ఇంతకూ యేం జరిగిందో చెప్పండి"

"చాలా 'సింపుల్' గా నువ్వే చెప్పేశావు.... లెక్చరర్లు పాఠాలు చెప్పరు కరెక్ట్! ఎవడన్నా చెబుతానన్నా స్టూడెంట్స్ క్లాసుల్లో కూర్చోరు.. సరిగ్గా ఈరోజు కూడా జరిగిందే.... నీకు దివ్య దృష్టి ఉన్నట్టుగా ఉంది. యేం చెప్పకుండానే కరెక్ట్‌గా చెప్పేశావు"

"చాల్లెండి! యేం జరిగిందో చెప్పండి"

"రెండు మాటల్లో చెప్పేస్తున్నాను—అంతకన్న ఎక్కువ చెప్పినా నువ్వు బోరై పోవటం తప్ప లాభంలేదు—యేంలేదు. టూ గ్రూప్స్ ఆఫ్ స్టూడెంట్స్ కొట్టుకున్నారు—కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ధ్వంసమైపోయింది. పోలీసులొచ్చి కనిపించిన వాళ్ళనల్లా బాదేశారు—లెక్చరర్లకు కూడా దెబ్బలు తగిలాయి"

"లెక్చరర్లకు కూడా తగిలాయా? పాపం! వాళ్ళుమాత్రం యేం చేస్తారు? స్టూడెంట్సు, లెక్చరర్లు ఒకేలాగుంటే — మీకైతే యేం తగల్లేదు కదా?"

"నేనెలా ఉన్నాను? స్టూడెంట్‌లా ఉన్నానా? లెక్చరర్‌లా ఉన్నానా? దాన్నిబట్టి నాకు దెబ్బలు తగిలాయో లేదో నువ్వే నిర్ణయించుకోవచ్చు"

"మీరు స్టూడెంట్‌లా లేరనుకోండి"

"ఔను! నీతో కల్సి జీవిస్తున్నప్పట్నించి—"

"ఆగిపోయారెందుకు? చెప్పండి"

"స్టూడెంట్‌లా కనిపించడం మానేశాను"



"ఎందుకు? నేనేం చేశాను? మిమ్మల్ని స్టూడెంట్‌లా కనిపించొద్దన్నానా?"

"లావెక్కించావు....? చదువుకునే రోజుల్లోనూ, ఉద్యోగం లేని రోజుల్లోనూ నేను చాలా సన్నగా వుండేవాడ్ని నువ్వొచ్చేసి మూడుపూటలా బాగా మేపేశావు. నా పనులన్నీ చేసిపెడ్తూ నా శరీరానికేమీ వ్యాయామం లేకుండా చేశావు దాంతో 45 కిలోలు వుండే నేను యాభైఐదు కిలోలకు పెరిగిపోయాను. ఇక స్టూడెంట్‌లా ఎలా కనబడ్తాను"

"ఛీ! నేను మీకేమీ చెయ్యటం లేదండీ! ఈరోజు లాగా ఎన్ని రోజులు మిమ్మల్ని ఆకలితో మాడ్చానండి."

"ఫరవా లేదు. అప్పుడప్పుడు ఆకలితో మాడటం కూడా శరీరానికి చాలా అవసరం. అది సరేగానీ.... ఈ టమాటా కూర ఇలా వుందేమిటి?"

"అసలు ఈరోజు మీరు తెచ్చిన కూరగాయలేమీ బాగా లేవు.... మీరసలు కూరగాయలు తెచ్చేటప్పుడు అవి ఎలా వున్నాయో చూసే తెస్తారా? ఆ అమ్మేవాడు యేమిస్తే అవే కళ్ళు మూసుకొని తెస్తారా?"

"ఏం? ఏమైంది?"

"టమాటాలన్నీ మురిగాయి సగంకంటే ఎక్కువ బైట పారేశాను. బెండకాయలన్నీ ముదిరాయి.... వాటిల్లో పనికొచ్చేవి ఏమీలేవు.... అన్నీ బైట పారెయ్యాల్సిందే.... మిమ్మల్ని మార్కెట్‌కు పంపించటం పరమ దండగండీ."

"ఇంట్లో కూర్చొని తెచ్చిన వాటికన్నిటికీ ఇలా వంకలు పెడుతూ కూర్చుంటారు మీ ఆడవాళ్ళు.... మధ్యాహ్నం పూట తీరిగ్గానే వుంటావుగా వెళ్ళి తెచ్చుకోరాదూ? అన్నీ జాగ్రత్తగా చూసుకొని, ఏరుకుని నాకంత ఓపికుండదు నన్నేం చెయ్యమంటావు?"

"ఔను ఓపికుండదు.... కూర్చుని ఉత్తరాలు రాయమంటే మాత్రం రెడీ ... ఎన్ని గంటలైనా ఫరవాలేదు"

"ఔను.... మరిచేపోయాను ఇంతకు ముందు నువ్వు రెండుత్తరాలు ఇచ్చావు. రెండోది నేను చదవలేదు. అదెక్కడున్నింది?"

"ఒకటి మీ నాన్నగారు రాస్తే ఒకటి మా నాన్నగారు రాశారు."

"అలాగా? ఏం రాశారు?"

"ఈ మధ్య వంట్లో బావుండటం లేదట?"

"ఏమైందట?"

"మళ్ళీ దగ్గు బాగా వస్తోందిట. ఏమండీ! నేనొకసారి మా ఊరెళ్ళి మా నాన్నగార్ని చూసొస్తానండి."

"మళ్ళీ వెళ్తావా? మొన్నేగా వెళ్ళొచ్చా."

"మొన్నెప్పుడండి? నేనొచ్చి నెలరోజులు దాటింది."

"అయితే.... త్వరలోనే బతకమ్మ పండగ, దసరా, దీపావళి మొదలైనవన్నీ వచ్చేస్తున్నాయి గదా నా ప్రాణం తీయటానికి.... అప్పుడు ఎలాగూ వెళ్తావు.... మళ్ళీ ఇప్పుడెందుకు?"

"ఇప్పుడెళ్ళి నాలుగంటే నాలుగే రోజులుండి వస్తాను మీరూ రాకూడదూ? నాల్గు రోజులేగా.... ఒక ఆదివారం వస్తుంది. మూడు రోజులు సెలవు పెట్టండి."

"ఐడియాలు బాగానే వస్తున్నాయి గనీ సెలవు పెట్టాల్సిన అవసరం లేదు. ఇవ్వాళ జరిగిన గొడవ కారణంగా కాలేజీ మూసేశారు."

కాలేజీ మూసేశారా?" ఆమె ఎగిరి గంతేసినంత పని చేసింది.

"మరి ఆ మాట ఇంతసేపు చెప్పరేమిటి?"

"నువ్వు చెప్పనిస్తేగా? ఎందుకంత సంబర పడుతున్నావు?"

"మీరు మా ఊరొచ్చి చాలా కాలమైంది. రేపే ఇద్దరమూ వెళ్ళి ఓ వారం రోజులుండి వద్దాము.... ప్లీజండి.... కాదనకండి—"

"సారీ రజనీ! నేను రాలేను,"

"ఛీ! మీరెప్పుడూ ఇంతే! మా ఊరన్నా, మా వాళ్ళన్నా మీకు ఇష్టం లేదు."

"ఇదుగో రజనీ! అలా అకారణంగా కోపం తెచ్చుకోవద్దని, ఎదుటి వ్యక్తి మీద అభాండాలు వేయొద్దని నీకెన్నోసార్లు చెప్పాను."

"ఏమిటండీ మరీ! కాలేజీ మూసేశారుగా.... మా ఊరు రావటానికి మీకెందుకభ్యంతరం?"



"రేపట్నించి నేను రాయటం మీద కాన్సంట్రేట్ చేద్దామనుకుంటున్నాను— ఒక మూడు నాల్గు కథలు రాయాలి— ఒక నవల మొదలెట్టాలి. ఇంత మంచి అవకాశం మళ్ళీ నాకు దొరకదు.

"పెద్ద మహా రాసేవాడిలా మాట్లాడుతున్నారు— ఎన్నిసార్లు చూడలేదు ఇలాంటి అవకాశాలు ఎన్నోసార్లు వచ్చాయి ఎన్నోసార్లు మీ కాలేజీకి సెలవులిచ్చారు. ఈ సెలవుల్లో ఇది రాస్తాను అది రాస్తాను అని చెప్పడమే గాని మీరెప్పుడు రాశారు? మా నాన్నగారికి వంట్లో బాగాలేదు— వెళ్ళొద్దామంటే రావటం ఇష్టం లేక యేవో సాకు చెబుతున్నారు" ఆమె భోజనం ముగించి లేచింది.

"సాకు కాదు. రేపట్నుంచి రాస్తానో లేదో చూడు"

"చూస్తాన్లెండి— కాలేజీ లేకపోతే మాత్రం మీకు ఎన్ని పనులు- ఎంతమంది ఫ్రెండ్స్- స్టడీ సర్కిల్ అంటారు. రచయితల సభలంటారు. ఇంకేదో అంటారు. ఆ పనులన్నీ వదిలేసి హాయిగా రాసుకోండి అని నేనెన్నిసార్లు పోరాడాను. అయినా మీరు నా మాట విన్నారా?"

"ఇప్పుడు అంటాను రేపట్నించి రాస్తాను"

"పోనీయ్ మీరు రాకండి. నే వెళ్ళి నాల్గురోజులుండి నాన్నగార్ని చూసొస్తాను— ఒక్క నాల్గు రోజులు మీరు హోటల్లో తినండి."

"నీకు తెలుసు రజనీ! నువ్వు లేకపోతే నేనేమీ రాయలేను— ఇంట్లో ఒక్కడ్నీ వుండలేను— భయంకరమైన ఒంటరితనం- ముఖ్యంగా రాత్రుళ్ళు— ఒంటరితనం నన్ను చంపేస్తుంది. నిద్రపట్టదు—చిరాకు— పిచ్చి— అలాంటి మూడ్‌లో నేను రాయలేను."

"అబ్బబ్బబ్బ! చంటిపిల్లాడికంటే అన్యాయం."

"నువ్వే అలా తయారుచేశావు."

"చేశాను... యేం చేశాను? సరేగానీ రేపు నన్ను వెళ్ళొద్దంటారు- నాన్నగారిని చూసి నెలరోజులు దాటిందండీ!"

"పోనీయ్ ఆయన్నే ఇక్కడకు రమ్మని రాస్తే"

"ఆయన అక్కడ్నుంచి కదులుతాడా? ఆయన ఆ వ్యవసాయం ఆ

జీతగాండ్లను వదిలి యెక్కడకూ వెళ్ళడండీ! ఆ పల్లెటూరు, ఆ మనుషులు ఆ వాతావరణం మీకు నచ్చదు. మధ్యలో నేను నలిగి ఛస్తున్నాను."

అతడు కూడా భోజనం ముగించి లేచాడు.

స్త్రీ బ్రతుకూ ఇంతేనా?

నాన్న తర్వాతే భర్త....

కాలేజీలో గొడవైందంటే యేమిటో తెలుసుకోవాలన్న ఇంటరెస్ట్ లేదు. లెక్చరర్లను కొట్టారంటే కూడా చలనం లేదు. తనక్కూడా తగిలాయి. మీక్కూడా తగిలాయా అన్న ఆతురతగానీ బాధగానీ యేమీ లేదు. అసలు తగిలాయా అని తెలుసుకోవాలన్న ఆపనకూడా లేదు. కాని ఎక్కడో 150 కిలోమీటర్ల దూరంలో వున్న నాన్నగారికి యెప్పుడూ వచ్చే దగ్గే మళ్ళీ వస్తోందని తెలిసినప్పుడు ఆమె అంతగా బాధపడిపోతుంది. వెంటనే వెళ్ళి చూసి రావాలనుకుంటుంది.

చిత్రం....తన ప్రాణంలో ప్రాణమై, తన శరీరంలో శరీరమై, తన రక్తంలో రక్తమై, తన అణువులో అణువై, తన హృదయంలో హృదయమై, ఆనందంలో ఆనందమై అనుక్షణం తన కోసం అర్రులు చాపే భర్త ఆమె కేమీ కాదు.

నాన్న... !

నాన్నను చూడాలి.

నాన్నను చూడకపోతే పిచ్చెక్కుతుంది. నాలుగు రోజుల కొకసారయినా నాన్నను చూడాల్సిందే ఇక్కడ వీడేమైపోయినా ఫరవాలేదు.... హోటల్‌లో తినలేక పస్తులుంటూ, పక్కమీద పడుకోలేక జాగరణ చేస్తూ, ఒంటరితనంతో, నిట్టూర్పులతో, రోజుల్ని, గంటల్ని, నిముషాల్ని సెకండ్లనీ లెక్కపెట్టుకుంటూ, ప్రతి సెకండ్ గుండెల మీద కుంపటికాగా, గుండెల్ని పిండివేసే వేదనతో, ఆమెను గూర్చిన, ఆమెతో గడిపిన మధుర క్షణాలు- వాటిని గూర్చిన ఆలోచనలతో పడుకోలేక, కూర్చోలేక, నిల్చోలేక, చదువుకోలేక, రాయలేక, కాలం స్తంభించిపోతుంటే, దిక్కుతోచక, దిక్కులు పిక్కటిల్లేలా ఆమె కోసం తన గొంతులోంచి వెలువడిన ఆ వెర్రికేకలు ఆమెకు వినిపించవు. పొద్దత్తమానాలు కాదే నీ వూసె....



వద్దన్నను మరపు రాదే! అమ్మలక్కలతోటి నీవా నా యెంకి సెమ్మసెక్కాడుతున్నావా? నీ వెల్లిపోయినావంటే పచ్చినై నేనెటో కొట్లాడుతుంటే... ఇరుగమ్మలక్కలతో నీవా నా రజని....యెకసెక్కమాడుతున్నావా?

బయటెవరో తలుపు కొట్టిన చప్పుడయింది.

తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ రవి వెళ్ళి తలుపు తీసాడు. బయట సీతారామారావు నిల్చొని వున్నాడు.

"హల్లో! మీరా సార్? రండి....రండి"

"యేమిటి? ఇప్పుడే భోంచేసినట్టున్నారు "

సీతారామారావొచ్చి లోపల కూర్చున్నాడు.

"ఔను సార్! కొంచెం లేటయింది."

"మనం ఇంటికి రావడమే లేటయిందనుకోండి. నేనూ ఇంటికెళ్ళి భోజనం చేసి మీతో కాసేపు మాట్లాడి పోదామని వచ్చాను. ఇవ్వాళ మీరు ఆ మీటింగ్‌లో బాగా ఎమోషనల్ అయిపోయారు" అన్నాడు సీతారామారావు.

"మీకు తెలుసుగా! నేను కొంచెం ఎమోషనలే!" అన్నాడు రవి అతనికి ఎదురుగా కూర్చుంటూ.

"అఫ్‌కోర్స్! కానీ లాభంలేదండీ! అలాంటి విషయాల్ని మనం అంతగా పట్టించుకోవద్దు. కాలేజీలో యెపుడూ యేవో అలాంటి గొడవలు జరుగుతూనే వుంటాయి. మనం వాటిల్లో తలదూర్చగూడదు."

"స్టూడెంట్స్‌లో ఒక వర్గానికి అంత అన్యాయం జరగటం, లెక్చరర్లను కూడా పోలీసులు కొట్టటం ...చూస్తూ ఊరుకోమంటారా?"

"అన్యాయం జరిగితే ఆ స్టూడెంట్స్ ఊరుకుంటారా? వాళ్ళ వెనుక ఒక వ్యవస్థీకరమైన రాజకీయ పార్టీ వుంది. మధ్యలో మీరెందుకు తల దూర్చటం? మీమీద ఒక ముద్రను వేయించుకోవట మెందుకు? రేపు మీకేదన్నా అయితే మిమ్మల్ని ఎవడురక్షిస్తాడు? ఆ పార్టీ వాళ్ళు మీ సహాయానికి వస్తారనుకుంటున్నారా? మీరా పార్టీ మెంబర్ కారు. నాకు తెలుసు...

ఇలాంటి విషయాల్లో ఎలా ఉండాలంటే మునిగితే నిండా మునగాలి. లేకపోతే దాని జోలికే వెళ్ళొద్దు—అటూ ఇటూ కాకుండా ఉండటం చాలా ప్రమాదం. ఇప్పుడు సూర్యప్రకాష్‌ను తీసుకోండి....నిండా మునిగాడు.... చిన్నప్పటినుంచి పార్టీ కోసమే పనిచేస్తున్నాడు. పార్టీలో ఒక ముఖ్యమైన ఆఫీస్ బేరర్....

అఫ్‌కోర్స్ ...దాన్ని వాళ్ళు పొలిటికల్ పార్టీ కాదంటారనుకోండి— అతన్ని పార్టీ ఆదుకొంటుంది. అతనికి బాగా డబ్బుంది. పలుకుబడి ఉంది. సంఘంలో గౌరవముంది. మన ప్రిన్సిపాల్ కూడా అతనంటే భయపడ్తాడు. అలాంటివాడికేమీ కాదు.

అదే మీరో నేనో అయితే....మనం పార్టీ మెంబర్స్‌మి కాము. కేవలం సానుభూతి పరులమనే ముద్ర తప్ప మనకింకేమీ లేదు. అటువంటప్పుడు ఆ పార్టీ మనల్ని పెద్దగా ఆదుకోదు. మనకు సూర్యప్రకాష్‌కు వున్నట్లు ప్లాట్లు లేవు....డబ్బులేదు....పార్టీ వర్కర్లు లేరు. మన కేదన్నా అయితే మనకోసం ఎవడూ రాడు. అందుకనే ఈరోజు మీరంతగా బయటపడటం నాకు నచ్చలేదు.

ఆ ప్రభాకర్ వాళ్ళు వాళ్ళకన్యాయం జరిగితే ఊరుకుంటారా? ప్రిన్సిపాల్‌ను, కాలేజీని లేపి అవతల పారేస్తారు. మధ్యలో మీరెందుకు వాళ్ళను అట్లా అంతగా సమర్థించి బైటపడిపోవడం?"

రవి వెంటనే యేమీ మాట్లాడలేదు.

కళ్ళముందు ఎంత అన్యాయం జరుగుతున్నా చూస్తూ వూరుకోవాల్సిందేనా? తనెంతో అభిమానించే ఆదర్శంకోసం యేమీ చెయ్యొద్దా?

"మార్క్సిజం మీద మనకుండే ఇష్టమంతా సిద్ధాంతపరమయింది. అలా కాదంటారా....మీకు దమ్ముంటే పార్టీలో చేరండి....దాని కోసమే వర్క్ చేయండి........కాని ఒక ప్రభుత్వోద్యోగిగా ఉంటూ నేను పార్టీ కోసమే పని చేస్తానంటే చెయ్యలేరు-చెయ్యకూడదు కూడా....

పూర్తిగా అటూ కాకుండా, పూర్తిగా ఇటూ కాకుండా వుంటుంది. మీరొక సృజనాత్మక రచయితగా మీకు అన్యాయమనిపించిన విషయాల్ని మీ రచనల్లో పెట్టండి. ఆ విధంగా మీ బాధ చాలా తగ్గుతుంది.



ఈ మీటింగులూ, ఆవేశపడి ఉపన్యాసాలివ్వటం....వీటివల్ల ప్రయోజనం లేదు....

ముఖ్యంగా సూర్యప్రకాష్‌తో వ్యవహారం ప్రమాదం! అతనితో తలపడితే వూరుకునే మనిషి కాడు. మిమ్మల్నెలాగయినా దెబ్బ తీయాలని చూస్తాడు"

"యేం చేస్తాడంటారు?"

"యేమైనా చేస్తాడు....మీరు హాయిగా వుండండి....ఇలాంటి విషయాల్లో తలదూర్చి ఇబ్బందుల్లో పడిపోయి, టైమంతా ఆ ఇబ్బందుల్లోంచి బయటపడటం కోసమే వృధా చెయ్యకండి. మీరు బాగా రాయగలరు. మీకా ప్రతిభ వుంది....మీరు యేది చెప్పాలన్నా మీ రచనల ద్వారానే చెప్పండి" అన్నాడు.

"రచనలద్వారా చెబితే ఎవడు వింటున్నాడు సార్! మొదలు మన రచనల్ని పబ్లిష్ చేసేవాడు లేడు"

"అసలు....ముందు మీరు రాయండి. పబ్లిషింగ్ గురించి ఆలోచించకండి. మీరేమనుకుంటున్నారో అదే ధైర్యంగా రాయండి. ఇలా రాస్తే జనం చదువుతారో లేదో....పబ్లిషర్ ప్రచురిస్తాడో లేదో........ఇలాంటివి పెట్టుకోకండి"

లోపలినుంచి రజని రెండు కప్పుల్లో టీ తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"యేం రజనీ! బావున్నావా?" అన్నాడు సీతారామారావు.

రజని అతనివేపు చూసి బావున్నానన్నట్టు నవ్వింది.

"ఈయనను కొంతకాలం బయటకు వెళ్ళనీయకుండా యింట్లోనే కూర్చోబెట్టి రాయించండి"

"నేను చెబితే వింటారా? బయట ఆయనకెన్ని పనులు....ఎప్పుడయినా టైము దొరికితే ఉత్తరాలు రాసుకుంటూ కూర్చుంటారు" అంటూ రజని లోపలికెళ్ళిపోయింది.

"మీకు చెప్పటం మర్చిపోయాను....ఇప్పుడే దారిలో మన సూప

రింటెండెంట్ కలిసి చెప్పాడు-శ్రీనివాసరెడ్డికి ఆదిలాబాద్ ట్రాన్స్‌ఫర్ అయిందట"

అన్నాడు సీతారామారావు టీ త్రాగుతూ.

"ఆశ్చర్యంగా వుందే...."

"ఆశ్చర్యమేమీ లేదు....పదేళ్ళనుంచి యిక్కడే వుంటున్నాడు. లాంగ్ స్టాండింగ్ కాబట్టి ఎప్పుడయినా ట్రాన్స్‌ఫర్ కావచ్చునని ఆయనక్కూడా తెలుసు"

"ఆదిలాబాద్ వెళతాడా?"

"వెళ్ళడు....ఆయనే కాదు....జనరల్‌గా ఆదిలాబాద్‌కు ఎవర్ని వేసినా వెళ్ళరు....చింతచెట్టు కిందకు వెళ్ళి నిల్చుంటారు. చింతచెట్టంటే యేమిటో మీకు తెలుసా"?

"మన లెక్చరర్స్ చెప్పుకోగా విన్నానేగాని తెలీదు"

"హైద్రాబాద్‌లో మన డైరెక్టర్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫీస్‌లో ఒక చింత చెట్టుంది. బుద్ధుడు బోధి చెట్టుకింద కూర్చొని తపస్సు చేశాడంటారు.

గవర్నమెంట్ కాలేజీలో పనిచేసే ప్రతి లెక్చరర్ తన సర్వీసులో ఎప్పుడో అప్పుడు ఆ చెట్టు కిందకు వెళ్ళి తపస్సు చేస్తేనే వాడికి మోక్షం లభిస్తుంది. ఆ చింతచెట్టు కిందకు వెళ్ళి నిలబడని లెక్చరర్ ఒక గొప్ప అనుభవాన్ని కోల్పోతాడు.

ఎందుకంటే మన గవర్నమెంట్.... ఈ సిస్టమ్ ఎలా పని చేస్తున్నదో చూడాలంటే....స్వయంగా అనుభవించాలంటే....ఆ చింతచెట్టు కిందకు వెళ్ళి నిల్చోవాలి"

"మీరెప్పుడన్నా వెళ్ళారా?"

"వెళ్ళకపోవటమేమిటి? ఒకసారి నన్ను కూడా ఆదిలాబాద్ ట్రాన్స్‌ఫర్ చేశారు. దాన్ని తప్పించుకోవటానికి రెండు నెలలు నేనా చింతచెట్టు కింద తపస్సు చేశాను....అక్కడ నిల్చుంటే మొత్తం ... ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలవాళ్ళూ కలుస్తారు ...

అంతకూ ట్రాన్స్‌ఫర్ల గురించి వచ్చేవాళ్ళే....అక్కడ నిల్చుంటే



మనకు వినిపించే మాటలు....'ఎం.ఎల్.ఏగారు కలిశారా?' 'ఇప్పుడు ఇక్కడకు వస్తామన్నారు' 'ఏం వస్తాడో యేమిటో?'

"వస్తాడులెండి....అందుకు తగిన యేర్పాట్లన్నీ చేశాం....ఎడ్యుకేషన్ మినిష్టర్‌గారితో ఎండార్స్‌మెంట్ కూడా తీసుకున్నాం" "సెక్షన్‌లో మన ఫైల్స్ చూసే క్లర్క్‌ను కలిశారా?"

"క్లర్క్‌ను కలవటం, దక్షిణ సమర్పించుకోవటం, సెక్షన్ సూపరింటెండెంట్‌ను కూడా కలిసి దక్షిణ సమర్పించుకోవటం... అంతా అయిపోయింది. అవ్వాళ నోట్ పుటప్ చేస్తాడు జెడి గారి కూడా చెప్పించాం. ఆయన వెంటనే ఎండార్స్ చేస్తాడు. ఎటొచ్చీ డైరెక్టర్ గారితోనే వుంది చిక్కంతా....అంతా సవ్యంగా జరిగితే రేపు ఆర్డర్స్ చేతిలో పడొచ్చు...."

ఆలా రేపు పడుతుందన్న ఆర్డర్ వారాలకొద్దీ నెలలకొద్దీ తిప్పుతూనే వుంటుంది వందలు ఖర్చయిపోతాయి. వేలు ఖర్చయిపోతాయి.... చివరికి ఎప్పుడో ఇల్లు, వళ్ళు గుల్లయిపోయాక ఆర్డర్ చేతికొస్తుంది....

జీవితంలో అంత హింస నేనెన్నడూ అనుభవించలేదు. రేపటినించి శ్రీనివాసరెడ్డి కూడా అదే పని చెయ్యాలి. 'చింతచెట్టు శరణం గచ్ఛామి' అనుకోవాలి" అన్నాడు సీతారామారావు.

"ఆ చింతచెట్టుకు ఇంత ఘనమైన చరిత్ర ఉందన్నమాట"

"ఆ చింతచెట్టుకే నోరుంటే ఎన్ని కథలు చెప్పేదో....చాలామంది ఆ చింతచెట్టుమీద కవిత్వం రాశారు. చింతచెట్టు అంటే డి.హెచ్.ఇ ఆఫీసుకు, ఆ ఆఫీసులో జరిగే పైరవీలకు ఒక గొప్ప సింబలైపోయింది. రేపెప్పుడన్నా ఆ ఆఫీసును మార్చి వేరే బిల్డింగ్‌లో పెట్టినా ఈ చింతచెట్టును కూడా అక్కడినుంచి పెకిలించుకొని తీసుకెళ్ళి కొత్త ఆఫీసులో నాటించాలి....ఆ చింతచెట్టు లేకపోతే డి హెచ్.ఇ. ఆఫీస్‌కు కళే ఉండదు. ముందు ముందు ఆ చింతచెట్టునొక మ్యూజియమ్ పీస్‌గా నాటించాలి"

"ఈ ట్రాన్స్‌ఫర్‌ను క్రమబద్ధంచేసి వీటిమీద ఇంత టైమ్ వేస్ట్ కాకుండా చెయ్యటానికి వీలు కాదంటారా?"

"ఎందుక్కాదు? కాని ఆ పని ఎవడు చెయ్యాలి... ? వేరే డిపార్ట్‌మెంట్స్‌లో ఒక ఉద్యోగస్థుడు ఒకచోటే చాలా కాలం ఉంటే కొన్ని

సమస్యలు రావచు....కాని మన డిపార్ట్‌మెంట్‌లో తరచుగా ట్రాన్స్‌ఫర్స్ చెయ్యాల్సిన అవసరం లేదు. పోనీ చేసిన వాళ్ళు దాన్ని అమలు జరిగేలా చూస్తారా అంటే అదీ లేదు. ఎన్నో ట్రాన్స్‌ఫర్స్‌ని కాన్సిల్ చేస్తారు..... మారుస్తారు. బలం ఉన్న వాడిదే బతుకు. ఎవ్వడు ఎక్కువ ఒత్తిడి తీసుకు రాగలిగితే వాడు ఇష్టమున్నచోటికి వెళ్ళగల్గుతాడు. మన డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు మన ఎడ్యుకేషన్ మినిష్టర్లు... వీళ్ళల్లో ఎవరికీ విద్యా విధానం గురించి గాని, కాలేజీల్లో సక్రమంగా పాఠాలు ఎందుకు చెప్పబడ డం లేదన్న విషయాన్ని గురించి గానీ, విద్యా ప్రమాణాల్ని ఎలా పెంచాలి అన్న అంశాన్ని గురించి గానీ ఆలోచించే టైమే వుండదు. వీళ్ళ టైమ్‌లో నూటికి తొంభై పాళ్ళు ట్రాన్స్‌ఫర్‌లు చెయ్యటం, వాటిని కాన్సిల్ చెయ్యటం, వాటిని మార్చటం మీదే ఖర్చయిపోతుంది. అలాంటప్పుడు ఈ కాలేజీలు బాగుపడమంటే ఎలా బాగుపడతాయి...? మీరూ నేనూ ఎంతగా గుండెలు బాదుకుంటే యేం లాభం? ఈ పద్ధతి ఇంతే! డబ్బున్న వాడు వాడి పిల్లల్ని పేరుకు గవర్నమెంట్ కాలేజీల్లో చదివిస్తున్నా, ట్యూషన్లు చెప్పించు కుంటాడు. రేపు మంచి ఉద్యోగాలన్నీ వాళ్ళకే వస్తాయి. అడుగడుగునా ఈ వ్యవస్థ డబున్న వాళ్ళకే సహాయం చేస్తున్నది. డబ్బున్న వాళ్ళు తమ పిల్లల్ని పెద్ద పెద్ద డొనేషన్లు కట్టి, యే ఇంజనీరింగ్ కాలేజీల్లోనో... యే మెడికల్ కాలేజీల్లోనో జాయిన్ చేస్తారు. ఇది ధనవంతుల ప్రపంచం మీరూ నేనూ ఈ సిస్టమ్‌ను మార్చలేమండీ...మన ప్రయత్నమంతా కొండకు వెంట్రుక కట్టి లాగటం లాంటిది. విప్లవం వస్తే తప్ప ఈ వ్యవస్థ మారదు. కాని విప్లవం వచ్చే ఆశ నాకేమీ కనిపించటంలేదు.

"అంటే....అప్పటి వరకు మనం చెయ్యగలిగిందేమీ లేదా?"

"యేమీ చెయ్యొద్దని కూడా నేను చెప్పను. స్లోగానైనా సరె ఈ సిస్టమ్‌ను యే కొంచెమైనా మార్చటానికి మనకు చేతనయిన ప్రయత్నం చెయ్యాలి....నా లాంటివాడు ఊరికే మాట్లాడటం తప్ప చేసేదేమీలేదు. కాని మీరు సృజనాత్మక రచయిత కదా! మీరు రాయండి... మీ రచనలు చదివి యే ఒక్కడు మారినా చాలు....ఆ ఒక్కడి ద్వారా ఇంకొక్కడు మారొచ్చు. కాబట్టి మీరు రాయండి... ఈ సిస్టంలో... ముఖ్యంగా మన



Cultural Association

దేశంలో మార్పు చాలా స్లోగా వస్తోంది. కాని ముందు ముందు అదీ కొంచెం త్వరితం కావచ్చు.... అందుకు మీ లాంటి వాళ్ళ రచనలు తోడ్పడాలి."

బయట ఎవరో 'సార్....!' అని పిలువగానే రవి లేచాడు.

"నే వెళతానండి మరి........అలా హాస్పిటల్ దాకా వెళ్ళి ఇక్బాల్ ఎలా వున్నాడో చూసొస్తాను...." అన్నాడు సీతారామారావు కూడా లేచి నిల్చుంటూ.

"నేనూ వస్తే బావుండేదే!"

"కాని మీ కోసం ఎవరో వచ్చినట్టుంది."

"ఎవరో చూస్తానుండండి."

బయట రాజేంద్ర నిల్చొని వున్నాడు.

"హల్లో రాజేంద్రా! ఏమిటి సంగతి" అన్నాడు రవి.

"ఈ రోజు మీటింగ్ వుందని చెప్పాను కదండి....!" అన్నాడు రాజేంద్ర లోపలకొస్తూ—

"సారీ! మరిచిపోయాను. కృష్ణమోహన్ వచ్చాడా....?" అన్నాడు రవి.

"వచ్చారు సార్! వారొచ్చినప్పట్నించి మిమ్మల్నే గుర్తుచేస్తున్నారు- మీ గురించి కాలేజీకి ఫోన్ చేస్తే మీటింగ్‌లోవున్నారని చెప్పారు" అన్నాడు రాజేంద్ర.

"సరే నువ్వు పద! నే నిప్పుడే వస్తాను."

"అదికాదు సార్! ఈ రోజు మీటింగ్ కాన్సిలయిపోయింది సార్!" రాజేంద్ర.

"ఎందుకు?" రవి.

"మీ కాలేజీలో యేదో గొడవయిందట గద సార్! దాన్ని గురించి టౌనులో 144 వ సెక్షన్ పెట్టారు. మీటింగ్ పెట్టొద్దని పోలీస్ వాళ్ళు వార్నింగిచ్చారు. కృష్ణమోహన్ పెద్ద నక్సలైట్ రైటరని వాళ్ళకు రిపోర్టు వచ్చిందట...." రాజేంద్ర.

"మై గాడ్! పోలీసుల దృష్టిలో కృష్ణమోహన్ కూడా నక్సలైట్ లైటరయిపోయాడా?" రవి.

"గట్టిగా ఎవరు మాట్లాడితే వాడు నక్సలైటే" అన్నాడు సీతారామారావు.

"ఈలోగా ఇంకో తగాదా....కొందరు జె.వి.పి. కార్యకర్తలు మేం మీటింగ్ పెట్టుకుంటుంటే టౌన్ హాల్ దగ్గరకొచ్చి 'నక్సలైట్ కృష్ణమోహన్ గో బ్యాక్!" అని అరిచారు. దాంతో కృష్ణమోహన్‌గారు చాలా బాధపడ్డారు సార్! ఆయన వెంటనే ఇక్కడ్నించి వెళ్ళిపోవాలనుకున్నారు.... కేవలం మీ కోసమే ఆగారు ఇప్పుడు ఆరు గంటలకు హైదరాబాద్ బస్సుంది....దాంట్లో వెళ్ళిపోతున్నారు" రాజేంద్ర.

"ఇంత గొడవ జరిగిందా? ఇప్పుడు కృష్ణమోహన్ ఎక్కడున్నాడు" రవి.

"ప్రకాష్ లాడ్జిలో వున్నారు సార్. రూమ్ నెంబరు ఇరవైరెండు. మీరు వెళ్ళి కలిస్తే బాగుంటుంది సార్" రాజేంద్ర.

"నువ్వెళ్ళు! నేనిప్పుడే వస్తున్నా...." రవి.

రాజేంద్ర వెళ్ళిపోయాడు.

"అయితే మీరు ప్రకాష్ లాడ్జ్‌కెళ్ళి అతన్ని కలవండి. నేను హాస్పిటల్ కెళ్ళి ఇక్బాల్‌ని చూస్తాను" సీతారామారావు.

"మంచిది సార్! నేను వీలైతే అక్కణ్ణించి హాస్పిటల్ కొస్తాను" రవి.

"అతను కోమాలో వున్నాట్ట....మనం వెళ్ళి చేసేదికూడా యేమీ లేదనుకొండి....ఈ పాటికి ఉన్నాడో....పోయాడో" అంటూ సీతారామారావు బయటకు వెళ్ళిపోయాడు.

రవి లోపలకెళ్ళి బట్టలు వేసుకోవటం మొదలెట్టాడు.

"ఇప్పుడు ఎక్కడకెళ్ళాలి?" రజని.

"కృష్ణమోహనని ఒక ఫ్రెండ్! మనం నల్గొండలో పనిచేసినప్పుడు ఫ్రెండయ్యాడు....మరచిపోయావా?" రవి.



"ఔను...మీరిద్దరు కలిసి స్టడీ సర్కిల్ అని యేదో పెట్టారు" అంది రజని.

"ఔను...."

"ఊళ్ళో అంత గొడవగా వుందని చెబుతున్నారుగా....మీరు ఇప్పుడు బయటికి వెళ్ళకపోతే యేం?" రజని.

"పాపం కృష్ణమోహన్ చాలా సేపటి నుంచి చూస్తున్నాట్ట....కలిసి మాట్లాడి వస్తాను" రవి.

"కాసేపు కూడా ఇంట్లో వుండేది లేదు....ఇద్దరం కలిసి సినిమాకెళ్ళి ఎన్ని రోజులయిందో! ఈ రోజు వెళదామనుకున్నాను ..." అంది రజని.

"దొరక్క దొరక్క నీకి రోజే దొరికిందా....? రేపెళదాంలే...." అన్నాడు రవి. బట్టలు వేసుకోవటం పూర్తిచేసి బయటకు నడిచాడు.

"రేపు మాత్రం ఈ రోజులాగే వుండదని నమ్మకమేమిటి? అయినా మనం ఎక్కువ సినిమాలు చూసినా కష్టమేననుకొండి...." అంది రజని.

రవి సైకిల్ తీసి బయటపెడ్తూ 'ఎందుకని?' అన్నాడు.

"మీ నాన్నగారికి కోపం రాదూ?" రజని.

"నువ్వా లెటర్‌లోని విషయాల్ని ఎంత త్వరగా మరిచిపోతే అంత మంచిది—ఇంట్లో కూర్చుని పిచ్చి పిచ్చిగా ఆలోచించకు" రవి.

"ఇంట్లో కూర్చోక ఏం చెయ్యమంటారు? మీరెక్కడికన్నా తీసుకెడుతున్నారా నన్ను? మీరు మగమహారాజులు—ప్రపంచమంతా తిరిగొస్తారు. నేను ఆడదాన్ని. ఇరవై నాలుగు గంటలూ ఈ నాలుగ్గోడలు మధ్య వుండాల్సిన దాన్నేగా?" రజని.

రవి సైకిలెక్కి తొక్కసాగాడు.

ఉమన్ ఈజ్ ఎ వుమన్ ఈజ్ ఎ వుమన్ ఈజ్ ఎ వుమన్—మ్యాన్ ఈజ్ ఎ మ్యాన్ ఈజ్ ఎ మ్యాన్—సీతారామారావు ఈజ్ ఎ సీతారామారావు ఈజ్ ఎ సీతారామారావు.

పూర్ థింగ్! బయట కెక్కడికీ తీసుకెళ్ళలేక పోతున్నాడు ఇరవై నాలుగ్గంటలూ ఆ నాలుగ్గోడల మధ్యన వుంటే ఎవరి బుర్రయినా చెడిపో

తుంది. గోడలు—రోడ్డు పక్క పెద్దగా అక్కడక్కడ కూలిపోయిన గోడలు. గోడల్ని చూస్తే ఎక్కడో యే మూలో భయం. కూలిపోతున్న గోడలు—పగిలిపోతున్న గోడలు—అదిగో గోడల మీద కవిత్వం... అర చేతిని అడ్డు పెట్టి సూర్య కాంతి నాపలేరు....ఒక వీరుడు మరణిస్తే ప్రభ వింతురు వేనవేలు... కృష్ణమోహన్ నక్సలైటెప్పుడయ్యాడు? అరు కావ టానికింకా అరగంటైనా లేదు. వెళ్ళిపోతాడేమో... తొక్కు.... తొక్కు.... సైకిల్ తొక్కు... డౌన్ కాబట్టి సైకిల్ వేగంగానేపోతుంది. ప్రకాష్ లాడ్జ్ దగ్గర్లోనే వుంటుంది. ఇంకో ఐదు నిముషాల్లో వెళ్ళిపోతాం.

రోడ్ల మీద జనం ఎక్కువ లేరు. 144 ప్రభావమా....? ఎక్కడ చూసినా పోలీసులే. గజానికొక పోలీసువాడు గజానికొక గాంధారి కొడుకు. గాంధీగారి దేశంలో- కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలు వర్థిల్లాలి.

కొత్తపల్లి జర్దానే వాడండి.

బస్టాండ్....

ఎన్.టి.ఆర్. సినిమా ఏదో ఆడుతున్నట్టుంది. రాముడు, కృష్ణుడు—రావణుడు, కర్ణుడు, దుర్యోధనుడు....ఫైవ్ ఇన్ వన్....ఆర్ వన్ యిన్ ఫైవ్....

వీళ్ళలో ఎవడు నిజమయిన ఎన్.టి.ఆర్?

గిన్నిస్ బుక్కాఫ్ వరల్డ్స్ రికార్డ్స్‌లో కెక్కాడా? ఇంకా ఎక్క లేదా? ఒక్క సినిమాలోనే యిన్ని పాత్రలు ఇదివరకెన్నడన్నా వేశాడా? ఇంపాజిబుల్! ఎన్.టి.ఆర్. దేవుడు. జనం ముందు ముందు ఓ గుడికట్టి పూజలు, పునస్కారాలు చేస్తారేమో!

రోడ్ల మీద స్టూడెంట్సెవరూ లేరు.

అదిగో తన వెనకెవరో వస్తున్నారు.

సైకిళ్ళ మీద ఇద్దరు స్టూడెంట్స్ వేగంగా తన మీదకే వస్తున్నారు. సూర్యప్రకాష్ పంపించాడా?

"అరె బిడ్డా! పెళ్ళానికి కరువై పోతావురా...." వాళ్ళు పెద్దగా అంటూ తన పక్కనుంచే ముందుకు దూసుకుపోయారు.



వాళ్ళు తన నుద్దేశించే ఆ మాట అన్నారా?

కాదు....కాదు....తన నుద్దేశించి కాదు. ఔను....తన నుద్దేశించే—వాళ్ళిద్దరూ జె.వి.పి. వర్కర్స్. ఆ మాట తననే అన్నారు. ఓ రకం వార్నింగ్ కాబోలు.

తను వెంటనే ఇంటి కెళ్ళిపోవాలి

ఎలా? ఎలా?

అవిగో గోడలు....

పెద్ద పెద్ద గోడలు—

తన కడ్డంగా నిల్చిన గోడలు-

కాదు—కాదు—

వాళ్ళు తన నుద్దేశించి ఆ మాట అనలేదు. వాళ్ళు వాళ్ళు అనుకున్నారు. కాదు, కాదు. వాళ్ళు తననే అన్నారు. వాళ్ళను సూర్యప్రకాష్ పంపి వుంటాడు. యేం చేస్తారు? వాళ్ళు తనను చంపేస్తారు. నెత్తురు మడుగులో ముంచేస్తారు.

భయం....

సూర్యప్రకాష్‌ను తక్కువ అంచనా వెయ్యకు. వెళ్ళిపోవాలి..... రజని తనను బయటకెళ్ళొద్దన్నది. ఆమె మాట వినకుండా తను రోడ్డుమీది కొచ్చాడు.

కృష్ణమోహన్‌ను పనిగట్టుకొని ఈ రోజే కలవాలా? ఆయన పనిగట్టుకొని యీ రోజే రావాలా?

చీకటి పడకముందే ఇంటికెళ్ళిపోవాలి. ఇంటి కెళ్ళిపోయే లోపలే వాళ్ళు తనను పట్టుకుంటే-పోలీసు దగ్గరకెళ్ళి నా లైఫ్‌కు ప్రమాదముందని చెప్పుకుంటే?

నీ లైఫ్‌కు పోలీసుల నుంచే పెద్ద ప్రమాదముందని మరచిపోకు. రక్షించవలసిన వాడే భక్షిస్తోంటే—వెళ్ళిపో... పరుగెత్తు... కృష్ణమోహన్ జాంతేనహీ అనుకో. యువర్ సేఫ్టీ ఈజ్ మోస్ట్ ఇంపార్టెంట్! ఆయమ్ సేఫ్! హోప్ యూ ఆర్ ఇన్ ది సేమ్ సేఫ్! ఇస్పేట్‌గాడి జోకు! ఇంకా వున్నాడా? పోయాడా?

అసలీ ఉండటమేమిటి? పోవటమేమిటి?

కలందు కలండనెడు వాడు కలడో, లేడో?

ప్రకాష్ లాడ్జ్ వచ్చేసింది రిసెప్షన్ కౌంటర్ దగ్గర ఒక బట్ట తలాయన కూర్చొని వున్నాడు

"రూమ్ నెంబర్ ఇరవై రెండు యెక్కడ?" అన్నాడు రవి.

"ఫస్ట్ ఫ్లోర్...."

"థాంక్యూ"

ఫస్ట్ ఫ్లోర్....మెట్లు....మెట్లు....ఈ మెట్లెక్కడో 'చూశానే....!' ఔను చూశాను-ఎక్కడ? రాత్రి కలలో. ఎన్ని మెట్లో? మెట్లు యెక్కుతున్నాడు, దిగుతున్నాడు. యేమిటా కల కర్థం?

రెండు రెండు మెట్లను ఒకేసారి ఎక్కేశాడు. అదిగో ఇరవై రెండు. రాజేంద్ర రూమ్ బయటనే వున్నాడు

"హల్లో రవీ! కమాన్! ఏమిటయ్యా యిది? నీకోసం ఎంత యిదిగా వెయిట్ చేశానో! తీరా వెళ్ళిపోతున్న టైమ్‌కు వస్తావా? ఇట్స్ టూ బ్యాడ్" షేక్‌హాండ్ చేస్తూ కృష్ణమోహన్ అన్నాడు.

రూమ్ లోపలకెళ్ళి కూర్చున్నారు.

"రాజేంద్రా! కాఫీ తెప్పించు. త్వరగా"—కృష్ణమోహన్.

"సారీ కృష్ణా! ఇవ్వాళంతా కాలేజీలో"—రవి.

"విన్నాను. విన్నాను దాని ప్రభావం నా మీద కూడా పడిందిగా.... మీటింగ్ కేన్సిలయిపోయింది. ఈ ఊర్ని చూస్తే భయమేసింది— లాస్ట్ మినిట్ దాకా మీటింగ్ కేన్సిలయినట్టు తెలియదు.

టౌన్ హాల్ దగ్గర కెళ్ళగానే ఎవరో కొందరు కుర్రాళ్ళు నక్సలైట్ కృష్ణమోహన్ గో బ్యాక్ అంటూ కేకలు పెట్టడం....పోలీసుల గోల.... ఏదో సమావేశముంటే నాలుగు మాటలు చెప్పి పోదామని నేనొస్తే యిదెక్కడి గొడవ? గిరీశం అన్నట్టు 'ఎరక్క చిక్కడ్డాన్రా బాబూ!' అనుకున్నాను.

ఏమిటి సంగతి? ఈ ఊళ్ళో యేప్పుడూ ఇలాగే గొడవలౌతుంటాయా?" కృష్ణమోహన్ ఎప్పటిలాగే చాలా వేగంగా మాట్లాడాడు.



"ఎప్పుడూ ఏం కాదు అదీ సరేగాని నీ మీద ఈ నక్సలైట్ ముద్ర ఎప్పుడు పడింది?"—రవి.

కృష్ణమోహన్ నవ్వాడు.

"ఎప్పుడేమిటి? ఆ ముద్ర నా మీద చాలా కాలం నుంచీ వుంది. ఈ మధ్య నేను రాస్తున్న పొయెట్రీ చదవటం లేదా?"—కృష్ణమోహన్.

"ఆ మధ్యెప్పుడో ఒక గేయం చదివాను బాగా నిప్పులు కక్కుతున్నట్టున్నావే?—రవి.

"అవును సమ్‌థింగ్ సెన్సేషనల్. సమ్‌థింగ్ ప్రవోకింగ్ రాస్తే తప్ప విన్నెవ్వడూ గుర్తించడోయ్....ఈ సమాజానికో జోల్ట్... దీన్ని బాగా తిట్టాలి. తన్నాలి- దీని మీద ఉమ్మెయ్యాలి. అలా రాస్తే తప్ప దానికి బుద్ధిరాదు. అసే మారదు మనల్ని గుర్తించదు అందుకే నేను రాస్తున్నాను- నువ్వన్నట్టు నిప్పుల్ని కక్కుతున్నాను. అప్పట్నుంచే నన్ను నక్సలైట్ అంటున్నారు అననీయండి. ఐ డోన్ట్ కేర్"—కృష్ణమోహన్.

"నువ్వు చాలా గొప్పవాడివోయ్ కృష్ణా! అటు ఎస్టాబ్లిష్‌మెంట్‌తో మంచి సంబంధాలు పెట్టుకుంటావు. నీ పుస్తకాల్ని ప్రచురించుకోవటానికి అకాడమీ హెల్ప్ తీసుకుంటావు. అకాడమీ నీకు అవార్డు కూడా యిస్తుంది. ఎట్ ద సేమ్ టైమ్ నక్సలైట్ పొయెట్ అన్న పేరు- పొయెట్ ఆఫ్ ప్రొటెస్ట్ అన్న గుర్తింపు"—రవి.

రెండు కప్పులతో వెయిటర్ కాఫీ తెచ్చిపెట్టాడు.

ఇద్దరూ కాఫీ సిప్ చెయ్యటం మొదలెట్టారు.

"నథింగ్ రాంగ్ రవీ....! ఈ సిస్టమ్ నుంచి ఎంత ప్రయోజనం పొందాలో అంత ప్రయోజనం పొందాలి అకాడమీ వాడిచ్చే డబ్బు మనం తీసుకోకపోతే ఇంకెవడో తీసుకుంటాడు.

కాబట్టి మనమే తీసుకోవాలి.

ఈ సిస్టమ్‌ను అలా ఉపయోగించుకోకపోతే లాభం లేదు. దాని చేతుల్తోనే దాని కళ్ళు పొడవాలి.

బై దిబై ఈ ఊళ్ళో ఇంకా ఎంతకాలం వుంటావు? ఈ వూరు చాలా అల్లాకల్లోలంగా వుంది. త్వరగా యిక్కడనుంచి తప్పుకో. సిటీ కొచ్చెయ్.

ఈ పల్లెటూళ్ళో నువ్వేం రాస్తున్నావో ఎవడు చూస్తాడు? సిటీలో అయితే బోలెడు అవకాశాలు.

ఈ జాబ్‌కు రిజైన్ చేసి సిటీ కొచ్చేయ్. నీకు యునివర్శిటీలో దొరకదా? ప్రయత్నించగూడదా? ప్రొఫెసర్ ఉపేంద్రబాబు నిన్ను చాలా లైక్ చేస్తాడుగా!"

"నేను నీ అంత అదృష్టవంతుడ్ని కాదు కృష్ణా! హాయిగా సిటీలో ప్రైవేట్ కాలేజీలో జాబ్ సంపాదించావు.

అకాడమీ అవార్డులు కొట్టేశావు ఏదన్నా రచయితల సంఘం స్థాపించావా?"

"నోనో....ఈ సంఘాల కన్నిటికీ దూరంగా వుండాలన్నదీ నా పాలసీ. రచయిత అన్నవాడికి స్వేచ్ఛ చాలా అవసరం. ఎవడూ నన్ను డిక్టేట్ చెయ్యడం నాకిష్టముండదు.

నువ్వు సిటీ కొచ్చెయ్యవోయ్ రవీ..... వొచ్చి ఏదో గొప్ప పని చెయ్యి.

నలుగురి దృష్టిలో పడు....నీ మొదటి నవల చాలా బాగుందే అనుకో, కాని అదీ సరిపోదు.

ఇంకా షాకింగ్‌గా ఉండాలి. సుత్తితో కొడితే తప్ప ఈ సమాజం నిన్ను పట్టించుకోదు. నీలాంటి వాళ్ళు హైదరాబాద్ రావాలి. రావడమే కాదు మూసీ నదికి నిప్పంటించెయ్యాలి"—కృష్ణమోహన్.

రవి నవ్వాడు.

"మొత్తమ్మీద నల్గొండను వదిలిపెట్టాక నువ్వు చాలా ఫాస్ట్ అయిపోయావు. సిటీ నిన్ను బాగానే మార్చింది- కానీ, కృష్ణా! మనమేదో సంచలనం సృష్టించాలని, షాక్ చెయ్యాలని-అలా నేను రాయలేను- నేను ఫీలయ్యిందే రాయగలను-ఎవరెవరు ఏమిటేమిటి రాయాలన్న దాన్ని గురించి ఒక్కటే నాకు తెలుసు-ఎవరికి ఏది చాతనయితే వాళ్ళు అదీ రాస్తారు" - రవి.

"టైమయిందీ సార్" అన్నాడు రాజేంద్ర.

"టైమయిందా? అయామ్ రెడీ- ఆటో తెచ్చావా?"



"తెచ్చాను సార్!" — రాజేంద్ర.

"మళ్ళీ ఎవడైనా నిన్ను చూసి 'కృష్ణమోహన్ గో బ్యాక్' అని అరవడు గదా?" అన్నాడు రవి.

ఇద్దరూ ఒకేసారి నవ్వారు. "ఇంతకుముందు టౌన్ హాల్ దగ్గర వాళ్ళలా అరుస్తోంటే ప్రెస్ వాళ్ళెవరన్నా చూశారా?" అన్నాడు కృష్ణమోహన్ రాజేంద్రతో.

"తెలియదు సార్" అన్నాడు రాజేంద్ర

బ్రీఫ్ కేసు పట్టుకొని బయటకొచ్చాడు కృష్ణమోహన్. ముగ్గురూ మెట్లు దిగి కిందికొచ్చారు. "రేపు పేపర్లో ఈ మీటింగ్‌కు నేను వచ్చి ఇలా వెళ్ళిపోవటం గురించి వార్తలేమన్నా వస్తాయేమో చూడాలి" అంటూ.

రోడ్డుమీద రెడీగా ఉన్న ఆటోలో కూర్చుంటూ "యేం రవీ! బస్టాండ్ వరకు రాగూడదూ?" అన్నాడు కృష్ణమోహన్.

"ఇక్కడినుంచి నేను మా కొలీగ్‌ను చూడటానికి హాస్పిటల్ కెళ్ళాలి—సారీ" అన్నాడు రవి తన సైకిల్ దగ్గరకెళ్తూ.

"ఇంకా ఆ డొక్కు సైకిల్ పట్టుకునే తిరుగుతున్నావా? నువ్వీపాటికి స్కూటరన్నా కొన్నావనుకుంటున్నాను." అని నవ్వేసి సమాధానం ఆశించనట్టుగా.

రవితో షేక్‌హ్యాండ్ చేస్తూ "నైస్ మీటింగ్ యూ రవి! హైదరాబాద్ వస్తే రా" అన్నాడు కృష్ణమోహన్.

"తప్పకుండా" అన్నాడు రవి.

ఆటో వెళ్ళిపోయింది.

సైకిల్ అన్‌లాక్ చేస్తున్న రవికి లాడ్జ్ లోపలకెళుతున్న సన్నగా పొడగ్గా వున్న ఓ వ్యక్తి కనిపించాడు

అతన్నెక్కడో చూశాడు....అతడెవరో తనకు బాగా—చాలా బాగా తెలుసు—ఎవరతడు? బక్కచిక్కి, బలహీనంగా, అడుగులో అడుగువేస్తూ ఆ మనిషి తనకు బాగా తెలుసు—అదిగో....అతడు తనను చూస్తున్నాడు—అతడూ తనకేసి రెప్పవాల్చకుండా చూస్తూనే ఉన్నాడు-అతడు-అతడు విధి! అబ్బ ఎంత రిలీఫ్! కాని ఇదేమిటి? విధి ఇలా అయిపోయాడేమిటి?

"హల్లో....నువ్వు—నువ్వు నిధివేనా?" - రవి

"నువ్వు రవివైతే నేను నిధినే" అన్నాడు నిధి నీరసంగా నవ్వుతూ.

రవి సైకిల్‌కు స్టాండ్ వేసి అతని దగ్గరగా వెళ్ళాడు.

వెంటనే నిధి అతన్ని గట్టిగా కౌగరించుకున్నాడు....ఇద్దరి కన్నులూ చెమ్మగిల్లాయి.

"మొత్తానికి కలిశావు....నువ్వు కనిపించకుండానే వెళ్ళిపోతానేమో అనుకున్నాను" అన్నాడు నిధి రవి చేతిని తన చేతిలోకి తీసుకొని.

"అసలెప్పుడొచ్చావు? వస్తున్నట్టు ఓ లెటరన్నా రాయలేదేమిటి? నేనీ ఊళ్ళో ఉంటున్నట్టు నీకు తెలుసా?"

"నిన్ననే వచ్చాను....నువ్విప్పుడు ఇక్కడ ఉంటున్నట్టు తెలుసు. కాని మీ ఇంటి అడ్రస్ తెలియదు. కాలేజికి ఫోన్ చేస్తే ఒకసారేమో మీటింగ్‌లో ఉన్నారన్నారు....మరోసారి వెళ్ళిపోయాడన్నారు—"

"ఇదేమిటి? ఇలా అయిపోయావేమిటి? నీ హెల్త్ బాపుండటం లేదా?" - రవి.

"రూమ్‌లోకెళ్ళి మాట్లాడుకుందాం రా" - నిధి.

"ఓ పని చేద్దాం నిధి! నేనిప్పుడు చాలా తొందర్లో ఉన్నాను. ఓ ఫ్రెండ్ హాస్పిటల్‌లో చాలా సీరియస్ కండిషన్‌లో ఉన్నాడు. వెళ్ళిచూడాలి నేను రేపు పొద్దున్నే ఇక్కడకొస్తాను. మనిద్దరం మా ఇంటికెళ్ళి తీరిగ్గా మాట్లాడుకుందాం"

"నేను రేపటిదాకా ఉంటేగద... యే క్షణంలో వెళ్ళిపోతానో తెలియదు....ఎక్కడికో తెలుసా ?"

లోపలకు పీక్కుపోయిన కళ్ళు - రేగిన తల-మాసిన గడ్డం-చిక్కి శల్యమైపోతున్న శరీరం—అతనిలో ఎక్కడా జీవం ఉన్నట్టుగా లేదు. నడుస్తున్న శవంలా ఉన్నాడు—యేదో జరిగింది-అతన్ని చూస్తే ఎందుకో భయమేస్తున్నది—యే క్షణంలో వెళ్ళిపోతానో తెలీదు అంటున్నాడు—ఎక్కడికి?

"ఎక్కడికి నిధి ?"

"మనం ఎక్కణ్ణించైతే వచ్చామో అక్కడికే"

"అంటే?"



"గుడ్‌బై టు దిస్ వరల్డ్! నీకు తెలియదా రవీ....నా హెల్త్ నాశనమై పోయింది"

"రూమ్‌లో కెళదాం పద"

నిధి దారితీశాడు....మళ్ళీ మెట్లు....ఎందుకో ఈ మెట్లను చూస్తే భయం-గోడల్ని చూస్తే భయం-ఎక్కడో హృదయాంతరాళంలో ఉన్న యేవో అస్పష్ట, అవ్యక్త, అనిర్వచనీయ భయాల్ని తట్టి లేపుతున్నాయి. వాటీజ్ రాంగ్ విత్ నిధి? మృత్యువుకు అత్యంత సమీపంలో ఉన్నట్టుగా కనిపిస్తున్నాడు.

"రూమ్ నెం. 21 ముందు నిధి ఆగి తాళం తీశాడు.

"ఆశ్చర్యంగా ఉంది. ఇంతకు ముందు నేను ఇక్కడికే వచ్చాను. రూమ్ నెం 22 లో చాలా సేపు ఉన్నాను కూడా"

"నేనిప్పుడే కొంచెం టిఫిన్ చేసి వద్దామని బయటికి వెళ్ళాను"

"అది సరేగాని....ఎందుకిలా అయిపోయావు?"

"నేను చాలా కాలంగా టి. బి. తో బాధపడుతున్నాను.... ఈ మధ్య అది చాలా ముదిరిపోయింది. ఈ ఊళ్ళో ఒక మంచి డాక్టరున్నాడంటే అతన్ని చూద్దామని వచ్చాను."

"ఔను....మరిచేపోయాను .... యేడెనిమిది నెలల క్రితం రమేష్ వరంగల్‌లో కలిసినప్పుడు చెప్పాడు - నీకు టి. బి. ఎటాకయిందని....కాని తగ్గిపోయిందని చెప్పాడే"

"తగ్గిపోయిందనుకున్నాను. అక్కడే పెద్ద పొరపాటు జరిగింది-తగ్గిపోయిందిలే అని నిర్లక్ష్యం చేశాను. రెండు నెలల తర్వాత మళ్ళీ నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఈసారి మాత్రం నన్ను వదిలి పెట్టనంటోంది."

అలా మాట్లాడుతూనే అతడు దగ్గటం మొదలెట్టాడు. మూడు నాలుగు నిముషాల వరకు అతడలా దగ్గుతూనే ఉన్నాడు—మెల్లగా ప్రారంభమై, క్రమక్రమంగా ఉధృతమై అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది—అతని శరీరమంతా కుంచించుకుపోతుంటే, అతని ముఖమంతా ముడుతలు పడిపోతుంటే అతడు బాధతో విలవిల్లాడిపోతూ, చేతుల్తో గుండెలు పట్టుకుంటూ, రూమ్

అంతా అటూ ఇటూ తిరుగుతూ దగ్గుతూనే ఉన్నాడు. ఆ దగ్గుకు అంత మంటూ ఉంటుందా? అలా దగ్గుతూ దగ్గుతూ అతడు కళ్ళు తేలవేశాడు—ఆ కళ్ళల్లో జీవం లేదు—ఆ కళ్ళల్లో మృత్యువు నీడలు స్పష్టంగా కనిపించాయి—అతడు ఎగ్జాగరేట్ చెయ్యలేదు. యే క్షణంలో నయినా వెళ్ళిపోవచ్చు.

రవికి భయమేసింది ఇప్పుడు తనేం చెయ్యాలి? వెంటనే డాక్టర్ దగ్గరకు పరుగెత్తడమా? యేం చెయ్యాలి? హోటల్ మేనేజర్ని పిలవాలా?

అతడలా దగ్గుతూనే వెళ్ళి అతని సూట్‌కేసు తెరచి ఓ టాబ్లెట్ తీసి నోట్లో వేసుకొని మంచినీళ్ళు తాగాడు. ఒక నిముషం తర్వాత మెల్లగా తేరుకున్నాడు—తుఫానులా అతన్ని కుదిపివేసిన దగ్గు ఆగిపోయింది—అతని చూపులు మళ్ళీ మామూలుగా మారిపోయాయి.

"భయపడ్డావా రవీ? అయామ్ సారీ"

"ఫరవాలేదు-కానీ ఈ రోజుల్లో టి. బి. ఈజీగా కంట్రోలై పోతుందంటారే-నీకిలా ఎందుకయ్యింది?"

"కంట్రోలయ్యేదే—కాని నేనా రెండు నెలలు ఇక ఇది నన్ను వదిలించుకుందనుకొని—సారీ! వదిలిందనుకొని నిర్లక్ష్యం చెయ్యకపోతే నాకీ పరిస్థితి వచ్చేది కాదు. పోనీయ్‌లేగాని—నీ సంగతి చెప్పు. నువ్వెట్లా ఉన్నావు? ఉద్యోగం. సంసారం అన్నీ బాగేనా?"

"ఫరవాలేదు"

"ఆ మధ్య నీ కథొకటి ఏదో మేగజైన్‌లో చదివాను. నాకు ఎంత నచ్చిందో చెప్పలేను. చలంగారి నవలల తర్వాత నన్ను మళ్ళీ అంతగా కదిలించిన కథ అదే! ఆ కథ పేరు మరచిపోయాను ఆ కథేమిటంటే ఓ ఆఫీసులో పనిచేసే ఓ క్లర్కు వాళ్ళ ఆఫీసర్‌ను హత్య చెయ్యాలనుకుంటాడు-మానవుని మానసిక ధోరణిని గురించి—ఆ కథలో నేరస్థుడి మనస్తత్వాన్ని బాగా చిత్రించావు."

"ఓ అదా! ఆ కథ నీకంతగా నచ్చిందా? థాంక్యూ—"

"ఇంకా ఈ మధ్యేం రాశావు?"



"చాలా తక్కువ- రాసేంత టైమ్, మనస్థిమితం వుండటంలేదు. రాయాలనుకున్నదాంట్లో ఓ పదోవంతు కూడా రాయలేకపోతున్నా."

"రాయి రవీ! నువ్వు రాయాలి తప్పకుండా రాయాలి ఈ మధ్య వేణు కలిశాడా?"

"లేదు- చాలా కాలం క్రితం కలిశాడు. ఆయనదొక ప్రపంచం. మనదొక ప్రపంచం. రెండిటికీ సమన్వయం కుదరదు"

"క్రాంతి" రెగ్యులర్‌గా వస్తోందా?"

"వస్తోందనుకుంటాను. నాకు దాంతో ఇప్పుడు టచ్ పోయింది.

"రమేష్ కలుస్తున్నాడా?"

"ఎప్పుడైనా వరంగల్ వెళ్తే, అక్కడి యూనివర్సిటీలో లెక్చరర్-అతడు హాయిగానే వున్నాడు. అతడు సాధించాలనుకున్న లక్ష్యాన్ని సాధించాడు— అలాగే సాగర్! ఇప్పుడు మంత్రయిపోయాడుగా!"

"ఔను— పేపర్‌లో చూశాను. ఎలా వున్నాడు? నువ్వెప్పుడన్నా కలిస్తే మాట్లాడుతాడా?"

"సాగర్ యేం మారలేదు. ఎప్పట్లా స్నేహంగానే వుంటున్నాడు. చాలా ఆప్యాయంగా మాట్లాడతాడు. కానీ అసలు కల్సుకోవటమే తక్కువ. వేణుదొక ప్రపంచమైతే సాగర్‌ది మరొక ప్రపంచం. అటూ ఇటూ కాని ప్రపంచం మనది. నాకేమనిపిస్తోందంటే మనిషి గమ్యాన్ని నిర్ణయించేది వాడి మనస్తత్వమేనని- ఎవడి మనస్తత్వానికి తగిన రంగాన్ని వాడు ఎన్నుకుంటాడు. సోకాల్డ్ ఆదర్శాలు, ఆశయాలు- ఇవన్నీ తరువాత విషయాలే."

"అసలు ముఖ్యమైన సమస్యలు. జీవితం ఎందుకు? జీవితానికి అర్థమేమిటి? అన్న ప్రశ్నలకు నీకు సమాధానాలు దొరికాయా?"

"అకస్మాత్తుగా నువ్వు చాలా గట్టి ప్రశ్నలే అడిగేశావు. జీవితం జీవించటం కోసం— నిర్దేశించాలనుకున్న లక్ష్యాన్ని కొంతవరకైనా సాధించటం కోసం- ప్రస్తుతం నాకు తెలిసిందింతే."

కాస్సేపు నిశ్శబ్దం

"నేను రేపును గురించి ఆలోచించటంలేదు రవీ! ఆ రేపనేది వస్తుందా అనేది నాకెప్పుడూ సందేహంగానే వుంటున్నది. ఈరోజు గడిస్తే

చాలు అన్నదే నాకు చాలా ముఖ్యమైపోయింది. మృత్యువుకు నేను చాలా సమీపంలో వున్నాను రవీ!"

"నో నో.... టి బి. ఈజీగా కంట్రోలవుతుంది. నువ్వసలు కరెక్ట్ ట్రీట్‌మెంట్ తీసుకున్నావా అని—"

"నా ట్రీట్‌మెంట్ మీద ఎంత డబ్బు తగలేశానో లెక్కలేదు. ఎంతోమంది స్పెషలిస్టులను కలిశాను— కాని లాభంలేదు. ప్రతీవాడూ ప్రారంభంలో నువ్వు చాలా నిర్లక్ష్యం చేశావంటాడు. ఇదిగో ఈ ఎక్స్‌రే ఫోటోలు చూడు. నా లంగ్స్ పూర్తిగా చెడిపోయాయి. అంటూ అతడు ఓ ఎక్స్‌రే ఫోటోల కట్టను రవికి అందించాడు.

"15 వరకూ వున్న ఆ ఫోటోలను మూడు నాలుగు నిముషాల్లో చూడటం ముగించి లేచాడు రవి.

"నే వెళతాను నిధీ! మళ్ళీ రేపొస్తాను. మా ఇంటికెడదాం—నేను చాలా తొందరగా వెళ్ళాలి."

"హాస్పిటల్‌లో ఎవరో ఫ్రెండన్నావు కదూ?"

"ఔను. నేను వెళ్ళే వరకు అతడు బతికే వుంటాడా? అన్న సందేహంకూడా వుందనుకో."

నిధి నవ్వాడు.

"నువ్వు వెళ్ళేవరకు అతడుంటాడా అన్నదీ సందేహమే! నువ్వొచ్చే వరకు నేనుంటానా అన్నదీ సందేహమే! జీవితం ఎంత అనిశ్చితమో చూశావా? అయినా నేను పెద్దగా చలించిపోవటం లేదు. ఈ బొందిలో ప్రాణమున్నంతవరకు భౌతికంగానే కాదు, మానసికంగా కూడా జీవించాలనే ప్రయత్నిస్తున్నాను. నీకు తెలుసా ఈరోజు నేనో సినిమా కెళ్ళాను." నిధి—

"సినిమాకెళ్ళావా?"

"ఔను—"

"ఏం పిక్చరది?"

"చల్తీకానామ్ గాడీ! మార్నింగ్ షో.... నీకు తెలుసుగా నా కప్పటి కిశోర్ కుమార్ కామెడీసంటే చాలా ఇష్టమని.... ఈ ఊరికి రాగానే



'చల్తీకా నామ్ గాడీ' పోస్టర్ కనిపించింది. వెంటనే ఆ థియేటర్‌ను వెతుక్కుంటూ వెళ్ళి ఆ పిక్చర్ చూశాను. కడుపు నిండా నవ్వుకున్నాననుకో. . ఆ పిక్చర్ చూస్తోంటే నువ్వు చాలాసార్లు గుర్తొచ్చావు.... హైదరాబాద్‌లో వున్నప్పుడు మనిద్దరం ఒకసారి ఆ సినిమా చూసి ఆ రోజంతా నవ్వుకున్నాము. మళ్ళీ ఆ రోజులన్నీ గుర్తొచ్చాయి ... ఆ రోజులనిప్పుడు గుర్తు చేసుకుంటే ఎంత హాయిగా వుంటుందో! ఆ ఎ—హాస్టల్.... అప్పటి మన ఫ్రెండ్స్.... అప్పటి మన జోక్స్.... అప్పటి మన కేర్‌ఫ్రీ లైఫ్.... జేబులో పైసా లేకున్నా సినిమాల కోసం పరిగెత్తటం.... తిరిగొచ్చేసరికి డైనింగ్ హాల్ మూసెయ్యటం.... ఆ ఆకలి ... ఆ దాహం.... నిజంగా రవీ! ఆ జ్ఞాపకాలే నన్నిప్పుడు బతికిస్తున్నాయి.... హాస్టల్, కాలేజీ వదిలి పెట్టినప్పటినుంచి నా జీవితం చాలా ఘోరంగా మారిపోయింది. అయామ్ సారీ ... నువ్వెళ్ళు రవీ! ఈరోజు నిన్నిలా కాకతాళీయంగా కలిసినందుకు ఎంత థ్రిల్లింగ్‌గా వుందో చెప్పలేను. ఈ థ్రిల్ నా ఆయుష్షును కొంత పెంచుతుంది. అసలు ఈ లైఫన్నదే పెద్ద యాక్సిడెంటనిపిస్తుంది.... మనం పుట్టటం.... మనం బతకటం.... మనం చావటం.... అన్నీ యాక్సిడెంట్లే ఏమంటావు? యేదేదో మాట్లాడుతున్నాను.... నువ్విక వెళ్ళు"

రేపు కలుద్దాం నిధి.... పదిగంటలకు వచ్చేస్తాను."

"అసలు నువ్వు కలిశావనే వుంటున్నాను.... లేకపోతే రేపొద్దున్నే వెళ్ళే వాడిని."

"సో సీయూ టుమారో మార్నింగ్!"

రవి బయటకొస్తోంటే నిధి మళ్ళీ దగ్గటం మొదలెట్టాడు.

రవి చకచకా రెండు రెండు మెట్లొకేసారి దిగి కిందకొచ్చాడు. దూరంగా ఆకాశం ఉరిమినట్టుగా అతని దగ్గు భయంకరంగా వినిపిస్తూనే వుంది. అది దగ్గు కాదు.... మృత్యువు వికటాట్టహాసం— రేపొచ్చేదాకా వుంటాడా? ఇప్పుడు తను హాస్పిటల్‌కి వెళ్ళేదాకా ఇక్బాల్ వుంటాడా? ఈ వుండటమేమిటి? వెళ్ళటమేమిటి? ఈ జీవితానికర్థమేమిటి? రేపు అనే ఒకటుందన్న నమ్మకం లేని మనిషి ఈరోజు 'చల్తీకానామ్ గాడీ!' అన్న సినిమా చూడటమేమిటి?

చీకటి పడిపోయింది. లైట్లు వెలిగాయి. చీకటికంటే ముందే తను ఇంటికి వెళ్ళిపోవాలనుకున్నాడు.... కాని చీకటి తనను 'ఓవర్ టేక్' చేసేసింది

"పెళ్ళానికి కరువైపోతవురో- జాగ్రత్త."

తననే అన్నారా! ఇక్బాల్, విధిల సంగతి వదిలెయ్! ఇంటికెళ్ళి రజనిని చూసేదాకా నువ్వుంటావా?

సైకిల్ దగ్గరకెళ్ళి 'అన్‌లాక్' చేసేసి సైకిలెక్కి హాస్పిటల్ వైపుగా వెళ్ళటం మొదలెట్టాడు.

అసలిప్పుడు హాస్పిటల్‌కు వెళ్ళకపోతే యేం? టైమ్ చూశాడు.... ఏడు దాటింది. డైరెక్ట్‌గా ఇంటికే వెళ్ళిపోవాలి. కోమాలో వున్న ఇక్బాల్‌ను చూసి చేసేదేముంది.... కోమాలో సేఫ్‌గా వుండి వుంటాడు.... మన సేఫ్ బద్దలై పోతున్నది. హాస్పిటల్‌కు వెళ్ళటమా? సరాసరి ఇంటికే వెళ్ళి "రజనీ నేను నీకింకా కరువైపోలేదు" అని చెప్పటమా? వెంటనే నిర్ణయించుకో వోయ్ వెర్రి మొహమా! నువ్వొక ఖైదీవి— ప్రిజినరాఫ్ ఇన్ డెసిషన్— ఖైదీవి! పుట్టినప్పటి నుంచి ఖైదీవే—ఆచారానికి, సంప్రదాయాలకు, మూఢ నమ్మకాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి, భార్యకు, పై ఆఫీసర్‌కు, అభిమాన రచయితలకు, కలలకు, కన్నీళ్ళకు, ఎన్నింటికో! లెక్క లేదు. మ్యాన్ ఈజ్ బార్న్ ఫ్రీ బట్ హి ఈజ్ ఇన్ చెయిన్స్ ఎవ్రీవేర్—ఎవ్రీవేర్— జనం, జనం— ఎవ్రీవేర్ — ఎంత ట్రాఫిక్కో. రోడ్డుమీద సైకిల్ వెళ్ళటానికి కూడా ప్లేస్ లేదు.144 సెక్షన్ ఎక్కడా కనిపించదే- పోలీసువాడు— విజిల్ ఊదుతున్నాడు. తన సైకిల్‌కు అన్నీ వున్నాయా? అదిగో యేదన్నా లేదని పట్టుకుంటాడా? అదిగో గోవిందరావు— బట్టల షాపులో-యేదో కొనేస్తున్నట్టున్నాడు.

"హల్లో రవీ! ఎక్కడికి?" -గోవిందరావు.

"హాస్పిటల్‌కు- ఇక్బాల్‌ను చూద్దామని" -రవి.

"ఇంకెక్కడి ఇక్బాల్? నాల్గింటికే పోయాడు. శవాన్ని వాళ్ళూరికి తీసికెళ్ళారు."

"మైగాడ్! ఇంత త్వరగా—"



"ఇంత త్వరగా యేమిటి? అతడింత కాలం బతకటమే పెద్ద వండర్! కానీ చాలా ఘోరం— అతను చనిపోయినప్పుడు అతని పక్క నెవరూ లేరుట అతడు చనిపోయిన గంటసేపటికి అదిలాబాద్ నుండి వాళ్ళ సిస్టర్స్ వచ్చి శవాన్ని తీసుకెళ్ళారట— అసలు మనిషన్న వాడికి పెళ్ళాం, పిల్లలు వుండి తీరాలనుకుంటాను. పెళ్ళి చేసుకొని వుంటే ఇక్బాల్ లైఫ్ ఇలా అంతమయ్యేది కాదు."

"నిజమే."

"కాని గొప్పవాడులే. మీరేమన్నా అనండి. చివరి నిమిషం వరకు నవ్వుతూ నవ్విస్తూనే బతికాడు— ఈరోజు కూడా చూశారుగా! కాలేజీకి వచ్చి ఎన్ని జోక్స్ వేశాడో! అలా జీవితాన్నొక పెద్ద జోక్‌గా తీసుకునే వాళ్ళు చాలా అరుదుగా కనిపిస్తారనుకుంటాను"

"ఔను"

"మీకింకో వార్త తెలుసా?"

"యేమిటది?"

"శ్రీనివాసరెడ్డిని అదిలాబాద్‌కు షంటారు.......కాలేజీ పీడా వదిలిపోయింది"

"తెలిసింది....కానీ అతడు అదిలాబాద్‌కు వెళ్ళడంటున్నారే!"

"వెళ్ళకేం చేస్తాడు? ఆ చింతచెట్టు కిందకెళ్ళి మూర్ఛించుకుంటాడేమో....అసలు వెళ్ళకుండా వుండటం మాత్రం ఇంపాజిబుల్... పదేళ్ళ నుండి ఈ ఊళ్ళో వుంటూ జనరల్ స్టోర్లు....చిట్ ఫండు....బ్యాషన్లు ... ఎన్ని విధాలుగా సంపాదించాలో అన్ని విధాలుగా సంపాదిస్తున్నాడు.... వెధవకు....రోగం కుదిరింది"

"డాడీ! వెళ్ళిపోదాం" అన్నాడు గోవిందరావు ప్రక్కనే వున్న కుర్రాడు.

"వీడికేదో యూనిఫామ్ కుట్టించాలంటే బజారుకొచ్చాను....నిజానికి రోజు బజారుకు రావొద్దనే అనుకున్నాను ...ఎందుకంటే ఊళ్ళో బోర్డు

టెన్షన్! మీరుకూడా బయటకెందుకొచ్చారు? త్వరగా వెళ్ళిపోండి. మీకు కాలేజీనుండి వస్తున్నప్పుడు చెప్పిన విషయాన్ని మర్చిపోయారా?"

—గోవిందరావు.

"మర్చిపోలేదు....కాని బయటికెళ్ళటం తప్పలేదు"—రవి.

"మీరసలు ఆవేశపడి మాట్లాడొద్దు రవీ! వాళ్ళూ వాళ్ళూ కొట్టుకుని చస్తారు. మనమెందుకు బయటపడడం? పోలీసువాళ్ళను గూర్చి కూడా అలా మాట్లాడొద్దు పోలీసు వాడ్ని కాలేజీకి పిల్చాక వాడూరుకుంటాడా? కన్పించిన వాడినల్లా బాదేస్తాడు. మనం పోలీసువాళ్ళకు వ్యతిరేకంగా అలా మీటింగ్స్‌లో మాట్లాడితే అది వాళ్ళకు తెలిసిపోతుంది... పోలీసువాడు పగబట్టాడంటే చాలా కష్టం... వాళ్ళ దృష్టిలో పడనేకూడదు....పడ్డామో.... మళ్ళీ బయటపడటం చాలా కష్టం"

"డాడీ! వెళ్ళిపోదాం" కుర్రాడు మళ్ళీ వాళ్ళ నాన్న చెయ్యి పట్టుకున్నాడు.

"వెళదాం రా! వస్తాం రవీ! నువ్వు మాత్రం డైరెక్ట్‌గా యింటికే వెళ్ళిపో" -గోవిందరావు.

"అలాగే" —రవి.

రవి ఆ షాపు ముందటినుంచి కదిలి బసు స్టాండ్ దాటి, జడ్.పి ఆఫీసు ముందునుంచి ముకరంపురా వేపు బయలుదేరాడు.

జడ్.పి. ఆఫీసు ముందు రవిని ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆపేశాడు

"రవీందర్....లెక్చరర్ అంటే నువ్వేనా?" అడిగాడు కానిస్టేబుల్ రవి సైకిల్ హేండిల్‌ని పట్టుకొని

"అవును....నేనే" అన్నాడు రవి వెంటనే సైకిల్ దిగి.

"మా అపీసర్ సాబ్ రమ్మంటున్నాడు" అని కొంచెం దూరంలో నిల్చున్న సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను చూపించాడు.

"దట్సిట్! అనుకున్నట్టే అవుతుందన్నమాట! యేం చేస్తాడు? అరెస్ట్ చేస్తాడా? టార్చర్ చేస్తాడా? సూర్యప్రకాష్ 'నన్ను హత్య చెయ్య చెయ్యటానికి ప్రయత్నించాడని రిపోర్టు చేశాడా? కొంచెం ముందుగా



అయినా బాపుండేదే! గోవిందరావు చూసేవాడు....కాపాడటానికి ప్రయత్నించేవాడు....

ఎస్.ఐ. రమేష్ తన రక్తం తాగటానికి పొంచి వున్న పెద్ద పులిలా కనిపించాడు. పొడుగ్గా, సన్నగా, ఎర్రగా వుంటాడు....గుబురుగా పెరిగిన మెలికలు తిరిగిన మీసాలు....ఎర్రజీరలతో నిండిన కళ్ళు క్రూరంగా.... కర్కశంగా....

"మిష్టర్ రవీందర్! జీపెక్కండి"

"ఎందుకు?"

"నీతో మాట్లాడాలి"

"ఆర్ యూ అరెస్టింగ్‌మీ"

"నో....జస్ట్ ఇంటరాగేషన్! జీపెక్కండి"

"నా సైకిల్"

"సైకిల్‌ను మా కానిస్టేబుల్ తెస్తాడు"

రవి వెనుకనుండి జీపెక్కి కూర్చున్నాడు.

జీపు రయ్యిమని పోలిస్ స్టేషన్ వేపు దూసుకుపోయింది.

ఎవడయినా చూశాడా? ఎస్.ఐ. తనను పిలవటం....జీపెక్కమని ఆర్డరివ్వటం....తను జీపెక్కటం....తెలిసిన వాడెవడన్నా చూస్తే తనో పెద్ద క్రైమ్ చేసినట్టు....అందుకే పోలీసులు తనను అరెస్ట్‌చేసి తీసికెళుతున్నట్టు....

ఎన్ని విలువలు వలువలు చేసి....ఎంత ప్రచారం చేస్తాడో....ఛీఛీ! పోలీసువాడి జీపెక్కే పరిస్థితి రావటం....పోలీసువాడి చేతిలో కెళ్ళగానే ఏ తప్పు చేయకపోయినా యేదో తప్పు చేశామన్న భావం....ఎవడూ చూడకూడదన్న భావం....

ఉత్త పుణ్యానికే నేరస్థుడి మనస్తత్వం....వాడికెంత అహంకారం-ఏకవచనంతో సంబోధిస్తాడా? సంస్కారం లేనివాడు....అసలు పోలీసువాడికి సంస్కారం యేమిటి? అంతా డిగ్రీ కల్చరే....నోనో....అగ్రికల్చర్‌ను కించపరచటానికి వీల్లేదు....

విల్ డ్యూరాంట్ యేమన్నాడు? ది ఫస్ట్‌ఫామ్ ఆఫ్ కలర్ ఈజ్ అగ్రికల్చర్....కృషితో నాస్తి దుర్భిక్షమ్....మానవజీవితాన్ని వాడి నాగరికతను ప్రభావితం చేసినది రెండే రెండుట....ఒకటి వ్యవసాయాన్ని కనుక్కోవటం, రెండవది ప్రాథమిక విప్లవాన్ని సాధించటం....

అంతే! అదే స్టోరీ ఆఫ్ సివిలైజేషన్....పది సంపుటాలలో ఒక సంపుటం చదివాడు....స్ట్రేంజ్! పోలీసువాడి జీపులో కూర్చుని 'విల్‌డ్యూరాంట్'ను జ్ఞాపకం చేసుకోవటం....యేవి, యెప్పుడు, ఎక్కడ జ్ఞాపకం చేసుకోవటం జరుగుతుందో తెలీదు...

ఈ మనస్సనే మహా సముద్రం....దీని లోతును, దీని పైశాల్యాన్ని దీని శక్తిని, దీని వేగాన్ని అంచనా వెయ్యటం ఎవరికి సాధ్యం? హాస్పటల్ జ్ఞాపకాలతోనే బ్రతుకుతున్నాను....లైఫొక యాక్సిడెంట్! కరెక్ట్....విధి కలవటమొక యాక్సిడెంట్....విధి కలిశాడు కాబట్టే గోవిందరావు కలిశాడు....గోవిందరావు కలిశాడు కాబట్టే పోలీసువాడు కలిశాడు.

అదిగో ఎవరో తలకేసి చూశాడు ...తెల్సినవాడే! లెక్చరర్ రవీంద్ర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారహో! అంటూ ఊరంతా ఢంకా భజాయిస్తాడేమో! ఈ పోలీసువాడు తననిప్పుడు యేం చేస్తాడు? తనింటికెళ్ళి రజని వడిలో తలదాచుకునే క్షణం వస్తుందా?

క్షణక్షణానికి ఇల్లు—రజని....తనకు దూరంగా....ఇంకా దూరంగా వెళ్ళిపోతున్నారు. తనెక్కడో మహారణ్యంలో—జనారణ్యంలో చిక్కుబడిపోయాడు. ఎటు చూసినా గోడలు—ఎత్తుగా, నిటారుగా నిల్చున్న గోడలు....ఎటు చూసినా మెట్లు ఎక్కుతున్నాడు-దిగుతున్నాడు. ఆ మెట్లకు అంతంలేదు—ఆ మెట్లను తప్పించుకొని బయటపడే మార్గంలేదు ఈ పోలీసువాడినీ తప్పించుకునే మార్గం లేదు.

మృత్యువునూ. పోలీసువాడినీ తప్పించుకోలేం —పోలీసువాడే రాజు-పోలీసువాడే దేవుడు—నారాయణుడు-శ్రీకృష్ణుడు-సర్వధర్మాన్పరిత్యజ్యమామేకం శరణం వ్రజ! ఘంటసాల పుణ్యమా అని భగవద్గీత మనస్సున పట్టింది.

పోలీస్ స్టేషనొచ్చేస్తోంది. పోలీసులు—పోలీసులు—రాజ్యం అనే



దానికి ముఖ్య ప్రతినిధి పోలీసువాడు రాజ్యం ఎలా పుట్టింది? ఆస్తి రాజ్యానికి తల్లి—యుద్ధం రాజ్యానికి తండ్రి—తనను పోలీసుస్టేషన్‌కి తీసికెళ్ళినట్టు రజనికి తెలిస్తే షాకైపోయి, గుండె పగిలిపోయి, ఏడ్చి యేడ్చి చచ్చిపోతుందేమో—

యేం చచ్చిపోదు—అంతా నువ్వూహించుకుంటున్నావు—నీకోసం ఈ ప్రపంచంలో ఒక మనిషి చచ్చిపోవటానికి సిద్ధంగా వుందన్న భావం నీకానందాన్నిస్తుంది. అదే ఇది.

కాని ఎవరూ దేనికోసమూ చచ్చిపోరు. మైడియర్ హజ్బెండ్! ఈ ఎస్.ఐ.గాడిప్పుడు నిన్నేం చేస్తాడు?

పోలీస్ స్టేషన్ ముందు జీపు ఆగింది.

రవి జీపు దిగాడు.

ఎస్.ఐ ని చూడగానే అక్కడున్న కానిస్టేబిల్స్ అందరూ సెల్యూట్ చేశారు.

కానిస్టేబుల్సే కాకుండా వేరేవాళ్ళు కూడా అక్కడ చాలామందీ వున్నారు.

అందులో ఒకతడు రవిని చూడగానే అతని దగ్గరకొచ్చి 'నమస్కారం సార్' అన్నాడు.

ఎవరితడు? ఎక్కడా చూసినట్టు గుర్తులేదు.

మా అబ్బాయిని తీసుకొచ్చి లోపల లాకప్పులో పడేసింద్రు. సార్! ఎంత బతిమిలాడినా విడిచిపెట్టలేదు సార్....! వానికేం తెల్వదు సార్....పొద్దున కాలేజీకి పోతే అక్కడేదో లొల్లయితే అందరితో బాటు మావోన్ని గూడా పట్టుకొచ్చింద్రు....మీరు కొంచెం జెప్పుండ్రి సార్...." అంటున్నాడతను.

"పొద్దున తీసుకొచ్చిన పిల్లల్లో మీ అబ్బాయి కూడా వున్నాడా?"

"ఔను సార్....వాడు మేడ్చి యేడ్చి చస్తాండు సార్....మీరు జర జెప్పుండ్రి సార్."

"నేనేం చెప్పలేనండి....అయామ్ సారీ!" అంటూ రవి ఎస్.ఐ. వెంట లోపలకెళుతుంటే ఆ రోజు అరెస్టు చెయ్యబడిన స్టూడెంట్స్ కొందరు

పోలీస్ స్టేషన్ పక్కనే బారక్స్‌లోంచి చూసి "సార్! సార్! మిమ్మలను కూడా పట్టుకొచ్చింద్రా ఈ గాడిది కొడుకులు" అని అరిచారు.

ఎస్ ఐ. తన సీట్లో కూర్చోగానే ఫోన్ మోగింది ఆతని పై అధికారెవరో మాట్లాడుకున్నట్టుంది అంతా ప్రశాంతంగానే వుందని, ఎవ్రీ థింగ్ అండర్ కంట్రోల్ అని చెప్పాడు ఎస్.ఐ. రమేష్.

ఎస్.ఐ.కి ఎదురుగా కూర్చున్న రవిని చూసి—

"మిష్టర్ రవీ! జస్ట్ రెండు మూడు క్వశ్చన్స్....ఈ రోజు మీ కాలేజీలో జరిగిన సంఘటనలకూ. నీకూ యేమిటి సంబంధం?"

"యేమీ సంబంధం లేదు" వెంటనే అన్నాడు రవి.

"స్టూడెంట్స్‌లో ఒక వర్గం వాళ్ళను నువ్వే రెచ్చగొట్టావని మాకు సమాచారం వచ్చింది."

"ఎవరండీ ఆ సమాచారం మీకిచ్చింది? మరో వర్గం విద్యార్థులు....అంతేనా?"

"అఫ్‌కోర్స్....నిజంగా నీకేం సంబంధం లేదంటావు."

"ఔను....నాకెలాంటి సంబంధం లేదు."

"నువ్వు కమ్యూనిస్టు పార్టీలో మెంబరా?"

"కాదు. యూ కెన్ చెకప్!"

"ఆర్.డబ్ల్యూ.ఏ.లో మెంబరా?"

"కాదు....అది కూడా మీరు చెకప్ చేసుకోవచ్చు."

"నువ్వు ఆర్.డబ్ల్యూ.ఏ. వాళ్ళ మీటింగ్స్ అటెండ్ చేసినట్టు మా పోలీసు రిపోర్టులో వుంది."

"ఒకసారి అటెండ్ చేసిన మాట నిజమే. కాని మెంబర్‌గా కాదు. వాళ్ళ విధానాలేమిటో తెలుసుకోవటానికి మాత్రమే!"

"ఐ.సీ....ఈ రోజు మీ కాలేజీ మీటింగ్‌లో నువ్వు మా పోలీసుల్ని బాగా తిట్టి మీ లెక్చరర్స్‌ని మా మీదకు బాగా రెచ్చగొట్టావుట కదా? నేను మీకు అపోలజీ ఇచ్చుకోవాలన్నావుట కదా!"

రవి వెంటనే మాట్లాడలేదు....కాలేజీలో స్టాఫ్ మీటింగ్స్‌లో ఎవరు యేం మాట్లాడారో కూడా పోలీసులకు తెలిసిపోతుందా? పోలీస్ వారికి సమాచారం ఇచ్చేవాళ్ళు స్టాఫ్‌లోనే ఉన్నారన్నమాట.



"సారీ....!" అన్నారు బయట్నుంచి అప్పుడే లోపలకొచ్చిన ఇద్దరు కానిస్టేబుల్స్.

రవి వెనక్కి తిరిగి చూశాడు.

ఆ ఇద్దరు కానిస్టేబుల్స్ మధ్యలో రౌడీలా కనిపిస్తున్న 25 యేళ్ళ వ్యక్తి రెండు చేతులూ జోడించి నిల్చొని వున్నాడు.

ఎస్,ఐ, రమేష్ "ఎవడు వాడు?" అని గర్జించాడు.

"వీడు కమాన్ దగ్గర వచ్చీపోయే ఆడోళ్ళను బెదిరించి పైసలు వసూలు జేస్తున్నాడు సార్" అన్నాడొక కానిస్టేబుల్.

"ఇటు పట్కరాండ్రి లంజొడుకును" అంటూ పక్కనే ఉన్న బెత్తాన్ని చేతిలోకి తీసుకొని లేచి నిలుచున్నాడు ఎస్.ఐ.

పోలీసుల మధ్యలో వున్న ఆ రౌడీ వణికిపోసాగాడు.

గళ్ళషర్ట్....పైకి మడిచిన పాంట్....విచ్చలవిడిగా పెరిగిన జుట్టు—గుబురు మీసాలు- కమిలిన మొఖం....అచ్చం సినిమాల్లో కనిపించే చిన్నపాటి రౌడీలాగే ఉన్నాడు.

"కాళ్ళు మొక్తదొరా, దండం బెడ్త దొరా, నన్ను కొట్టకుండ్రి దొరా...." అంటూ వచ్చి అమాంతం ఎస్.ఐ. కాళ్ళ మీద పడ్డాడు.

"ఆడోళ్ళను టీజ్ చేస్తావురా లంజాకొడుకా....లంజాకొడుకులకు పోలీసులంటే బొత్తిగా భయం లేకుండ బోయింది" అంటూ బెత్తంతో ఆ రౌడీని బాదటం మొదలెట్టాడు ఎస్ ఐ.

ఎస్.ఐ. కాళ్ళమీద వంగిపోయిన ఆ రౌడీ మీద బెత్తం దెబ్బలు ఉధృతమైన వర్షంలా కురవసాగాయి.

"అమ్మో! నాయనో! నన్ను చంపకు దొరో! నీ కాళ్ళు మొక్తదొరో దండం బెడ్త దొరో" అంటూ ఆ పోలీసు స్టేషన్ అంతా దద్దరిల్లేలా అరవసాగాడు.

ఎస్.ఐ రౌడీని కొడుతూనే వున్నాడు.

రౌడీ అరుస్తూనే వున్నాడు.

రవి ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు.

ఎ.ఐ. కొడుతున్న ఒక్కొక్క దెబ్బ తనకు తగులున్నట్టు కడుపులో యేవో భయం....జుగుప్స....జాలి....బాధ....తనక్కడ్నించి పరుగెత్తుకొని పారిపోవాలి. ఆ దృశ్యం అలా ఇంకో అయిదు నిమిషాలు చూస్తే తనకు పిచ్చెక్కుతుంది.

"అమ్మో! నాయనో! చచ్చిన్రో నాయనో!"

ఒక దెబ్బ ఆయువు పట్టుమీద తగిలినట్టుంది. హృదయ విదారకంగా అరిచాడు. అరుస్తూనే వున్నాడు. తల కోసేసిన కోడి పిల్లలా అటూ ఇటూ కొట్టుకుంటూనే వున్నాడు. కాని ఎస్.ఐ. అతన్ని వదిలి పెట్టతేదు. ఇంకా కొడుతూనే వున్నాడు. ఎస్.ఐ.కి చెమటలొచ్చేశాయి. అయినా అతని చేతిలోని బెత్తం రౌడీ వీపు మీద ప్రళయతాండవం చేస్తూనే వుంది.

మిష్టర్ రమేష్! స్టాపిట్! ప్లీజ్ స్టాపిట్! ఇది పాశవికం. ఇది దౌర్జన్యం-ఇది దయనీయం-ఇది హృదయ విదారకం. ఇది బార్బరిజం—ప్లీజ్ స్టాపిట్. అలా అరవాలనిపిస్తోంది. అతన్ని ఆపాలనిపిస్తోంది....తన కన్నుల ముందే ఇంత హింసను తను ఎన్నడూ చూడలేదు.

ఎస్.ఐ. కొడుతూనే వున్నాడు.

అతడు అరుస్తూనే వున్నాడు.

ఆ హింసకు అంతం లేదు-అనంతం.

'అమ్మో!' అంటూ ఓ భయంకరమైన కేక పెట్టి అతడు అరవటం మానేశాడు—సొమ్మసిల్లి నిలువునా నరికేసిన చెట్టులా కుప్పకూలిపోయాడు.

అప్పుడాగింది ఎస్ ఐ చేతిలో ఉన్న బెత్తం.

బెత్తాన్ని ఓ మూలకు విసిరేసి "లాకప్‌లో పడేయండి లంజా కొడుకును" అన్నాడు ఎస్.ఐ. మళ్ళీ తన సీట్లో కూర్చుంటూ—ఇదరు కానిస్టేబుల్స్ మూర్ఛపడిపోయిన ఆ రౌడీని బయటకు శవాన్ని ఈడ్చుకుపోయినట్టుగా ఈడ్చుకుపోయారు.

ఎస్ ఐ. జేబులోంచి కర్చీఫ్ తీసి మొహం మీద పట్టిన చెమట తుడుచుకుంటూ అలసిపోయినట్టుగా కనిపించాడు. రవి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ—



"నువ్వో రైటర్ వటకదా!" నేనిప్పుడో రౌడీగాడ్ని కొట్టాను.

"ఓ అమాయకుడ్ని చచ్చేట్టు కొట్టాడు ఎస్ ఐ" అని కవిత్వం రాసి పారెయ్—అసలు పోలీసు వాడెందుకొట్టదతాడో నీకు తెలుసా? వీడో రౌడీగాడు. ఆడపిల్లల్ని ఏడిపిస్తాడు. అమాయకులయిన పల్లెటూరి జనాన్ని బెదిరించి డబ్బులు లాగేస్తాడు ఇలాంటి బాస్టర్డ్స్‌ని కొట్టకపోతే కామన్ మ్యాన్‌కు సేఫ్టీ యేముంది చెప్పండి—ఆడపిల్లల్ని యేడిపిస్తున్నారని, రేప్ చేస్తున్నారని పేపర్లో చదివి ఈ పోలీసు వాళ్ళేం చేస్తున్నారని మళ్ళీ మీరే అడుగుతారు."

మళ్ళీ ఫోన్ మోగింది. అరెస్టయిన పిల్లల్ని గూర్చి ఎవరో నాయకుడు ఫోన్ చేసినట్టున్నాడు.

"కొట్టటం లేదు—కొట్టటం కాలేజీలోనే అయిపోయింది. లేదు-లేదు—కొట్టమండి—అదేం లేదండి. రేపు కోర్టులో ప్రొడ్యూస్ చేస్తాం. రేపు చాలా మందిని వదిలేస్తాం కూడా—లేదండి! నేను చెబుతున్నాగా—కొట్టటం లేదు—టార్చర్ కూడా చెయ్యమండి-అదే నిజం."

ఎస్.ఐ. ఫోన్ పెట్టేశాడు.

"ఈయనో పెద్ద నాయకుడుతో—పిల్లల్ని కొడ్తున్నారా? టార్చర్ చేస్తున్నారా? టార్చర్ చేస్తే బావుండదు అని బెదిరిస్తున్నాడు—పోలీసు వాడంటే ప్రతి వాడికీ లోకువే! ఇలా అయితే 'లా అండ్ ఆర్డర్' ఎలా వుంటుంది? దేశంలో లా అండ్ ఆర్డర్ పాడైపోతోందో అని మళ్ళీ ఈ నాయకులే. ఈ పేపర్లే పెద్ద కాకిగోల మొదలెడతాయి."

ఎస్ ఐ. అలా మాట్లాడుతుంటే మళ్ళీ ఫోన్ మ్రోగింది. మళ్ళీ ఎవరో అరెస్టయిన స్టూడెంట్స్‌ని గురించి అడిగారు. మళ్ళీ ఎస్.ఐ. "కొట్టటం లేదు-వాళ్ళనేమీ అనటం లేదు. రేపు రిలీజ్ చేస్తాం—" అంటూ విసుగ్గా ఫోన్ పెట్టేశాడు.

కొన్ని క్షణాలు రవికేసి చూస్తూ—

"అసలు నేను నిన్నెందుకు తీసుకొచ్చాను?" అన్నాడు రవిని అప్పుడే చూస్తున్నట్టుగా.

"ఆదే— ఆదే— నాకు తెలియటం లేదు....

యేమిటి వీడు? నటిస్తున్నాడా? లేక నిజంగానే మరిచిపోయాడా? రోడ్డుమీద కనబడేటప్పటికి వీడికి అరెస్టు చెయ్యబుద్ధయింది.... అంతకంటె కారణం ఇంకేమీ కనిపించటంలేదు.

"అయామ్ సారీ! నువ్వు కాలేజీ లెక్చరర్‌వు కదూ? .. యూ కెన్ గో నౌ... కాని జాగ్రత్తగా ఉండండి. స్టూడెంట్స్ వ్యవహారాల్లో తల దూర్చకు. పోలీసుల మీదకు మీ వాళ్ళను రెచ్చగొట్టకు. ప్రమాదంలో పడి పోతావు... తెల్సిందా?"

"తెల్సింది." అన్నాడు రవి లేచి నిల్చుంటూ.

"ఈ వార్నింగివ్వటానికే తీసుకొచ్చాను" అన్నాడు ఎస్.ఐ. ఒక చేత్తో మోగుతున్న ఫోన్ అందుకుంటూ, రెండో చేత్తో వెళ్ళిపొమ్మని రవికి సంజ్ఞచేస్తూ.

"థాంక్స్" అని రవి బయటకు రాగానే "ఇదుగోండి సార్.... మీ సైకిల్" అంటూ కానిస్టేబుల్ సైకిల్ అందించాడు.

పోలీసు స్టేషన్‌లోంచి రవి బయటకెళ్తొంటే నిర్బంధంలో ఉన్న స్టూడెంట్స్ కొందరు "సార్! సార్" అంటూ కేకలు వేశారు. కాని రవి వెనక్కి తిరగలేదు. త్వరగా బయటకొచ్చి సైకిలెక్కి తొక్కటం మొదలెట్టాడు.

టైమ్ ఎనిమిదీ దాటిపోయిందీ.

ఇప్పటికైనా తను క్షేమంగా ఇల్లు చేర్తాడా?

చాలా అలసిపోయాడు.... విపరీతమైన నీరసం.... కాళ్ళల్లో సత్తువ లేదు. సైకిల్ తొక్కలేడు.... చాలా దాహంగా వుంది. ఎవరైనా కొంచెం మంచినీళ్ళు ఇస్తే బావుండును...

రజనీ. మంచినీళ్ళు. యేదీ రజనీ? ఎక్కడ రజనీ? ఇక లాభంలేదు. తను తన రజనిని చేరుకో లేడు. తనలోని సర్వశక్తులూ కృంగిపోయాయి. తనలోని చైతన్యమంతా హరించిపోయింది. తనలోని రక్త మాంసాలన్నీ నశించిపోయాయి. తన గుండెలోని బలమంతా మాడిపోయింది. యే క్షణంలోనైనా తను కుప్పకూలిపోవచ్చు.... 'కాల్మొక్త దొరా! దండం పెడ్తదొరా!



నన్ను కొట్టకుండ్రి! నన్ను చంపకుండ్రి' చెవులు గింగురు మంటున్నాయి. వాడు నిజంగానే రౌడీయా? వాడు నిజంగానే ఆడపిల్లల్ని ఏడిపించాడా? అయినా అంత క్రూరంగా కొట్టాలా? ఇదేనా శాంతి భద్రతల పరిరక్షణ? ఎవరో తన వెనక వస్తున్నవాళ్ళు ఆ రౌడీని గురించే మాట్లాడుకుంటున్నారు.

"వాడు రౌడీ కాడు... పాపం కాడు.... చిన్న చిన్న దొంగతనాలు చేస్తడు.... ఈ రోజు పోలీసోళ్ళకిచ్చే మామూల్లేదు. వాళ్ళె కొట్టిన చంపిండ్రు. గంతే!"

అంతేనా? ఎంత ఘోరం? ఎంత అన్యాయం! పశువును కూడా అలా బాదరు తన కళ్ళముందే నాలుగడుగుల దూరంలో జరుగుతున్న ఆ అన్యాయాన్ని ఆ అక్రమాన్ని, ఆ దౌర్జన్యాన్ని, తను ఆపలేక పోయాడు.

అసహ్యం చేతకానితనం.... జుగుప్స.... వ్యక్తనేవాడు వ్యవస్థ చేతిలో ఎంత బలహీనుడు! పతితులారా! భ్రష్టులారా! బాధాసర్ప దష్టులారా యేడవకండేడవకండి! మీకోసం కలం పట్టి ఆకాశపు దారులంట హడావుడిగా వెళ్ళిపోయే- జగన్నాథ రథచక్రాల్.... భూమార్గం పట్టిస్తాను.. భూకంపం పుట్టిస్తాను . యే ఆ జగన్నాథ రథచక్రాలు? ఎక్కడా ఆ భూకంపం? ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తి, ఒక జాతిని వేరొక జాతీ, పీడించే సాంఘిక ధర్మం ఇంకానా ఇకపై సాగదు... మైడియర్ మహాకవి గారూ! ఎందుకీ ప్రగల్భాలూ? ఇప్పుడే కాదు... ఇంకో వంద సంవత్సరాల తర్వాత కూడా అది సాగుతూనే ఉంటుంది. .

సైకిల్‌ను వేగంగా నడిపించే శక్తి లేదు. . తడారిపోతున్న గొంతులోకి చల్లటి మంచినీళ్ళను పంపిస్తే ఎంత ఉపశమనం లభించేదో! కాని ఎవరిస్తారా మంచినీళ్ళు? రజని.... మైస్వీట్ లిటిల్ రజని .. ఎక్కడున్నావు? నీకూ నాకూ మధ్య ఎన్ని యుగాల దూరం? ఎన్ని కోట్లమైళ్ళు... ఎన్ని కాంతి సంవత్సరాలు? కాంతి సంవత్సరమండే ఎంతో కరెక్ట్‌గా చెప్పగలవా?

ఎందుకంత ఆవేశపడిపోతారు? జాగ్రత్తగా ఉండు! స్టాఫ్ మీటింగ్‌లో జరిగిన విషయాన్ని పోలీసులకెవడు చెప్పాడు? సూర్యప్రకాష్? శ్రీరంగాచారి? జాగ్రత్త— బీ కేర్ ఫుల్! బిగ్ బ్రదర్. నిన్నే చూస్తున్నాడు! ఎవడా బిగ్ బ్రదర్!? స్టాలినా, హిట్లరా? ఎవడా బిగ్ బ్రదర్? బీ కేర్ ఫుల్....

బిగ్ బ్రదర్ ఈజ్ వాచింగ్ యూ— 1984 వరకు ఈ బిగ్ బ్రదర్ ఇంకెంత పెరిగిపోతాడో!

తీరందాజ్ టాకీసు దాటాడు. ఇంకా వెళ్ళాలి... రోడ్లమీద జనసంచారం తగ్గింది. డక్టర్ల వీధి- మెల్ల మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఒకడుగు ముందుకేస్తే రెండడుగులు వెనక్కి వేస్తూ... ఆకలితో దాహంతో ఎండమావుల సౌందర్యాన్ని అందుకోవటానికి పరుగెత్తుతున్న వెర్రివాడిలా.. పిచ్చివాడిలా... పిచ్చివాడిలా— వెర్రివాడిలా....

అశోక హోటల్‌ను సమీపించాడు ఓ గ్లాసెడు మంచినీళ్ళు.... చల్లటి మంచినీళ్ళు తాగి వెడితే బావుండును ..

ఈ ప్రాంతంలో ట్యూబ్ లైట్లు వెలగటంలేదు. అంతా చీకటి. జనసంచారం చాలా తక్కువగా ఉంది.

అకస్మాత్తుగా ఆ చీకట్లోంచి ఎవరో అదే పనిగా ఊదుతున్న విజిళ్ళు ఆ చీకట్లోంచి ఐదారు మానవాకారాలు.... సైకిళ్ళు.... రవి సైకిల్ కడ్డంగా ఆ సైకిళ్ళు— రవి చుట్టూ ఆ ఆకారాలు...

స్తంభించిపోయాడు.

వాళ్ళంతా ఎవరో క్షణంలో ఆతడికి తెల్సిపోయింది.

"యేందిరా! గింత రాత్రెటో బొయ్యేస్తున్నవు?" అన్నాడు వాళ్ళలో ఒకడు రవి భుజంమీద చెయ్యేసి.

"అత్తగారింటి కున్నట్టుందిరా!" అన్నాడు మరొకడు

వాడెవడో తనకు తెలుసు. కిశోర్‌కుమార్— పరీక్షలో కాపీ చేస్తుంటే తను పట్టుకున్నాడు. రెండు సంవత్సరాలు రస్టికేట్ చేశారు...

ఆ పభార్ గ్రూపోళ్ళకు చెప్రియునింగిచ్చొస్తున్నవు గదరా .. ఇయాల్య కాలేజీ లేందో లావులావు మాట్లాడినవట. . ఇప్పుడు మాట్లాడరా." అన్నాడు కిశోర్ అతన్ని గట్టిగా వెనక్కి తోసేస్తూ. రవి వెళ్ళి వెనుక



నిల్చున్న ఇంకొకడి మీద పడ్డాడు. వాడు మళ్ళీ గట్టిగా ముందుకు తోశాడు కిశోర్ మీద పడ్డాడు.

"వీడు పరీక్షల్ల కూడా మస్తు స్ట్రిక్టుగుంటడు. నన్ను డీబార్ చేయించినవుగదరా... నిన్నిప్పుడు పైలోకానికే పంపిస్త." అంటూ కిశోర్‌కుమార్ రవి కాలర్ పట్టుకున్నాడు.

"వద్దులేర పాపం! వాడి పెళ్ళానికొక్కడే మొగుడు.. కరువైపోతాడు అన్నాడు ఇంకొకడు.

"ఒక్కడే అని నీకేం తెలుసురా" అన్నాడు కిశోర్ అలాగే రవి కాలర్ పట్టుకొని.

అకస్మాత్తుగా వాళ్ళ మధ్యలోకి శ్రీనివాస్, ఇంకో ముగ్గురు స్టూడెంట్స్ పరుగెత్తుకొని వచ్చారు.

"సార్ నేమనొద్దు. . సార్‌ను వదిలిపెట్టు... సార్‌నేమన్న అంటే మీ రక్తం కళ్ళజూస్త" అన్నాడు శ్రీనివాస్ కిశోర్ చేతుల్ని రవి కాలర్ మీంచి తప్పిస్తూ.

"వీడెవడ్రా లంజొడుకు? అడ్డం వచ్చావంటే పొడిచిపారేస్త" అన్నాడు కిశోర్ శ్రీనివాస్ మీదకు లంఘిస్తూ.

"ఏదీ పొడువురా చూద్దాం...." అన్నాడు శ్రీనివాస్.

అరే కిశోర్— ఊరుకోరా... పోలీస్ జీపొస్తున్నట్టుంది. పోదాం పదండి" అని అరిచాడు వాళ్ళల్లో ఒకడు.

మరుక్షణంలో వాళ్ళంతా సైకిళ్ళెక్కి వేగంగా అక్కడ్నించి వెళ్ళిపోయారు వాళ్ళు వెళ్ళిపోయిన మరుక్షణంలో పోలీస్ జీపు రయ్యిమని రవి పక్కనుండి వెళ్ళిపోయింది

తనకేదో అర్థమయింది. తన మస్తిష్క పథంలో యేదో మెరుపులా మెరిసింది. కిశోర్.... కిశోర్— పోయిన ఏప్రిల్‌లో తను ఇన్విజిలేషన్ చేస్తున్న ఎగ్జామినేషన్ హాల్- గైడు ముందు పెట్టుకొని నిర్భయంగా కాపీ చేస్తున్న కిశోర్ తనతో పాటు ఆ హాల్లో ఇన్విజిలేషన్ చేస్తున్న సీనియర్ లెక్చరర్ రంగారావుతో చెప్పాడు.

"కిశోర్ కాపీ చేస్తున్నాడు... వెళ్ళిపట్టుకుందాం" అని.

వద్దండి— వాడిజోలికెళ్ళొద్దు. మీకు తెలియదా.... అతడు స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీ" "అయితే.... స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీకి కాపీ చెయ్యటానికి లైసెన్సుందా? అతడొక్కడ్ని వదిలేస్తే మిగతా అందర్నీ వదిలెయ్యాలి"

"నా మాట వినండి.... కొంచెం సేపు చూసీ చూడనట్టు ఊరుకోండి. మీరీ కాలేజీకి కొత్త. . ఇక్కడి విషయాలు మీకింకా చాలా తెలియవు"

"కొత్తేమిటి, పాతేమిటి? మన డ్యూటీ మనం చెయ్యాలికదా." కిశోర్ దగ్గరకు వెళ్ళబోతున్న తనన అతడు ఆపి చెవిలో చెప్పాడు.

"వాడిజోలికి వెళ్ళకండి. చాలా డేంజరస్ ఫెలో"

"అలా అయితే ఇక్కడ మనం ఎందుకున్నటు బొమ్మల్లా నిలబడటానికా?"

"మర్యాదగా ఈ హాల్లోంచి బయటకు వెళ్ళిపోదాం పదండి. వాళ్ళిష్ట మొచ్చినట్టు రాసుకుంటారు" అతడు నోరు మూశాడు.

రోడ్డుమీద నడుస్తున్నాడే గాని యేం జరిగిందో, తనెక్కడికి వెళుతున్నాడో తెలీటంలేదు.... సైకిలెక్కి తొక్కేంత శక్తిలేదు. తన సైకిల్‌ను శ్రీనివాస్ పట్టుకున్నాడు. బుర్రలో కిశోర్ తప్ప ఇంకెవరూ లేరు. తనమీద పగతీర్చుకోవటానికి కిశోర్‌కు ఈ రోజు అవకాశం దొరికిందన్న మాట.... అతనితో వచ్చిన మిగతా వాళ్ళెవరో తను గుర్తుపట్టలేకపోయాడు. ఆ రోజు కాలేజీలో అందరూ తనసో పెద్ద హీరోలా చూశారు. "కిశోర్‌ను బుక్ చేశారూ? వాడీ కాలేజీలో పెద్ద పీడగా తయారయ్యాడు. మంచి పనిచేశారు సార్! వాడకెంత గర్వమనుకున్నారు? లెక్చరర్స్ అంటే వాడికి కొంచెం కూడా గౌరవం లేదు." "కిశోర్‌ను బుక్ చేశారా? సరే! కానీ వాడు మోస్ట్ డేంజరస్ ఫెలో! కిశోర్‌ను పట్టుకున్నారా? పాపం....వాడు నెక్స్ట్ ఇయర్ ప్రెసిడెంట్ కావాలని కలలు గన్నాడు....కలలుగంటున్నాడు. డెఫినిట్‌గా ప్రెసిడెంట్ అయిపోయేవాడు.... కొన్ని రోజులు జాగ్రత్తగా ఉండండి.... నేను ఎస్.పి.కి ఫోన్ చేసి వాడిని బుక్‌చేసిన విషయం వాడు మిమ్మల్ని బెదిరించిన విషయం చెబుతాను వాన్ని పోలీసులొకకంట కనిపెడతారు లెండి .. డోన్ట్ వర్రీ" అన్నాడు ప్రిన్సిపాల్. అంతా సద్దుమణిగాక వాడు



ఇవ్వాళ ఎటాక్ చేశాడు .. శ్రీనివాస్ రాకపోతే యేమయ్యేది? తనను స్పృహ తప్పి పడిపోయేలా కొట్టి ఆ రోడ్డుమీద పడేసి వెళ్ళిపోయేవాళ్ళు.... వళ్ళు జలదరించింది.

"సైకిలెక్కండి సార్... జల్దీ పోదాం" అన్నాడు శ్రీనివాస్.

"సైకిలెక్కేంత శక్తిలేదు శ్రీనివాస్ ..." రవి.

"మీరు కూర్చోండి సార్....నేను తొక్కుత" శ్రీనివాస్.

"వద్దు....ఇలాగే నడుస్తూ వెళ్ళిపోదాం దగ్గరకొచ్చాంగా" అన్నాడు రవి.

"పరిస్థితి బాగలేదు సార్....మళ్ళెవడన్న వస్తే కష్టం సార్! రిక్షా ఎక్కుతరా?"

"వద్దు .. సైకిల్ మీదే పోదాం పద" అంటూ శ్రీనివాస్ చేతిలోని సైకిల్ తీసుకొని దాని మీద ఎక్కి శక్తినంతా కూడదీసుకొని తొక్కటం మొదలెట్టాడు.

పక్కన శ్రీనివాస్, అతని ఫ్రెండ్స్ సైకిళ్ళ మీద తన వెంట....

"యేడింటికే తెలిసింది సార్... మీ మీద ఎటాక్ జరుగుతదని. బయటికెళ్ళ కండ్రి సార్ అని చెబుదామని మీ కోసం ఇంటికి బోయిన.... మీరి ట్ల లేరు....మీటింగ్‌కు బోయిండ్రని చెప్పిండ్రు! అప్పట్నించి మీకోసం తిరుగుతనే వున్నాం....గిప్పుడే మా స్టుడెంట్ ఒకడు మీరు పోలీసుస్టేషన్‌కు బోయిండ్రని చెప్పిండు ...పోలీస్ స్టేషన్‌కు బోతే ఇట్లనే వస్తరుగదా అని మీకోసం జూసుకుంటవొస్తున్నం."

అంతా యేదో కలలో జరిగినట్టుగా, యేదో నాటకంలో జరిగినట్టుగా, యేదో నవలలో జరిగినట్టుగా, జరుగుతున్న సంఘటనలన్నిటిని తనెక్కడో పైన ఉండి చూస్తున్నట్టుగా—కిశోర్, శ్రీనివాస్, ఎస్.ఐ. రమేష్, చిన్న రౌడీ, నిధి, కృష్ణమోహన్ అందరూ ఆ నాటకంలో పాత్రలు—ఎవరి పాత్రను వాళ్ళు తమ సామర్థ్యంమేరకు శక్తివంచన లేకుండా నటిస్తున్నారు. అసలు వీళ్ళందర్నీ పాత్రలుగా తీసుకొని తనే ఓ నవల రాసేస్తే? అయిడియా గొప్ప ఐడియా.

అందుకూ పాత్రలే—వీళ్ళందరితో తనొక వినూత్న ప్రపంచాన్ని సృష్టిస్తాడు ఎవర్నీ ద్వేషించడు—ఎవరి మీదా ప్రతీకారవాంఛను పెంచుకోడు వాళ్ళంతా ఎందుకలా ప్రవర్తిస్తున్నారో విశ్లేషిస్తాడు. తనను తాను విశ్లేషించుకొని, తన చుట్టూ ఉన్న వాళ్ళను విశ్లేషించి తను తెలుసుకున్న జీవిత వాస్తవాల కొక కళారూపాన్నిస్తాడు.

కులం, ఆస్తి, మతం, అంతస్తు, ప్రాంతం మొదలయిన కృత్రిమ విలువలకన్నిటికి అతీతమైన స్వచ్ఛమైన మానవత్వాన్ని పెంపొందించే రచనల సృష్టిని తను చెయ్యాలి.

ఒక భయంకరమైన తుఫాను తర్వాత వెల్లివిరిసే ప్రశాంతతలా ఇప్పుడు మనస్సంతా ప్రశాంతంగా వుంది—హాయిగా ఉంది.

ఇల్లొచ్చేసింది.

"థాంక్ యూ శ్రీనివాస్! థాంక్ యూ వెరీమచ్" అన్నాడు రవి గేటు దగ్గర నిల్చొని.

"థాంక్సెందుకు సార్—నా డ్యూటీ నేను జేసిన కొన్ని రోజులదాక బయట కెళ్ళకండ్రిసార్" అన్నాడు శ్రీనివాస్.

"ఫరవాలేదు—మీరిక వెళ్ళిపొండి."

"నమస్కారం సార్!" అంటూ తనవెంట వచ్చిన వాళ్ళు సల్లుమా వెళ్ళిపోయారు.

గేటు తెరచుకొని లోపలకెళ్ళాడు—సైకిల్‌కు స్టాండ్ వేస్తుండగా రజని తలుపు తీసింది.

ఒక్కక్షణం రజనికేసి చూశాడు.

"అమ్మయ్య! వచ్చేశారా? మీ కోసం శ్రీనివాస్ వచ్చి వెళ్ళినప్పట్నుంచి గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయి. మీరు రావటం ఇంకో అర గంట ఆలస్యమయితే గుండె ఆగి చచ్చిపోయేదాన్ని" అంటోంది రజని.

"నిజంగా!" అన్నాడు లోపలకొస్తూ.

ఆమె వెంటనే తలుపులు మూసేసి అతని మీద వాలిపోతూ.

"నమ్మటం లేదా? చూడండి. ఈ గుండెమీద తలపెట్టి నా గుండె



ఇప్పటికీ ఎలా కొట్టుకుంటోందో వినండి." అంది అతని తలను తన గుండెల మీదకు లాక్కుంటూ.

"నిజమే రాజీ! నీ గుండె చాలా వేగంగానే కొట్టుకుంటుంది—నిముషానికి 72 సార్లు."

"జోక్ చెయ్యకండి నిజం చెప్పండి" అందామె అతని తలను ఇంకా గట్టిగా తన గుండెలకు అదుముకుంటూ.

"నిజమే చెబుతున్నాను."

ఆమెను వదిలించుకొని బెడ్‌రూంలో కెళ్ళి పక్కమీదకు వాలిపోయాడు అతని వెంటే ఆమె కూడా వచ్చి అతని పక్కన పడుకొని, అతన్ని తన మీదకు లాక్కోటానికి ప్రయత్నించింది.

"యేం జరిగిందో చెప్పండి....చెప్పకపోతే నన్ను చంపుకున్నంత ఒట్టే!"

"అలిసిపోయాను రాజీ! నన్నిలా కాస్సేపు వదిలెయ్" కళ్ళు గట్టిగా మూసుకుంటూ అన్నాడతడు.

"పాపం పెళ్ళాని కొక్కడే వదిలెయ్‌రా!"

శరీరం జలదరించింది కళ్ళు తెరిచాడు. పెద్ద పెద్ద కళ్ళతో బతిమాలుతున్నట్టుగా చూస్తున్న రజని!

నిజంగా తనకేమన్నా అయితే పాపం! యేమయిపోయేదో!

"వదిలెయ్యను! నిజం చెప్పండి—ఇవ్వాళ కాలేజిలో యేదో గొడవ జరిగిందట—మీరేదో ఆవేశంగా మాట్లాడారట—ప్లీజ్! చెప్పండి—నాకెంత భయమేసిందో మీరూహించలేరు."

"మధ్యాహ్నం వచ్చినప్పుడు చెప్పబోతే నువ్వు వినిపించుకుంటేకద! నీ ప్రపంచంలో నువ్వున్నావు ఎంత ప్రయత్నించినా నిన్ను దాంట్లోంచి బయట పడెయ్యలేక పోయాను."

"తప్పయింది—క్షమించండి—మరో సారెప్పుడూ అలా ప్రవర్తించను. యేం జరిగిందో చెప్పండి! ప్లీజ్—దండం పెడతాను."

"పిచ్చిదానా! చెబితే భరించగలవా?"

"పిచ్చిదాన్నే—ఒప్పుకున్నాను—చెప్పండి"

"విద్యార్థుల్లో ఒక వర్గం వాళ్ళు నన్ను కొట్టడానికి ప్రయత్నించారు. సమయానికి శ్రీనివాస్ రాకపోతే నువ్వు నన్ని పాటికి హాస్పిటల్‌లో చూసే దానివి."

మరుక్షణంలో రజని కళ్ళల్లో నీళ్ళు—అతని కట్టుకుపోయి వెక్కి బ్బంగా యేడవటం మొదలెట్టింది.

"ఇందుకే నిన్ను పిచ్చి దానివి అన్నాను—ఊరికే ఎందుకలా యేడుస్తావు! కాటుకంతా కరిగిపోతున్నది ఛీ ఛీ!" అన్నాడు ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

"అందరిలా మీరుండరు—ప్రతి దాంట్లో జోక్యం చేసుకుంటారు. ప్రతి దానికీ చలించిపోతారు. వేరే విషయాల్లో మనం జోక్యం చేసుకోవద్దు అని నేనెంత మొత్తుకున్నా మీరు నా మాట వినరు."

"నా పని నేను చేసినందుకే నన్ను వాళ్ళు శిక్షించటానికి ప్రయత్నించారు—వేరే విషయాల్లో నేనేం జోక్యం చేసుకోలేదు. ప్రతి దానికీ చలించిపోవటం నా తత్వం... అది సర్లే—ఇలారా! ఇలా నీ గుండెల్లో తలదాచుకోవాలని పొద్దున లేచింది మొదలు ఇప్పటి వరకు ఎంత తపించిపోతున్నానో నువ్వూహించగలవా రజీ."

గొప్ప ఆవేశంతో ఆమె అతని ఆక్రమించుకొని అతని శరీరాన్నంతా ముద్దులతో నింపేసింది.

"ఇప్పుడెంత హాయిగా ఉందో తెలుసా? నీ సమక్షంలో తప్ప నాకింత శాంతి ఈ ప్రపంచంలో ఎక్కడా లభించదు—నీవు ఒక్క దానివి నా పక్కనుంటే ఎంత బాధనైనా భరించగలను ఎంత దుఃఖాన్నయినా నాలో ఇముడ్చుకోగలను."

ఆమె అతని వక్షస్థలం మీద పసిపాపలా కళ్ళు మూసుకుని పడుకుని నిద్రపోతున్నట్టుగా కనిపించింది.



అలా ఎన్ని క్షణాలు గడిచిపోయాయో.

ఇప్పుడు హాయిగా ఉంది. ఆకలి—దాహం—అశాంతి—ఆవేదన—బాధ- కన్నీళ్ళు – ఈర్ష్య- ద్వేషం- అన్నీ అంతమై పోయిన సంపూర్ణ శాంతి.

యేదో గుర్తొచ్చినట్టుగా అతన్ని తప్పించుకొని లేచిందామె.

"లేవండి—భోంచేసి పడుకుందాం"

"వద్దు రజనీ! ఆకలీ, దాహం, అన్నీ తీరాయి. ఇప్పుడేమీ అక్కర్లేదు—హాయిగా పడుకొని నిద్రపోదాం."

"కొంచెం తినేసి పడుకుందాం—పాపిష్టిదాన్ని—ఈ రోజంతా మిమ్మల్ని ఆకలితో చంపాను ఇప్పుడు కూడా మీరు భోంచెయ్యకుండా పడుకుంటే నన్ను నేను క్షమించుకోలేను.... ప్లీజ్! లేవండి కొంచెమంటే కొంచెం తినేసి పడుకోండి."

దీనంగా, ప్రేమగా బ్రతిమాలుతున్న రజని

ఓ క్షణం సేపు ఆమె కేసి చూశాడు.

రజని—తన రజని....తనకోసం ప్రాణాన్నయినా ఇచ్చే రజని ఇంత అందంగా ఉంటుందా....? ఆ క్షణంలో తనకు కనిపిస్తున్నది రజని బాహ్యసౌందర్యం కాదు ...ఆమె హృదయ సౌందర్యం— హృదయ సౌందర్యం ముందు బాహ్య సౌందర్యం దూదిపింజలా తేలిపోతుంది.

"అలా చూస్తారేం? లేవండి ప్లీజ్!"

"నువ్వెన్నిసార్లు ప్లీజంటే నాకన్ని సార్లు ఈ హృదయం మీద పన్నీటి జల్లును చిలకరిస్తున్నట్టుగా ఉంది." అన్నాడతను పక్క మీది నుంచి లేస్తూ.

ఆమె చకచకా డైనింగ్ టేబుల్ మీద రెండు ప్లేట్లు పెట్టేసి వడ్డించ సాగింది.

అతడు బట్టలు మార్చుకుని బాత్‌రూం వైపుగా వెళ్ళాడు. పూర్ రజని! పిచ్చిది-యేవేవో ఊహించుకుంటుంది. తన నెవరో ఆడిపోసుకుంటారని — తననెవరో భర్త నుండి విడదీస్తారని— అలా ఊహించుకొని పిచ్చిదై పోయి ఎవరెవరి మీది కోపాన్నో తన మీద చూపిస్తుంది. మొఖం మీద చల్లటి నీళ్ళు చల్లుకున్నాడు.

"ఈ లంజొడుకు పరీక్షలల్ల మస్తు స్ట్రిక్టుగుంటడు"

తిట్లన్నీ ఆడవాళ్ళను అవమానించేవే!

వాడా మాట అన్నప్పుడు ఎర్రగా మండుతున్న ఇనుపచువ్వను తన గుండెలో గుచ్చుతున్నట్టుగా ఫీలయ్యాడు. అది గుర్తొస్తే ఇప్పుడూ అలాగే ఫీలౌతున్నాడు. కాని కిశోర్. తను సృష్టించబోయే పాత్రకు ఆధారమయ్యాడు— అతన్ని క్షమించాడు.

పాపం! అమ్మ యేం చేస్తున్నదో!

"వాళ్ళెందుకిలా నన్నాడిపోసుకోవాలి. మీకు మీ అమ్మా నాన్నల మీదే ప్రేమ!"

క్లాష్ ఆఫ్ ఇంటరెస్ట్స్!

స్త్రీకి స్త్రీయే శత్రువంటే సరి కాకేం చేస్తుంది.

రజని అలా యెందుకు మాట్లాడుతుందో.... ఒక్కొక్కసారి తన నెందుకంతగా గాయపరుస్తుందో తనర్థం చేసుకోగలడు... రజని కూడా తన పాత్ర! రజనిని ఆధారం చేసుకుని తనెన్నో పాత్రల్ని సృష్టిస్తాడు....స్త్రీత్వానికి, స్త్రీ జాతికి ఆమె గొప్ప ప్రతినిధి-ఈ క్రూరసమాజంలో తనను తాను రక్షించుకోవటానికి ద్వేషిస్తుంది....గాయపరుస్తుంది.... గర్జిస్తుంది ...శాసిస్తుంది....కాటేస్తుంది....ప్రేమిస్తుంది....లాలిస్తుంది....పాలిస్తుంది.... ఊరిస్తుంది....రెచ్చగొడుతుంది....రెచ్చిపోతుంది....కన్నీళ్ళు కారుస్తుంది... తన దగ్గరున్న ఆయుధాలన్నిటిని ఉపయోగిస్తుంది... కానీ స్త్రీ ఇచ్చే సుఖాన్ని పురుషుడికి ప్రపంచంలో ఏ శక్తి ఇవ్వలేదు.



Cultural Association NANDUAL

ఈ బుర్రకు విశ్రాంతిలేదు. ఇలా అనుక్షణం ఆలోచిస్తూనే ఉంటుంది ఈ అంతస్స్రవంతి అవిశ్రాంతిగా అవిచ్ఛిన్నంగా అనంతంగా ప్రవహిస్తూనే ఉంటుంది....

డైనింగ్ టేబుల్ ముందొచ్చి కూర్చున్నాడు.

"అప్పుడు మీరేమీ తినలేదు... టమాటకూర కుదరలేదు... అందుకే ఇప్పుడు ఎగ్స్ తెప్పించాను...."

ఇద్దరూ అన్నం తినటం మొదలెట్టారు.

"ఎవరు తెచ్చారు?"

"పక్కింటి వాళ్ళబ్బాయిని బతిమాలి స్టౌ బత్తీలు, ఎగ్స్ తెప్పించుకున్నాను. యేం చెయ్యమంటారు? మీ కూరికెనే కోపమొస్తుంది"

"నువ్వింతవరకు నా కోపాన్ని అర్థం చేసుకోలేదు రజనీ! చాలా సార్లు నేను కోపగించుకునేది నీమీద కాదు....ఆ కోపమంతా నా మీదే"

"యేమిటో బాబూ! మీరనేది నాకర్థం కాదు"

"నాలో యెప్పుడూ యేదో అశాంతి. యేదో చేయాలన్న ఆరాటం-ఎక్కడికో పరుగెత్తాలన్న ఆతురత-ఎప్పుడూ దేనికోసమో అన్వేషణ-అర్థంకాని తపన-ఎప్పటికీ తీరని దాహం....వీటితో వేగిపోతూ నా మీద నేనే కోపగించుకుంటాను....నాలోపలెప్పుడూ యేదో ప్రవాహం, బాహ్య సంఘటనలు ఆ ప్రవాహానికి అడ్డు తగులుతుంటాయి. ఆ ప్రవాహాన్ని ఫ్రీగా ప్రవహించనీయవు-అప్పుడూ కోపమొస్తుంది...... పిచ్చిదానివి-అదంతా నీమీది కోపమనుకుంటావు"

"ఇప్పటినుంచి అలా యేమీ అనుకోనుగాని మీరు మీ ఆలోచనల్లో బడి అర్ధాకలితో లేవకుండా కాస్త కడుపునిండా తినండి" అంటూ ఆమె అతని ప్లేట్లో మళ్ళీ అన్నం—కూరా వడ్డించింది.

ఆమెతో అలా మాట్లాడుతుంటే యేదో తృప్తి ...తనను తాను ఎనలైజ్ చేసుకోవటం... తనేమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించటం.... అసలు తన చేతిలో తనూ ఒక పాత్రే! ఇతరులను విశ్లేషించినట్టే తనను కూడా విశ్లేషించుకుంటాడు తననుండి తను వేరై యితరులను విశ్లేషించినట్టగానే విశ్లేషించి ఆ విశ్లేషణ అధారంతో పాత్రల్ని సృష్టిస్తాడు అలా సృష్టించడంతోనే తనకు నిజమైన శాంతి

భోజనం చెయ్యటం ముగించి ఇద్దరూ లేచారు. అకస్మాత్‌గా అతనికేదో గుర్తొచ్చింది. ఆమె పాత్రలన్నీ సర్దేస్తోంటే అతడు ముందురూమ్‌లోకెళ్ళి, ఫౌంటెన్ పెన్, కాగితాలు తీసి వేగంగా రాయటం మొదలుపెట్టాడు.

పదిహేను నిముషాల తరువాత అన్నీ సర్దేసి, ఆమె ముందు రూమ్‌లోకి వచ్చి "ఇప్పుడు రాస్తున్నారా? బాగా అలసిపోయారు. రేపు రాసుకుందురుగాని లేవండి" అందామె.

"ఈ రాసుకోవటమే నాకు నిజమైన శాంతి....రియల్ రిలాక్సేషన్-ఇలా నన్ను రాసుకోవటానికి వదిలేస్తే నీమీదెప్పుడూ కోపగించుకోను ... సరేనా?"

"కోపగించుకున్నా ఫరవాలేదు....రేపు రాద్దురుగానీ........ఇప్పుడు లేవండి ప్లీజ్...."

మళ్ళీ ప్లీజ్‌లు మొదలెట్టావా? ఓ నవలకు సినాప్సిస్ రాస్తున్నా. ఇప్పుడే బుర్రలో మెదిలింది. తరువాత మరచి పోతాను. ఇంకో పావుగంటాగిలెయ్-సరేనా?

"ఛీ ! మీరెప్పుడూ ఇంతే .... మూడంతా పాడుచేస్తారు .... ఈ రోజంతా మీకోసం యెంతగా వెయిట్ చేశానో? ఎందుకో తెలుసా?"

అతడు తలెత్తి ఆమె కేసి చూశాడు.



ఆ రూమ్‌లో తెల్లగా వెలుగుతున్న ట్యూబ్‌లైట్ కాంతుల్లో ఆమె మరింత తెల్లగా వెలిగిపోతూ కనిపించింది ఆమె కళ్ళల్లో తను ఇదివరకెన్నడూ చూడని కొత్తదనమేదో కనిపించింది. ఆ కళ్ళల్లో యేదో నూతన తేజస్సు-ఏదో గర్వం-ఏదో హాయి-ఏదో ఆనందం-ఏదో సంతృప్తి ఏదో విశేషం తప్పనిసరిగా ఉంది.

వెంటనే రాయటం ఆపేసి "ఏమిటది?" అన్నాడు.

"ఇప్పుడు చెప్పను. మీరు లోపలకొస్తే చెబుతాను." అంటూ ఆమె లోపలికెళ్ళి పడుకుంది.

అతడు కాగితాలు సర్దేసి, లైటార్పేసి లోపలకెళ్ళి బనియన్ కూడా విప్పేసి ఆమె పక్కన పడుకొని ఆమెను తనవైపుకు తిప్పుకున్నాడు.

"యేమిటో చెప్పు?"

"యేమీ లేదు .... మిమ్మల్ని లోపలికి రప్పించటానికి చిన్న నాటకం...."

జీరో బల్బు కాంతిలో చిలిపిగా నవ్వుతున్న ఆమె కళ్ళు .

"కాదు ఏదో వుంది. నాకు తెలుసు" అన్నాడు ఆమె కళ్ళను ముద్దు పెట్టుకుంటూ.

"యేముంటుంది?"

"అదీ తెలిస్తే నిన్నింక బతిమాలటం ఎందుకు?"

"మీతో ఎంత బతిమాలించుకుంటే నాకంత ఇష్టం ఆ విషయం మీకు తెలుసా?"

"తెలుసు"

"అయితే బతిమాలండి"

"ప్లీజ్ రజనీ! త్వరగా చెప్పెయ్"

"మరోసారి ప్లీజ్ అనండి"

"ఒ కె. ప్లీజ్! ప్లీజ్! ప్లీజ్!"

"ఇక చాలు-ఏమిటంటే."

అతని ఛాతీమీద పడుకొని, కళ్ళు మూసుకుని, పెదవులతో అతని శరీరాన్నంతా స్పృశిస్తూ....

"ఏమిటో చెప్పు."

"మీరు తండ్రీ కాబోతున్నారు."

"నిజంగా?"

ఆమెను గట్టిగా గుండెలకు హత్తుకున్నాడు.

కొన్ని క్షణాలసేపు ఏ అనుభూతి లేని స్థితి .....సంతోషమూ, దుఃఖము ఏమీలేని విచిత్రమైన స్థితి-తనకు తెలుసు..... ఆమె సంతోషిస్తోంది ... తనకెందుకో ఆ సంతోషం.... ఆ థ్రిల్.... ఆ ఎక్సైట్ మెంట్ కలగటం లేదు.

"ఏమీ మాట్లాడరెందుకు?"

"ఎందుకో భయమేస్తోంది రాజీ!"

"ఎందుకు?"

"తల్లి అయ్యాక నువ్వు నాకేమన్నా మిగుల్తావా?"

"నా పిచ్చి రాజా! నేనెప్పుడూ నీ దాన్నే"

"కాదు. తల్లయ్యాక నా దానివి కాకుండా పోతావు"

"పోను. పోను. పోను. పిచ్చిపిచ్చిగా మాట్లాడకండి"

ఉధృతమైన వేగంతో ఆమె అతని శరీరాన్ని తన శరీరంతో కలిపేసింది. ఆమెలో అంత ఆవేశాన్ని తనింత వరకెప్పుడూ చూడలేదు. తుఫానులా ఆమె అతన్ని కుదిపేసింది. అతనిలో కోరిక వువ్వెత్తున చెలరేగింది....అతడూ ఆమె శరీరంతో తన శరీరాన్ని కలిపేశాడు.



వాళ్ళిద్దరూ రెండు శరీరాలుగా—రెండు ప్రాణాలుగా అంతమైపోయి ఏకప్రాణిగా ఆవిర్భవించే ఆ క్షణాలు అతనికి మహత్తరంగా, మహోన్నతంగా, మధుర మనోజ్ఞంగా కనిపిస్తాయి. అలాంటి క్షణాలు నిత్యమై, శాశ్వతమై, అనంతమై—

ఈ సృష్టిలో ఇంత ఆనందం, ఇంత శాంతి, ఇంత హాయి తనకు మరొకటి లేదు. రాగం, ద్వేషం, కోపం, తాపం, ఈర్ష్య, ద్వేషం అన్నీ అంతమైపోయిన ఆ క్షణాలు, కాలేజి స్టూడెంట్లు, లెక్చరర్స్, పోలీసులు, కొట్లాట, హింస, రక్తం,తన అన్నీ స్మృతి పథంలోంచి తొలగిపోయిన ఆ క్షణాలు.

ఇద్దరూ అలసిపోయి, విడిపోయారు.

ఆమె మెల్లగా నిద్రలోకి జారిపోతోంది.

తన కళ్ళు కూడా మూతలు పడుతున్నాయి చల్లగా, మెల్లగా నిద్ర ఆహ్వానిస్తోంది

తనలోంచి, తనను చీల్చుకొని బయటపడాలని ఒక అస్పష్టమైన రూపం పెనుగులాడుతోంది.

ఆమెలోంచి, ఆమెను చీల్చుకొని బయటపడాలని ఒక ప్రాణం తాపత్రయపడుతోంది.

సృష్టి విచిత్రమైంది సృష్టి అనంతమైంది, సృష్టి ఆద్యంతాలూ లేనిది, సృష్టి ఒక అవిచ్ఛిన్న ప్రవాహం నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. దానికి విరామం, విశ్రాంతి లేవు. అనుక్షణం సృష్టికి ప్రతి సృష్టి జరుగుతూనే ఉంటుంది అదే జీవిత రహస్యం. అదే జీవితానికర్థం. జీవితం జీవించటానికి-ఆద్యంతాలు లేని ప్రవాహంగా ప్రవహించటానికి మెట్లు లెక్కలేనన్ని మెట్లు ఆద్యంతాలు లేని మెట్లు ఒకదాని తర్వాతొకటి

మెట్లెక్కుతున్నాడు. తనని రమ్మని ఆహ్వానిస్తున్నారు. ఎవరామె-రజని తన రజని త్వరత్వరగా మెట్లెక్కుతున్నాడు. రజని అందినట్టే అంది మళ్ళీ దూరమైపోయింది. మళ్ళీ మెట్లు-రజని మళ్ళీ పైకి-తనకు అందనంత పైకి కాని ఆమెనందుకోవాలి. మెట్లెక్కుతున్నాడు-రజని నవ్వుతోంది. వచ్చేశాడు ఆమెకు అత్యంత సమీపంగా వచ్చేశాడు తనలో దుఃఖం, బాధ, ఆకలి, దాహం....అయినా మెట్లెక్కుతున్నాడు....కనుచూపు మేరలో రజనిని చూస్తూనే వున్నాడు.

BAPUJI
Cultural Association,
NANDYAL-518 501.

—: అయిపోయింది :—

# Anthasrawanthi

BY

Naveen

కాలేజీ విద్యానంతరం ఉద్యోగాన్వేషణ వైవాహిక జీవితం - వైవాహిక జీవితంలోని మాధుర్యం. భిన్నమైన స్వార్థ ప్రయోజనాలతో స్పష్టంగా మూర్తికట్టిన వ్యక్తులు, వారి సమావేశం సంఘర్షణ, ప్రవర్తన, సమగ్రంగా సజీవంగా రూపొందించిన నవల -

## అంతస్స్రవంతి

మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం, విజయవాడ - 520 004.